సోమవారం 2-6-2025

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 71

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





ప్రపంచ రెండో ర్యాంకర్ నకమురాపై అర్జున్ గెలుపు

స్టావెంజర్: నార్వే చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ అద్భుత విజయం అందుకున్నాడు. ప్రపంచ రెండో ర్యాంకర్ హికారు నకమురా (అమెరికా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో అర్జున్ అర్మగెడాన్ టైబ్రేక్ గేమ్‌లో గెలుపొందాడు. వీరిద్దరి మధ్య జరిగిన క్లాసికల్ ఫార్మాట్ గేమ్ 76 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. దాంతో విజేతను నిర్ణయించేందుకు అర్మగెడాన్ గేమ్‌ను నిర్వహించారు. ఈ గేమ్‌లో అర్జున్ 48 ఎత్తుల్లో నకమురాపై విజయం సాధించాడు. మరోవైపు ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ఐదో రౌండ్ గేమ్‌లో 56 ఎత్తుల్లో వె యి (చైనా) చేతిలో ఓడిపోయాడు. ఇదే టోర్నీ మహిళల విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చైనా గ్రాండ్‌మాస్టర్ లె టింగ్‌జీపై అర్మగెడాన్ టైబ్రేక్ గేమ్‌లో 38 ఎత్తుల్లో గెలిచింది. అంతకుముందు వీరిద్దరి మధ్య క్లాసికల్ ఫార్మాట్ గేమ్ 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. భారత మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి 35 ఎత్తుల్లో స్పెయిన్‌కు చెందిన సారా ఖాడెమ్‌ను ఓడించింది.

ఫైనల్లో పంజాబ్ కింగ్స్

- రేపే బెంగళూరుతో అమీతుమీ
- రెండో క్వాలిఫయర్‌లో ముంబైకి చెక్
- 5 వికెట్లతో కింగ్స్ జయభేరి
- మెరిపించిన వధేరా
- గెలిపించిన అయ్యర్

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఫైవ్‌స్టార్ చాంపియన్లు (ముంబై, చెన్నై), మూడుసార్లు విజేత (కోల్‌కతా)ను చూసిన ఫ్యాన్స్ ఈ సీజన్‌లో కొత్త చాంపియన్‌ను చూడబోతున్నారు. తొలి క్వాలిఫయర్‌లో తేలిపోయిన పంజాబ్ కింగ్స్ రెండో క్వాలిఫయర్‌లో జూలు విదిల్చింది. 11 ఏళ్ల తర్వాత (2014) ఐపీఎల్‌లో ఫైనల్‌కు చేరింది. ఆదివారం శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌ను ఇంటికి పంపింది. రేపు జరిగే ఫైనల్లో బెంగళూరు, పంజాబ్ తొలి ఐపీఎల్ టైటిల్ కోసం తలపడతాయి. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 44; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఠాకూర్ తిలక్ వర్మ (29 బంతుల్లో 44; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), నమన్ ధీర్ (18 బంతుల్లో 37; 7 ఫోర్లు) దంచేశారు. అజ్మతుల్లా ఒమర్జాయ్ 2 వికెట్లు తీశాడు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన పంజాబ్ 19 ఓవర్లలో 5 వికెట్లకు 207 పరుగులు చేసి గెలిచింది. నాయకుడు శ్రేయస్ అయ్యర్ (41 బంతుల్లో 87 నాటౌట్; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) జట్టు గెలిచేదాకా నడిపించాడు. నేహల్ వధేరా (29 బంతుల్లో 48; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు.


గెలిపించిన అయ్యర్

పంజాబ్‌కు అంతపెద్ద లక్ష్యం ఛేదించడానికి అవసరమైన శుభారంభం దక్కలేదు. మూడో ఓవర్లో ప్రభ్‌సిమ్రన్ (6), కాసేపటికే ప్రియాన్ష్ ఆర్య (10 బంతుల్లో 20; 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుకు చుక్కెదురైంది. దీంతో పవర్‌ప్లేలోనే ఓపెనర్ల వికెట్లను కోల్పోయిన 64/2 స్కోరు చేసింది. ఇన్‌గ్లిస్ (21 బంతుల్లో 38; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దంచేసే ఆటను పాండ్యా అడ్డుకున్నాడు. దీంతో 72 పరుగులకే టాపార్డర్ వికెట్లను కోల్పోయింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, నేహల్ వాధేరా జట్టు స్కోరును వంద దాటించారు. 12 ఓవర్లలో 109/3 స్కోరు చేసిన పంజాబ్... విజయానికి 48 బంతుల్లో 95 పరుగులు కష్టమనిపించింది. టాప్లీ 13వ ఓవర్లో అయ్యర్ కొట్టిన వరుస 3 సిక్స్‌లు, ఆ వెంటనే బౌల్ట్ బౌలింగ్‌లో వాధేరా కొట్టిన బౌండరీలతో ఈ రెండు ఓవర్లలోనే 33 పరుగులు సాధించడంతో కింగ్స్ రేసులో పడింది. నాలుగో వికెట్‌కు 84 పరుగులు జోడించాక వాధేర అవుటయ్యాడు. శశాంక్ (2) రనౌటైనా... 27 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న అయ్యర్ భారీ సిక్స్‌లతో కింగ్స్‌ను గెలిపించాడు.


శ్రేయస్ అయ్యర్

దంచేసిన తిలక్, సూర్య

రోహిత్ (8), బెయిర్‌స్టో (38)ల తర్వాత తిలక్, సూర్యకుమార్ అడపాదడపా మెరుపులతో జట్టు స్కోరు 10 ఓవర్లలో 100 పరుగులు దాటింది. ఈ జోడీ నిలబడి దూకుడు పెంచడంతో పరుగులు వేగంగా వచ్చాయి. చహల్ ఓవర్లో సిక్సర్ బాదిన సూర్యకుమార్... జేమీసన్ ఓవర్లో రెండు బౌండరీలు కొట్టాడు. ఇదే జోరుతో 4, 6 కొట్టిన అతన్ని చహల్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మరుసటి ఓవర్లోనే తిలక్‌ను జేమీసన్ పెవిలియన్ చేర్చాడు. అయితే నమన్ ధీర్ ధనాధన్ బౌండరీలతో ఓవర్‌కు సగటున 10 రన్‌రేట్‌తో ముంబై స్కోరు దూసుకెళ్లింది. ఆఖరి ఓవర్లో నమన్ అవుట్ కాగా జట్టు 200 మార్క్ దాటింది.


సూర్యకుమార్

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) వైశాక్ (బి) స్టొయినిస్ 8; బెయిర్‌స్టో (సి) ఇన్‌గ్లిస్ (బి) వైశాక్ 38; తిలక్ వర్మ (సి) ప్రియాన్ష్ (బి) జేమీసన్ 44; సూర్యకుమార్ (సి) వధేరా (బి) చహల్ 44; హార్దిక్ పాండ్యా (సి) ఇన్‌గ్లిస్ (బి) అజ్మతుల్లా 15; నమన్ (సి) స్టొయినిస్ (బి) అజ్మతుల్లా 37; రాజ్ (నాటౌట్) 8; సాంట్నర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 203. వికెట్ల పతనం:** 1-19, 2-70, 3-142, 4-142, 5-180, 6-197. **బౌలింగ్:** అర్ష్‌దీప్ సింగ్ 4-0-44-0, జేమీసన్ 4-0-30-1, స్టొయినిస్ 1-0-14-1, అజ్మతుల్లా 4-0-43-2, వైశాక్ 3-0-30-1, చహల్ 4-0-39-1. **పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్:** ప్రియాన్ష్ (సి) హార్దిక్ (బి) అశ్వని 20; ప్రభ్‌సిమ్రన్ (సి) టాప్లీ (బి) బౌల్ట్ 6; ఇన్‌గ్లిస్ (సి) బెయిర్‌స్టో (బి) హార్దిక్ 38; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 87; వధేరా (సి) సాంట్నర్ (బి) అశ్వని 48; శశాంక్ (రనౌట్) 2; స్టొయినిస్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (19 ఓవర్లలో 5 వికెట్లకు) 207. వికెట్ల పతనం:** 1-13, 2-55, 3-72, 4-156, 5-173. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-38-1, టాప్లీ 3-0-40-0, బుమ్రా 4-0-40-0, అశ్వని 4-0-55-2, సాంట్నర్ 2-0-15-0, పాండ్యా 2-0-19-1.

జో రూట్ 166 నాటౌట్

రెండో వన్డేలోనూ విండీస్‌పై ఇంగ్లండ్‌దే విజయం ● కేసీ కార్టీ సెంచరీ వృథా

కార్డిఫ్: మాజీ కెప్టెన్ జో రూట్ (139 బంతుల్లో 166 నాటౌట్; 21 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో విజృంభించాడు. దాంతో వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఇంగ్లండ్ 309 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తద్వారా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే 2–0తో కైవసం చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ 47.4 ఓవర్లలో 308 పరుగులకు ఆలౌటైంది. కేసీ కార్టీ (105 బంతుల్లో 103; 13 ఫోర్లు) శతకంతో చెలరేగగా... కెప్టెన్ షై హోప్ (66 బంతుల్లో 78; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) బ్రాండన్ కింగ్ (59; 10 ఫోర్లు) హాఫ్‌సెంచరీలతో ఆకట్టుకున్నారు. ఇంగ్లండ్ బౌలర్లలో ఆదిల్ రషీద్ 4, సాఖిబ్ మహమూద్ మూడు వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ 48.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 312 పరుగులు చేసింది. జెమీ స్మిత్ (0), బెన్ డకెట్ (0), జోస్ బట్లర్ (0) డకౌటయ్యారు. కెప్టెన్ హ్యారీ బ్రూక్ (47; 7 ఫోర్లు, 1 సిక్స్), విల్ జాక్స్ (49; 2 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడగా... జో రూట్ వన్డేల్లో తన 18వ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో వన్డేల్లో ఇంగ్లండ్ తరఫున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా జో రూట్ (179 మ్యాచ్‌ల్లో 7082 పరుగులు) అవతరించాడు. ఇయాన్ మోర్గాన్ (6957 పరుగులు) పేరిట ఉన్న రికార్డును రూట్ అధిగమించాడు. వెస్టిండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్ 4 వికెట్లు తీశాడు. ఇరు జట్ల మధ్య నామమాత్రమైన మూడో వన్డే మంగళవారం జరగనుంది.


రూట్


కార్టీ

ఇంగ్లండ్ లయన్స్ 527/7

భారత్ 'ఎ'తో తొలి అనధికారిక టెస్టు

కాంటర్‌బరీ: భారత్ 'ఎ'తో జరుగుతున్న మొదటి అనధికారిక టెస్టులో ఇంగ్లండ్ లయన్స్ జట్టు దీటుగా బదులిస్తోంది. ఓవర్‌నైట్ స్కోరు 237/2తో ఆదివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ లయన్స్ ఆట ముగిసే సమయానికి 124 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 527 పరుగులు చేసింది. టామ్ హైన్స్ (279 బంతుల్లో 171; 19 ఫోర్లు) భారీ సెంచరీతో కదంతొక్కగా... మ్యాక్స్ హోల్డన్ (101 బంతుల్లో 101; 12 ఫోర్లు, 1 సిక్స్), డాన్ మౌస్లీ (157 బంతుల్లో 113; 10 ఫోర్లు, 1 సిక్స్) 'శత'క్కొట్టారు. భారత బ్యాటర్లు భారీ స్కోరు చేసిన పిచ్‌పై ఇంగ్లండ్ లయన్స్ ప్లేయర్లు కూడా దూకుడుగా ఆడారు. భారత బౌలర్లలో ముకేశ్ కుమార్ 3 వికెట్లు పడగొట్టగా... అన్షుల్ కంబోజ్, హర్ష్ దూబే, కరుణ్ నాయర్ తలా ఒక వికెట్ పడగొట్టారు. చేతిలో 3 వికెట్లు ఉన్న ఇంగ్లండ్ లయన్స్ జట్టు భారత్ 'ఎ' స్కోరుకు ఇంకా 30 పరుగులు వెనుకబడి ఉంది. జమాన్ అక్తర్ (38 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు భారత్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో కరుణ్ నాయర్ డబుల్ సెంచరీ... సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ మెరుపులతో 557 పరుగులు చేసింది.


ముకేశ్

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ జమ్మూలో 70 సీనియర్ రెసిడెంట్ పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్), జమ్మూలో వివిధ విభాగాల్లో సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 70.
- **విభాగాలు:** అనెస్తీషియాలజీ, అనాటమీ, బర్న్స్ అండ్ ప్లాస్టిక్ సర్జరీ, కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, కమ్యూనిటీ మెడిసిన్, డెర్మటాలజీ, ఎండోక్రైనాలజీ, మెటబాలిజమ్, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ ఆంకాలజీ, మైక్రోబయాలజీ, నియోనెటాలజీ, నెఫ్రాలజీ, ఒబెస్ట్రిక్స్ అండ్ గైనకాలజీ, ఆప్తాల్మాలజీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్ సర్జరీ, పీడియాట్రిక్స్, ఫిజియాలజీ, సైకియాట్రీ, రేడియోలజీ, రేడియోథెరపీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్లాంక్, ట్రామా అండ్ ఎమర్జెన్సీ మెడిసిన్, యూరాలజీ.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/డీఎన్‌బీ, ఎంబీబీఎస్, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 14.06.2025 నాటికి 45 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు నాన్ మెడికల్ పోస్టులకు రూ.56,100, మెడికల్ పోస్టులకు రూ.67,700.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 14.06.2025.
- **వెబ్‌సైట్:** www.aiimsjammu.edu.in/



బామర్ లారీ కంపెనీ లిమిటెడ్, కోల్‌కతాలో వివిధ ఉద్యోగాలు

కోల్‌కతాలోని బామర్ లారీ కంపెనీ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **పోస్టుల వివరాలు:** సీనియర్ మేనేజర్-01, అసిస్టెంట్ మేనేజర్-02, మేనేజర్-02.
- **విభాగాలు:** ఓషన్ ఎక్స్‌పోర్ట్, ఆపరేషన్స్, మానుఫ్యాక్చరింగ్, ఎఫ్ఐసీవో ఫంక్షనల్, లాజిస్టిక్స్, ఇండస్ట్రియల్, కార్పొరేట్ ఐటీ.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీఏ, డిగ్రీ(ఇంజనీరింగ్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** సీనియర్ మేనేజర్‌కు 40 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 27 ఏళ్లు, మేనేజర్‌కు 37 ఏళ్లు.
- **వేతనం:** నెలకు అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000, మేనేజర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, సీనియర్ మేనేజర్‌కు రూ.70,000 నుంచి రూ.2,00,000.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.06.2025.
- **వెబ్‌సైట్:** www.balmerlawrie.com

జీఆర్ఎస్ఈ, కోల్‌కతాలో 56 పోస్టులు

కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ (జీఆర్ఎస్ఈ).. వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 56.
- **పోస్టుల వివరాలు:** సూపర్‌వైజర్(ఎస్ గ్రేడ్1, 2, 3, 4)-38, డిజైన అసిస్టెంట్(ఎస్ గ్రేడ్1, 2)-17, ఇంజిన్ టెక్నీషియన్(ఎస్ గ్రేడ్1)- 01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీబీఏ, బీఎస్సీ, డిప్లొమా, బీబీఎం, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** డిజైన్ అసిస్టెంట్‌కు 32 ఏళ్లు, సూపర్‌వైజర్‌కు 36 నుంచి 38 ఏళ్లు, ఇంజన్ టెక్నీషియన్‌కు 28 ఏళ్లు ఉండాలి. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- **వేతనం:** నెలకు సూపర్‌వైజర్ ఎస్-3 గ్రేడ్‌కు రూ.27,600 నుంచి రూ.96,600, సూపర్‌వైజర్(ఎస్-2 గ్రేడ్)కు రూ.25,700 నుంచి రూ.90,000, సూపర్‌వైజర్ (ఎస్-1 గ్రేడ్)కు రూ.23,800 నుంచి రూ.83,300, సూపర్‌వైజర్(ఎస్-4 గ్రేడ్)కు రూ.29,300 నుంచి రూ.1,02,600, ఇంజన్ టెక్నీషియన్‌కు రూ.23,800 నుంచి రూ.83,300, డిజైన్ అసిస్టెంట్‌కు రూ.23,800 నుంచి రూ.83,300.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ట్రేడ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.06.2025
- **వెబ్‌సైట్:** http://grse.in/

తెలుగు యూనివర్శిటీలో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా, బాచుపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్శిటీలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ, ఎంఏ, యూజీ, పీజీ, పీజీ డిప్లొమా, డిప్లొమా, సర్టిఫికేట్ రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సుల వివరాలు:** బీఎఫ్ఏ(నాలుగేళ్లు), బీడిజైన్(నాలుగేళ్లు), ఎంఎఫ్ఏ(రెండేళ్లు), ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్(రెండేళ్లు), ఎంఏ/ఎంపీఏ(రెండేళ్లు), ఎంఏ (తెలుగు, హిస్టరీ, సంస్కృతి, పర్యాటకం) (రెండేళ్లు), ఎండిజైన్ (రెండేళ్లు)తోపాటు పీజీ డిప్లొమా కోర్సులు, డిప్లొమా కోర్సులు, సర్టిఫికేట్ కోర్సులు.
- **అర్హత:** కోర్సును అనుసరించి ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **ఎంపిక విధానం:** రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.06.2025.
- **ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్.
- **వెబ్‌సైట్:** https://teluguuniversity.ac.in/

ఇంటర్‌తోనే కొలువు + కోర్సు

రక్షణ రంగంలో ఆఫీసర్ కొలువు కోరుకునే వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. యూపీఎస్సీ త్రివిధ దళాల్లో పోస్టుల భర్తీకి ఎన్‌డీఏ, ఎన్ఏ(2) 2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా ఇంటర్ అర్హతతోనే ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో కొలువుతోపాటు కోర్సును పూర్తి చేసుకోవచ్చు. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో.. ఎన్‌డీఏ, ఎన్ఏ పోస్టుల వివరాలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



కేంద్ర ప్రభుత్వ నియామక సంస్థ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ).. త్రివిధ దళాల్లో ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఏటా రెండుసార్లు నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ), నావల్ అకాడమీ ఎగ్జామినేషన్(ఎన్ఏ) నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. తాజాగా 2025 సంవత్సరానికి సంబంధించి రెండో విడత నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా 2026 జూలై 1న ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో ప్రారంభమయ్యే ఎన్‌డీఏకు చెందిన 156వ కోర్సు, అదేవిధంగా 118వ ఇండియన్ నావల్ అకాడమీ కోర్సులో ప్రవేశం పొందొచ్చు. ఈ కోర్సుల్లో చేరి శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులకు త్రివిధ దళాల్లో ఆఫీసర్ స్థాయి కొలువు ఖాయమవుతుంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 406

పోస్టుల వివరాలు

నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)కి సంబంధించి ఆర్మీలో 208 పోస్టులు (మహిళలకు 10 పోస్టు లు); నేవీలో 42 పోస్టులు(మహిళలకు 5 పోస్టులు); ఎయిర్ ఫోర్స్‌లో 120 పోస్టులు((ఫ్లయింగ్-92 పోస్టులు(మహిళలకు 2 పోస్టులు), గ్రౌండ్ డ్యూటీ (టెక్)-18 పోస్టులు(మహిళలకు 2 పోస్టులు), గ్రౌండ్ డ్యూటీ నాన్ టెక్-10 పోస్టులు(మహిళలకు 2 పోస్టులు)); అదేవిధంగా నావల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)-36 పోస్టులు(మహిళలకు 4 పోస్టులు) ఉన్నాయి.

విద్యార్హతలు

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ)కి చెందిన ఆర్మీ వింగ్‌లో పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఏదైనా గ్రూప్‌లో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.
- నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)కి చెందిన ఎయిర్‌ఫోర్స్, నావల్ వింగ్‌తోపాటు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి.

వయసు

అభ్యర్థులు 2007 జనవరి 1కు ముందు, 2010 జనవరి 1 తర్వాత జన్మించి ఉండరాదు. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వేతనం

శిక్షణకు ఎంపికైన వారికి ప్రారంభంలోనే నెల కు రూ.56,100 స్టైపెండ్ లభిస్తుంది. విజయ వంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ప్రతి నెల రూ.56,100 మూల వేతనంతోపాటు డీఏ, హెచ్ఆర్ఏ, ఇతర ఆర్థిక ప్రోత్సాహకాలు, సౌకర్యాలు లభిస్తాయి.

ఎంపిక విధానం

ఎన్‌డీఏ, ఎన్ఏకు అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. మొదటి దశలో రాత పరీక్ష నిర్వహిస్తారు. రాత పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఎస్ఎస్‌బీ(సర్వీస్ సెలక్షన్ బోర్డ్) ఇంటర్వ్యూ, మెడికల్ టెస్టుల ఆధారంగా తుది విజేతలను ప్రకటిస్తారు.

రాత పరీక్ష ఇలా

- మొత్తం 900 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో రాత పరీక్ష ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు.. పేప ర్-1 మ్యాథమెటిక్స్-300 మార్కులకు, పేపర్-2 జనరల్ ఎబిలిటీ టెస్ట్-600 మార్కులకు ఉంటాయి. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్న పత్రాలు ద్విభాష (బైలింగ్వల్) ఇంగ్లిష్/హిందీలో ఉంటాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది.
- రాత పరీక్షలో ప్రతిభ చూపిన వారికి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ 900 మార్కులకు జరుగుతుంది. ఇందులో స్టేజ్ 1, స్టేజ్ 2 ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. స్టేజ్ 1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్, పిక్చర్ పర్సెప్షన్ అండ్ డిస్క్రిప్షన్ టెస్ట్ ఉంటాయి.
- స్టేజ్ 1లో అర్హత సాధించిన వారికి స్టేజ్ 2 నిర్వహిస్తారు. స్టేజ్ 2లో.. ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్క్స్, సైకాలజీ టెస్టులు, కాన్ఫరెన్స్ ఉంటాయి. ఇవి నాలుగు రోజుల పాటు కొనసాగుతాయి. ఇంటర్వ్యూ ఆఫీసర్, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్, సైకాలజిస్ట్ అభ్యర్థి వ్యక్తిత్వాన్ని అంచనావేస్తారు.

శిక్షణ

- నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)కి చెందిన ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు ఎంపికైన అభ్యర్థులకు మూడేళ్లపాటు శిక్షణ ఉంటుంది. ఇందులో భౌతిక శిక్షణ తోపాటు అకాడెమిక్ బోధన కూడా ఉంటుంది. ఈ మూడేళ్లలో రెండున్నరేళ్లు మూడు సర్వీసులకు ఉమ్మడిగా శిక్షణ ఇస్తారు. మొత్తంగా మూడేళ్ల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ డిగ్రీలను ప్రదానం చేస్తుంది. ఆర్మీ క్యాడెట్స్‌కు బీఎస్సీ/బీఎస్సీ(కంప్యూటర్స్/బీఏ; నావల్ క్యాడెట్స్‌కు బీటెక్ డిగ్రీ, ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్స్‌కు బీటెక్/బీఎస్సీ/బీఎస్సీ కంప్యూటర్స్ పట్టాలను అందజేస్తారు.
- 10+2 క్యాడెట్ ఎంట్రీ నావెల్ అకాడమీకి ఎంపికైన అభ్యర్థులకు ఇండియన్ నావల్ అకాడమీ, ఎజిమలలో నాలుగేళ్లపాటు శిక్షణ ఇస్తారు. వీరికి శిక్షణ అనంతరం బీటెక్ డిగ్రీని ప్రదానం చేస్తారు.
- ఇలా శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌ల్లో ఆఫీసర్ స్థాయి ఉద్యోగాలైన లెఫ్టినెంట్, సబ్‌లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్/గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ హోదాలతో కెరీర్ ప్రారంభమవుతుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 17.06.2025
- రాత పరీక్ష తేది:14.09.2025
- వెబ్‌సైట్: https://upsconline.nic.in., https://upsc.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం- సోషల్ మెథడ్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-ఫిజిక్స్ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం- రీజనింగ్


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 71

సోమవారం 2-6-2025


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చెట్టు రంగు మారిందో... అగ్నిపర్వతం పేలిందే! -6లో



రిటర్నుల దాఖలుకు రెడీనా?
ఐటీఆర్ పత్రాల్లో మార్పులు. సెప్టెంబర్ 15 వరకు అదనపు గడువు -13లో



ముస్లిం ఓట్ల కోసమే..

ముస్లిం ఓటు బ్యాంకు కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతపై అమిత్ షా మండిపడ్డారు.

వివరాలు 6లో ▸



బ్రిటన్ గాట్ టాలెంట్‌లో...

అసోంకు చెందిన తొమ్మిదేళ్ల బనితా చెత్రీ ప్రఖ్యాత 'బ్రిటన్ గాట్ టాలెంట్' రియాలిటీ డ్యాన్స్ పోటీల్లో రెండో రన్నరప్‌గా నిలిచింది.

వివరాలు 6లో ▸



రష్యాపై డ్రోన్ దాడులు...

రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులకు దిగింది. 40 ఫైటర్ జెట్లను ధ్వంసం చేసింది. ఈ పేలుళ్లలో 2 వంతెనలు కూలాయి.

వివరాలు 6లో ▸



అన్నార్తులపైకి కాల్పులు

గాజాలో అన్నార్తులపై ఇజ్రాయెల్ సైన్యం కాల్పులకు తెగబడింది. ఆ కాల్పుల్లో 31 మంది పాలస్తీనావాసులు బలయ్యారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

నేటి నుంచి గ్రామాలకే నాణ్యమైన విత్తనాలు



'గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ నాణ్యమైన విత్తన పంపిణీ' అనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు.

- వివరాలు 5లో▶

ఈ వారంలో భారత్‌కు ప్రభాకర్‌రావు



ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ టి. ప్రభాకర్‌రావు ఈ వారంలోనే భారత్‌కు రానున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆయన సిట్ ఎదుట హాజరుకానున్నారని సమాచారం.

- వివరాలు 3లో▶

స్టేటస్ పెట్టుకుంటే డబ్బులిస్తాం!



సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. 'తక్కువ మొత్తం.. ఎక్కువ మంది నుంచి వసూలు' అనే సరికొత్త మోసతంత్రాన్ని తెరపైకి తెచ్చారు. తాము పంపిన ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకుంటే మీ బ్యాంకు ఖాతాల్లో కాసులు వచ్చిపడతాయని బురిడీ కొట్టిస్తున్నారు.

- వివరాలు 2లో▶

ఉత్తమ సేవలకు పతకాలు



అత్యుత్తమ సేవలందిస్తున్న పోలీస్, అగ్నిమాపక శాఖ సిబ్బందికి ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు సేవా పతకాలు ప్రకటించింది. పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో కలిపి 625 మందికి, ఏసీబీలో 22 మందికి పతకాలు అందించనుంది.

- వివరాలు 3లో▶



కంకరలో వంకర పనులు

సంగారెడ్డి జిల్లాలో విచ్చలవిడిగా అక్రమ మైనింగ్

ఈటీఎస్ సర్వేతో వెలుగులోకి గ'లీజు' దందా

- వందల కోట్లు కొట్టేస్తున్న లీజుదారులు
- అనుమతించిన విస్తీర్ణానికి మించి తవ్వకాలు.. అక్రమంగా తరలింపు
- సీనరేజి చార్జీలు చెల్లించకుండా సర్కారు ఆదాయానికి గండి

సీనరేజి, జరిమానా కింద రూ.974 కోట్లు చెల్లింపునకు నోటీసులు

- 15 కంపెనీలు, వ్యక్తులకు నోటీసులు జారీ చేసిన భూగర్భ గనుల శాఖ
- అక్రమార్కుల్లో ఎమ్మెల్యే సోదరుడి బినామీ!.
- పలు దఫాలుగా నోటీసులు జారీ



సంగారెడ్డి జిల్లాలోని ఓ స్టోన్ అండ్ మెటల్ క్వారీ

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలో గత పదేళ్లుగా అక్రమ మైనింగ్ విచ్చలవిడిగా జరుగుతోంది. రాజకీయ పలుకుబడి ఉన్న ప్రజాప్రతినిధులు, బడా బాబులు మైనింగ్ దందాలో వందల కోట్లు కొట్టేస్తున్నారు. అడిగే నాథుడే లేకపోవడంతో ఈ అక్రమ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలు అన్నట్లుగా సాగుతోంది. తవ్వకాలు జరిపిన పరిమాణానికి గాను నిర్దేశిత మొత్తంలో భూగర్భ గనుల శాఖకు చెల్లించాల్సిన సీనరేజీ చార్జీలు చెల్లించకుండా సర్కారు ఆదాయానికి గండి కొట్టడం ఇక్కడ పరిపాటైంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అక్రమ మైనింగ్‌పై విచారణకు ఆదేశించింది. ఈ క్వారీల్లో ఏ మేరకు తవ్వకాలు జరిపారు.. ఎంత కొల్లగొట్టారనే దానిపై ఈటీఎస్ (ఎలక్ట్రానిక్ టోటల్ స్టేషన్) సర్వే చేపట్టారు. ఈ సర్వేలోనే భారీ ఎత్తున అక్రమాలు వెలుగులోకి రావడం గమనార్హం. కాగా.. రూ.974 కోట్లు సీనరేజీ చార్జీలు, జరిమానా కింద చెల్లించాలంటూ, అక్రమార్కులకు గతం నుంచే పలు దఫాలుగా నోటీసులు జారీ అయిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.

జిన్నారం, కంది, పటాన్‌చెరు మండలాల్లో..

భూగర్భ గనుల శాఖ నుంచి డిమాండ్ నోటీసులు జారీ అయిన క్వారీలు సంగారెడ్డి

మిగతా 5వ పేజీలో ▶

యువ వికాసం అర్హుల లెక్క తేలాకే..

నేటి మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా

- పథకంపై కేబినెట్‌లో చర్చించాక నిర్ణయం
- ఈ నెల 5న సమావేశం కానున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాజీవ్ యువ వికాసంతో పాటు వివిధ పథకాలపై చర్చించే అవకాశం
- నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయం
- మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ భేటీ

సాక్షి, హైదరాబాద్

రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాల జారీ వాయిదా పడింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తొలి రెండు కేటగిరీల వారికి యూనిట్లకు సంబంధించిన మంజూరు పత్రాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే అర్హులందరికీ మంజూరు పత్రాలు ఇచ్చేందుకు కొంత సమయం పడుతుంది కాబట్టి ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు. ఈ నెల 5న రాష్ట్ర కేబినెట్ భేటీ కానుంది. ఇందులో రాజీవ్ యువ వికాసంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఇతర కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆదివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో రాష్ట్ర మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, వానాకాలం పంటల సాగు సన్నద్ధత, ఉద్యోగుల సమస్యలు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, జిల్లాల్లో మంత్రులు చేసిన పరిశీలన, రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.



యువ వికాసానికి అనూహ్య స్పందన

రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో..మొత్తం నాలుగు కేటగిరీలకు సంబంధించి ప్రభుత్వానికి అందిన ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే అర్హుల ఎంపిక జరపాలని, ఈ పథకం కింద

మిగతా 5వ పేజీలో ▶



ఆదివారం యాదగిరిగుట్టలో ధర్మ దర్శనం క్యూ కాంప్లెక్స్‌లో నిల్చున్న భక్తులు

ఒక్క రోజే 90 వేల మంది!

- యాదగిరిగుట్ట ఆలయ చరిత్రలోనే రికార్డు స్థాయిలో పోటెత్తిన భక్తజనం

- వివరాలు 14లో



72 ఏళ్ల మా కల నెరవేరింది

నా బ్యూటీ పాజెంట్ జర్నీ నా పద్దెనిమిదవ ఏట మొదలైంది. మొదటిసారి నేను గెలవలేదు. తర్వాత రెండేళ్లకు మళ్లీ నేషనల్ బ్యూటీ పాజెంట్‌లో పాల్గొన్నాను. గెలిచాను. మిస్ వరల్డ్‌కి ఎంపికయ్యాను. బ్యూటీ విత్ ఎ పర్పస్‌తో విన్ అయ్యి.. మిస్ వరల్డ్ క్రౌన్‌తో మీ ముందుకు వచ్చాను. నిజానికి ఇది మా దేశం 72 ఏళ్లుగా కంటున్న కల. ఆ కల నా ద్వారా సాకారం అయినందుకు, నేను మిస్ వరల్డ్ క్రౌన్‌తో మా దేశానికి వెళ్లగలుగుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

..: మిస్ వరల్డ్ ఓపల్ సుచాతా :..

సమానత్వం.. సాధికారత సాధిస్తా!



కిరీటం మరొకరికి వెళ్లచ్చు. కానీ, నా అంతర్గత అందం నేను చేసే పనిపైనే ఉంటుంది. అదే నాకు కిరీటం. స్థానికంగా, అంతర్జాతీయంగా ఆరోగ్య సమానత్వం, లింగ సాధికారత కోసం ఒక గొంతుకగా పనిచేస్తాను. ఈ పోటీలలో పాల్గొనడం ద్వారా భారతీయ సంప్రదాయ, సాంస్కృతిక పరిమళాన్ని అర్థం చేసుకున్నాను. ఆస్వాదించాను.

ఫస్ట్ రన్నరప్ హాసెట్ డెరెజె అడ్మస్సు



అందమైన అనుభవాలు.. అద్భుతమైన జ్ఞాపకాలు

నేను పొందిన గొప్ప విజయాల్లో ఒకటి చిన్నచూపును అధిగమించడం. మొదట్లో నలుగురితో కలవాలంటే చాలా సిగ్గుపడేదాన్ని. దానిని దాటి ఈ దశకు వచ్చాను. ప్రజలతో కలిసిపోవడం, వారితో మాట్లాడుతూ ఉండటం అంటే నాకు ఇష్టం. కిరీటం దక్కకపోయినా అంతకు మించిన అనుభవాలు నాకు అద్భుతమైన జ్ఞాపకాన్ని ఇచ్చాయి.

12లో

సెకండ్ రన్నరప్ మాజా క్లాజ్డా

స్లాట్ బుకింగ్ నేటి నుంచే..

రాష్ట్రవ్యాప్తంగా అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలుకు శ్రీకారం

- రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో ఏఐ చాట్‌బాట్ 'మేధ'సేవలు కూడా..
- క్రయవిక్రయదారుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక వాట్సాప్ నంబర్ ఏర్పాటు
- 82476 23578కు వాట్సాప్ చేస్తే కార్యాలయ లోకేషన్, స్లాట్ బుకింగ్ వేళల సమాచారం పొందే వీలు
- అధికారులతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి రానుంది. స్లాట్‌బుకింగ్‌తోపాటు కృత్రిమ మేధ (ఏఐ) సహకారంతో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో చాట్‌బాట్ 'మేధ'సేవలు కూడా ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో ఆదివారం నిర్వహించిన సమీక్షలో ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి స్లాట్ బుకింగ్ విధానాన్ని ఇప్పటికే రెండు దశల్లో పైలట్ ప్రాజెక్టు పద్ధతిన అమలు చేశారు. తొలి దశలో ఏప్రిల్ 10 నుంచి 22 మధ్య, రెండో దశలో మే 12 నుంచి 25 దాకా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ద్వారా రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ విధానం ద్వారా ఇప్పటివరకు 45,191 డాక్యుమెంట్లు రిజిస్టర్ అయ్యాయని.. మాన్యువల్ విధానంతో పోలిస్తే సుమారు 3 వేల వరకు ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగాయని సమీక్షలో అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు సులభతరమైన సేవలను పారదర్శకంగా అందించడమే లక్ష్యంగా సోమవారం నుంచి రాష్ట్రంలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. అయితే స్లాట్ బుకింగ్‌తోపాటు ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఐదు మాన్యువల్ రిజిస్ట్రేషన్లు చేసే విధానం కూడా కొనసాగనుంది.

వాట్సాప్‌లోనే సమాధానాలు

ఆస్తుల క్రయవిక్రయదారులు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్ ద్వారా నేరుగా సందేహాలు

మిగతా 3వ పేజీలో ▶

3 నెలల రేషన్.. 6 సార్లు నిశాన్

- చాలాచోట్ల మొరాయించిన సర్వర్లు.. షాపుల మూసివేత
- కేంద్రం, రాష్ట్ర కోటా కింద ఆరుసార్లు వేలిముద్రల సేకరణకు అధిక సమయం
- రాష్ట్రవ్యాప్తంగా తొలిరోజు అంతంత మాత్రంగా సన్నబియ్యం పంపిణీ

సాక్షి, హైదరాబాద్: వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన రేషన్ ఏకకాలంలో పంపిణీ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అవాంతరాల మధ్య అంతంతమాత్రంగా సాగింది. లబ్ధిదారుల నుంచి మూడు నెలలకు సంబంధించి ఆరుసార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి రావడం క్షేత్రస్థాయిలో సాంకేతిక సమస్యలకు దారితీసింది. ఒక్కో లబ్ధిదారు నుంచి వేలిముద్రల సేకరణ, వేర్వేరుగా బియ్యం కాంటా కోసం సుమారు అరగంట సమయం పట్టింది. దీంతో లబ్ధిదారులు గంటలకొద్దీ క్యూలలో నిరీక్షించాల్సి వచ్చింది. చాలా జిల్లాల్లో ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ–పీఓఎస్) పరికరాలు నెట్‌వర్క్ సమస్యలతో మొరాయించడంతో చేసేది లేక డీలర్లు దుకాణాలను మూసేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులు ఖాళీ సంచులతో ఇళ్లకు తిరిగి వెళ్లారు. ఇంకొన్ని జిల్లాల్లో రేషన్ షాపులకు సన్నబియ్యం స్టాక్ చేరుకోకపోవడంతో పంపిణీ సాధ్యంకాలేదు. వెరసి.. తొలిరోజు ఎక్కడా 10 శాతం మించి సన్నబియ్యం పంపిణీ సాధ్యం కాలేదు.

కేంద్రం.. రాష్ట్ర లెక్కల వల్లే..

రాష్ట్రంలో ఉన్న రేషన్ కార్డుల్లో 55 లక్షలు కేంద్రం ఇచ్చిన ఎన్ఎస్ఎఫ్ఏ కార్డులుకాగా.. 32 లక్షలు

మిగతా 14వ పేజీలో ▶



ఆదివారం ఆదిలాబాద్‌లోని ఓ చౌక ధరల దుకాణం వద్ద రేషన్ కార్డుదారుల పడిగాపులు

రాష్ట్రంలో ఓ కుటుంబ డ్రామా నడుస్తోంది..

- దండుకున్న సొమ్ము పంపకాల్లో గొడవలే ఇందుకు కారణం
- ఆ డ్రామాలో మనం పాత్రధారులం కావాల్సిన అవసరం లేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయి
- రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

2లో



స్టేటస్ పెట్టుకుంటే డబ్బులిస్తాం!

సైబర్ నేరగాళ్లు రూటు మార్చారు. 'తక్కువ మొత్తం.. ఎక్కువ మంది నుంచి వసూలు'అనే సరికొత్త మోసతంత్రాన్ని తెరపైకి తెచ్చారు. నగరాల్లో సైబర్ మోసాలపై క్రమంగా అవగాహన పెరుగుతుండటంతో సైబర్ నేరగాళ్లు క్రమంగా ద్వితీయశ్రేణి పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. వాట్సాప్ వాడటం అన్ని ప్రాంతాల్లో పరిపాటిగా మారడంతో దాన్నే ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. తాము పంపిన ఫొటోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకుంటే మీ బ్యాంకు ఖాతాల్లో కాసులు వచ్చిపడతాయని బురిడీ కొట్టిస్తున్నారు. వాట్సాప్ స్టేటస్‌గా పెట్టిన ఫొటోలను వ్యూ, లైక్, కామెంట్.. ఇలా ఒక్కో టాస్క్‌కు రూ. 2 చొప్పున మీ బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని ప్రచారం చేస్తున్నారు. ఇదంతా జరగాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు కింద రూ. 300 తాము చెప్పిన ఫోన్ నంబర్‌కు పంపాలని సూచిస్తున్నారు. వాటిని నమ్మి వాట్సాప్ స్టేటస్ టాస్క్‌కు ముందుకొచ్చే వారి నుంచి ముందుగా రూ. 300 వసూలు చేయడమే కాకుండా మరో ఆరుగురిని చేరిస్తే కట్టిన రూ. 300 తిరిగి ఇస్తామని ఊదరగొడుతున్నారు. క్రమంగా మల్టీలెవల్ మార్కెటింగ్ తరహాలో చైన్‌ను ఏర్పాటు చేస్తూ అమాయకుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారు. తాండూరు ప్రాంతంలో ఈ తరహా సైబర్ మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది. వేలాది మంది ఈ తరహాలో డబ్బులు పోగొట్టుకున్నట్లు తెలుస్తోంది.

సాక్షి, హైదరాబాద్



- నయా దందా మొదలుపెట్టిన సైబర్ మోసగాళ్లు
- కొన్ని ఫొటోలు పంపి వాట్సాప్ స్టేటస్ పెట్టాలని సూచన
- ఒక్కో వ్యూకి రూ. 2 చొప్పున లెక్కకట్టి ఇస్తామని గాలం
- రూ.300 చొప్పున సభ్యత్వ రుసుం పేరిట వసూలు
- ఆరుగురిని చేర్పిస్తే మీ డబ్బు మాఫీ అవుతుందని బురిడీ
- వేలాది మంది నుంచి డబ్బు కొల్లగొడుతున్న కేటుగాళ్లు
- చిన్నమొత్తాలు కావడంతో పోలీసులను ఆశ్రయించని బాధితులు

సైబర్ మోసగాళ్లు చెప్పే మాటలు నమ్మి బాధితులంతా రూ.300 చొప్పున వారు చెప్పే గూగుల్ పే, ఫోన్ పే నంబర్లకు చెల్లిస్తున్నారు. ఇందులో ఒకరిద్దరికి రూ. 300 తిరిగి ఇస్తున్న నేరగాళ్లు... ఎక్కువ మంది నుంచి డబ్బులు దండుకోవడమే పనిగా పెట్టుకుంటున్నారు. వాట్సాప్ స్టేటస్‌ను నెలపాటు పెట్టుకోవడంతోపాటు ప్రతిరోజూ స్క్రీన్ షాట్ పంపాలని నిబంధన విధించడం.. చివరకు నిబంధనలు పాటించనందున మళ్లీ మొదటి నుంచి చేయాలంటూ అమాయకులను మోసగిస్తున్నారు. ఈ తరహా మోసాలు ప్రధానంగా తాండూరు, వికారాబాద్ ప్రాంతంలో ఎక్కువగా వెలుగులోకి వస్తున్నాయి. అయితే బాధితులంతా ఇంత చిన్న మొత్తానికి పోలీసులకు ఏం ఫిర్యాదు చేస్తాంలేనని వదిలేస్తుండటం సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోంది. బాధితుల సంఖ్య పెరిగేకొద్దీ సైబర్ నేరగాళ్లు కొల్లగొడుతున్న సొమ్ము రూ. లక్షల్లోకి చేరుతోంది.

బాధితులు ఫిర్యాదు చేయకపోవడంతో..

తెలిసిన వాళ్లు చెబితే డబ్బు కట్టాం



మాకు తెలిసిన వ్యక్తి ద్వారా వాట్సాప్ స్టేటస్ పెడితే డబ్బులు వస్తాయని తెలిసి మేం కూడా రూ. 300 ఫీజు ఆన్‌లైన్‌లో కట్టి రుద్ర టెక్నాలజీ పేరిట వాట్సాప్ గ్రూప్‌లో చేరాం. ఆ తర్వాత 30 ఫొటోలు వచ్చాయి. రోజుకు ఒకటి చొప్పున వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాం. కానీ ఆ తర్వాత డబ్బులు తిరిగి రాలేదు.

- సుదర్శన్‌రెడ్డి, తాండూరు

ఐదుగురిని చేర్పించి మోసపోయా



వికారాబాద్‌లో ఓ స్నేహితుడి ద్వారా రూ. 300 ఆన్‌లైన్‌లో పంపా. 30 రోజులపాటు ఫొటోలు పెట్టాక డబ్బులు అడిగితే టాస్క్ సరిగా చేయలేదన్నారు. గ్రూప్‌లో ఐదుగురిని చేర్పిస్తే వెంటనే డబ్బులు వస్తాయని ఆశపెట్టడంతో ఐదుగురిని చేర్పించా. అయినా నాతోపాటు ఆ ఐదుగురి డబ్బులు కూడా పోయాయి.

- నీరటి నరేశ్‌కుమార్, కొత్తూరు

4 నెలల్లో 11% తగ్గిన సైబర్ నేరాల ఫిర్యాదులు

- గతేడాదితో పోలిస్తే తగ్గుదల నమోదు
- 16 శాతానికి చేరిన రికవరీ: తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో
- దేశవ్యాప్తంగా సైబర్ నేరాల నమోదు 28 శాతం పెరిగినట్లు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఆర్థిక సైబర్ నేరాల ఫిర్యాదులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 11 శాతం తగ్గినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తెలిపింది. అదే సమయంలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాల ఫిర్యాదులు 28 శాతం పెరిగినట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. దీనిప్రకారం జనవరి–ఏప్రిల్ మధ్య సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బులు కోల్పోయే ఘటనలు 19 శాతం తగ్గినట్లు వివరించింది. సైబర్ బాధితులు పోగొట్టుకున్న సొమ్ము రికవరీ 2024లో 13 శాతంగా నమోదవగా ఈ ఏడాది అది 16 శాతానికి పెరిగినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో తెలిపింది. గతేడాది ఇదే కాలంలో 6,763 కేసులు నమోదవగా ఈ ఏడాది 7,575 కేసులు నమోదైనట్లు పేర్కొంది. 2024లో 230 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామని.. ఈ ఏడాదిలో 626 మంది నేరగాళ్లను పట్టుకున్నామని బ్యూరో వివరించింది. 1930 కాల్ సెంటర్‌కు ఫిర్యాదు అందిన వెంటనే 3 నిమిషాల్లోనే నగదు ఫ్రీజింగ్‌కు సంబంధించి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది.

రాష్ట్రంలో ఓ కుటుంబ డ్రామా నడుస్తోంది

దండుకున్న సొమ్ము పంపకాల్లో గొడవలే ఇందుకు కారణం

- ఆ డ్రామాలో మనం పాత్రధారులం కావాల్సిన అవసరం లేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయి
- రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పుడు ఓ కుటుంబ డ్రామా నడుస్తోందని, అధికారంలో ఉన్నప్పుడు దండుకున్న సొమ్మును పంచుకోవడంలో తలెత్తిన గొడవలే ఇందుకు కారణమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలు చేసి దోచుకున్న ఆస్తుల కోసం జరుగుతున్న గొడవల్లో మనం పాత్రధారులం కావాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతి, అక్రమాలపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మచ్చలేని పాలన సాగిస్తోందన్నారు.

మోదీ పాలనపై ఎలాంటి చర్చకైనా తాను సిద్ధమన్నారు. విద్యుత్, ఎరువులు, రైతుల సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అని కాంగ్రెస్‌కు సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రావాలన్నారు. రాహుల్ గాంధీకి దేశ చరిత్ర తెలియదని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. కాగా, తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. బీజేపీ జిల్లా, మండల పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు.

వర్క్‌షాప్‌కు పలువురు డుమ్మా..

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వర్క్‌షాప్‌కు పలువురు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గైర్హాజరయ్యారు. మొత్తం 11 మంది ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల్లో కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఆర్.కృష్ణయ్య, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు హజరయ్యారు. ఎంపీ కె.లక్ష్మణ్ నిజామాబాద్ పర్యటనలో ఉన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు అర్వింద్, గోడెం నగేశ్ గైర్హాజరయ్యారు.

పెప్పర్ ఎరీనా ప్రాంగణం గులాబీమయం

నేడు డాలస్‌లో బీఆర్ఎస్ రజతోత్సవం

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు అమెరికాలోని డాలస్ నగరం ముస్తాబైంది. అక్కడి డాక్టర్ పెప్పర్ ఎరీనా ప్రాంగణాన్ని గులాబీమయం చేశారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు (భారత కాలమానం ప్రకారం సోమవారం తెల్లవారు జామున 3 గంటలకు) బీఆర్ఎస్ రజతోత్సవాలు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు జరుగనున్నాయి. ఆయా వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో పాల్గొనేందుకు అమెరికాలోని వివిధ నగరాల నుంచి తెలంగాణవాదులు ఇప్పటికే డాలస్ చేరుకున్నారు. గత 10 రోజులుగా బీఆర్ఎస్ ఎన్నారై యూఎస్ఏ చైర్మన్ మహేశ్ తన్నీరు, ఎన్నారై సెల్ గ్లోబల్ కో–ఆర్డినేటర్ మహేశ్ బిగాల తదితరులు వివిధ ప్రాంతాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. న్యూజెర్సీ, డెలావేర్, హ్యూస్టన్, టెక్సాస్, కొలంబస్, ఆస్టిన్, ఫ్లోరిడా, శాన్‌ఫ్రాన్సిస్కో, లాస్‌ఏంజెల్స్, అష్బర్న్, చికాగో, కెంటకీ తదితర నగరాల నుంచి ఈ వేడుకలకు ప్రజలు డాలస్ చేరుకుంటున్నట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. మే 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ స్ఫూర్తితో డాలస్ సభ నిర్వహిస్తున్నామని మహేశ్ తన్నీరు తెలిపారు.

ముగిసిన కేటీఆర్ యూకే పర్యటన

లండన్ నుంచి అమెరికాలోని డాలస్‌కు పయనం



డాలస్‌లో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు ఇంగ్లండ్ పర్యటన ముగిసింది. మే 27న యూకేలో అడుగుపెట్టిన ఆయన.. 31వ తేదీ వరకు వివిధ ప్రాంతాల్లో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం అమెరికా బయలుదేరి వెళ్లారు. మే 28న బీఆర్ఎస్ ఎన్నారై విభాగం కార్యవర్గంతో కేటీఆర్ సమావేశమై పార్టీ కార్యక్రమాలపై చర్చించారు. అదేరోజు యూకే తెలుగు బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో పాల్గొన్నారు. 30న బ్రిడ్జ్ ఇండియా వీక్– 2025 సదస్సులో పాల్గొని కీలకోపన్యాసం చేశారు. మెక్‌లారెన్, ఆస్టన్ మార్టిన్, జాగ్వార్, ల్యాండ్ రోవర్ వంటి ఆటోమోటివ్ సంస్థలకు ఆర్ అండ్ డీ సేవలు అందించే పీడీఎస్ఎల్ సంస్థ నాలెడ్జ్ సెంటర్‌ను వార్విక్ యూనివర్సిటీలో మే 31న కేటీఆర్ ప్రారంభించారు. యూకే పర్యటన ముగించుకొని అమెరికాలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనేందుకు అమెరికాలోని డాలస్‌కు బయలుదేరారు. తనకు వీడ్కోలు పలికేందుకు విమానాశ్రయానికి భారీగా తరలివచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, ఎన్నారైలకు కేటీఆర్ కృతజ్ఞతలు చెప్పారు. డాలస్ కేటీఆర్‌కు భారీ స్వాగత ఏర్పాట్లు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

స్వేచ్ఛ ఉందని లక్ష్మణ రేఖ దాటొద్దు

అభిప్రాయాలను అంతర్గతంగానే తెలియజేయాలి

- టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి
- గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించిన కమిటీ



బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీనాక్షి నటరాజన్, మహేష్‌గౌడ్‌లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లు రవి

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో మాట్లాడే స్వేచ్ఛ ఉంటుంది కదా అని నేతలెవరూ లక్ష్మణ రేఖ దాటొద్దని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామిక వాతావరణం ఉంటుందని.. పార్టీ నాయకులు ఏదైనా మాట్లాడాలనుకుంటే నాలుగు గోడల మధ్య అభిప్రాయాలను తెలియజేయాలని సూచించారు. టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన తర్వాత తొలిసారి ఢిల్లీ నుంచి రాష్ట్రానికి వచ్చిన మల్లు రవి నేరుగా గాంధీ భవన్‌కు వచ్చి అక్కడ మాజీ చైర్మన్ జి.చిన్నారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయనతోపాటు కమిటీ సభ్యులు కూడా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులెవరూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. క్రమశిక్షణ గీత దాటకుండా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం పరిఢవిల్లేలా చూడాలని కోరారు. తాను మూడు సార్లు ఎంపీగా, ఓసారి ఎమ్మెల్యేగా, రెండుసార్లు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధిగా బాధ్యతలు నిర్వర్తించానని.. పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ పదవి రావడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ఈ అవకాశం ఇచ్చిన ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మీనాక్షీ నటరాజన్, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో సామాజిక న్యాయమే లక్ష్యంగా పాలన

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో సామాజిక న్యాయమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పాలన కొనసాగుతోందని మల్లు రవి తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో గత ప్రభుత్వాలు దోపిడీ చేశాయని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయమే లక్ష్యంగా పలు పథకాలు, కార్యక్రమాలను చేపట్టిందని పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఏడాదిన్నరకాలంలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ ఆశయాలకు అనుగుణంగా, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌లో కేసీఆర్ కోవర్టు మహేశ్‌గౌడే

- ఆయన వల్లే నిజామాబాద్‌లో కవిత గెలిచారు
- బీజేపీ ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, హరీశ్, రామారావు, సూర్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీలో కేసీఆర్‌కు ప్రధాన కోవర్టు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడే అని బీజేపీ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పవార్, పైడి రాకేశ్‌రెడ్డి, పాల్వాయి హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. తెలంగాణ వచ్చాక జరిగిన ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి కవితను ఎంపీగా గెలిపించేందుకు ఆయన పరోక్షంగా మద్దతు ఇచ్చారని, ఈ విషయంపై కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీగౌడ్ అధిష్టానానికి ఫిర్యాదు చేశారని తెలిపారు. బీఆర్ఎస్‌తో ఆయనకు ఉన్న సఖ్యత వల్లే ఆమె అక్కడ గెలిచారని ఆదివారం బీజేపీ ఎమ్మెల్యేలు ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇప్పుడు కవితను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుని ఆమెకు మంత్రి పదవి ఇప్పించేందుకు అధిష్టానం వద్ద లాబీయింగ్ చేస్తున్నారని అన్నారు. కాగా, ఈటల రాజేందర్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు రహస్య భేటీ అని, మాజీ సీఎం కేసీఆర్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారంటూ మహేశ్‌కుమార్‌గౌడ్ నిరాధార ఆరోపణలు చేశారని బీజేపీ నేతలు మండిపడ్డారు. బీజేపీ పరపతిని, ఎంపీ ఈటల రాజేందర్ పరువును దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే ఇదంతా జరుగుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు ఆరోపణలు మాని, ఇందుకు సంబంధించిన ఆధారాలుంటే బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం, మిషన్ భగీరథ, ధరణి పోర్టల్, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, ఈ–కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలపై సీబీఐ విచారణ కోరాలని అన్నారు.

కాళేశ్వరంపై నేడు హరీశ్‌రావు 'ప్రజెంటేషన్'

సాక్షి, హైదరాబాద్: 'కాళేశ్వరంపై దుష్ప్రచారం–వాస్తవాలు' అనే అంశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కార్యక్రమంలో ఆయన కాళేశ్వరం ప్రాజెక్టుపై పలు అంశాలు వివరించనున్నారు.

రేవంత్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత: హరీశ్‌రావు



మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

జగదేవ్‌పూర్ (గజ్వేల్): 'దేవుళ్లపై ఒట్లు..అందాల పోటీలపై ఆసక్తి..రైతులపై కపట ప్రేమ ఇది సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి' అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఆదివారం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిగుల్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ, వంద అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏడాదిన్నర పరిపాలనలో ప్రజల నుంచి వ్యతిరేకత మొదలైందన్నారు. విత్తనాలు దొరకక, ఎరువులు అందక, ధాన్యం కొనుగోలు లేక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. రూ.200 కోట్లతో అందాల పోటీలు నిర్వహించడంపై ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మందకృష్ణ




మందకృష్ణకు జ్ఞాపికను బహూకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలిశారు. దేశ అత్యున్నత పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి అందుకున్న నేపథ్యంలో.. మందకృష్ణ తన ఆనందాన్ని సీఎంతో పంచుకున్నారు. సామాజిక న్యాయం కోసం మందకృష్ణ కృషికి కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డు ప్రదానం చేయడం తెలిసిందే.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ తెలిపారు. ఆయన ఆదివారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ భవన్‌లో పెద్దఎత్తున రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. డల్లాస్‌లో కేటీఆర్ నేతృత్వంలో పెద్ద ఎత్తున సిల్వర్ జూబ్లీ, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయంతోపాటు.. తెలంగాణ స్వరాష్ట్రం కోసం కేసీఆర్ నాయకత్వంలో జరిగిన ఉద్యమ ప్రస్థానాన్ని శ్రవణ్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలి

ముస్లిం పర్సనల్‌లా బోర్డు సభలో వక్తల డిమాండ్

- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ
- భారీ సంఖ్యలో హాజరైన ముస్లింలు



ధర్నాలో మాట్లాడుతున్న అక్బరుద్దీన్ ఒవైసీ

కవాడిగూడ (హైదరాబాద్): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు సవరణ చట్టం 2025ని వెనక్కి తీసుకోవాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు వద్ద పెద్ద ఎత్తున ధర్నా, భారీ సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా ఎంఐఎం శాసన సభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు అధ్యక్షుడు మౌలానా సయిఫుల్లా రహమానీ, ఎంఐఎం ఎమ్మెల్యేలు, పర్సనల్‌లా బోర్డు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ మత పెద్దలు ఈ ఉద్యమాన్ని ఐక్యంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. దీనికి ఎంఐఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అదే విధంగా ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. పర్సనల్‌లా బోర్డు అధ్యక్షుడు మౌలానా సయిఫుల్లా రహమానీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని, ముస్లింల వ్యక్తిగత హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులు, ఆదివాసీలు, ముస్లిం మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ పేరుతో నరమేధం

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు అంతా ఏకం కావాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో కోదండరామ్, ప్రొఫెసర్ హరగోపాల్, జస్టిస్ చంద్రకుమార్, సంపత్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. దేశంలో ప్రస్తుతం ఫాసిస్టు పాలన సాగుతోందని విమర్శించారు. మావోయిస్టుల ఏరివేత కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో నరమేధం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. మావోయిస్టులు చర్చలకు సిద్ధమని ప్రకటించినా చలించని ప్రధాని మోదీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొట్టికాయలు వేయగానే పాకిస్తాన్ ఉగ్రవాదులతో చర్చలకు సిద్ధమయ్యారని విమర్శించారు. పాకిస్తాన్‌తో కాల్పుల విరమణకు అంగీకరించిన మోదీ ప్రభుత్వం.. సొంత దేశ పౌరులైన మావోయిస్టులతో చర్చలు జరపకుండా మారణహోమం ఎందుకు సృష్టిస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాలని అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో లౌకిక శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు.

ఆదివాసీలపై యుద్ధం ఆపాలి: కోదండరామ్

ఎన్‌కౌంటర్ల పేరుతో నక్సలైట్లను చంపటం సరికాదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఆదివాసీలపై యుద్ధం ఆపాలని కోరారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. సమాజంలో శాంతిని కోరుకోవడం సరైనమార్గమని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి నమూనాలో భాగంగానే మావోయిస్టుల అణిచివేతకు దిగిందని ఆరోపించారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. శాంతి చర్చల కమిటీ ప్రతినిధి ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సీపీఐ నేతలు పద్మ, వేములపల్లి వెంకటరామయ్య, జీవన్‌కుమార్, అన్వేష్, కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, గాదగోని రవి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత బీసీ నినాదం హాస్యాస్పదం

బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్



నిజామాబాద్ సిటీ: ఎమ్మెల్సీ కవిత కొత్తగా బీసీ నినాదం, సామాజిక తెలంగాణ నినాదం ఎత్తుకోవడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. ఆదివారం ఆయన నిజామాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని సామాజిక తెలంగాణ ఇప్పుడు గుర్తుకువచ్చిందా? అని కవితను ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లో కుట్ర జరుగుతోందంటున్న కవిత.. ఆ విషయాన్ని తన తండ్రి కేసీఆర్‌తో తేల్చుకోవాలని సూచించారు. బీఆర్ఎస్‌లో కుటుంబ పోరు నడుస్తోందన్నారు. అందులోకి బీజేపీని లాగవద్దని అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనే అంశాన్ని ఎవరు ముందుకు తెచ్చారో కవిత, కేసీఆర్‌ను అడిగి తెలుసుకోవాలని సలహా ఇచ్చారు. దేశంలో 20 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, ఆయా రాష్ట్రాల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, అవినీతికి తావులేకుండా పాలన సాగుతోందని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఎవరితోనూ పొత్తుపెట్టుకోదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో జైహింద్ యాత్ర కాకుండా జై పాకిస్తాన్ యాత్ర చేయాలన్నారు. ఈ సమావేశంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

వర్షిణి వ్యాఖ్యలు సరికావు

- జాతీయ ఎస్సీ కమిషన్ సీరియస్
- సీఎస్, డీజీపీలకు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: గురుకులాల్లోని విద్యార్థులపై తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణి చేసిన వ్యాఖ్యలను జాతీయ ఎస్సీ కమిషన్ తీవ్రంగా పరిగణించింది. ఆమె వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కావని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ జాతీయ ఎస్సీ కమిషన్ సంచాలకుడు డాక్టర్ సునీల్‌కుమార్ బాబు.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీ చేశారు. నిర్దేశించిన గడువులోగా వివరణ ఇవ్వకుంటే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.

ఆ టెండర్లు రద్దు చేయండి: ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో మాన్‌సూన్ ఎమర్జెన్సీ టీమ్స్ టెండర్లలో రెండు ఏజెన్సీలకు లబ్ధికలిగేలా నిబంధనలు మార్చారని, ఈ టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆమె ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. జీహెచ్‌ఎంసీలో వర్షాకాలం పనుల టెండర్లలో గోల్‌మాల్ జరిగిందని అందులో ఆరోపించారు. ఇన్‌స్టంట్ రిపేర్ టీమ్స్ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొందరు అధికారులు తమ అనుకూల సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. అధికారుల తీరు తెలంగాణ బీసీ కాంట్రాక్టర్లకు నష్టం చేసేలా ఉందన్నారు. నిబంధనల మార్పుతో జీహెచ్‌ఎంసీపై ఏటా రూ.5 కోట్ల అదనపు భారం పడుతుందని ఆమె తన లేఖలో పేర్కొన్నారు.

ఆర్టిజన్ల సమస్యలపై సమ్మెకు సిద్ధం

టీఎస్‌ఈఈయూ రాష్ట్ర సెక్రటరీ జనరల్ శ్రీధర్

హనుమకొండ: విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలపై అవసరమైతే సమ్మెకు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్ ఈఈయూ)– 327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ చెప్పారు. హనుమకొండలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆర్టిజన్ ఉద్యోగులు.. తమ సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం, విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఆర్టిజన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. లేదంటే ఐఎన్‌టీయూసీ అనుబంధ యూనియన్ అయిన టీఎస్‌ఈఈయూ సమ్మె చేయడానికి వెనుకాడదని హెచ్చరించారు.

సెల్‌ఫోన్ వెలుగులో చికిత్స చేయడం తప్పా?

ఆసుపత్రి సూపరింటెండెంట్ సస్పెన్షన్ సరికాదు: టీజీజీడీఏ

సాక్షి, హైదరాబాద్: జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో మొబైల్ ఫోన్, టార్చిలైట్ల వెలుగుల్లో ఓ వ్యక్తికి చికిత్స చేసినందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీధర్‌ను సస్పెండ్ చేయడం పట్ల తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించకుండా, ఉన్న వనరులను ఉపయోగించుకొని విధులు నిర్వర్తించిన వైద్యులపై చర్యలు తీసుకోవడం వల్ల వారి మానసిక స్థైర్యం దెబ్బతింటుందని సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి.నరహరి, సెక్రటరీ జనరల్ లాలూప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రవూఫ్ ఒక ప్రకటనలో అభిప్రాయపడ్డారు. జహీరాబాద్ ఘటనలో మధ్యాహ్నం 1:30 గంటలకు విద్యుత్ నిలిచిపోయిందని.. మేఘావృత వాతావరణంలో వెలుతురు తక్కువగా ఉండటంతో వైద్యులు మొబైల్ ఫ్లాష్‌లైట్లు, టార్చిలైట్లతో వైద్య సేవలు కొనసాగించారని పేర్కొన్నారు. డాక్టర్ శ్రీధర్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీజీఎడ్‌సెట్‌కు 83 శాతం హాజరు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని బీఎడ్ కాలేజీల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆదివారం నిర్వహించిన టీజీఎడ్ సెట్–2025 ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా రెండు సెషన్లుగా నిర్వహించిన పరీక్షకు మొత్తం 38,758 మందికి గాను 32,106 మంది (83శాతం) హాజరైనట్లు ఎడ్‌సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి తెలిపారు. ఉదయం సెషన్‌లో 74, మధ్యాహ్నం సెషన్‌లో 73 సెంటర్లలో పరీక్ష నిర్వహించారు. మొదటి సెషన్ పరీక్షకు 19,538 మంది విద్యార్థులకు గాను 16,117 మంది (82.49 శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు నిర్వహించిన సెకండ్ సెషన్ పరీక్షకు 19,220 మందికి గాను 15,989 మంది (83.19 శాతం) హాజరయ్యారు. పరీక్షల కోసం ప్రశ్నపత్రాలను ఉన్నతవిద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ కె.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌లు ప్రొఫెసర్ ఇ.పురుషోత్తమ్, ప్రొఫెసర్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వీసా–ఫ్రీ.. విదేశాలు!

పాస్‌పోర్ట్ ఉంటే చాలు

సాక్షి, స్పెషల్ డెస్క్



విదేశాలు చుట్టి రావాలని ఎవరికి ఉండదు. సమస్యల్లా వీసా పొందడమే. వీసా అక్కర్లేదు.. పాస్‌పోర్ట్ ఉంటే చాలు, ఆతిథ్యం స్వీకరించేందుకు విచ్చేయండి అని భారతీయులను ఆహ్వానించే దేశాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఈ జాబితాలో తాజాగా ఫిలిప్పీన్స్ వచ్చి చేరింది. పలు దేశాలు వీసా రహిత ప్రవేశం, వీసా ఆన్ అరైవల్, ఆన్‌లైన్ వీసాలు (ఈ-వీసాలు) అందించడం ద్వారా పాస్‌పోర్ట్ ఉన్న భారతీయులకు ప్రయాణాన్ని సులభతరం చేశాయి.

ఈ జాబితాలోకి ఫిలిప్పీన్స్

'వీసా ఆన్ అరైవల్'తోనూ..

ఆతిథ్యానికి దేశాలు రెడీ

వీసా అవసరం లేకుండానే.. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) ప్రకారం 2025 మార్చి నాటికి 25 దేశాలలో భారతీయ పాస్‌పోర్ట్ హోల్డర్లకు వీసా రహిత ప్రవేశం అందుబాటులో ఉంది. దేశాన్నిబట్టి కాల వ్యవధులు, కొన్ని షరతులు ఉన్నాయి. దీర్ఘకాలిక ద్వైపాక్షిక ఒప్పందాల కారణంగా ఎలాంటి వీసా, రోజుల పరిమితి లేకుండా దక్షిణాసియాలో భూటాన్, నేపాల్‌ను చుట్టేయవచ్చు. హిందూ మహాసముద్ర ద్వీప దేశాలైన మాల్దీవులు (90 రోజులు అక్కడ ఉండొచ్చు), సీషెల్స్ (ముందస్తు ప్రయాణ అనుమతితో 90 రోజులు) భారతీయులను స్వాగతిస్తున్నాయి. మారిషస్ సైతం ఉచిత ప్రవేశాన్ని మంజూరు చేస్తోంది. ఆగ్నేయాసియాలో థాయ్‌లాండ్ 60 రోజుల వీసా రహిత ప్రయాణాన్ని అందిస్తోంది. 2026 డిసెంబర్‌లోగా 30 రోజుల పాటు వీసా లేకుండానే మలేషియా చుట్టొచ్చు. కరేబియన్ దీవులు భారతీయులకు వీసా రహిత ప్రయాణానికి హాట్‌స్పాట్. బార్బడోస్, గ్రెనడా, హైతీ, జమైకా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, సెయింట్ విన్సెంట్ అండ్ గ్రెనడీన్స్‌లో 30 నుండి 90 రోజుల వరకు బస చేయవచ్చు. ఇతర వీసా రహిత దేశాలలో పశ్చిమ ఆఫ్రికాలోని సెనెగల్, మధ్య ఆసియాలోని కజకిస్తాన్, బెలారస్, ఆగ్నేయాసియాలో ఫిలిప్పీన్స్ ఉన్నాయి.

ఈ-వీసా 62 దేశాల్లో.. భారత పౌరులకు 62 దేశాలు ఈ–వీసా ఆఫర్ చేస్తున్నాయి. ఈ జాబితాలో ఉన్న దేశాలకు వెళ్లే ఔత్సాహికులు రాయబార కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. సంబంధిత పత్రాలతో ఆన్‌లైన్‌లో వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే చాలు. అర్హతలనుబట్టి మంజూరు చేస్తారు. సమయం, ఖర్చు ఆదా అవుతుంది. ఆసియాలో జపాన్, సింగపూర్, ఇండోనేషియా, వియత్నాం, మలేషియా, శ్రీలంక, తైవాన్ ఎలక్ట్రానిక్ వీసా అందిస్తున్నాయి. కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, అర్మేనియా, అజర్‌బైజాన్, జార్జియా, రష్యా వంటి మధ్య ఆసియా, యురేషియా దేశాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఆఫ్రికా నుంచి కెన్యా, టాంజానియా, ఇథియోపియా, మొరాకో, ఈజిప్ట్, దక్షిణాఫ్రికా, నమీబియా దేశాలకు ఈ–వీసాలను పొందవచ్చు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సైతం భారతీయ పౌరులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అనుమతిస్తాయి. లాటిన్ అమెరికా, కరేబియన్‌లలోని అర్జెంటీనా, చిలీ, సురినామ్, ఆంటిగ్వా అండ్ బార్బుడా ఈ సౌలభ్యాన్ని అందిస్తున్నాయి. పశ్చిమాసియాలోని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, టర్కీ, ఒమన్ కూడా ఈ–వీసాలను ఆఫర్ చేస్తున్నాయి. బుర్కినా ఫాసో, బెనిన్, సావో టొమే అండ్ ప్రిన్సిపే, ఈక్వటోరియల్ గినియా ఈ జాబితాలో ఉన్నాయి.

వీసా ఆన్ అరైవల్ పాస్‌పోర్టు కలిగిన భారతీయ పౌరులకు వీసా ఆన్ అరైవల్ 38 దేశాల్లో అందుబాటులో ఉంది. ఈ జాబితాలో ఉన్న దేశానికి చేరుకున్న వెంటనే విమానాశ్రయంలోనే వీసా మంజూరు చేస్తారు. ఆఫ్రికాలోని టాంజానియా, కెన్యా, రువాండా, మడగాస్కర్, గినియా–బిస్సావు, జింబాబ్వే.. ఆసియాలోని లావోస్, కంబోడియా, ఇండోనేషియా, ఇరాన్, జోర్డాన్, మయన్మార్ వీటిలో ఉన్నాయి. మధ్యప్రాచ్య దేశాలైన ఖతార్, ఒమన్ కూడా వీసా ఆన్ అరైవల్ అందిస్తున్నాయి. కరేబియన్ మళ్లీ ఇక్కడ బలంగా ఉంది. సెయింట్ లూసియా, సెయింట్ విన్సెంట్ అండ్ గ్రెనడీన్స్ సైతం ఈ జాబితాలో నిలిచాయి.

టాప్-10 వీసా-ఫ్రీ దేశాలు

పర్యాటక ప్రదేశాలు, బీచ్‌లు, ప్రకృతి సుందర దృశ్యాలు, నోరూరించే వంటకాలు, జీవ వైవిధ్యం పరంగా ఎక్కువ మంది సందర్శించడానికి ఇష్టపడేవి.. థాయ్‌లాండ్, నేపాల్, మారిషస్, భూటాన్, మలేషియా, డొమినికా, కెన్యా, శ్రీలంక, ఖతార్, సీషెల్స్.

కొన్ని మార్గదర్శకాలు

వీసా రహిత దేశాలకు ప్రయాణించే భారతీయులు కొన్ని మార్గదర్శకాలను పాటించాలి. ఎన్ని రోజులు ఆ దేశంలో ఉండొచ్చు, నిర్దిష్ట ప్రవేశ అర్హతలు ధ్రువీకరించుకోవాలి. పాస్‌పోర్ట్ కనీసం ఆరు నెలల వరకు చెల్లుబాటులో ఉండాలి. తిరుగు ప్రయాణానికి టికెట్లు బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. వెళ్లే దేశాన్ని బట్టి ఖర్చులకు సరిపడా డబ్బులు బ్యాంకు ఖాతాలో ఉంచడమేగాకుండా అందుకు ఆధారాలనూ చూపించాల్సి ఉంటుంది. ఎక్కడ బస చేస్తున్నదీ హోటల్ వివరాలు సమర్పించాలి.

ఈ వారంలో భారత్‌కు ప్రభాకర్‌రావు

ఎమర్జెన్సీ సర్టిఫికెట్ జారీచేసిన అమెరికాలోని భారత ఎంబసీ

- పాస్‌పోర్ట్ రద్దు కావటంతో ఈసీతో భారత్‌కు మాత్రమే వచ్చే వీలు
- అది కూడా వారంలోగా రావాలన్న కచ్చితమైన నిబంధన
- వచ్చిన మూడు రోజుల్లోగా ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణకు హాజరు

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి. ప్రభాకర్‌రావు ఈ వారంలోనే భారత్‌కు రానున్నారు. అమెరికాలో ఉంటున్న ఆయనను తిరిగివచ్చి విచారణకు సహకరించాలని సుప్రీంకోర్టు గత గురువారం ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో ఈ వారంలో తిరిగి వచ్చి సిట్ ఎదుట హాజరుకానున్నారని సమాచారం. తెలంగాణ పోలీసుల విజ్ఞప్తితో ప్రభాకర్‌రావు పాస్‌పోర్టును అధికారులు రద్దుచేయటంతో.. ఆయన భారత్‌కు వచ్చేందుకు అమెరికాలోని భారత రాయబార కార్యాలయం ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (ఈసీ) జారీచేసింది. 2023 డిసెంబర్ 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ప్రభాకర్‌రావు ఉద్యోగానికి రాజీనామా చేసి అమెరికా వెళ్లిపోయారు. ఫోన్‌ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా తొలుత ఆయనపై లుక్ ఔట్ సర్క్యులర్ (ఎల్‌ఓసీ) జారీ చేసిన రాష్ట్ర పోలీసులు.. ఆపై రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం (ఆర్‌పీఓ)



ద్వారా పాస్‌పోర్టును ఇంపౌండ్ (సస్పెండ్) చేయించారు. అయినా ఆయన దిగిరాకపోవడంతో ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయించారు. దీంతోపాటు ప్రభాకర్‌రావు పాస్‌పోర్టు పూర్తిగా రద్దు చేయించారు.

భారత్‌కు మాత్రమే వచ్చే అవకాశం

సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభాకర్‌రావు అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీలో ఉన్న భారత రాయబార కార్యాలయానికి వెళ్లి తొలుత పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించారు. అయితే, కోర్టు ఆదేశాల ప్రకారం ఆయన కేవలం భారత్ వెళ్లడానికి మాత్రమే సహకరించాల్సి ఉండటంతో ఆ మేరకు అధికారులు ఎమర్జెన్సీ సర్టిఫికెట్ (ఈసీ) జారీ చేశారు. దీని ప్రకారం గరిష్టంగా వారం రోజుల్లో ఆయన భారత్‌కు తిరిగి రావాల్సి ఉంటుంది. భారత్‌కు మినహా మరే దేశానికీ వెళ్లడానికి ఆస్కారం ఉండదు. తాత్కాలిక పాస్‌పోర్టు జారీ చేసినా ఆయన మరో దేశానికి వెళ్లే ప్రమాదం ఉంటుందని భావించి ఈసీ ఇచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయనపై జారీ అయిన ఎల్‌ఓసీ, రెడ్‌కార్నర్ నోటీసు కూడా వీగిపోయినట్లే అని పోలీసులు చెప్తున్నారు. ప్రభాకర్‌రావు అమెరికా నుంచి తిరిగి వచ్చే సమయంలో విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆపితే.. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు సంబంధించిన సర్టిఫైడ్ ప్రతుల్ని చూపాల్సి ఉంటుందని చెప్తున్నారు.

విచారణకు సహకరించకుంటే మళ్లీ కోర్టుకు..

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ప్రభాకర్‌రావు భారత్‌కు వచ్చిన మూడు రోజుల్లోగా సిట్ ముందు విచారణకు హాజరుకావాలి. ఆయన బెయిల్ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం ఆగస్టు 5న విచారణ జరుపనుంది. ఈలోపు ప్రభాకర్‌రావు పోలీసుల విచారణకు సహకరించకుంటే ఆ విషయాన్ని న్యాయస్థానం దృష్టికి తీసుకువెళ్లి బెయిల్ ఇవ్వరాదని పిటిషన్ దాఖలు చేస్తామని ఒక పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. ప్రభాకర్‌రావు సుప్రీం ఆదేశాలకు లోబడే విచారిస్తామని చెప్పారు.

స్లాట్ బుకింగ్ నేటి నుంచే..

▶ మొదటి పేజీ తరువాయి

నివృతి చేసుకొనేందుకు 82476 23578 అనే నంబర్‌కు వాట్సాప్‌లో సందేహాలు పంపితే వెంటనే సమాధానాలు వచ్చేలా ఏర్పాట్లు పూర్తయ్యాయి. అలాగే సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల లొకేషన్, స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు, అందుబాటులో ఉండే సమయం, డీడ్‌లవారీగా రిజిస్ట్రేషన్ చార్జీలు, మార్కెట్ విలువలను కూడా నేరుగా క్రయవిక్రయదారుల సెల్‌ఫోన్లకు పంపేలా అధికారులు సాఫ్ట్‌వేర్ రూపొందించారు.

ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లు కూడా..: మంత్రి పొంగులేటి

సమీక్ష అనంతరం మంత్రి పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ క్రయవిక్రయదారుల సమయాన్ని ఆదా చేయడంతోపాటు వారికి అవినీతిరహిత పారదర్శక సేవలందించడమే లక్ష్యంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. పైలట్ పద్ధతిలో ఈ విధానం ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకున్న వారిలో 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేసినందున రాష్ట్రవ్యాప్తంగా స్లాట్ బుకింగ్‌ను అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ విధానం అమలు దృష్ట్యా పనిభారం అధికంగా ఉన్న 9 కార్యాలయాల్లో సబ్‌రిజిస్ట్రార్ సహా అదనపు సిబ్బందిని నియమించామని చెప్పారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు (మధ్యాహ్న భోజన సమయంలో మినహా) ప్రజలు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని.. ప్రతి కార్యాలయంలో రోజుకు 48 స్లాట్‌లు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అత్యవసర సందర్భాల్లో నేరుగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వీలుగా సాయంత్రం 5 గంటల నుంచి 5:30 గంటల మధ్య 5 వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతినిస్తామన్నారు. స్లాట్ బుకింగ్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి తెస్తున్నందున ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామని పొంగులేటి పేర్కొన్నారు.

త్వరలోనే ఈ–ఆధార్..

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేసేలా త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ–ఆధార్‌ను కూడా తీసుకొస్తామని.. అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా త్వరలోనే డెవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను అందుబాటులోకి తెస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. లేఅవుట్లవారీగా రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ల వివరాలు ఎరుపు రంగులో కనిపించేలా మాడ్యూల్‌ను రూపొందిస్తున్నామని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

ఉత్తమ సేవలకు పోలీస్ పతకాలు




- రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ప్రభుత్వం
- పోలీసు శాఖకు మొత్తం 625, ఏసీబీకి 22, అగ్నిమాపక శాఖకు 20, టీజీఎస్పీఎఫ్‌కు 19 అవార్డులు

సాక్షి, హైదరాబాద్: అత్యుత్తమ సేవలందిస్తున్న పోలీస్, అగ్ని మాపక శాఖ సిబ్బందికి ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు సేవా పతకాలు ప్రకటించింది. పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో కలిపి 625 మందికి, ఏసీబీలో 22 మందికి, అగ్నిమాపక శాఖలో 20 మందికి, టీజీఎస్పీఎఫ్‌లో 19 మందికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఆరుగురికి పతకాలు అందించనుంది. పతక విజేతల పేర్లు, ఆయా విభాగాలవారీగా ఇస్తున్న పతకాల వివరాలతో హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మహోన్నత సేవా పతకం సాధించిన వారికి రూ. 40 వేల నగదు పురస్కారం, ఉత్తమ సేవా పతకం పొందిన వారికి రూ. 30 వేల నగదు పురస్కారం, కఠిన సేవా పతకం సాధించిన వారికి రూ. 20 వేల నగదు పురస్కారం, తెలంగాణ సేవా పతకం పొందిన వారికి రూ. 20 వేల నగదు పురస్కారం, తెలంగాణ శౌర్య పతకం పొందిన వారికి రూ. 10 వేల నగదు పురస్కారంతోపాటు ప్రతినెలా రూ. 500 అందించనున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిష్టాత్మక పోలీస్ పతకం అయిన తెలంగాణ పోలీస్ శౌర్య పతకం 9 మంది గ్రేహౌండ్స్ సిబ్బంది (ఆర్ఎస్సైలు సి.హెచ్. మహేశ్, జి. శోభన్, ఎ. రాకేశ్‌కుమార్, కానిస్టేబుళ్లు జి. వెంకటేశ్, కె. రమేశ్, ఎం. పాపియా నాయక్, ఎం. రవీందర్ సంజయ్, జె. నరేశ్, టి. వెంకటేశ్)కి లభించింది. అలాగే అగ్నిమాపక శాఖలోని హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ టి. వెంకన్న, సాలార్జంగ్ మ్యూజియం ఫైర్ స్టేషన్ లీడింగ్ ఫైర్‌మన్ మిరాజ్ కరమతుల్లా బేగ్‌కు శౌర్య పతకాలు లభించాయి. ఫైర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ టి. మహేందర్‌రెడ్డికి మహోన్నత సేవా పతకం లభించింది. అలాగే ఉత్తమ సేవా పతకానికి ముగ్గురు, సేవా పతకానికి 14 మంది ఎంపికయ్యారు.

పోలీస్ శాఖకు కేటగిరీల వారీగా పతకాలు... సాక్షి ప్లస్‌లో..

ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుతున్నాయా?



- పార్టీలో మీరు సంతృప్తిగానే ఉన్నారా?
- కాంగ్రెస్ నేతలతో మీనాక్షి నటరాజన్ ఆరా
- ఐదో రోజు కొనసాగిన ముఖాముఖి సమావేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పార్టీ నేతలతో ముఖాముఖి సమావేశాలను కొనసాగిస్తున్నారు. వరుసగా ఐదో రోజు ఆదివారం ఆమె పార్టీ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో పార్టీ ఎంపీలు, గత లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా పోటీచేసిన నేతలు, పలు కార్పొరేషన్ల చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఒక్కో నేతతో 5 నిమిషాలపాటు పలు అంశాలపై మాట్లాడినట్టు తెలిసింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయి అన్నదాని గురించి ఆమె ఆరా తీసినట్టు సమాచారం. ప్రభుత్వంపై ప్రజల స్పందన ఎలా ఉందని పలువురు నేతలను ప్రశ్నించినట్లు తెలిసింది. పార్టీలో మీరు సంతృప్తిగానే ఉన్నారా? అని పలువురు నేతలను అడిగినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు రాజకీయ ప్రత్యర్థి ఎవరనే అంశంపై మరోమారు ఆమె ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఉత్తర తెలంగాణలో బీజేపీ, దక్షిణ తెలంగాణలో బీఆర్‌ఎస్‌లు కాంగ్రెస్‌కు ప్రత్యర్థులుగా ఉంటాయని పలువురు నేతలు చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీ బలహీనపడుతుందని వారు వివరించినట్టు సమాచారం. పార్టీ బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని మీనాక్షి ప్రశ్నించగా.. స్థానిక సంస్థల ఎన్నికలు వెంటనే నిర్వహిస్తే క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయవచ్చని కొందరు సూచించినట్టు తెలిసింది. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ల చైర్మన్లుగా పనిచేస్తున్న తమకు సొంత జిల్లాల్లోని నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఇప్పించాలని కోరుతూ పలువురు కార్పొరేషన్ చైర్మన్లు ఆమెకు వినతిపత్రం అందజేశారని తెలుస్తోంది.



ఒక వ్యక్తి తనపై ఎంత ఎక్కువ మక్కువ కలిగి ఉంటే, బాధ అంత ఎక్కువగా ఉంటుంది.
– సయాజీ ఊ బా ఖీన్

సాక్షి

సోమవారం, 2 జూన్ 2025

గ్రీష్మవర్షం

‘దేవుడికేం హాయిగ ఉన్నాడూ, మానవుడే బాధలు పడుతున్నాడూ’ అంటాడో సినీకవి. అనాదిగా జరుగుతున్నదీ, మనం అంతగా గమనించనిదీ ఏమిటంటే, ఈ చరాచర జగత్తు మొత్తానికి మనిషి తనే కేంద్రస్థానమనుకుంటాడు; ఈ విశ్వరచన అంతా తన కోసమేననీ, తనే సృష్టిచక్రం తిప్పుతున్నాననే భ్రమలోకి జారిపోతూ ఉంటాడు, తన బాధ ప్రపంచ బాధగా ఊహించుకుంటాడు. నిజానికి మనిషే కాదు, ప్రతి జంతువూ, చెట్టూ, పిట్టా కూడా అలాగే అనుకుంటాయేమో కూడా!

కానీ కొంచెం సూక్ష్మంగా యోచిస్తే, దేవుడూ, లేదా ప్రకృతీ కూడా అంత హాయిగా ఏమీలేనట్టూ, తమవైన బాధలను, సమస్యలను ఎదుర్కొంటూనే ఉన్నట్టూ అర్థమవుతుంది. మనం దేవతగా భావించే భూమినే తీసుకుంటే, తన వందల కోట్ల సంవత్సరాల ఉనికిలో అదెన్ని బాధలు పడిందో, ఎన్నెన్ని అస్తిత్వ సమస్యల నెదుర్కొందో, ఎంతటి అస్థిరత్వానికి, అనిశ్చితికి గురైందో భూభౌతిక విజ్ఞానం మనకెంతో కొంత అవగాహన కలిగిస్తూనే ఉంది. మొదట భూమి మొత్తం మండిపోయే ఓ అగ్నిగోళం. క్రమంగా ఉపరితలం చల్లబడుతూ వచ్చింది. అయినా ఇప్పటికీ లోపల, తాపమానం మీద వందల, వేల డిగ్రీల మేరకు సెగలూ, పొగలూ కక్కుతూనే ఉందంటారు. ఆ పైన లక్షల సంవత్సరాల నిడివిగల మంచుయుగాలు, జలప్రళయాలు, అగ్నిపర్వత విస్ఫోటాలు, అంతర్గత ప్రకంపనాలతో అతలాకుతలమవుతూనే వచ్చింది. అప్పుడు తను కూడా మనిషిలానే, తనకన్నా పైన ఉన్న ఏ తీవ్రశక్తినో ఉద్దేశించి, ‘దేవుడికేం హాయిగ ఉన్నా’డని పాడుకునే ఉంటుందేమో!

మరీముఖ్యంగా తన ప్రకృతి గమనానికి సంబంధించి భూమి తనదైన ఓ ఋతుభ్రమణాన్ని నిర్దేశించుకుని అదే స్థిరమూ, శాశ్వతమూ అని కూడా భ్రమిస్తూ ఉండచ్చు. ఇక్కడే మనిషికీ, భూమికీ మరో పోలిక. మనిషి కూడా తనదైన ఓ ఋతుచక్రాన్ని కల్పించుకుని, దానినో కాలచక్రంలో బంధించాననుకుంటాడు. తను కోరుకున్నట్టే అవి తిరుగుతూ ఉంటాయనుకుంటాడు. కానీ, తన పైనున్న శక్తులు తను నిర్దేశించుకున్న ఋతుభ్రమణాన్ని తలకిందులు చేయగలవన్న ఎరుక భూమికి తరచు తప్పినట్టే, ప్రకృతి తన ఋతుచక్రాన్ని వెనక్కి తిప్పగలదన్న ఎరుక మనిషికీ తప్పుతుంది. అసలు ప్రకృతీ, తనూ అనుసరించే ఋతుకాల సూచికలు ఒకటే కావాల్సిన అవసరం లేదన్న గ్రహింపూ మనిషికి లోపిస్తూ ఉంటుంది.


ఇంతకీ సంగతేమిటంటే, ఈ ఏడాది దేశంలోని పలు ప్రాంతాలు గ్రీష్మతాపాన్ని చవిచూడకుండానే వర్షర్తువు చొరబడిపోయింది. ఆ విధంగా గ్రీష్మానికి, వర్షర్తువుకు మనం నిర్దేశించుకున్న కాలికమైన హద్దుల్ని ప్రకృతి మరోసారి చెరిపేసింది. దాంతో వాతావరణ, పర్యావరణ శాస్త్రవేత్తలు రంగంలోకి దిగిపోయి వర్షపాతానికి సంబంధించిన చారిత్రకమైన గణాంకాలు, ఇతర వివరాల కవిలె కట్టల్ని బయటికి తీసి శోధించడం ప్రారంభించారు. కేరళనే తీసుకుంటే, నైరుతి ఋతుపవనాలు 1975, 1990 తర్వాత మళ్ళీ ఇప్పుడే అక్కడికి వారం రోజుల ముందు అడుగుపెట్టాయంటున్నారు. దేశం ఇతర ప్రాంతాలలో ఇలా జరగడం 2009 తర్వాత మళ్ళీ ఇప్పుడేనంటున్నారు. ఆ పైన ఈసారి కేరళతోపాటు, తమిళనాడులోనూ, కర్ణాటక, మహారాష్ట్రలలోని అత్యధిక ప్రాంతాలలోనూ నైరుతి ఋతుపవనాలు మామూలు గడువుకన్నా ముందు రావడమే కాకుండా; ఒకే రోజున ఒకేసారి పెద్ద ఎత్తున ముంచెత్తడాన్ని విశేషంగా చూపుతూ, ఇలా జరగడం 1971 తర్వాత ఇదే మొదటిసారి అంటున్నారు. మళ్ళీ ఇంకోవైపునుంచి చూస్తే, 1970లనుంచీ ఒక పద్ధతి ప్రకారం ఋతుపవనాల రాకలో ఆలస్యం జరుగుతోందంటున్నారు. మొత్తంమీద సంవత్సరాల వారీగా వర్షర్తువు చరిత్రనైతే నమోదు చేయగలుగుతున్నా, అది ఒక్కోసారి గడువు కన్నాముందే ఎందుకు తొలకరించి పలకరిస్తుందో, ఒక్కోసారి ఎందుకు వేళతప్పిన అతిథి అవుతుందో ఇప్పటికీ కారణాలు అంతుబట్టక శాస్త్రవేత్తలు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు.

అలాగని వాతావరణ, పర్యావరణ రంగాల్లో వైజ్ఞానికంగా మనం వేసిన అంగలు చిన్నవేమీ కావు. వర్షాలు ఎందుకు పడతాయో, ఎందుకు పడవో మనకిప్పుడు బాగా తెలుసు. నేలమీది శీతోష్ణాలు, సముద్రాలమీది శీతోష్ణాలు చెట్టపట్టాలు వేసుకుని విడతలవారీగా అల్పపీడనాలను సృష్టిస్తూ వర్షపాతానికి ఎలా కారణమవుతాయో; మారిషస్, మడగాస్కర్ల సమీపంలో పుట్టుకొచ్చే సోమాలీ నిమ్నవాయువులూ, పసిఫిక్ గాలులూ అరేబియా సముద్రం, బంగాళాఖాతాల దాకా వ్యాపించి మన గడ్డమీద వర్షాలకు, లేదా వర్షాభావాలకూ కూడా ఎలా దోహదం చేస్తాయో, ప్రత్యేకించి హిమాలయాలు మన దగ్గర వర్షసామ్రాజ్యాన్ని ఎలా శాసిస్తున్నాయో మనకిప్పుడు మరింత స్పష్టంగా తెలుసు. అసాధారణ ఉపరితల ఉష్ణోగ్రతలను సంకేతించే ‘ఎల్ నినో’, అంతే అసాధారణ శీతలత్వాన్ని సూచించే ‘లా నినా’ అనే వాతావరణ ధోరణులకూ – వర్షాల రాకడకూ, పోకడకూ, ఇతర పరిణామాలకూ ఉన్న సంబంధం గురించిన అవగాహన కూడా మనకుంది. అయినాసరే, గడువుకు ముందే వర్షాలు, వర్షాభావాలూ, వర్షాలస్యాల వెనుక ప్రకృతి అనుసరించే సూత్రబద్ధత ఏమిటో ఇప్పటికీ అంతుబట్టని బ్రహ్మపదార్థంగానే ఉంది. మనకు సరే, ప్రకృతికి మాత్రం అది అంతుబట్టిందా అన్నది అంతిమ ప్రశ్న.

అదలా ఉంచితే, ముందుస్తు వర్షాలు రేపటి ఆశల విరిజల్లులను తలపించి సంతోషభరితం చేస్తాయి కానీ, దురదృష్టవశాత్తూ ప్రతిసారి అవి వర్షపుష్కలత్వానికి హామీ ఇవ్వకపోవచ్చని శాస్త్రవేత్తలు పెదవి విరుస్తున్నారు. వారి భయాలు నిజం కాకూడదని మనసారా కోరుకుందాం.

పరిధి అతిక్రమించడం కాదా?

కామెంట్



కరణ్ థాపర్

మన న్యాయమూర్తులకు బయటి శత్రువులెవరూ ఉండరు. వారికి వారే శత్రువులు. ఇలా అనడం మీకు విచిత్రం కావచ్చు. కానీ నాకు అలాగే తోచింది. వారు ఒక్కోసారి తమను తాము మర్చిపోయారా అన్నట్లు అసాధారణంగా మాట్లాడుతుంటారు. అలా మాట్లాడేప్పుడు తమ మాటల పర్యవసానాలు ఎలా ఉంటాయోనన్న ఆలోచన వారిలో ఉండదా? వాటి ప్రభావం ఎలా ఉంటుందోనని ఆందోళన చెందరా? అశోకా యూనివర్సిటీలో ప్రొఫెసరైన అలీ ఖాన్ మహ్మూదాబాద్ వ్యాఖ్యల కేసులో వారు వ్యవహరించిన తీరు ఎలా ఉందో ఈ సందర్భంగా పరిశీలిద్దాం.

మొదటగా వారు ఆయన పోస్టును ‘డాగ్–విజిలింగ్’ అని నిందించారు. పదాలను ద్వంద్వార్థాలతో ఉపయోగించారని వ్యాఖ్యానించారు. ‘‘ఇతరులను అవమానించడానికి, కించపరచడానికి లేదా అసౌకర్యం కలిగించడానికి ఉద్దేశపూర్వకంగా పదాలు ఎంపిక చేసుకున్నారు’’ అని పేర్కొన్నారు. కానీ తాము అనుకుంటున్న ఆ పదాలేమిటో చెప్పారా? చెప్పలేదు. పైగా, ‘‘ఆయన ఈ భావాలను సులభమైన, మర్యాదపూర్వకమైన, ఎంతో తటస్థమైన పదజాలం ఉపయోగిస్తూ, అతి సులభమైన భాషలోనూ వ్యక్తం చేయొచ్చు’’ అంటూ చెప్పుకుపోయారు. ఇక్కడ కూడా తాము అనుకుంటున్న ఆ భావాలేమిటో వారు చెప్పలేకపోయారు.

డాగ్–విజిల్ అంటే ఏమిటి? ఆ విజిల్ సాధారణంగా మనిషి చెవులు ఆలకించలేని శబ్దతరంగాల్లో (ఫ్రీక్వెన్సీలో) ఉంటుందని రాజ్యాంగ న్యాయశాస్త్రంలో పండితుడైన గౌతమ్ భాటియా అంటారు. మరి మహ్మూదాబాద్ ఫేస్‌బుక్ పోస్టుల్లో ఏ భాగాలను డాగ్ విజిల్స్ అని భావించాలి? ఏ ‘కుక్కల’కు ఆయన విజిల్స్ వేశారు? ఆయన ఉద్దేశించని ‘శునకేతరులు’ ఎవరు?

అసలు ఆందోళన

జడ్జీలు వీటిలో వేటినీ వేలెత్తి చూపించలేదు. ఏం... వారు అలా చేయదగిన పని కాదా అది? అందుకు బదులుగా... ‘‘అతను వాడిన పదజాల సంక్లిష్టతను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి, ఈ రెండు ఆన్‌లైన్ పోస్టుల్లో ఉపయోగించిన కొన్ని వ్యక్తీకరణల స్వభావాన్ని సరైన రీతిలో గ్రహించడానికి ఒక సిట్ ఏర్పాటు చేయాలని హరియాణా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను మేం ఆదేశిస్తున్నాం’’ అని ఉత్తర్వు జారీ చేశారు. అయితే ఈ స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)లో పోలీసు అధికారులే ఉంటారు. శామ్యూల్ జాన్సన్, నోవా వెబ్‌స్టర్ వంటి నిఘంటుకారులు (లెక్సికోగ్రాఫర్లు) ఉండబోరు.

వాస్తవం చెప్పాలంటే, ఈ ఇద్దరు న్యాయమూర్తులు రేకెత్తించిన ఆందోళనల్లో ఇది చిన్నమెత్తు కూడా ఉండదు. తీవ్రంగా ఆందోళన కలిగించేవి ఇంకా ఉన్నాయి. వారు పేర్కొన్న ఈ వాక్యాలను చూడండి: ‘‘ప్రతి ఒక్కరూ హక్కుల గురించి మాట్లాడతారు. నాకు ఇది చేసే హక్కు ఉందని, అలా చేసే హక్కు ఉందని అంటారు. కాని దేశం పట్ల మీ బాధ్యత ఏమిటో చెప్పరు.’’



◆ రాజ్యాంగం ఏం చెబుతోంది? పౌరులుగా మనకు సంక్రమించిన ప్రాథమిక హక్కులను మాత్రమే అది ప్రత్యేకంగా గుర్తించింది. రాజ్యాంగబద్ధంగా అమలు చేసి తీరాల్సినవి అంటూ ఎలాంటి బాధ్యతలనూ గుర్తించలేదు. దేశ భక్తుడిగా ఉండాల్సిన బాధ్యత కూడా మనకు లేదు. దేన్నయినా సరే సందేహించడానికి, ప్రశ్నించడానికి మనకు ప్రతి హక్కూ ఉంది. మరి ఏ ప్రాతిపదికన అశోకా యూని వర్సిటీ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహ్మూదాబాద్ కేసులో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు హక్కులను, బాధ్యతలను ఒకే గాట కట్టారు?

నిజం ఏమిటి? రాజ్యాంగం ఏం చెబుతోంది? పౌరులుగా మనకు సంక్రమించిన ప్రాథమిక హక్కులను మాత్రమే అది ప్రత్యేకంగా గుర్తించింది తప్ప, రాజ్యాంగబద్ధంగా అమలు చేసి తీరాల్సినవి అంటూ ఎలాంటి బాధ్యతలనూ రాజ్యాంగం గుర్తించలేదు. దేశ భక్తుడిగా ఉండాల్సిన బాధ్యత కూడా మనకు లేదు. జెండా చుట్టుకు తిరగమని రాజ్యాంగం చెప్పలేదు. దేన్నయినా సరే సందేహించడానికి, ప్రశ్నించడానికి మనకు ప్రతి హక్కూ ఉంది. మరి ఏ ప్రాతిపదికన ఈ న్యాయమూర్తులు హక్కులను, బాధ్యతలను ఒకే గాట కట్టారు? ఆ విషయం వారు చెప్పలేదు.

ఏమైనప్పటికీ, మహ్మూదాబాద్ ప్రొఫెసర్‌గా ఉన్న అశోకా యూనివర్సిటీ విద్యార్థులను, అధ్యాపకులను ఉద్దేశించి వారు మరికొన్ని వ్యాఖ్యలు చేశారు. అవి అత్యంత కలవరపాటుకు గురి చేస్తున్నాయి. అవేమిటో చదవండి: ‘‘వారు ఏమైనా సరే చేయగలం అనుకుంటే మేం ఒక ఉత్తర్వు జారీ చేస్తాం... ప్రైవేటు యూనివర్సిటీలు అని చెప్పుకొనే ఇలాంటి కొన్ని సంస్థలను ప్రారంభించడం, వాటిలో నానా రకాల శక్తులూ చేరి చేతులు కలపటం, బాధ్యతారహితమైన ప్రకటనలు చేయడం మాకు సమ్మతం కాదు. ఇలాంటి వారితో ఎలా వ్యవహరించాలో మాకు తెలుసు.’’

మాటలు న్యాయసమ్మతమేనా?

ఈ భూమ్మీద ఏ శక్తి వారిని ఇందుకు పురికొల్పింది? ఎలాంటి వివరణ గానీ, న్యాయ ఔచిత్యం గానీ లేకుండా కలగాపులగంగా మాట్లాడిన అనేక విషయాల్లో అలవోకగా చేసిన ఈ వ్యాఖ్యా చేరుతుంది. తమ ఆలోచనల విపరీత పోకడ వల్లే ఒక అంశం నుంచి మరొక అంశంలోకి, అది తమకు సంబంధం లేనిదైనప్పటికీ, వారు ఇలా ఒక గెంతు గెంతినట్లు అనుకోవాలి.

న్యాయమూర్తులు ఇలా మాట్లాడేందుకు వారిని ప్రోత్సహించిందేమిటి? ఎదుటి పక్షం వాదనలను లోతుగా తరచి చూసే ‘డెవిల్స్ అడ్వకేట్’ పాత్ర పోషించేప్పుడు, వారు మాట్లాడాల్సిన విషయాలు కావివి. ఇవి వారి వ్యక్తిగత అభిప్రాయాల్లా ధ్వనిస్తున్నాయి. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులకు పూచీ వహించడమే వారి బాధ్యత. దానికి వారు విధేయతతో కట్టుబడి ఉండాలి. అయితే ఏం జరిగింది? అలా కాకుండా, కొందరు రాజకీయ ప్రేక్షకుల ముందు వినమ్రతతో శిరస్సు వంచుతున్నారా? ఇలా అని ఎవరైనా అనుకుంటే ఆశ్చర్య పోనవసరం లేదు. వారు ఎక్కువగా మాట్లాడారు. ఇంకా చెప్పాలంటే, ఆ మాటలు న్యాయసమ్మతం కావు.

గౌతమ్ భాటియా ఒక జాతీయ దినపత్రిక ద్వారా లేవనెత్తిన అంశం నన్ను నిజంగా దిగ్భ్రాంతికి గురిచేసింది. మహ్మూదాబాద్ మీద ప్రకటించిన గ్యాగ్ ఆర్డర్‌ను ప్రస్తావిస్తూ, ‘‘ఒకరి నోరు నొక్కే అధికారం (గ్యాగ్ ఆర్డర్ ఇవ్వడం) న్యాయవ్యవస్థకు లేదన్నది ఇక్కడ ముఖ్యమైన పాయింటు. ఒకవేళ ప్రభుత్వం ఇలా చేయాలని నిర్ణయిస్తే, అది రాజ్యాంగబద్ధమా, రాజ్యాంగ విరుద్ధమా అనేది తేల్చడానికి మాత్రమే దానికి అధికారం ఉంది’’ అని భాటియా పేర్కొన్నారు.

అంటే ఈ న్యాయమూర్తులు తమకు లేని అధికారాలను ఉపయోగించారా అని ఆయన్ను ప్రశ్నించాను. దానికి ఆయన ఎంతో వివేకంతో, ఎంతో స్పష్టంగా, ‘‘వారు తమ పరిధులను మించిపోయి’’ వ్యవహరించారని చెప్పారు. ఓహ్!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

అది అదే... ఇది ఇదే!



నిజ్జర్ హత్యతో (‘ఖలిస్థాన్’ సిక్కు వేర్పాటువాది) ద్వైపాక్షిక సంబంధాలపై నీలి నీడలు కమ్ముకుని ఉన్నప్పటికీ మేము భారతదేశంతో భాగస్వామ్యాన్ని కొనసాగించటానికి ఎదురు చూస్తున్నాము. అయితే ఇదంతా కూడా – ప్రపంచ వ్యాప్తంగా మేము సహకారాలను నిర్మించుకునే ప్రయత్నంలో భాగంగానే జరుగుతుంది.

– అనితా ఆనంద్, కెనడా విదేశాంగ మంత్రి

ఇటువైపే చూడకండి!



భారత్ ఎప్పటికీ అణు బెదిరింపులకు లొంగదు. దేశ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా తీసుకోవలసిన నిర్ణయాలను భారత్ తీసుకుంటూనే ఉంటుంది. ఉగ్రవాదాన్ని ప్రేరేపించేవారు, పెంచి పోషించేవారు, భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఉపయోగించుకునే వారు భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుంది.

– డాక్టర్ ఎస్. జైశంకర్, విదేశీ వ్యవహారాల మంత్రి

పులుల చెలికాడు



భారతదేశ పులుల ప్రత్యేకతలు, జీవన శైలుల గురించి ఏళ్లుగా అంతర్జాతీయ ప్రపంచానికి ఆసక్తిని కలుగజేసే ప్రసంగాలు ఇస్తూ రచనలు చేస్తున్న వాల్మీక్ థాపర్‌ను జంతు ప్రేమికులు ఎప్పటికీ మర్చిపోలేరు. ఆయన రాసిన ‘టైగర్ ఫైర్’, ‘లివింగ్ విత్ టైగర్స్’, ఇంకా ఇతర పుస్తకాలను అందరం చదవటమే ఆయనకు ఘనమైన నివాళి.

– నేహా సిన్హా, కన్జర్వేషన్ బయాలజిస్టు

పాలు-నీళ్లు



ఒక కళారూపం, ఆ కళాకారుడికి – అణిచివేయటానికి, దాడి చేయటానికి, దుర్వినియోగం చేయటానికి శక్తిని, పలుకుబడిని, డబ్బును ఇస్తే కనుక ఆ కళను కళాకారుడి నుండి వేరు చేసి చూడలేం.

– చిన్మయి శ్రీపాద, వాయిస్ ఆర్టిస్ట్

పోగేసుకుంటున్నాం



ప్లాస్టిక్ వినియోగం మితి మీరి పెరగటంలో ప్యాకేజింగ్ ఎలా ఒక సాధనంగా మారిందో దృష్టి సారించి, ఈ ఉద్ధృతాన్ని తక్షణం ఆపవలసిన అవసరం కనిపిస్తోంది.

– సాబిరా చౌధురి, ‘కన్‌స్యూమ్డ్ : హౌ బిగ్ బ్రాండ్స్ గాట్ అజ్ హుక్డ్ ఆన్ ప్లాస్టిక్’ పుస్తక రచయిత్రి

అభిమాని కలిసే!



ఇటీవల నేను ఎయిర్ ఇండియా విమానం 191లో ప్రయాణిస్తున్నప్పుడు సురభి కోల్హాత్కర్ అనే యువ ఎయిర్ హోస్టెస్‌ను కలిశాను. తనకు ఆమె తల్లితండ్రులు మా పాపులర్ ‘సురభి’ టీవీ కార్యక్రమం పేరును పెట్టారట. తల్లిదండ్రులతో కలిసి ఆ కార్యక్రమాన్ని చూసినట్లు ఆమె చెప్పటం నాకెంతో సంతోషాన్నిచ్చింది.

– సిద్ధార్థ్ కక్, అలనాటి ‘సురభి’ టీవీ షో వ్యాఖ్యాత

జూన్ 2 స్ఫూర్తితో ముందుకు...

సందర్భం



జూలూరు గౌరీశంకర్

2014 జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ జరిగిన రోజు. తెలంగాణ ఆత్మ గౌరవం నిలువెత్తుగా నిలిచిన రోజు. తెలంగాణ సమాజం ఏ బాధలు పడ్డదో ఆ బాధల నుంచి విముక్తి పొందేందుకు సాగిన తెలంగాణ పునర్నిర్మాణ ప్రక్రియ కూడా ఉద్యమ ఉత్తేజంతోనే కొనసాగింది. ఎవరు ఎన్నెన్ని విమర్శలు చేసినా దేశంలోనే తెలంగాణ అనేక విషయాల్లో నమూనాగా నిలవటానికి కారణం తెలంగాణ తొలి ప్రభుత్వ కృషే. తొలిసారి, మలిసారి కూడా ముఖ్యమంత్రిగా కేసీఆర్ చూపిన దార్శనికత చూసి దేశమే ముచ్చట పడింది.

తెలంగాణ ఉద్యమ సమయంలో అడుగడుగునా అడ్డుపడ్డశక్తులు రాష్ట్రం వచ్చాక కూడా ఆపసోపాలు పడి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడే ప్రయత్నాలు చేస్తూనే వచ్చారు. తెలంగాణలో నిజంగా ప్రభుత్వాన్ని నడపడమంటే అభివృద్ధి ఉద్యమాన్ని నడపడమే. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ పాలన చేయాలి. ఎన్నికల్లో గెలవటం, ఓడటాలు ప్రామాణికంగా చూడకుండా గాయాల నుంచి బయటపడ్డ తెలంగాణకు భవిష్యత్తును అందించే ప్రాణవాయువుగా పాలన కొనసాగాలి. ఈ విషయంలో రాజీపడే ఆలోచనలు రానివ్వవద్దు. జూన్ 2 స్ఫూర్తితో ప్రతి తెలంగాణీయుడు మన రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించుకుంటూ ముందుకు సాగే శక్తులు బలంగా నిలవాలనే కోరుకోవాలి. ఇందుకు భిన్నమైన ఆలోచన చేయటమంటే తెలంగాణ అస్తిత్వంపై దాడి చేయటంగానే భావించవలసి ఉంటుంది. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడే శక్తులు, అస్తిత్వంపై దాడి చేసే శక్తులు నిరంతరం సంఘర్షించుకుంటూనే ఉంటాయి. ఈ సందర్భంలో ప్రతి మలుపులోను తెలంగాణ సమాజం తన చైతన్యాన్ని ఎప్పటికీ మెరుగుపరుచుకుంటూనే ఉంటుంది. ఇక్కడ చిక్కుముడి విప్పాల్సిందేమిటంటే – ప్రతి పదేళ్ళకు వచ్చే మార్పు కొత్త తరాన్ని ముందుకు తెస్తుంది.

1997 నుంచి రాజుకున్న మలిదశ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం 2001 ఏప్రిల్ 27న అగ్గిలాగా మండింది. యువకుల ఆత్మ బలిదానాల దగ్గర్నుంచి కేసీఆర్ ఆమరణ నిరాహారదీక్ష వరకూ ఉద్యమాన్నే మలుపు తిప్పిన ఘటనలు ఉన్నాయి. కొత్తతరం అవలోకనం చేసుకునేవిధంగా ఈ చరిత్రను వారిచేతికి అందించాలి. 1969 తొలిదశ ఉద్యమం తర్వాత 2001 నుంచి అగ్గిమంటైన మలిదశ ఉద్యమ ఘట్టాలు, వాటి నేపథ్యాలన్నీ ఈ తరం లోతుగా అవలోకనం చేసినప్పుడే ఉద్యమకారులెవరు? ఉద్యమ ద్రోహులెవరో తెలుస్తుంది. తెలంగాణ అస్తిత్వ భావనను జీవితకాలం విడనాడని కొత్తపల్లి జయశంకర్ లాంటి వాళ్ళు మలిదశ ఉద్యమంలో ప్రత్యక్షంగా టీఆర్ఎస్ కొనసాగించిన ఉద్యమ ప్రక్రియలో పాల్గొన్నారు. ఆ విషయం లోతుగా అధ్యయనం చేస్తేనే, ‘సకలజనుల సమ్మె’ దగ్గర నుంచి ‘మిలియన్ మార్చ్’, ‘సాగరహారాల’ వరకు జరిగిన ఉద్యమం అర్థమవుతుంది.

కాళేశ్వరం ప్రాజెక్టు లేకుంటే తెలంగాణ ఎగువభూములకు నీళ్ళందేవి కావు. కాళేశ్వరమే తెలంగాణ కరవు, నేలల దప్పిక తీర్చింది. జూన్ 2ను స్మరించుకోవటమంటే కొత్తగా ఏర్పడ్డ రాష్ట్రం దశాబ్దకాలంలో ఎలా దేశానికి నమూనాగా మారిందో తెలుసుకోవడమే! కరవు బారిన పడ్డ తెలంగాణ దేశానికే ఆకలితీర్చే ధాన్యాగారంగా మారింది. సమైక్యాంధ్రలో జరగని అభివృద్ధి స్వరాష్ట్రంలోనే అందనంత ఎత్తుగా శరవేగంతో సాగింది. సామాజిక న్యాయానికి బాటలు పడ్డ స్థితిని చూస్తున్నాం. అదింకా పరిపూర్ణం కావాల్సి ఉంది. ‘దళితబంధు’ పథకం విప్లవాత్మకం. గొర్రెల పంపిణీ జరిగింది. చెరువుల్లో జలసంపదలు పెరిగాయి. పల్లెకు కావాల్సిన మౌలిక వసతులన్నీ తొలి తెలంగాణ ప్రభుత్వం అందించింది. అది ఏ పల్లెనడిగినా చెబుతుంది. హైదరాబాదు విశ్వనగరంగా ఐటీ విస్తరణ నగరంగా మారింది. అడవులు పెంచే కార్యక్రమం జరిగింది. వన సంపద పెరిగింది. జలసంపద పెరిగింది. భూముల విలువలు పెరిగాయి. పాలన ప్రతి గడపదాకా పోయింది. ఇవన్నీ కళ్ళు చూపించే సత్యాలు. ఇవన్నీ నేడు మననం చేసుకోక తప్పదు.

రాష్ట్ర అవతరణ ముందు, ఆ తర్వాత తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్న వారిని కనిపెట్టకపోతే ఉద్యమ చరిత్ర, తెలంగాణ రాష్ట్ర సాకారం అర్థరహితమవుతాయి. ‘నీళ్ళు, నిధులు, నియామకాలు’ మలిదశ ఉద్యమ ట్యాగ్ లైన్. స్వరాష్ట్ర సిద్ధి తర్వాత నీళ్ళు, నిధులు, నియామకాలు అమలు జరిగేందుకు కృషి ప్రతి తెలంగాణీయుడికి తెలియంది కాదు.



గోదావరి జలాలను రక్షించుకోవలసిన బాధ్యత ఉంది. స్వరాష్ట్రం వచ్చినా నదీ జలాల మళ్ళింపు విషయంలో అప్రమత్తంగా లేకపోతే తెలంగాణకు తీరని నష్టం జరుగుతుంది. తెలంగాణ ప్రతిష్ఠను భంగపరిచే ఏ పని చేసినా అది తెలంగాణ అస్తిత్వానికే దెబ్బతగులుతుంది. కాళేశ్వరం జలాలతో తెలంగాణ కోటి ఎకరాల మాగాణంగా వర్ధిల్లాలి. అదే జూన్ 2 స్ఫూర్తితో పాలకులు అడుగులు వేయాలి.

వ్యాసకర్త తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు

(జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం)

బాధలెవరివి? భోగాలెవరివి?

పన్నెండు వందలమంది ఆత్మబలిదానాలతో, వందలాదిమంది విప్లవకారుల పరోక్ష త్యాగాలతో పోరాడి సాధించుకున్న తెలంగాణలో రాసుకున్న వారిదే చరిత్రగా, దోచుకున్న వారిదే సంపదగా దిగజారుతుండగా... 2025 జూన్ 2న మనం పుష్కర తెలంగాణలో అడుగుబెడుతున్నాం. కడుపులు ఎండుతున్న వారి దుఃఖానికి బదులు, కడుపులు నిండిన వారి ఆక్రోశాలు వార్తలవుతున్న సమయంలో అసలు ఈతి బాధలెవరివో, రాజ భోగాలెవరివో మాట్లాడుకోవాల్సి రావడమే అత్యంత విషాదం. ఆంతరంగిక వలస విముక్త అవగాహనతో, ప్రాంతీయ ప్రజాస్వామిక నినాదంతో, ఆత్మగౌరవ పతాకతో, సాంస్కృతిక అస్తిత్వ గానంతో తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కు ప్రాణం పోసిన విప్లవోద్యమం లేకుండా తెలంగాణ ఉద్యమమే లేదు.

1969లో మున్నూట అరవై మంది ప్రాణాలను బలిగొని తెలంగాణ ఉద్యమాన్ని అణిచివేస్తే, విప్లవోద్యమం సార్వజనీన ప్రజా విముక్తి ఆశగా అప్రతిహతంగా పెరుగుతూ వచ్చింది. తిరిగి విప్లవోద్యమాన్ని నెత్తుటేర్లలో ముంచిన ప్రపంచీకరణ విధానాల తర్వాత అనేక కష్టనష్టాల మధ్య కూడా ఆ విప్లవోద్యమమే తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కు ప్రాణ ప్రతిష్ఠ చేసింది. అందుకే వీరన్నలను, పోరన్నలను, ఐలమ్మలను ఆదర్శంగా ప్రకటించిన పాలక పార్టీలు నక్సలైట్ ఎజెండానే తమ ఎజెండాగా ప్రకటించాల్సి వచ్చింది. వారి దేశభక్తిని ఆకాశానికెత్తాల్సి వచ్చింది. చివరకు ముఖ్యమంత్రి పదవి కంటే పౌరహక్కుల సంఘం అధ్యక్ష పదవి గొప్పదని ప్రకటించేదాకా పోయారు. లక్షల మంది ఉద్యమ కార్యకర్తల కృషిని అంగీకరించకుండా తెలంగాణ తెచ్చామంటున్నవారు, తెలంగాణ ఇచ్చామంటున్న వారు... ఇద్దరూ ఇప్పుడు మన ముందు పాలకులుగా, ఏలికలుగా ఉన్నారు. అందుకే టీఆర్ఎస్/ బీఆర్ఎస్ పదేళ్ల పాలనను, ఒకటిన్నర సంవత్సర కాల కాంగ్రెస్ పాలన తీరును బేరీజు వేసుకుంటూ భవిష్యత్ తెలంగాణను ఎట్లా తీర్చిదిద్దుకోవాలో ఆలోచించుకోవడానికి ఒక మంచి సందర్భం కూడా ఇదే.

తెలంగాణలో భూమి సమస్యను తెలంగాణ సాయుధ పోరాటం పెద్ద ఎత్తున లేవనెత్తింది. ఆ తర్వాతి ఆదివాసీ, విప్లవోద్యమాలూ దీనిపైనే ప్రధానంగా సాగాయి. అయితే పాలకులు భూ పంపిణీని విస్మరించి నీళ్ల సమస్యను పాపులర్ నినాదం చేశారు. భూమిని సరుకుగా మార్చి... రియల్ ఎస్టేట్ వ్యాపారులను తలదన్నే విధంగా ప్రభుత్వమే భూములు అమ్మే పక్కా వ్యాపారవేత్తగా అవతారం ఎత్తింది. ప్రజా ప్రతిపక్షంగా నిలబడ్డ శక్తులమైనా కలసికట్టుగా ప్రపంచీకరణ రుద్దిన విధ్వంసకర అభివృద్ధి నమూనాను ఐక్యంగా ప్రతిఘటించలేకపోతున్నాం. అందుకే ‘ఆరు గ్యారెంటీల’తో పాటు ప్రజాస్వామిక హక్కుల పునరుద్ధరణ అనే ఏడో హామీ కూడా ప్రజలను ఒక మేరకు ప్రభావితం చేసింది. అందుకే ఒక పుష్కర కాలంలోనైనా వీటిని బేరీజు వేసుకుంటూ ఆర్థిక విధానంతో పాటు, హక్కుల విషయం, కేసుల ఎత్తివేత వంటి అంశాలలో కూడా ప్రభుత్వాలు రాజకీయ కోణంలో నిర్ణయం తీసుకోవాల్సిందే. తెలంగాణలో కులగణన ఆధారంగా ‘మేమెంతో మాకంత’ అనే సామాజిక న్యాయం ఆచరణ మార్గం పట్టించాలి.

సందర్భం



‘అరుణోదయ’ విమలక్క

ఒక ప్రజా సాంస్కృతిక కార్యకర్తగా ఆరు పదులు నిండిన నా జీవితంలో 50 ఏళ్లు ప్రజా పాటలతో ముడిపడి ఉంటే, అందులో 30 ఏళ్ల చైతన్య పూరిత జీవితమంతా (1995–2025) ప్రధానంగా తెలంగాణ సాంస్కృతిక–రాజకీయ ఉద్యమాలతోనే ముడిపడి ఉంది. ‘పల్లె పల్లెనా పల్లేర్లు మొలిసే పాల మూరులోనా/ మన తెలంగాణలోనా’ అంటూ మొదలై ‘దగాబడ్డ మన తెలంగాణలో సంఘ మొకటి పెడుదాం/సంగతేందో చూద్దాం’ అనే పిలుపులో పిలుపునై వేల సభల్లో వందల పాటలు పాడాను. 1996లో ‘తెలంగాణం’ అనే పుస్తకాన్ని, పాటల క్యాసెట్‌ను విడుదల చేసిన ‘అరుణోదయ’లో కీలకమైన బాధ్యతలు నెరవేరుస్తూ ఉన్నాను. గొంతులు పచ్చి పుండయినా రాష్ట్రమంతా కలియ తిరిగి పాడాను. 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటనకు ముందే ఉస్మానియా శిబిరాన్ని కాపాడుకోవడంలో, బహుజన బతుకమ్మను తలపై ఎత్తుకోవడంలోనూ, వలస పెత్తందార్ల ఆర్థిక మూలాలను దెబ్బ కొట్టి తెలంగాణ సాధించుకోవాలని చేసిన అనేక మిలిటెంట్ పోరాటాల్లో ముందు బాగాన్నే ఉండి జైళ్ళు–సంకెళ్లు అన్నీ ఎదుర్కొన్నాము. గాయిదోల్ల తెలంగాణ కావాలని, గరీబోల్ల తెలంగాణ రావాలని, గారడీ తెలంగాణ వద్దని నినదించాము. ఫలితంగా అక్రమ కేసుల పరంపర, ఆఫీసులకు తాళాలు, అవమానాలు ఎదుర్కొన్నాం. అయినా ఎవరో గద్దె దిగి, మరొకరు గద్దెనెక్కాలని కాకుండా తెలంగాణలో సామాజిక న్యాయం పరిఢవిల్లాలని పోరాడాము.

చరిత్ర నిర్మాతలు ప్రజలని చాటుతూ నవ తెలంగాణ నిర్మాణం కోసం, సామాజిక న్యాయానికై గొంతెత్తడమే మన కర్తవ్యం. నిజమైన పోరాటకారుల చరిత్ర ప్రజా తెలంగాణలోనే సాధ్యం. అప్పుడే దోచుకున్న సంపద ప్రజల సొంతమవుతుంది. అమరులు కన్న నిజమైన ప్రజా తెలంగాణ కల సాకారమవుతుంది.

వ్యాసకర్త టీయూఎఫ్ అధ్యక్షురాలు

గ్రహం అనుగ్రహం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.సప్తమి రా.12.06 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** మఖ రా.2.31 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.2.06 నుండి 3.45 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.18 వరకు, తదుపరి ప.3.03 నుండి 3.55 వరకు, **అమృతఘడియలు:** రా.12.07 నుండి 1.46 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27.



అలుపెరుగని పో(డు)రు

ఈ కష్టజీవులు ఒళ్లు అలసేలా పనిచేసి చెట్టు నీడన కాస్త విశ్రాంతి తీసుకుంటున్నట్లు ఉంది కదా ఈ ఫొటో.. కానీ, వీరి కష్టం అంతకు మించినది. ప్రభుత్వ ఆదేశంతో రాష్ట్రవ్యాప్తంగా పోడు పట్టాలు లేని భూములను అటవీ అధికారులు రైతుల నుంచి స్వాధీనం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం జైహింద్‌పూర్ గ్రామ శివారులో పోడు భూముల స్వాధీనానికి వచ్చే అటవీ అధికారుల నుంచి తమ భూములు కాపాడుకోవడానికి 40 మంది పోడు రైతులు తమ భూముల వద్దే ఇలా మూడు రోజులుగా కాపలా కాస్తున్నారు. కుటుంబాలతో కలిసి పగలు, రాత్రి అలుపెరుగక నిరసన తెలుపుతున్నారు. బీసీలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వకపోవడంతో తాము సాగుచేసుకుంటున్న 160 ఎకరాల భూమిని కాపాడుకునేందుకు పోరాడుతున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి నగేశ్ అనే రైతు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అతడిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

– పెంచికల్‌పేట్ (సిర్పూర్)

కంకరలో వంకర పనులు

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లాలోని కంది, జిన్నారం, పటాన్‌చెరు మండలాల పరిధిలో ఉన్నాయి. పటాన్‌చెరు మండలం లకడారంలోని సర్వే నంబర్ 738, 747, రుద్రారంలోని 132, లకడారం, రుద్రారంలోని 738/1, జిన్నారం మండలం ఖాజిపల్లిలోని 138, 139, 140, 143, 144, 155, 156, కంది మండలం ఆరుట్లలోని 134 సర్వే నంబర్లలో ఈ తవ్వకాలు కొనసాగినట్లు మైనింగ్ శాఖ జారీ చేసిన నోటీసులను బట్టి తెలుస్తోంది. ఈ సర్వే నంబర్లలో తవ్వకాలు సాగించిన మొత్తం 15 మంది వ్యక్తులు, కంపెనీలకు నోటీసులు జారీ అయ్యాయి. ఆయా కంపెనీలు, వ్యక్తులకు సంబంధించిన క్వారీలు హైదరాబాద్ మహానగరానికి అతిసమీపంలో ఉండటంతో ఇక్కడి నుంచి నగరానికి కంకర అక్రమ రవాణా చేసి వందల కోట్లు దండుకున్నారు. నగరంలో నిత్యం భారీ ఎత్తున జరుగుతున్న నిర్మాణ రంగానికి ఇక్కడి క్వారీల నుంచే కంకర సరఫరా జరుగుతోంది. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా క్వారీల్లో తవ్వకాలు కొనసాగించారు.

అడ్డూ అదుపు లేకుండా..

భూగర్భ గనుల శాఖ నుంచి అనుమతులు తీసుకున్న విస్తీర్ణానికి మించి.. నిర్ణీత సరిహద్దులు దాటి లీజుదారులు అక్రమంగా తవ్వకాలు సాగించారు. అలాగే ఈ అదనపు విస్తీర్ణానికి ఎలాంటి సీనరేజీ చెల్లించలేదు. కంకర తరలించేందుకు ట్రాన్సిట్ పర్మిట్లు తీసుకోవాల్సి ఉండగా, అలాంటివి ఏమీ లేకుండానే భారీ టిప్పర్లలో అక్రమ రవాణాకు పాల్పడ్డారు. ఇలా సీనరేజీని ఎగవేయడం, పర్మిట్లు తీసుకోకుండానే అక్రమ రవాణా చేయడం, తీసుకున్న అనుమతులకు మించి.. సరిహద్దులు దాటి తవ్వకాలు జరగడం వంటి అతిక్రమణలకు గాను జరిమానాలు, ఎగవేసిన సీనరేజీ కలిపి మొత్తం రూ.974 కోట్లకు ఈ డిమాండ్ నోటీసులు జారీ అయ్యాయి.

కొన్ని నెలల క్రితమే..

అక్రమాలకు పాల్పడిన 8 క్వారీల లీజుదారులు జరిమానాలతో కలిపి రూ.575 కోట్లు చెల్లించాలని కొన్ని నెలల క్రితమే భూగర్భ గనుల శాఖ డిమాండ్ నోటీసులు జారీ చేసింది. కాగా ప్రస్తుతం ఇలా డిమాండ్ నోటీసులు జారీ అయిన లీజుదారుల సంఖ్య 15కు చేరింది. వీరికి సంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం నోటీసులు ఇచ్చింది.

అక్రమార్కుల్లో ఓ ఎమ్మెల్యే సోదరుడి బినామీ!

పటాన్‌చెరు మండలం లకడారంలోని క్వారీల్లో జరిగిన తవ్వకాలకు సంబంధించి రూ.341 కోట్లు చెల్లింపునకు ఓ లీజుదారుకు ఏడాది క్రితం నోటీసులు జారీ కావడం రాజకీయవర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. తర్వాత ఇతనికే చెందిన మరో క్వారీలో కూడా అక్రమాలు జరిగినట్లు ఈటీఎస్ సర్వేలో వెల్లడైనట్లు తెలిసింది. ఆరుట్ల గ్రామ శివారులో ఉన్న క్వారీలో అక్రమ తవ్వకాలకు గాను రూ.249.06 కోట్లు చెల్లించాలని మరో డిమాండ్ నోటీసు జారీ కావడం గమనార్హం. ఈ లీజుదారు జిల్లాలోని ఎమ్మెల్యే సోదరుడికి బినామీ అని సమాచారం.

ఈటీఎస్ సర్వేతో వెలుగులోకి అక్రమాలు

జిల్లాలోని అన్ని మైనింగ్ కార్యకలాపాలపై ఈటీఎస్ సర్వే జరిగింది. అనుమతులకు మించి, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిగినట్లు తేలింది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడిన మొత్తం 15 క్వారీల లీజు దారులకు రూ.974 కోట్లు చెల్లించాలని నోటీసులు జారీ చేశాం. అయితే ఈ నోటీసులు అందుకున్న లీజు దారులు అప్పిలేట్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు ఉంటాయి.

– రవిబాబు,
భూగర్భ గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, సంగారెడ్డి

నేటి నుంచి గ్రామాలకే నాణ్యమైన విత్తనాలు

- వ్యవసాయ వర్సిటీతో కలిసి 11 వేల గ్రామాలకు సరఫరా
- 40 వేల మంది అభ్యుదయ రైతులకు విత్తన కిట్లు పంపిణీ
- ప్రతి గ్రామంలో ముగ్గురు, నలుగురు అభ్యుదయ రైతుల ఎంపిక



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 11 వేల గ్రామాల్లో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో కలిసి చేపడుతోంది. 'గ్రామ గ్రామానికి వ్యవసాయ విశ్వవిద్యాలయ నాణ్యమైన విత్తన పంపిణీ' అనే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సోమవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. జిల్లాల్లో జరిగే రాష్ట్ర అవతరణ వేడుకలలో భాగంగా ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు 5 ప్రధాన పంటలకు సంబంధించిన (వరి, కంది, పెసర, మినుములు, జొన్న) నాణ్యమైన విత్తనాల కిట్లను పంపిణీ చేస్తారు. ఇప్పటికే ఎంపిక చేసిన మిగతా అభ్యుదయ రైతులకు జూన్ 3వ తేదీన ఆయా గ్రామలకు సంబంధించిన రైతు వేదికల నుంచి స్థానిక ఏఈఓ, ఏఓలు, వ్యవసాయ విశ్వవిద్యాలయ నోడల్ అధికారుల పర్యవేక్షణలో విత్తన కిట్లను పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమం క్రింద సుమారు 40,000 మంది అభ్యుదయ రైతులకు నాణ్యమైన విత్తన కిట్లను పంపిణీ చేయనున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సుమారు 10,250 క్వింటాళ్ల విత్తనాన్ని సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. మే 5వ తేదీ నుంచి జూన్ 13 వరకు వ్యవసాయ వర్సిటీ, రాష్ట్ర వ్యవ సాయ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు 800 గ్రామాలలో 48,000 మంది రైతులకు విత్తన ప్రాముఖ్యతపై అవగాహన కల్పించినట్లు వెల్లడించారు.

విత్తన స్వయం సమృద్ధే లక్ష్యం

దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే విత్తన మార్పిడి రేటు (సీడ్ రీప్లేస్‌మెంట్ రేట్) 92 శాతంతో మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉంది. కొన్నేళ్లుగా విత్తన కంపనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి వివిధ పేర్లతో విత్తనాలను అధిక ధరలకు రైతులకు విక్రయిస్తున్నాయి. అక్కడక్కడా నాణ్యత లోపించిన విత్తనాల ఫలితంగా దిగుబడులు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ ప్రధాన పంటల నాణ్యమైన మూల విత్తనాన్ని ప్రతి గ్రామంలో ఎంపిక చేసిన అభ్యుదయ రైతులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. దాదాపు 40,000 విత్తన కిట్లను గ్రామాలలో పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచారు. ఈ విత్తనంతో అభ్యుదయ రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో సాగుచేసి వచ్చే దిగుబడిని తిరిగి ఆయా గ్రామాలలోని రైతాంగానికి విత్తన రూపంలో సరఫరా చేయాలని ప్రభుత్వం సూచించింది.

కోడెల మరణాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- జాతీయ జంతు పరిరక్షణ బోర్డుకు న్యాయవాది ఫిర్యాదు
- రాజన్న గోశాలలో మరో నాలుగు కోడెలు మృతి



మృతి చెందిన కోడెలను ట్రాక్టర్‌లో తరలిస్తున్న గోశాల సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/వేములవాడ: రాజన్న గోశాలలో కోడెల మరణాలకు కారణమైనవారిపై వెంటనే చర్యలు చేపట్టాలని ప్రముఖ న్యాయవాది ఇమ్మనేని రామారావు ఆదివారం హరియాణాలోని జాతీయ జంతు పరిరక్షణ బోర్డుకు ఫిర్యాదు చేశారు. వేములవాడ గోశాలలో వరుసగా మూగజీవాలు మరణించడం, ఆ ఫొటోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడం తెలిసిందే. ఈ నేపథ్యంలో వరుసగా వెలుగు చూస్తున్న కోడెల మరణాల విషయంలో వెంటనే చర్యలు చేపట్టేలా కలెక్టర్‌ను ఆదేశించాలని ఆయన జంతు పరిరక్షణ బోర్డును కోరారు. ప్రస్తుతం ఒకే గోశాలలో దాదాపు 1,150 వరకు కోడెలు ఉన్నాయని, గోశాల పరిమితికి మించి మూడు రెట్లు అధికంగా అందులో కోడెలను ఉంచారని తెలిపారు. ఈ నేపథ్యంలో కొన్ని కోడెలను ఇతర ప్రాంతాలకు తరలించాలని కోరారు. కోడెలను రైతులకు, ఇతరులకు అప్పగించినప్పుడు వాటి రక్షణ సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకునేలా అధికారులను ఆదేశించాలన్నారు. ఇప్పటి వరకూ అక్రమంగా కోడెలను తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

మరో నాలుగు కోడెల మృత్యువాత

ఇదిలా ఉండగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి గోశాలలో కోడెల మరణాలు ఆగడం లేదు. ఆదివారం మరో నాలుగు కోడెలు చనిపోయాయి. గోశాల సిబ్బంది వాటిని ట్రాక్టర్‌లో తీసుకెళ్లి మూలవాగు తీరంలో ఖననం చేశారు. తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలో కోడెల రక్షణకు పటిష్ట చర్యలు చేపట్టామని, మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

గర్భిణి ప్రాణం తీసిన మూఢనమ్మకం!

- ఇంటి నిర్మాణ సమయంలో భార్య గర్భంతో ఉండకూడదని అబార్షన్ మాత్రలు మింగించిన భర్త



ప్రవళిక

ఆదిలాబాద్ టౌన్: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లోనూ ప్రజలు ఇంకా మూఢనమ్మకాలను వీడటం లేదు. నూతన ఇంటి నిర్మాణ సమయంలో భార్య కడుపుతో ఉండటం శుభసూచకం కాదని నమ్మిన ఓ భర్త.. గర్భిణీ అయిన తన భార్యకు అబార్షన్ మాత్రలు ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ఆరు నెలల గర్భిణీ మృతిచెందింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బంగారుగూడకు చెందిన ప్రవళికకు మూడేళ్ల క్రితం మహారాష్ట్రకు చెందిన ప్రశాంత్‌తో వివాహం జరిగింది. వీరికి రెండేళ్ల బాబు ఉన్నాడు. ఇటీవల వారు నూతన ఇంటి నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది. ఈ సమయంలో ఆమె గర్భం దాల్చడం అరిష్టమని భావించిన భర్త ప్రవళికకు అబార్షన్ మాత్రలు మింగించాడు. దీంతో ఆమెకు తీవ్ర రక్తస్రావం జరిగింది. చికిత్స నిమిత్తం కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె శనివారం మృతిచెందింది. కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణీందర్ తెలిపారు.

6న కుర్తాళ పీఠం ఉత్తర పీఠాధిపతి పట్టాభిషేక మహోత్సవం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 6న శ్రీ సిద్ధేశ్వరి పీఠం ఉత్తర పీఠాధిపతిగా దత్తేశ్వరానంద భారతి స్వామి పట్టాభిషేక మహోత్సవం తమిళనాడు కుర్తాళంలోని శ్రీ సిద్ధేశ్వరి పీఠంలో జరగనుంది. ఈ సందర్భంగా శ్రీ సిద్ధేశ్వరి పీఠం తెలంగాణ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ మాట్లాడుతూ.. పీఠం పురోహితుడు మాచవోలు రమేశ్ శర్మ ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి 6 వరకు జరగనున్న ఈ కార్యక్రమాలలో.. రోజూ ఉదయం పీఠ దేవతలకు విశేషాభిషేకం అర్చనలు, పూజలు, సాయంత్రం జగద్గురువుల అమృత భాషణం, జూన్ 6వ తేదీ ఉదయం పట్టాభిషేక మహోత్సవం, సాయంత్రం అమ్మవారికి గ్రామోత్సవ సేవ నిర్వహిస్తారని తెలిపారు.

యువ వికాసం అర్హుల లెక్క తేలాకే..

▶ మొదటి పేజీ తరువాయి

అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లో చోటు దక్కకుండా, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని మంత్రులు సూచించారు. క్షేత్రస్థాయిలో కూడా ఈ పథకం కింద వచ్చిన దరఖాస్తుల విషయంలో ఫిర్యాదులు వస్తున్నాయని, కాబట్టి అత్యంత పారదర్శకంగా పరిశీలన జరపాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ నేపథ్యంలోనే దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యాకే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, ఇందుకు జిల్లాల్లో ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు.

క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయండి: సీఎం
రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన అంశాలపై మంత్రులు క్షేత్రస్థాయి పరిస్థితులను సీఎంకు వివరించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఈ సందర్భంగా మంత్రులు అభినందించారు. కాగా ధాన్యం కొనుగోళ్లపై సీఎం జిల్లాల వారీగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులతో పాటు ప్రభుత్వం తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడం.. రాష్ట్రానికి ముందస్తు రుతుపవనాలతో కలిగే ప్రయోజనాలు, నష్టాలపైనా చర్చించారు. ఈ సీజన్‌కు సంబంధించి పంటల సాగును వేగవంతం చేయాలని, అధికార యంత్రాగాన్ని ఈ దిశగా అప్రమత్తం చేయాలని రేవంత్ చెప్పారు.

ఆర్థికేతర అంశాలను పరిష్కరిద్దాం!: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఇప్పటికే ప్రభుత్వం సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయగా.. ఆ కమిటీ మంత్రివర్గ ఉప సంఘానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికలోని ప్రధాన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరించారు. ఉద్యోగుల సమస్యల్లో ప్రధానంగా ఆర్థికేతర అంశాలను పరిష్కరిస్తే వారికి కొంతమేర ఊరటగా ఉంటుందని, ఉద్యోగ సంఘాల డిమాండ్ కూడా ఇదేనని భట్టి చెప్పారు. దీంతో ఆర్థికేతర అంశాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగానే ఉందని, దీనిపై కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుందామని మంత్రులకు సీఎం సూచించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపైనా, గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు, భూభారతి ద్వారా సమస్యల పరిష్కారం తదితర అంశాలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రుతుపవనాలతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మంత్రులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

పేగు క్యాన్సర్ బాధితులకు వ్యాయామంతో మేలు

- పెరుగుతున్న జీవితకాలం
- తాజా అధ్యయనంలో వెల్లడి



వాషింగ్టన్: నిత్యం వ్యాయామంతో పేగు క్యాన్సర్ బాధితులకు ఎంతో మేలు కలుగుతున్నట్లు తాజా అధ్యయనంతో తేలింది. కనీసం మూడేళ్లపాటు వ్యాయామం చేస్తే వారు వారు జీవించే అవకాశాలు చాలా వరకు మెరుగవుతున్నట్లు వెల్లడయ్యింది. అంతేకాకుండా వ్యాయమం చేసేవారికి ఈ క్యాన్సర్ సోకే పరిస్థితి ఉండదని అంటున్నారు. పేగు క్యాన్సర్‌కు చికిత్స పొందుతున్నవారు కసరత్తులపై ఎక్కువగా దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంగ్లండ్, కెనడా, ఆస్ట్రేలియాలో ఈ అధ్యయనం నిర్వహించారు. 889 మంది బాధితులను పరిశీలించారు. వీరంతా పేగు క్యాన్సర్ బారినపడి కీమోథెరపీ చికిత్స పొందినవారే. సగం మందికి వ్యాయామాలు చేయాలని సూచించారు. తగిన పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. కానీ, వారు పెడచెవిన పెట్టారు. మిగిలిన సగం మందికి అధ్యయనకర్తలు కోచ్‌లను ఏర్పాటుచేశారు. కచ్చితంగా వ్యాయామాలు చేసేలా చర్యలు తీసుకున్నారు. నడక, ఈత వంటి ఎక్సర్‌సైజ్‌లతో శరీరాలను బాగా కదిలించిన వారు చురుగ్గా మారడంతోపాటు పేగు క్యాన్సర్ ప్రభావం తగ్గిపోయినట్లు తేలింది. వ్యాయామం చేయనివారితో పోలిస్తే వీరి జీవితకాలం పెరిగినట్లు స్పష్టమయ్యింది.

చెట్టు రంగు మారిందో... అగ్నిపర్వతం పేలిందే!

ప్రమాదాన్ని ముందే గుర్తించగల పరిజ్ఞానం • కార్బన్ డయాక్సైడ్‌తో రంగు మారుతున్న ఆకులు



అగ్నిపర్వతాలు ఎప్పుడు బద్ధలవుతాయో కచ్చితంగా గుర్తించగల పరిజ్ఞానం ఇప్పటిదాకా లేదు. ఇది తరచూ తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టానికి దారితీస్తోంది. అగ్నిపర్వతాల విస్ఫోటాన్ని ముందుగానే కనిపెట్టగల విధానాన్ని తాజాగా ఆవిష్కరించారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా', స్మిత్సోనియన్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు ఈ దిశగా కీలక ముందడుగు వేశారు. అగ్నిపర్వతం చుట్టుపక్కల ఉండే చెట్లూ చేమల ఆధారంగా అదెప్పుడు పేలేదీ ముందుగానే గుర్తించవచ్చని వారంటున్నారు. అగ్నిపర్వతం పేలినప్పుడు శిలాద్రవం (మాగ్మా) వెలువడుతుందన్నది తెలిసిందే. మాగ్మా కంటే ముందే కార్బన్ డయాక్సైడ్ అధిక మోతాదుల్లో వెలువడుతుంది. దాన్ని పీల్చే చెట్ల ఆకుల రంగు మారిపోతుంది. అవి ముదురు ఆకుపచ్చ రంగును సంతరించుకుంటాయి. ఈ మార్పును స్పష్టంగా గమనించవచ్చు. అంతేగాక పేలుడుకు ముందు ఆ ప్రాంతంలో భూమి ఎత్తు హఠాత్తుగా పెరుగుతుంది. భూకంప తరంగాలు ఉత్పన్నమవుతాయి. ఇవన్నీ అగ్నిపర్వతం పేలుడుకు సంకేతాలేనని నాసా ఒక ప్రకటనలో వెల్లడించింది.

ఉపగ్రహాలతో విశ్లేషణ

అగ్నిపర్వతాలపై కార్బన్ డయాక్సైడ్ స్థాయిలను గుర్తించాలంటే సైంటిస్టులు ఆ పర్వతాలపైకి చేరుకోవాల్సి వస్తోంది. ఎందుకంటే తక్కువ స్థాయిలో వెలువడే కార్బన్ డయాక్సైడ్‌ను ఉపగ్రహ చిత్రాల ద్వారా అంచనా వేయడం సాధ్యం కాదు. కానీ ఇది చాలాసార్లు ప్రమాదకరంగా మారుతోంది. ఇలాంటి సమస్యలు ఇకపై దూరమైనట్లే. ఎందుకంటే చెట్ల ఆకుల రంగు ద్వారా అగ్నిపర్వతాల పేలుడును కచ్చితంగా గుర్తించగలమని సైంటిస్టులు పేర్కొంటున్నారు. ఈ రకమైన విశ్లేషణకు ఎన్నో రకాల శాటిలైట్లు అందుబాటులో ఉన్నాయని టెక్సస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హూస్టన్‌లో వోల్కనాలజీ డాక్టోరల్ విద్యార్థి నికోల్ గిన్ చెప్పారు. ఇటలీలో సిసిలీ తీరంలోని మౌంట్ ఎట్నా అగ్నిపర్వతంతోపాటు సమీపంలోని చెట్టూచేమల చిత్రాలను లాండ్‌శాట్ 8, టెరా శాటిలైట్, సెంటినెల్‌-2తోపాటు ఇతర ఎర్త్‌-అబ్జర్వింగ్ ఉపగ్రహాల ద్వారా సేకరించారు. వాటిని సమగ్రంగా విశ్లేషించారు. అక్కడ అధిక కార్బన్ డయాక్సైడ్‌తో చెట్ల ఆకుల రంగు మారినట్లు కనిపెట్టారు. ఈ అగ్నిపర్వతం నుంచి మాగ్మా ప్రవాహం మొదలైంది.

- ప్రపంచ జనాభాలో 10 శాతం అగ్నిపర్వతాలకు కొన్ని మైళ్ల దూరంలోనే నివసిస్తోంది.
- అగ్నిపర్వతాల పేలుడు గురించి ముందే తెలియక చాలా సందర్భాల్లో ఆస్తి, ప్రాణ నష్టం సంభవిస్తున్నాయి.
- చెట్ల ఆకుల రంగు ద్వారా పేలుడును సామాన్యులు సైతం ముందే కనిపెట్టవచ్చని సైంటిస్టులు అంటున్నారు. తద్వారా ప్రాణాపాయం నుంచి సులువుగా బయటపడొచ్చని సూచిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

గాజాలో అన్నార్తులపైకి కాల్పులు 31 మంది మృతి

170 మందికి పైగా గాయాలు • ఇజ్రాయెల్‌పై విమర్శల వెల్లువ



కాల్పుల నుంచి తప్పించుకునేందుకు జనం పరుగులు

రఫా (గాజా స్ట్రిప్): గాజాలో మాటలకందని ఘోరం చోటుచేసుకుంది. అన్నార్తులపై ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం విచక్షణారహితంగా కాల్పులకు తెగబడింది. ఐరాస సాయాన్ని కాదని అమెరికా దన్నుతో గాజాలో ఇజ్రాయెల్ స్వయంగా సహాయ కేంద్రాలను మొదలుపెట్టడం తెలిసిందే. వాటినుంచి ఆహారం తెచ్చుకోవడానికి వెళ్తున్న వారిపై తూటాల వర్షం కురిపించింది. ఆ కాల్పుల్లో 31 మంది పాలస్తీనావాసులు బలయ్యారు. కనీసం 170 మందికి పైగానే గాయపడ్డట్టు హమాస్ వర్గాలు వివరించాయి. సహాయ కేంద్రానికి కిలోమీటర్ దూరంలో ఈ దారుణం జరిగినట్టు గాజా ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు ప్రత్యక్ష సాక్షులు కూడా తెలిపారు. దీనిపై అంతర్జాతీయంగా దుమారం రేగుతుండటంతో ఇజ్రాయెల్ తీవ్ర ఇరకాటంలో పడింది. అలాంటి ఉదంతమేదీ ఇప్పటిదాకా తమ దృష్టికి రాలేదని నెతన్యాహు ప్రభుత్వం చెప్పుకొచ్చింది. దీనిపై దర్యాప్తు చేపట్టినట్టు పేర్కొంది.

ఆపరేషన్ సిందూర్‌పై వ్యాస రచన పోటీ

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ ఇతివృత్తంగా దేశవ్యాప్తంగా వ్యాస రచన, వీడియోలు, రీల్స్ రూపకల్పన పోటీలను నిర్వహిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వ మైగవ్‌ఇండియా, హోం శాఖ ఆదివారం తెలిపాయి.. జూన్ 1 నుంచి 30వ తేదీ వరకు ఇది కొనసాగుతుందని, టాప్‌-3 విజేతలకు రూ.10 వేల చొప్పున పారితోషికం అందజేస్తామని పేర్కొన్నాయి. విజేతలకు ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే 78వ గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం కూడా కల్పిస్తామని ప్రకటించాయి. ' OperationSindoor & Redefining India's Policy Against Terrorism' అంశంపై ఇంగ్లిష్, హిందీ భాషల్లో వ్యాసం రాయాల్సి ఉంటుందని వివరించాయి. అదేవిధంగా, భారత స్వాతంత్ర్య సంగ్రామానికి చెందిన ప్రాంతాలు, చిహ్నాలతో కూడిన వీడియోలు, రీల్స్‌ను తయారు చేయాలని సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు పిలుపునిచ్చాయి. ఒక్కొక్కరికి ఒక్క ఎంట్రీకి మాత్రమే అవకాశం ఉంటుందని మైగవ్‌ఇండియా, హోం శాఖ 'ఎక్స్'లో స్పష్టం చేశాయి.

రష్యాపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు... ధ్వంసం

40 ఫైటర్ జెట్లు
2 వంతెనలు

- వైమానిక స్థావరాలపై భారీ దాడులు
- ప్రత్యక్షంగా పర్యవేక్షించిన జెలెన్‌స్కీ

కస్క్‌లో కూలిన వంతెనపై వేలాడుతున్న రైలు బోగీలు



కీవ్/మాస్కో: రష్యా, ఉక్రెయిన్ నడుమ మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధం ఒక్కసారిగా భీకర రూపం దాల్చింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. రష్యాలోని ఇర్‌కుట్‌స్క్ ప్రాంతంలోని మిలటరీ యూనిట్‌పై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులకు దిగింది. ఏకంగా 40 ఫైటర్ జెట్లను ధ్వంసం చేసింది. అలాగే రష్యా సరిహద్దుల్లోని కస్క్ ప్రాంతంలో సంభవించిన శక్తిమంతమైన పేలుళ్లలో రెండు వంతెనలు కుప్పకూలాయి. ఈ ఘటనలో ఏడుగురు చనిపోయారు. ప్రతీకారంగా తమపైకి రష్యా ఆదివారం ఏకంగా 472 డ్రోన్లు, ఏడు క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ తెలిపింది. సోమవారం తుర్కియేలో రష్యా, ఉక్రెయిన్ మధ్య మరో దఫా శాంతి చర్చలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం.

అతి పెద్ద దాడి!

రష్యాపై ఉక్రెయిన్ చేపట్టిన భారీ డ్రోన్ దాడిలో ఇర్‌కుట్‌స్క్ రీజియన్‌లోని బెలాయా, స్రెడ్నీ ఎయిర్, మిలటరీ బేస్‌లు భారీ పేలుళ్లతో దద్దరిల్లిపోయాయి. టీయూ–95, టీయూ–22 వంటి వ్యూహాత్మక బాంబర్లను రష్యా ఈ బేస్‌లలోనే మోహరించింది. ఉక్రెయిన్‌పైకి దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి వాటినే వినియోగిస్తోంది. దాడుల్లో 41 బాంబర్లు ధ్వంసమైనట్లు ఉక్రెయిన్ నిఘా విభాగం ఎస్‌బీయూ తెలిపింది. స్రెడ్నీ బేస్‌కు సమీపంలోనే రష్యా అణ్వాయుధాలను మోసుకెళ్లే యుద్ధ విమానాలను మోహరించే ఒలెనియా ఎయిర్ బేస్ కూడా ఉంది. రష్యా సైనిక వనరులపై ఉక్రెయిన్ జరిపిన అతిపెద్ద దాడి ఇదే! ఈ దాడుల్లో మృతులు, క్షతగాత్రులపై సమాచారం లేదు. ఈ దాడికి ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఏడాదిన్నరపాటు రూపకల్పన చేయడమే గాక స్వయంగా పర్యవేక్షించారని ఓ అధికారి తెలిపారు. ఉక్రెయిన్‌కు 2,500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలకు అతి సమీపంలోకి డ్రోన్లను ట్రక్కుల్లో తరలించినట్లు వివరించారు. తమ ప్రాంతంలో ఉక్రెయిన్ డ్రోన్ దాడి ఇదే మొదటిసారని స్థానిక గవర్నర్ ఇగొర్ అన్నారు. వాటిని ట్రక్కు నుంచి ప్రయోగించినట్లు గుర్తించామన్నారు. ఆదివారం మధ్యాహ్నం ర్యాజన్, ముర్మాన్‌స్క్ ప్రాంతాల్లోనూ డ్రోన్లు సంచరించినట్లు రష్యా అధికారులు తెలిపారు.

కుప్పకూలిన వంతెనలు

సరిహద్దుల్లో రష్యాకు చెందిన బ్రియాన్‌స్క్ ప్రాంతంలో వంతెన కూలడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికుల రైలు ప్రమాదంలో చిక్కుకుంది. ఈ ఘటనలో ఏడుగురు ప్రయాణికులు చనిపోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. కస్క్ ప్రాంతంలో మరో రైలు వంతెన కూలి గూడ్స్ రైలు ధ్వంసమైంది. మంటలు చెలరేగాయి. ఎవరికీ ప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు. పేలుళ్లకు కారణాలను రష్యా అధికారులు వివరించలేదు. ఇది ఉక్రెయిన్ పనేనని చెబుతున్నారు. రష్యా ఆక్రమిత క్రిమియా, జపొరిజియాలను కలిపే కీలక వంతెనలు కూలినట్టు ఉక్రెయిన్ నిఘా విభాగం తెలిపింది. కారణాలను మాత్రం వివరించలేదు.

రష్యా దాడిలో 12 మంది సైనికులు మృతి

యుద్ధ క్షేత్రానికి వెయ్యి కిలోమీటర్ల దూరంలోని ఉక్రెయిన్ ఆర్మీ శిక్షణ విభాగంపై ఆదివారం మధ్యాహ్నం రష్యా క్షిపణి దాడి చేసింది. ఈ ఘటనలో 12 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా 60 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ ధ్రువీకరించింది. ఉత్తర ఉక్రెయిన్‌లోని సుమీ రీజియన్‌లో ఒలెక్సివ్‌కా గ్రామాన్ని స్వాధీనం చేసుకున్నట్లు రష్యా తెలిపింది. అక్కడ 11 గ్రామాల ప్రజలను ముందు జాగ్రత్తగా ఖాళీ చేయించినట్లు ఉక్రెయిన్ పేర్కొంది. సుమీ సరిహద్దులతోపాటు డొనెట్‌స్క్‌లోని పొక్రొవ్‌స్క్, టొరెట్‌స్క్, లిమాన్ ప్రాంతాలపై పట్టు సాధించేందుకు రష్యా ఆర్మీ తీవ్ర దాడులకు పాల్పడుతోందని ఉక్రెయిన్ ఆర్మీ చీఫ్ చెప్పారు.



బ్రిటన్ గాట్ టాలెంట్ పోటీలో రన్నరప్‌గా అసోం చిన్నారి

గువాహటి: అసోంకు చెందిన తొమ్మిదేళ్ల బినితా చెత్రీ ప్రఖ్యాత 'బ్రిటన్ గాట్ టాలెంట్ (బీజీటీ)' రియాలిటీ డ్యాన్స్ పోటీల్లో రెండో రన్నరప్‌గా నిలిచింది. కొండప్రాంత కర్బి అంగ్‌లాంగ్ జిల్లాలోని ఓ కుగ్రామంలో నుంచి తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఈ బాలిక ప్రపంచ వేదికపై సత్తా చాటడం విశేషం. ఈమె ప్రతిభను అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ మెచ్చుకున్నారు. ఆమె ప్రదర్శన బ్రహ్మపుత్ర నుంచి థేమ్స్ నది వరకు అందరినీ మంత్రముగ్ధులను చేసిందని, తమను గర్వపడేలా చేసిందని ప్రశంసలు కురిపించారు. శనివారం జరిగిన ఫైనల్స్‌లో బ్రిటిష్ మెజీషియన్ హ్యారీ మౌల్డింగ్ విజేతగా నిలిచాడు. ఎల్‌ఈడీ డ్యాన్స్ గ్రూప్ రెండో స్థానంలో నిలిచింది. బీజీటీ ఫైనల్స్ చేరిన తొలి భారతీయురాలు బినితాయేనని ఆమె కుటుంబసభ్యులు చెప్పారు. బినితా స్వగ్రామం పేరు టల్పాలిజన్. తండ్రి అమర్ చెత్రీ ఊళ్లో చిన్న కోళ్లఫారం నడుపుతుంటారు. బినితా ప్రిపరేషన్ కోసం కర్బి అంగ్‌లాంగ్ అటానమస్ కౌన్సిల్ రూ.5 లక్షలు సాయంగా అందజేసింది.

ముస్లిం ఓట్ల కోసమే బుజ్జగింపు రాజకీయాలు

- బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను ప్రోత్సహిస్తున్నారు
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధ్వజం



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం ముస్లింల ఓట్ల కోసమే ఆపరేషన్ సిందూర్‌ను, వక్ఫ్ సవరణ బిల్లును గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం కోల్‌కతాలో బీజేపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో అమిత్ షా ప్రసంగించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మమతా బెనర్జీ శకం 2026లో ముగుస్తుందని తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్‌ను వ్యతిరేకిస్తున్న ముఖ్యమంత్రికి మహిళలు తగిన గుణపాఠం నేర్పడం ఖాయమని పేర్కొన్నారు. ఉగ్రవాదులను నరేంద్ర మోదీ ప్రభుత్వం అణచివేయడాన్ని మమతా బెనర్జీ భరించలేపోతున్నారని విమర్శించారు. ఓటు బ్యాంక్‌ను కాపాడుకొనేందుకు ఎంతకైనా దిగజారుతున్నారని ఆక్షేపించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో పశ్చిమబెంగాల్ వ్యక్తులు కూడా మరణించారని, అయినప్పటికీ మమతా బెనర్జీ నోరెత్తలేదని తప్పుపట్టారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో జరిగిన హింసాకాండ వెనుక తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ హస్తం ఉందని అమిత్ షా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతోనే బంగ్లాదేశ్ నుంచి బెంగాల్‌లోకి అక్రమ వలసలు కొనసాగుతున్నాయని చెప్పారు. వలసదార్ల కోసం సరిహద్దులు తెరిచేశారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు కేవలం రాష్ట్ర భవిష్యత్తుతోనే కాకుండా.. దేశ భద్రతతో ముడిపడి ఉన్నాయని అమిత్ షా స్పష్టంచేశారు. బంగ్లాదేశ్ నుంచి వలసలను ఆపే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఎన్నికల్లో హింసను ఆశ్రయించకుండా డిపాజిట్లు అయినా తెచ్చుకోలగరా? అని మమతా బెనర్జీకి సవాలు విసిరారు. ఇదిలా ఉండగా, అమిత్ షా ఆరోపణలను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఖండించింది. సరిహద్దుల రక్షణ కేంద్ర హోంశాఖ పరిధిలోనే ఉంటుందని గుర్తుచేసింది. బంగ్లాదేశ్ నుంచి వలసదార్లు రాకుండా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది.

అమెరికాలో కాల్పులు.. ముగ్గురు మృతి

వాషింగ్టన్: అమెరికాలో రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒక పోలీసు అధికారి సహా ముగ్గురు చనిపోగా పదుల సంఖ్యలో గాయాలపాలయ్యారు. లాస్ ఏంజెలెస్ నగరంలోని బాల్విన్ పార్క్‌లో శనివారం రాత్రి 7 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి రైఫిల్‌తో కాల్పులకు దిగాడు. ఘటనలో ఒక పోలీసు అధికారి ప్రాణాలు కోల్పోగా మరొకరు గాయపడ్డారు. అనంతరం అధికారులు మరో మృతదేహాన్ని గుర్తించారు. ఘటనకు సంబంధించి ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. క్షతగాత్రుడికి ప్రాణాపాయం తప్పిందని పోలీసులు తెలిపారు. మరో ఘటన..నార్త్ కరోలినాలోని కటౌబా కౌంటీలో శనివారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకున్న మరో కాల్పుల ఘటనలో ఒకరు చనిపోయారు. మరో 12 మందికి గాయాలయ్యాయి.

దూషించడం ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు కాదు: సుప్రీం

న్యూఢిల్లీ: దూషించడం ఆత్మహ త్యకు ప్రేరేపించినట్లు కాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఓ విద్యార్థిని తిట్టడం ద్వారా అతడి బలవన్మరణానికి కారణమైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని నిర్దోషిగా జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ధర్మాసనం తేల్చింది. తిట్టడం పెద్ద విపత్తుకు, ఆత్మహత్యలకు దారి తీస్తుందని సామాన్యులెవరూ అనుకోరని అభిప్రాయపడి. తమిళనాడులో ఓ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థుల మధ్య గొడవ జరిగింది. ఇన్‌చార్జి మందలించడంతో ఒక విద్యార్థి ఉరేసుకున్నాడు. ఈ కేసులో ఇన్‌చార్జిని మద్రాసు హైకోర్టు దోషిగా నిర్ధారించడంతో సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకున్నాడు.

ఢిల్లీలోనూ బుల్డోజర్లు

మదరాసీ క్యాంప్ కూల్చివేత

న్యూఢిల్లీ: బుల్డోజర్ల న్యాయం దేశ రాజధానిలోకీ ప్రవేశించింది. హైకోర్టు తీర్పు మేరకు దక్షిణ ఢిల్లీలోని బారాపుల్లాలో మదరాసీ క్యాంప్ అనే మురికివాడను ఆదివారం మధ్యాహ్నం బుల్డోజర్లు నేలమట్టం చేశాయి. దీనిపై రాజకీయ దుమారం రేగుతోంది. పాలక బీజేపీకి మానవత్వమే లేకుండా పోయిందని ఆప్ నేత ఆతిశి దుయ్యబట్టారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు మదరాసీ క్యాంప్‌లోనే తిష్ట వేసి ప్రచారం చేసిన బీజేపీ నేతలు ఇప్పుడు అవసరం తీరగానే దాన్ని నేలమట్టం చేశారంటూ మండిపడ్డారు. 60 ఏళ్లుగా ఉన్న ఈ క్యాంప్‌లో దాదాపు 370 కుటుంబాలు నివసిస్తున్నాయి. నిర్వాసితులు తమిళనాడుకు తిరిగొస్తే ఆశ్రయం కల్పిస్తామని స్టాలిన్ ప్రభుత్వం ప్రకటించింది.

అడుక్కుంటుంటే మిత్రులూ హర్షించడం లేదు

పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ఆవేదన

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్ దేశ నోట ఆర్థిక దుస్థితికి అద్దం పట్టే వ్యాఖ్యలు వెలువడ్డాయి. నిత్యం చిప్ప పట్టుకుని దేహీ అంటూ అర్థించడాన్ని మిత్రదేశాలు కూడా హర్షించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం క్వెట్టాలో ఆయన సైనికాధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ''చైనా, సౌదీ అరేబియా, తుర్కియే వంటివి పాక్‌కు విశ్వసనీయమైన మిత్రులు. కానీ చీటికీమాటికీ అప్పులివ్వాలని కోరుతుంటే అవి కూడా చిరాకు పడుతున్నాయి. విద్య, వర్తకం, ఆరోగ్యం, పరిశోధనల వంటి రంగాల్లో మనం కూడా పెట్టుబడులు పెట్టాలని ఆశిస్తున్నాయి'' అని చెప్పుకొచ్చారు.

అసోంలో వర్షబీభత్సం

ఇంఫాల్: ఎడతెరపి లేని వానలతో ఈశాన్య భారతం అల్లాడుతోంది. ముఖ్యంగా అసోం అతలాకుతలమవుతోంది. ఏకంగా 4 లక్షల మంది నిర్వాసితులయ్యారు. 10 మందికి పైగా వరదలకు బలయ్యారు. అస్సాం సరిహద్దుల్లో నది మధ్యలో చిక్కుకుపోయిన 14 మందిని హెలికాప్టర్ ద్వారా కాపాడారు. మణిపూర్‌లోనూ అనేక ప్రాంతాలు నీట మునిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 3,802 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సిక్కింలో 1,500 మంది పర్యాటకులు చిక్కుకుపోయారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల సీఎంలతో ఆయన ఆదివారం ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు.

ఎమ్మెల్యే అన్సారీపై అనర్హత వేటు

లక్నో: విద్వేష ప్రసంగం కేసులో దోషిగా నిర్ధారణైన ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే అబ్బాస్ అన్సారీపై అనర్హత వేటు పడింది. అబ్బాస్ శాసనసభసభ్యత్వం రద్దయిందని అధికార వర్గాలు ఆదివారం తెలిపాయి.గ్యాంగ్‌స్టర్, రాజకీయ నేత ముఖ్తార్ అన్సారీ కుమారుడే అబ్బాస్. పూరిత ప్రసంగం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడింది. 2022 ఎన్నికల్లో మౌ సదర్ నియోజకవర్గం నుంచి సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ(ఎస్‌బీఎస్‌పీ) తరఫున ఎన్నికై న అబ్బాస్‌కు ప్రత్యేక న్యాయస్థానం శనివారం రెండేళ్ల జైలు శిక్ష విధించడం తెల్సిందే. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం రెండేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్ష పడిన ప్రజాప్రతినిధులు పదవిని కోల్పోతారు. ఈ మేరకు అబ్బాస్‌ను అనర్హుడిగా ప్రకటించడంతోపాటు మౌసదర్ స్థానాన్ని ఖాళీ అయినట్లు ధ్రువీకరించారు. ఎస్‌బీఎస్‌పీ రాష్ట్రంలోని అధికార బీజేపీకి మిత్రపక్షం కాగా ఈ పార్టీ అధ్యక్షుడు కేబినెట్ మంత్రిగా ఉన్నారు.

సాకర్ సంబరాల్లో అపశ్రుతి పారిస్‌లో ఇద్దరి మృతి

పారిస్: యూరోపియన్ సాకర్ ఫైనల్‌లో శనివారం రాత్రి ఇంటర్ మిలన్‌పై పారిస్ సెయింట్ జెర్మయిన్ జట్టు విజయం అనంతరం ఫ్రాన్సులో జరిగిన ఉత్సవాలు హింసాత్మకంగా మారాయి. వాటిలో ఇద్దరు అభిమానులు ప్రాణాలు కోల్పోగా, ఒక పోలీసు అధికారి తీవ్ర గాయాలతో కోమాలోకి జారుకున్నారు. డాక్స్ నగర వీధుల్లో జరిగిన సంబరాల్లో 17 ఏళ్ల బాలుడు కత్తిపోట్లకు గురై మరణించాడు. పారిస్‌లో విజయోత్సవాల ప్రాంతంలో కారు ఢీకొని ఓ స్కూటరిస్ట్ మృతి చెందాడు. కౌటన్స్ ప్రాంతంలో సాకర్ అభిమానులు పేల్చిన బాణసంచా తాకడంతో తీవ్రంగా గాయపడిన ఓ పోలీసు అధికారి కోమాలోకి వెళ్లారు. వీటికి సంబంధించి 500 మందిపైగా అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పారిస్‌లో భారీగా పోలీసులను మోహరించారు.



వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ సందర్శనకు వేళాయె..!

గోపేశ్వర్: ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ఉన్న 'వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్'నేషనల్ పార్క్‌ను ఆదివారం తెరిచారు. ఇందులో బ్రహ్మ కమలం, బ్లూ పాపీ, కోబ్రా లిలీ బ్లూమ్ వంటి యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించిన అనేక అరుదైన పూలు, వృక్ష జాతులున్నాయి. ఈ పూదోట సందర్శనకు ఆదివారం 83 మంది పర్యాటకులకు మొదటిసారిగా అనుమతిచ్చామని ఫారెస్ట్ రేంజ్ అధికారి చేత్నా కండ్‌పాల్ చెప్పారు. ఈ నేషనల్ పార్క్‌ను ఏటా జూన్ నుంచి అక్టోబర్ వరకు తెరిచి ఉంచుతారు.

ఉత్తరకొరియాగా మార్చొద్దు

ఇన్‌ఫ్లుయెన్సర్ అరెస్టుపై కంగన • విడుదల చేయాలి: డచ్ ఎంపీ



కంగన

న్యూఢిల్లీ: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ షర్మిష్ఠ పనోలీ అరెస్టును బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తీవ్రంగా తప్పుబట్టారు. ఆపరేషన్ సిందూర్‌పై కొందరు బాలీవుడ్ స్టార్లు ఎందుకు పెదవి విప్పలేదంటూ ఎక్స్‌లో వివాదాస్పద పోస్ట్ చేసినందుకు పనోలీని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేయడం, కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడం తెలిసిందే. పనోలీ వాడిన భాష అభ్యంతకరమే అయినా అందుకామె క్షమాపణలు చెప్పారని కంగన గుర్తు చేశారు. కనుక ఆమెను విడుదల చేసి దీన్ని ఇంతటితో వదిలేయాలని పశ్చిమబెంగాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగాక మరింతగా కక్షసాధింపుకు పాల్పడి రాష్ట్రాన్ని ఉత్తరకొరియాగా మార్చొద్దని సూచించారు. నెదర్లాండ్స్ ఎంపీ గ్రీత్ వైల్డర్స్ కూడా పనోలీ అరెస్టును తప్పుబట్టారు. ఇది భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు గొడ్డలిపెట్టని ఆక్షేపించారు. ఆమె తక్షణ విడుదలకు చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు.

270 ఏళ్ల తర్వాత... మహా కుంభాభిషేకం

తిరువనంతపురం: కేరళలోని ప్రఖ్యాత శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం 270 సంవత్సరాల తర్వాత అరుదైన మహా కుంభాభిషేక వేడుకలకు సిద్ధమైంది. పురాతనమైన ఈ ఆలయం పునరుద్ధరణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఈ నెల 8వ తేదీన జరిగే మహా కుంభాభిషేకం ముఖ్య ఉద్దేశం ఆలయ పవిత్రను ప్రతిష్ఠాపించడం, ఆధ్యాత్మిక శక్తిని బలోపేతం చేయడమే అని అధికారులు వివరించారు. ఇలాంటి పవిత్ర క్రతువులు 270 ఏళ్ల తర్వాత ఇప్పుడు జరుగుతున్నాయని చెప్పారు.

సాక్షి
హైదరాబాద్

సోమవారం ¦ 2 ¦ జూన్ ¦ 2025



వాయు కాలుష్యంపై స్మోక్ గన్‌తో 'ఫైర్'

దేశ రాజధాని ఢిల్లీ వలెనే మన నగరం సైతం కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. దీంతో ఎయిర్ పొల్యూషన్‌కు చెక్ చెప్పేలా ఢిల్లీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది.

-8లో



క్రేజ్ ఫుల్.. బోబా బబుల్..

యువతను ఆకట్టుకుంటున్న తాజా డ్రింక్ బోబా టీ. లేదా బబుల్ టీ. తైవాన్‌లో పుట్టిన ఈ పానీయం ఇప్పుడు నగరంలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతోంది.

- సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.0/25.0

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠంగా 36, కనిష్ఠంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.



అవతరణ వెలుగులు!

సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నగరం కొత్త శోభను సంతరించుకుంది. అసెంబ్లీ, సెక్రటేరియట్, చారిత్రక చార్మినార్, బల్దియా ప్రధాన కార్యాలయం, పబ్లిక్ గార్డెన్ తదితర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం రాత్రి ఇవి తళుకులీనుతూ కనిపించాయి.



న్యూస్‌రీల్

తాగి నడిపారు.. పోలీసులకు చిక్కారు

- వీరిలో అత్యధికంగా ద్విచక్ర వాహనదారులే



సాక్షి, సిటీబ్యూరో: వారాంతం వస్తే చాలు మందుబాబులు మత్తులో మునిగితేలుతున్నారు. ఈ వారాంతంలో డ్రంకన్ డ్రైవ్‌లో 305 మంది సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డారు. ఇందులో అత్యధికులు ద్విచక్ర వాహనదారులే. ఈ వారాంతంలో పట్టుబడిన వారిలో 242 మంది బైకర్లు ఉండగా.. 16 మంది త్రీ వీలర్లు, 47 మంది ఫోర్ వీలర్లు ఉన్నారు. నిషాచరుల్లో అత్యధికులు 116 మంది 31- 40 ఏళ్ల వయసు ఉన్నవాళ్లు కాగా.. 21- 30 ఏళ్లున్న మందుబాబులు 92 మంది.. 41- 50 ఏళ్ల వయస్కులు 74 మంది, 51-60 ఏళ్ల వాళ్లు 20 మంది ఉన్నారు. మైనర్ ఒకరు ఉండగా.. 61 ఏళ్ల వృద్ధులు ఇద్దరు ఉన్నారు. మియాపూర్ ట్రాఫిక్ ఠాణా పరిధిలో అత్యధికంగా 52 మంది మత్తుబాబులు చిక్కారు.

గోవా పోలీసు కస్టడీకి అబ్దుల్ అల్తాఫ్

- సెక్యూరిటీ గార్డు హత్య కేసులో పాతబస్తీ రౌడీషీటర్



సాక్షి, సిటీబ్యూరో: పేకాట కోసం హైదరాబాద్ నుంచి గోవా వెళ్లి అక్కడి క్యాసినోలో సెక్యూరిటీ గార్డును హత్య చేసిన రౌడీషీటర్ అబ్దుల్ అల్తాఫ్ కేసును పనాజీ పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అతడిని 14 రోజుల కస్టడీకి కోరుతూ గోవా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారించిన న్యాయస్థానం వారం పాటు అప్పగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అల్తాఫ్‌ను కస్టడీలోకి తీసుకున్న పనాజీ పోలీసులు వివిధ కోణాల్లో ప్రశ్నిస్తున్నారు. చార్మినార్‌లోని మిశ్రీగంజ్‌కు చెందిన అబ్దుల్ అల్తాఫ్‌కు నేరచరిత్ర ఉంది. ఇతడిపై సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు రౌడీషీట్ కూడా తెరిచారు. పేకాట కోసం ఇతను తరచూ గోవా వెళ్లివచ్చేవాడు. వారంరోజుల క్రితం మరో ఇద్దరితో కలిసి వెళ్లాడు. బుధవారం రాత్రి గోవా రాజధాని పనాజీలోని కంపాల్‌లో స్వల్ప విషయమై క్యాసినో నిర్వాహకులతో అల్తాఫ్‌కు వివాదం ఏర్పడింది. క్యాసినో సెక్యూరిటీ గార్డులు సర్దిచెప్పడంతో పాటు అక్కడ నుంచి పంపించే ప్రయత్నం చేశారు. దీంతో విచక్షణ కోల్పోయిన అల్తాఫ్ కత్తితో సెక్యూరిటీ గార్డులపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో మధ్యప్రదేశ్ నుంచి వెళ్లి గోవాలో పని చేస్తున్న ధీరు శర్మ చనిపోగా... సౌత్ గోవాలోని షిరోడాకు చెందిన సత్యం గోవాన్కర్ తీవ్రంగా గాయపడ్డారు. సిటీకి పారిపోయే ప్రయత్నాల్లో ఉన్న అల్తాఫ్‌ను పనాజీ పోలీసులు గత గురువారం నార్త్ గోవాలోని దబోలిం విమానాశ్రయం సమీపంలో పట్టుకున్నారు. అతడి వెంట వచ్చిన ఇద్దరి ఆచూకీ పోలీసులకు లభించలేదు. ఆదివారం కస్టడీలోకి తీసుకున్న అల్తాఫ్‌ను లోతుగా విచారించాలని నిర్ణయించారు.



బాచుపల్లిలో రేషన్ దుకాణం ఎదుట లబ్ధిదారుల క్యూ

పరేషన్!

ఒకేసారి మూడు నెలల సరుకులతో ముప్పు తిప్పలు

- వేర్వేరుగా చూపిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రేషన్
- ఒక్కో కార్డుదారుకు రెండు దఫాలుగా తూకం
- గ్రేటర్‌లో తెరుచుకోని కొన్ని రేషన్ దుకాణాలు
- తొలిరోజు పలు ప్రాంతాల్లో లబ్ధిదారుల కష్టాలు





హస్తినాపురంలో బారులుతీరిన లబ్ధిదారులు, ఎల్‌బీనగర్ పరిధిలో సర్వర్ డౌన్ కావడంతో మూసేసిన రేషన్ షాపు

సాక్షి, సిటీబ్యూరో: మూడు నెలల రేషన్ సరుకులు ఒకేసారి పంపిణీ చేసే విధానంతో తొలిరోజు నగరంలోని రేషన్ డీలర్లు, లబ్ధిదారులు ముప్పు తిప్పలు పడ్డారు. మూడు నెలలకు సంబంధించిన సరుకులు ఒకే దఫా ఇవ్వడానికి అవకాశం లేకుండా పోయింది. ఒక్కో కార్డుదారుకు బియ్యం పంపిణీలో ఆరు దఫాలు తూకం వేయాల్సి వస్తోంది. ఆరుసార్లు థంబ్ వేయాల్సి వస్తోంది. ఈ సమయంలో సర్వర్ డౌన్, ఇతర సమస్యలు చిరాకు తెప్పిస్తున్నాయని పలువురు వాపోయారు. బియ్యం పంపిణీ పూర్తయిన తర్వాత కూడా స్టాక్‌లో రేషన్ కట్ కాకపోవడంతో డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఒక్కో కార్డుకు బియ్యం ఇవ్వడానికి కనీసం 20 నిమిషాల నుంచి అర్ధగంట పడుతోంది. కొన్ని రేషన్ దుకాణాల్లో సర్వర్ డౌన్ కావడంతో లబ్ధిదారులు బారులు తీరారు. ఎండలో ఎదురుచూసి, ఓపిక నశించి వెనుదిరిగారు. మరికొన్ని చోట్ల డీలర్లకు సాఫ్ట్‌వేర్‌పై అవగాహన లేకపోవడం, ఇతర సమస్యలతో రేషన్ దుకాణాలను తెరవలేదు. పలు దుకాణాల్లో సర్వర్ డౌన్ కావడంతో మూడు గంటలకు కేవలం ఒకరిద్దరికి మాత్రమే బియ్యం అందించారు. దీంతో దుకాణాల ఎదుట భారీగా బారులు తీరిన జనం డీలర్లతో వాగ్వాదానికి దిగారు.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో అవస్థలు..

రేషన్ సరుకుల పంపిణీలో కొత్త సాఫ్ట్ వేర్ కొత్త కష్టాలు తెచ్చిపెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త సాఫ్ట్‌వేర్‌లో ఒక్కో వ్యక్తికి అందించాల్సిన ఆరు కేజీల బియ్యాన్ని విభజించి చూపిస్తోంది. కేంద్రం ఇచ్చే 5 కిలోల బియ్యం ఒక దఫా తూకం వేయగా, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఒక్క కేజీ బియ్యం కోసం మరో దఫా తూకం వేయాల్సి వస్తోంది. ఒక నెలకు ఒక కార్డుదారుకు రెండు దఫాలు తూకం వేయాల్సి వస్తోంది. ఇలా మూడు నెలలకు ఆరు దఫాలు అన్నమాట. దీంతో చాలా సమయం వృథా అవుతోందని డీలర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వచ్చే స్టాక్ గతంలో ఆటోమేటిక్‌గా డీలర్ డివైజ్‌లో కనిపించేది. ఇప్పుడు అప్‌డేట్ కావడం లేదని పేర్కొంటున్నారు. ఇలాంటి పంపిణీ వ్యవస్థను వ్యతిరేకించాలని డీలర్ల సంఘం పిలుపునిచ్చింది. దీనిపై పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు. కొత్త సాఫ్ట్‌వేర్‌తో చాలా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలని డీలర్లు కోరుతున్నారు.

కంగారు వద్దు.. ఈ నెల 30 వరకూ తీసుకోవచ్చు..

రేషన్ సరుకుల పంపిణీ ఈ నెల 30 వరకు ఉంటుంది. గతంలో 15వ తేదీ తరువాత పంపిణీ నిలిచిపోయేది. తాజాగా మూడు నెలల సరుకులు ఒకే దఫా ఇవ్వాలన్న నిర్ణయంతో క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ఈ నెల 30 వరకు లబ్ధిదారులకు రేషన్ దుకాణాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించింది. ఫలితంగా కార్డుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

ఆరుసార్లు థంబ్‌తో ఇబ్బందులు

మూడు నెలల కోటా ఒకేసారి రేషన్ ఇవ్వడం, దీనికి తోడుగా కొత్త సాఫ్ట్వేర్ రావడం, సర్వర్ డౌన్ తో రేషన్ డీలర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకొక్కరు ఆరుసార్లు తంబు వేయడం చాలా ఇబ్బందిగా ఉంది. సర్వర్ డౌన్‌తో ఏం చేయాలో తోచక కొన్నిచోట్ల షాపులను మూసివేశారు. ఇది తెలియక కార్డుదారులు డీలర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఒక్క థంబ్‌తో సరుకులు అందించే విధంగా సాఫ్ట్‌వేర్ మార్చాలి.

– శివునూరి శ్రీహరి, మేడ్చల్ ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ ప్రెసిడెంట్



గంటల తరబడి.. నిలబడి..

గతంలో 10-15 నిమిషాల్లో రేషన్‌షాపు వద్ద బియ్యం తీసుకుని ఇంటికి వెళ్లేవాళ్లం. మూడు నెలల రేషన్ బియ్యం కోసం పలుమార్లు వేలి ముద్రలు వేయడం, సర్వర్ మొరాయించడంతో ఎక్కువ సమయం అవుతోంది. గంటల తరబడి రేషన్ షాపు వద్ద క్యూలో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– మహ్మద్ ఆబేద్, రాంనగర్



వా'డర్' ట్యాంకర్లు!

- ఇష్టారాజ్యంగా దూసుకుపోతున్న వాహనాలు
- ఎడాపెడా ఉల్లంఘనలకు పాల్పడుతున్న డ్రైవర్లు

సాక్షి, సిటీబ్యూరో: నాగోలు పోలీసుస్టేషన్ పరిధిలోని జైపురికాలనీ చౌరస్తాలో ఆదివారం ఉదయం మృత్యుశకటంగా మారిన ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టుకుంటూ దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో తాపీ మేస్త్రీ మల్లికార్జున్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి స్నేహితుడు శివకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. నగర వ్యాప్తంగా ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లు యథేచ్ఛగా దూసుకుపోతుంటాయి. వీటి ఫిట్‌నెస్ మాట అటుంచితే డ్రైవర్లు సైతం అనేక ఉల్లంఘనలకు పాల్పడుతుంటారు. అత్యవసరం అనే భావనో, మరో కారణమో తెలియదు కాని క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే పోలీసులు సైతం వీటి విషయాన్ని పట్టించుకోవట్లేదు.

కెమికల్ ట్యాంకర్లకు మరమ్మతు చేసి..

నగరంలో సంచరిస్తున్న ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లలో అత్యధికం శిథిలావస్థలోనే ఉంటాయి. ట్యాంక్ మొత్తం రంధ్రాలతో దారి పొడవునా నీటిని వృథాగా పారపోసుకుంటూ వెళ్తుంటాయి. ఎక్కడికక్కడ విడిభాగాలు వేలాడుతూ, బ్రేక్ వేసినా ఆగుతాయా అనే సందేహాన్ని కలిగిస్తూ ప్రయాణిస్తుంటాయి. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లలో కేవలం నీటి సరఫరా కోసం తయారు చేయించినవి, ఖరీదు చేసినవి కనీసం పది శాతం కూడా ఉండవు. కెమికల్స్ లేదా పారిశ్రామిక వ్యర్థాలు తరలించడానికి వినియోగించే ట్యాంకర్లకు సంబంధించిన ట్యాంకులు కొన్నాళ్లకు దెబ్బతింటాయి. వీటిని ఖరీదు చేస్తున్న వ్యాపారులు మరమ్మతులు చేసి నీటి రవాణాకు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ వాటర్ ట్యాంకర్ల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రవాణా చేసేది నీళ్లే అయినప్పటికీ... జల మండలికి సంబంధించిన ట్యాంకర్ల నిర్వహణకు ప్రైవేట్ ట్యాంకర్ల నిర్వహణకు ఎంతో వ్యత్యాసం ఉంటోంది.

అడ్డూ అదుపూ లేని ఉల్లంఘనలు

కేవలం వాహనాల దుస్థితే కాదు ప్రైవేట్ ట్యాంకర్లను నడిపే డ్రైవర్లు సైతం యమకింకరుల్లా దూసుకుపోతూ వాహనచోదకులతో పాటు పాదచారులు, స్థానికుల్ని హడలెత్తిస్తూ ఉంటారు. ఫిట్‌నెస్ లేకపోయినా, ట్యాంక్ నిండా నీళ్లు ఉన్నా, కాలనీలోని రోడ్ల మీదుగా ప్రయాణిస్తున్నా వీరికి ఎలాంటి పట్టింపు ఉండటంలేదు. ఆదివారం ఉదయం జైపురికాలనీ చౌరస్తాలో జరిగిన ప్రమాదమే దీనికి ఉదాహరణ. మలుపు వద్దా మితిమీరిన వేగంతో ట్యాంకర్ దూసుకువచ్చింది. ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తున్న మల్లికార్జున్, శివకృష్ణల్ని ఢీకొట్టిన వెంటనే ఆగలేదు. కొద్ది దూరం వారిని ఈడ్చుకు వచ్చాకే బ్రేకులు పడ్డాయి. కొన్ని ట్యాంకర్ల డ్రైవర్లు ఫోన్‌లో మాట్లాడుతూ, సెల్‌ఫోన్‌ను స్టీరింగ్‌పై, పక్కన పెట్టుకుని రీల్స్, వీడియోలు చూస్తూ నడుపుతున్నారు. అటు ఆర్టీఏ అధికారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులు ఈ ట్యాంకర్ల విషయం పట్టించుకోవట్లేదు. అధికారుల అలసత్వాన్ని అలుసుగా తీసుకుంటున్న ట్యాంకర్ల డ్రైవర్లు, నిర్వాహకులు అత్యవసరం పేరు చెప్పి యథేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించాల్సిన అవసరముంది.





ద్విచక్ర వాహనంపైకి దూసుకెళ్లిన వాటర్ ట్యాంకర్, టైరు కింద నలిగిపోయిన మల్లికార్జున్

మృత్యు శకటం

ద్విచక్ర వాహనంపైకి దూసుకెళ్లిన వాటర్ ట్యాంకర్

- టైరు కింద నలిగిపోయిన నిండు ప్రాణం
- అక్కడికక్కడే తాపీమేస్త్రీ దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- నాగోలు జైపురి కాలనీ చౌరస్తాలో బీభత్సం



మల్లికార్జున్ (ఫైల్)

నాగోలు: వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. డ్రైవర్ నిర్లక్ష్యం ఒకరి నిండు ప్రాణం తీసింది. మరొకరిని తీవ్ర గాయాల పాల్జేసింది. ఆదివారం నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. ఏపీలోని బాపట్ల జిల్లా భట్టిప్రోలుకు చెందిన తాపీమేస్త్రీ గుంజి మల్లికార్జున్ (39) భార్య స్వప్న, కుమారుడు, కుమార్తెతో కలిసి నగరంలోని నాగోలు బండ్లగూడలో అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. బండ్లగూడ కృషినగర్‌కు చెందిన బొట్టు శివకృష్ణ వీ కేర్ కంపెనీలో మార్కెటింగ్ ఉద్యోగి. అతను అద్దెకు ఉండే ఇంటికి మరమ్మతులు చేయాలని యజమాని వినయ్ పురమాయించడంతో తాపీమేస్త్రీ మల్లికార్జున్‌తో పనులు చేయిస్తున్నాడు. ఆదివారం ఉదయం పని కోసం వినయ్ ఇంటికి మేస్త్రీ మల్లికార్జున్‌తో పాటు ఇద్దరు కూలీవాళ్లు వచ్చారు. కూలీ పనివాళ్లు టిఫిన్ చేసేందుకు రూ.200 తీసుకొని బయటికి వెళ్లి రెండు గంటలైనా తిరిగి రాకపోవడంతో.. వారిని వెతికేందుకు శివకృష్ణ తన ద్విచక్ర వాహనాన్ని తీసుకుని మేస్త్రీ మల్లికార్జున్ కూర్చొబెట్టుకుని బయలుదేరాడు. జైపురి కాలనీ చౌరస్తా వైపు రాగానే.. ఎదురుగా బ్లెండ్స్ కాలనీ నుంచి బండ్లగూడ వెళ్లే వాటర్ ట్యాంకర్ అతి వేగంతో వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం ట్యాంకర్ కిందికి వెళ్లిపోయింది. వెనక కూర్చున్న మల్లికార్జున్‌పై నుంచి ట్యాంకర్ ముందు టైరు వెళ్లడంతో తీవ్ర గాయాలతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. శివకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి నాగోలు సీఐ సూర్య నాయర్, పోలీసులు సిబ్బందితో చేరుకుని వివరాలు సేకరించారు. ట్యాంకర్ డ్రైవర్ పాపయ్యను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న మల్లికార్జున్ భార్య స్వప్న, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. నాగోలు డివిజన్ పరిధిలో వాటర్ ట్యాంకర్ డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను తీస్తోందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భీతావహంగా మారిన జైపురి కాలనీ చౌరస్తాను పరిశీలిస్తున్న పోలీసులు

పక్కాగా చెరువుల లెక్క!

లేక్ ప్రొటెక్షన్ కమిటీ సూచనల మేరకు ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

- 3,532 చెరువులపై హెచ్ఎండీఏ దృష్టి



సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ పరిధిలోని చెరువులు, కుంటల పరిరక్షణకు ఆ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పలు ప్రాంతాల్లోని చెరువులకు ఫుల్‌ట్యాంక్ లెవల్, బఫర్‌జోన్‌లను నిర్ధారించి ప్రాథమిక నోటిఫికేషన్‌లు ఇచ్చారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించడంతో పాటు ఫైనల్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారు.

చెరువులు మాయం కావడంతో..

నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇప్పటికే వందలాది చెరువులు ఆక్రమణకు గురి కాగా, అనేక చోట్ల వివాదాస్పదంగా మారాయి. బఫర్ జోన్‌లలోనే ఆకాశ హర్మ్యాలు వెలిశాయి. బహుళ అంతస్తుల భవనాలు, అపార్ట్‌మెంట్‌లు తదితర నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో చెరువుల పరిరక్షణ హెచ్ఎండీఏకు పెద్ద సవాల్‌గా మారింది. నిజాం కాలం నుంచి ఉనికిలో ఉన్న అనేక చెరువులు మాయమయ్యాయి. దీంతో అన్ని వైపుల నుంచి ఆందోళనలు వెల్లువెత్తాయి. చెరువుల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ సంస్థలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉన్నాయి. న్యాయస్థానాలు సైతం చెరువుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై పలు సందర్భాల్లో తీర్పులు వెలువరించాయి. ఈ క్రమంలోనే హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ (ఎల్‌పీసీ) ఏర్పడింది. చెరువుల పూర్తిస్థాయి నీటిమట్టం (ఫుల్‌ట్యాంక్ లెవల్), చెరువుల పరీవాహక ప్రాంతం (బఫర్‌జోన్‌ల) నిర్ధారణపై దృష్టి సారించింది.

దశలవారీగా పరిరక్షణ చర్యలు...

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థకు చెందిన 7,200 చదరపు కిలోమీటర్ల పరిధిలో 3,532 చెరువులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో దశలవారీగా ఎఫ్‌టీఎల్, బఫర్ నిర్ధారణ కార్యక్రమాలు కొనసాగాయి. ఈ మేరకు 14 ఏళ్లలో 2,525 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్‌లు ఇచ్చారు. వాటిలో కేవలం 230 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వడం గమనార్హం. కొన్నిచోట్ల ఆక్రమణదారులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కొన్నిచోట్ల హద్దుల నిర్ధారణ వివాదాస్పదంగా మారింది. గత 10 ఏళ్లలోనే అనేక చోట్ల భారీ సంఖ్యలో చెరువులు ఆక్రమణకు గురి కాగా, మిగిలిన వాటి ఎఫ్‌టీఎల్ నిర్ధారణ మాత్రం నత్తనడకన సాగింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో లేక్ ప్రొటెక్షన్ కమిటీ కార్యాచరణ వేగవంతం చేసింది. 2024 ఆగస్టు నుంచి ఈ ఏడాది మే నెల వరకు కేవలం 10 నెలల కాలంలోనే 408 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫకేషన్ ఇచ్చినట్లు హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. గతంలో ప్రాథమిక నిర్ధారణ జరిగిన 2,525 చెరువుల్లో 957 చెరువులకు ఫైనల్ నోటికేషన్ ఇచ్చారు. దీంతో ఇప్పటి వరకు 2,933 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్‌లు ఇవ్వగా, 1,187 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్‌లు ఇచ్చారు.

ఓఆర్ఆర్ బయట ఉన్నవాటికే..

హైడ్రా ఏర్పాటు అనంతరం హెచ్ఎండీఏ పరిధి ఔటర్ రింగ్‌రోడ్డు వెలుపల ఉన్న ప్రాంతాలకే పరిమితమైంది. ఓఆర్ఆర్ లోపల ఉన్న చెరువుల పరిరక్షణ బాధ్యతలను హైడ్రాకు అప్పగించారు. వాటిలో 431 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వగా, 94 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చారు.

స్పా సెంటర్‌పై పోలీసుల దాడులు

అమీర్‌పేట: ఓ స్పా సెంటర్‌పై పోలీసులు దాడులు నిర్వహించిన పోలీసులు ఆరుగురు యువతులు, విటుడిని అరెస్ట్ చేసిన సంఘటన ఎస్ఆర్‌నగస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డుకు చెందిన యాప్రాల్ జ్యోతి, ఉషశ్రీ అమీర్‌పేటలోని శాంతినిలయం అపార్ట్‌మెంట్‌లో ఎం.ఎస్.బ్యూటీ సెలూన్ పేరుతో స్పాసెంటర్ నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంగా వీరు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందడంతో వెస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆరుగురు యువతులతో పాటు సబ్ ఆర్గనైజర్ ఉషాశ్రీ,తో పాటు చాంద్రాయణగుట్టకు చెందిన విటుడు షేక్ రహీంను అరెస్టు చేశారు. ప్రధాన నిందితురాలు జ్యోతి పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యూట్యూబ్ చానల్‌పై పోలీసులకు ఫిర్యాదు

రాజేంద్రనగర్: తమ ప్రతిష్టకు భంగం కలిగేలా వార్తలు ప్రసారం చేసినందుకు రాష్ట్ర మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ మహ్మద్ ఫయీం ఖురేషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం రాజేంద్రనగర్ పోలీసులు ఓ యూ ట్యూబ్ నిర్వాహకుడితో పాటు మరో వ్యక్తిని స్టేషన్‌కు రప్పించారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ఇంగ్లాండ్ దేశానికి చెందిన కంటెస్టెడ్ యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించారంటూ మహ్మద్ ఫయీం ఖురేషితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ఫొటోలతో పాటు వారి పేర్లను పేర్కొంటూ వార్త ప్రచురించారు. ఈ వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై ఫయీం ఖురేషి రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం ఉప్పల్‌కు చెందిన గౌతం గౌడ్‌తో పాటు టొలిచౌకి ప్రాంతానికి చెందిన ఓ యూ ట్యూబ్ చానల్ నిర్వాహకుడు వసీంలను స్టేషన్‌కు పిలిపించారు. వారిని విచారించి 35(3) సీఆర్‌పీ ప్రకారం నోటీసులు అందజేశారు. మూడు రోజుల తర్వాత మరోమారు స్టేషన్‌లో హాజరు కావాలని సూచించారు. వసీం తన వద్దకు వచ్చిన వార్త క్లిప్పింగ్‌ను ఎలాంటి విచారణ లేకుండా పోస్టు చేశానని.. దీంతో ఫయీం ఖురేషితో పాటు రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ వ్యక్తిగతంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వారిని క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపాడు. గౌతం గౌడ్ తెలుగు స్ట్రైక్ పత్రికకు తనకు ఎలాంటి సంబంధం లేదని... గతంలోనూ ఇదే విషయాన్ని గచ్చిబౌలి పోలీసులకు చెప్పినట్లు తెలిపాడు. సదరు పత్రిక ఓ పార్టీ నేతలు నడిపిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు ఎప్పుడు కోరితే అప్పుడు తాను హాజరవుతానని వెల్లడించారు.

వాయు కాలుష్యంపై స్మోక్ గన్‌తో 'ఫైర్'

ఏర్పాటు తప్పనిసరి చేసిన ఢిల్లీ ప్రభుత్వం
- ఎయిర్ పొల్యూషన్ ప్రభావం తగ్గించేందుకే..
- నిర్ణీత సమయాల్లో ఆన్ చేసి ఉంచేలా చర్యలు
- హైదరాబాద్‌లోనూ అవసరమంటున్న నిపుణులు



సాక్షి, సిటీబ్యూరో: దేశ రాజధాని ఢిల్లీ కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. ప్రతి అక్టోబర్–జనవరి మధ్య గాలి నాణ్యతలో ఆందోళనకర స్థాయి క్షీణత కారణంగా ఏకంగా పాఠశాలలకూ సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. రోడ్డు పైకి వచ్చే వాహనాల విషయంలో 'సరి–బేసి', సీఎన్‌జీ వినియోగం తప్పనిసరి... ఇలా ఎన్ని చర్యలు తీసుకున్నా పరిస్థితుల్లో ఆశించిన మార్పు రావట్లేదు. దీంతో ఎయిర్ పొల్యూషన్‌కు చెక్ చెప్పేలా ఢిల్లీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఎత్తైన వాణిజ్య భవనాలు, హోటళ్లు తదితరాల్లో రూఫ్ టాప్ యాంటీ స్మోగ్ గన్‌లను ఏర్పాటు చేయడం తప్పనిసరి చేసింది. ఈ మేరకు అక్కడి పర్యావరణ శాఖ గత నెల 29న ఉత్తర్వులు జారీ చేసింది. అయితే హైదరాబాద్ నగరంలోనూ దాదాపు ఇంచుమించు ఇదే పరిస్థితి. రాబోయే రోజుల్లో నగరంలోనూ ఢిల్లీ తరహా ఇబ్బందులు తలెత్తవచ్చునని నిపుణులు పేర్కొంటున్నారు.

ఈ భవనాలపై ఏర్పాటు తప్పనిసరి...

భవనాల టెర్రస్‌పై స్మోక్‌గన్స్ ఏర్పాటు చేస్తే వాయు కాలుష్య కారకాలను సంగ్రహించి నీటి బిందువులతో కలిపి కింద పడిపోయేలా చేస్తుంది. మూడు వేల చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న వాణిజ్య సముదాయాలు, మాల్స్, హోటళ్లతోపాటు గ్రౌండ్ ప్లస్ ఐదు అంతస్తుల్లో నిర్మితమైన కార్యాలయాలు, ఇతర భవనాలపై వీటిని ఏర్పాటు చేయడం అనివార్యం. నివాస గృహాలతోపాటు అపార్ట్‌మెంట్స్, గ్రూప్ హౌసింగ్ సొసైటీలకు మాత్రం మినహాయింపు ఉంది. బిల్డింగ్ సైజును బట్టి ఏర్పాటు చేయాల్సిన యాంటీ స్మోక్ గన్‌ల సంఖ్య ఆధారపడి ఉంటుంది. పది వేల చదరపు మీటర్ల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న భవనాలపై మూడు ఏర్పాటు చేయాలి. దీనికి మించి ప్రతి ఐదు వేల చదరపు మీటర్లకు అదనంగా మరొకటి అమర్చాలి. ఈ గన్స్‌లో శుద్ధి చేసిన నీటిని మాత్రమే ఉపయోగించాలని, గరిష్ట వినియోగం గంటకు 12 వందల లీటర్లకు మించకూడదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఈ సమయాల్లో గన్స్ పని చేయాల్సిందే...

గరిష్ఠంగా ఆ నెలల్లో యాంటీ స్మోక్ గన్స్ ఏర్పాటు చేయాలని, వర్షాకాలం(జూన్ 15 నుంచి అక్టోబర్ 1 వరకు) మినహాయించి మిగిలిన సమయం మొత్తం వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. రోజూ ఉదయం 6.30–9.30 మధ్య, సాయంత్రం 5.30–8.30 వరకు కచ్చితంగా ఈ గన్స్ పనిచేయాలి. వీటి ఏర్పాటు, అమలు బాధ్యతలను మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ, అక్కడి పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ లిమిటెడ్, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బోర్డ్‌లకు అప్పగించింది. వీటి ఏర్పాటు, ఉల్లంఘించిన వారిపై జరిమానా విధింపు తదితరాలపై ప్రతి మూడు నెలలకు ఢిల్లీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

హైదరాబాద్‌లోనూ అమలు చేస్తే ఉత్తమం

ఇప్పటికే ఢిల్లీ ప్రభుత్వం మొబైల్ స్మోక్ గన్స్‌ను వినియోగిస్తోంది. వాహనాలకు అమర్చి ఉండే వీటిని వాయు కాలుష్యం తీవ్రంగా ఉండే రోజుల్లో బహిరంగ ప్రదేశాల్లో తిప్పుతోంది. దీని నుంచి వెలువడే నీటి బింధువులు గాలిలో ఉన్న కాలుష్యాన్ని తమలో ఇనుమడింప చేసుకుని కింద పడేస్తాయి. దీనివల్ల జల కాలుష్యం పెరిగే అవకాశాలు చాలా తక్కువ. హైదరాబాద్‌లోనూ వాయు కాలుష్యం ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. పరిస్థితులు చేతులు దాటకముందే ఇక్కడా స్మోక్ గన్స్ వినియోగించాల్సిన అవసరం ఉంది. తొలి దశలో పారిశ్రామిక వాడలు, జనసమ్మర్ధం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో యాంటీ స్మోక్ గన్స్ వినియోగించాలి.

– పి.సురేందర్‌రెడ్డి, పర్యావరణ నిపుణుడు

యువకుడి అనుమానాస్పద మృతి

అమీర్‌పేట: హోటల్‌లో పనిచేసే ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదీనాగూడలోని ఓ హోటల్‌లో కిచెన్ సూపర్‌వైజర్‌గా పనిచేసే పుండరిక్ ఎస్ఆర్‌నగర్‌లోని బహార్ కేఫ్ రీ ఓపెన్ కానున్నట్లు తెలియడంతో వారం రోజుల క్రితం అస్సాంకు చెందిన ముగ్గురు యువకులను మధ్యవర్తి సాంజిత్ నగరానికి రప్పించాడు. బసు మిత్రి (20), పర్సింగ్ మూన్, బసోత్రిలను బాపూనగర్‌లో గదిని అద్దెకు తీసుకుని అక్కడ ఉంచారు. శనివారం బసుమిత్రి అనే యువకుడి ముక్కు, నోట్లో నుండి రక్తం రావడంతో అపస్మారక స్థితికి చేరుకోవడాన్ని గుర్తించిన అతడి మిత్రులు పుండరిక్‌కు సమాచారం అందించగా, ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. దీంతో వారు 108 కు సమాచారం అందించగా అక్కడికి వచ్చిన సిబ్బంది అతడిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పుండరిక్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసిన పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మౌలాలి–చర్లపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైలు ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం అందడంతో సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి ఆధారాలు లభ్యం కాలేదని దాదాపు 55 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై పసుపు రంగు టీషర్టు, బిస్కెట్ రంగు లుంగీ ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్: ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మల్లిపెద్ది వెంకట్‌రెడ్డి అనే వ్యక్తి భార్య, కుమార్తెతో కలిసి కూకట్‌పల్లిలో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 30న ఇంటి నుంచి బయటికి వెళ్లిన అతను ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య ఫోన్ చేసినా స్పందించకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. చింతల్‌లో ఉంటున్న అతడి బావ రాజశేఖర్‌రెడ్డికి గాలింపు చేపట్టగా వెంకట్‌రెడ్డి భరత్‌నగర్‌లోని ఓయో లివింగ్ ట్రీ రూమ్ నెంబర్ 301లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ విషయమై మృతుడి తండ్రి మల్లారెడ్డికి సమాచారం అందించడంతో ఆయన సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంకట్ రెడ్డి ఇటీవలే ఇల్లు కొనుగోలు చేశాడని, అప్పుల భారం ఎక్కువ కావడంతో మనస్తాపానికిలోనై ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని అతను పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాల పేరుతో టోకరా

నిందితుడి అరెస్టు



నిందితుడు శ్రవణ్‌కుమార్

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడిన కేసులో తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని ఉత్తర మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోయిన్‌పల్లి బాపూజీనగర్‌కు చెందిన శ్రవణ్‌కుమార్ అమాయకులను ఎంచుకుని కంటోన్మెంట్ బోర్డులో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతున్నాడు. 2009 నుంచి 2024 వరకు బేగంపేట, తిరుమలగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో 6 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. శ్రీలేఖ అనే మహిళ నుంచి రూ.22వేలు తీసుకుని ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేశాడు. పవన్ అనే వ్యక్తి నుంచి రూ.35వేలు, విశాల్ అనే వ్యక్తి నుంచి రూ.20వేలు, మరో వ్యక్తి నుంచి రూ.35వేలు, వేములవాడకు చెందిన కృష్ణ అనే వ్యక్తి నుంచి రూ.50వేలు తీసుకుని కంటోన్మెంట్ బోర్డులో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు డిఫెన్స్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశాడు. గత కొన్నాళ్లుగా తప్పించుకు తిరుగుతున్న అతడిని ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి తిరుమలగిరి పోలీసులు అప్పగించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

సనత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను సనత్‌నగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భరత్‌నగర్‌కాలనీకి చెందిన గరక గణేష్ డిగ్రీ చదివాడు. ఓ మెడికల్ షాపులో పనిచేస్తున్న అతడికి జీతం ద్వారా వచ్చే డబ్బులు జల్సాలకు సరిపోవడం లేదు. తక్కువ సమయంలో ఎక్కువ మొత్తంలో డబ్బు సంపాదించాలనుకున్నాడు. దీంతో తన స్నేహితుడు మూసాపేట అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వడ్ల పవన్‌తో జత కట్టాడు. పవన్ స్నేహితుడైన మధు గంజాయి అవసరమైన వారికి సరఫరా చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో గణేష్, పవన్ రెండు రోజుల క్రితం రూ.25 వేలు ఇచ్చి మధు నుంచి 1.5 కిలోల గంజాయి కొనుగోలు చేశారు. వీరు మూసాపేట సంగీత మొబైల్స్ ఎదుట గంజాయి విక్రయిస్తున్నట్లుగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. వారి నుంచి చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గత కొన్ని నెలలుగా గంజాయి దందా చేస్తున్న వీరు ఇప్పటివరకు 15 మందికి విక్రయించినట్లు పోలీసు విచారణలో వెల్లడైంది. నిందితులు గణేష్, పవన్‌లను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి 1.1 కిలోల గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సనత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంతాప సభగా మారిన ఆత్మీయ సమ్మేళనం


- సిద్దిపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పీఈటీ మృతి
- పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వస్తుండగా ఘటన
- శోక సంద్రంగా మారిన సమ్మేళనం



రవికుమార్ (ఫైల్)

కవాడిగూడ: ఆత్మీయ సమ్మేళనం సంతాప సభగా మారిన సంఘటన దోమలగూడలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం దోమలగూడలోని ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో (1991) పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న కరీంనగర్ జిల్లా, పెద్దపల్లికి చెందిన పీఈటీ కదారి రవికుమార్ (57) సిద్దిపేట సమీపంలోని కొమురవెల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలియడంతో వ్యాయామ కళాశాలలో విషాదం నెలకొంది. ఈ సమ్మేళనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 70 మందికి పైగా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సమావేశం రవికుమార్ సంతాప సభగా మారింది. తమతో పాటు చదువుకున్న రవికుమార్ అకాల మృతి పట్ల వారు విచారం వ్యక్తం చేశారు. దాదాపు 34 ఏళ్ల తర్వాత కలుస్తున్నామన్న ఆనందం లేకుండా పోయిందన్నారు. రవికుమార్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. కరీంనగర్ జిల్లా పీఈటీల సంఘం అధ్యక్షుడిగా, జిల్లా క్రీడల సమైక్య నిర్వహణ కార్యదర్శిగా ఆయన సేవలను కొనియాడారు. రవికుమార్ అకాల మృతి పట్ల రాష్ట్ర అథ్లెటిక్ అసోసియేషన్ కోశాధికారి, ఓయూ ప్రొఫెసర్ రాజేష్‌కుమార్ సహా పలువురు సంతాపం తెలిపారు.

30 నుంచి ఢిల్లీలో లాల్‌దర్వాజా బోనాలు



చాంద్రాయణగుట్ట: ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు దేశ రాజధాని ఢిల్లీలో లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి 11వ వార్షిక బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్ తెలిపారు. ఆదివారం ఇక్కడ బోనాల ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఢిల్లీలో లాల్‌దర్వాజా బోనాలను ప్రతియేటా నిర్వహిస్తున్నామన్నారు. జూలై 1న ఇండియా గేట్ నుంచి అమ్మవారి ఘటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి తెలంగాణ భవన్‌లో స్థాపిస్తామన్నారు. 2న పోతరాజుల విన్యాసాలు, బోనాల జాతర ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి ఆడిటోరియంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అలాగే.. పాతబస్తీ లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి 117వ బోనాల జాతర ఉత్సవాలను జూలై 11న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ జి.అరవింద్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు పోసాని సతీష్ ముదిరాజ్, బి.అమర్‌నాథ్ యాదవ్, కోశాధికారులు ఎ.చంద్రకుమార్, జి.హరీష్ గౌడ్ పాల్గొన్నారు.

ఏసీపీ విజయ్ శ్రీనివాస్‌కు పోలీసు సేవా పతకం

- హెచ్–న్యూ ఇన్‌స్పెక్టర్ డేనియల్‌కు సైతం
- 'గ్రేటర్'లో 126 మందికి పతకాల ప్రకటన



డేనియల్ శాంతి కుమార్



విజయ్ శ్రీనివాస్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని సౌత్ వెస్ట్ జోన్‌లోని ఆసిఫ్‌నగర్ డివిజన్ ఏసీపీ కె.విజయ్ శ్రీనివాస్‌కు ప్రభుత్వం పోలీసు సేవా పతకం ప్రకటించింది. అలాగే మాదకద్రవ్యాల వ్యతిరేక విభాగం హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌లో (హెచ్–న్యూ) ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న జీఎస్ డేనియల్ శాంతి కుమార్ సైతం ఈ పతకం పొందారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా పతకాలు ప్రకటిస్తుంటుంది. ఈ ఏడాదికి సంబంధించి ఆదివారం విడుదలైన జాబితాలో 'గ్రేటర్'లోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు చెందిన అధికారులు 126 మంది ఉన్నారు. వీరిలో హోంగార్డ్స్ కమాండెంట్ ఎన్వీ కృష్ణారావు, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ అదనపు డీసీపీ బి.కిష్టయ్యలకు మహోన్నత సేవా పతకాలు లభించాయి. మరో 14 మందికి ఉత్తమ సేవా పతకాలు, 110 మందికి సేవా పతకాలను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బాధ్యత మరింత పెరిగింది

తోటి ఉద్యోగుల సహకారం, ఉన్నతాధికారుల ప్రోత్సాహం కారణంగానే ఈ పతకం లభించింది. దీంతో బాధ్యత మరింత పెరిగి, విధులకు పునరంకితం అయ్యే స్ఫూర్తి నిండింది. భవిష్యత్తులోనూ విధి నిర్వహణలో రాజీ పడకుండా ప్రజాసేవకు అంకితం అవుతాం.

– 'సాక్షి'తో విజయ్ శ్రీనివాస్, డేనియల్

రోడ్డు ప్రమాదంలో సినీ దర్శకుడికి గాయాలు

ఫిలింనగర్: బైక్‌పై ఇంటికి వెళ్తున్న సినీ దర్శకుడిని రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..మణికొండలో నివాసం ఉంటున్న శివ నాగేంద్ర నాథ్‌రెడ్డి (27) సినీ దర్శకుడిగా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి అతను షూటింగ్ ముగించుకుని షేక్‌పేట మీదుగా బైక్‌పై మణికొండకు వెళ్తున్నాడు. అదే సమయంలో మద్యం మత్తులో కారు నడుపుతున్న షేక్ రఫీ, షేక్ అజహరుద్దీన్, అనే ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో పాటు షేక్ ఫిరోజ్ రాంగ్ రూట్‌లో కారులో వెళ్తున్నారు. మణికొండలో మద్యం సేవించిన వీరు బిర్యానీ తినేందుకు గచ్చిబౌలి వెళ్లి తిరిగి వస్తుండగా కారులో పెట్రోల్ అయిపోయింది. దీంతో షేక్‌పేట డీమార్ట్ వద్ద పెట్రోల్ పోయించుకున్న వీరు రాంగ్‌రూట్‌లో మణికొండ వైపు వెళ్తూ ఎదురుగా వస్తున్న శివనాగేంద్ర నాథ్‌రెడ్డిని ఢీకొట్టారు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఫిలింనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారకులైన రఫీ, ఫిరోజ్, అజహరుద్దీన్‌లను అదుపులోకి తీసుకుని డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. కారు నడుపుతున్న రఫీతో పాటు పక్కన కూర్చొన్న ఇద్దరూ మద్యం సేవించినట్లు తేలింది. అర్ధరాత్రి మద్యం మత్తులో కారులో దూసుకెళ్లడమే కాకుండా రాంగ్‌రూట్‌లో వస్తూ ప్రమాదానికి కారకులైన వీరిని అరెస్ట్ చేసిన ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్లై ఓవర్‌పై నుంచి దూకి యువకుడి బలవన్మరణం



సూర్య (ఫైల్)

గచ్చిబౌలి: భార్యతో గొడవ జరగడంతో మనస్తాపానికిలోనైన ఓ యువకుడు ఫ్లైఓవర్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా, అంబేడ్కర్ నగర్‌కు చెందిన గొట్టివాడ చిన్నా అలియాస్ సూర్య(28) ఐదేళ్ల క్రితం ఒడిశాకు చెందిన రమ్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. మాదాపూర్‌లో ఉంటూ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతండటంతో వేర్వేరుగా ఉండేవారు. ఇటీవల కలిసిపోయిన వారు మళ్లీ ఒకే ఇంట్లో ఉంటున్నారు. కొద్ది రోజుల క్రితం భార్య తరుపు బంధువులు ఇంటికి రావడంతో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం భార్యతో గొడవపడిన సూర్య గచ్చిబౌలిలో ఉంటున్న తన సోదరి యమున ఇంటికి వెళ్లాడు. అతను పలు మార్లు ఫోన్ చేసినా భార్య లిఫ్ట్ చేయలేదు. మధ్యాహ్నం సోదరి ఇంటి నుంచి బయటికి వచ్చిన అతను 'నేను వెళ్లి పోతున్నా, మీరు జాగ్రత్తగా ఉండండి' అంటూ అక్క, బావకు వాయిస్ మెసేజ్ పెట్టాడు. ఆ తర్వాత కొద్ది నిమిషాలకే కొత్తగూడ ఫ్లైఓవర్ పైకి ఎక్కిన అతను బొటానికల్ గార్డెన్ జంక్షన్‌లో కిందికి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతడిని మసీద్‌బండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే తన సోదరుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి సోదరి యమున ఇచ్చిన ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'జయ గ్రూప్స్'పై చర్యలు తీసుకోవాలి

- ప్రీ లాంచింగ్ ఆఫర్ల పేరుతో నిండా ముంచారు
- రూ.300 కోట్లకు పైగా వసూలు
- న్యాయం చేయాలని బాధితుల వేడుకోలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

పంజగుట్ట: తమ వద్ద ప్రీ లాంచింగ్ ఆఫర్‌లో ప్లాట్లు తీసుకుంటే తక్కువ ధరకు ఇస్తామంటూ అందంగా బ్రోచర్లు ముద్రించి వందలాది మంది నుంచి దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి మోసం చేసిన జయత్రి రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ (జయ గ్రూప్స్) సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు వర్మ కుమార్, మూర్తి శ్రీనివాస్, ప్రసాద్ శివపురం, గణేష్, ఫణిలు మాట్లాడుతూ .. కాకర్ల శ్రీనివాస్ అనే వ్యక్తి మరో 19 మంది డైరెక్టర్లతో కలిసి 2021 ఫిబ్రవరిలో కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేస్‌లో అన్ని హంగులతో కార్యాలయం ఏర్పాటు చేశారని మొదటి వెంచర్‌గా హిల్టన్ జయ డైమెండ్ పేరుతో వెంచర్ ప్రారంభించినట్లు తెలిపారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ తమకు పదేపదే ఫోన్లు చేసి చందానగర్ లోని గోపనపల్లిలో తక్కువ ధరకు ప్లాట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారన్నారు. కార్యాలయానికి వెళ్లగా హంగు, ఆర్భాటాలతో పాటు దాదాపు వంద మందికి పైగా ఉద్యోగులు అక్కడ పని చేస్తున్నారన్నారు. సంస్థ ప్రతినిధుల మాటలు నమ్మి రూ. 20 లక్షల నుంచి రూ.1.80 కోట్ల వరకు పెట్టుబడి పెట్టామన్నారు. రెండేళ్లలో ప్లాట్లు అప్పగిస్తామని చెప్పారని. గడువు ముగిసిన తర్వాత అడిగితే నేడు రేపు అంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. దీంతో తమకు చూపించిన స్థలం వద్దకు వెళ్లి ఆరా తీయగా సదరు ప్రాజెక్టు వేరే సంస్థకు చెందినదిగా తెలుసుకుని నివ్వెరపోయామన్నారు. మధ్య తరగతికి చెందిన తాము పైసాపైసా కూడబెట్టుకుని ప్లాట్లు కోసం వెచ్చించామన్నారు. ఇదే సంస్థ గతంలో రాజమండ్రిలోనూ ఇదేతరహాలో మోసం చేసినట్లు తెలిసిందన్నారు. నిందితుడు కాకర్ల శ్రీనివాస్, మరికరు డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రస్తుతం బెయిల్‌పై దర్జాగా తిరుగుతున్నారన్నారు. ఈ విషయమై పలుమార్లు పోలీసులకు, ఈడీ కార్యాలయంలో, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు సంస్థ బాధితుల్లో రెండు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారని ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు చొరవ తీసుకుని నిందితులను అరెస్టు చేయాలని, వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: కిలో టమాట రూ.15, నల్లవంకాయ.25, పొడుగు వంకాయ.25, బెండకాయ.45, పచ్చిమిర్చి.40, బజ్జిమిర్చి.28, క్యాప్సికం.47, పచ్చికాకరకాయ.38, పందిరిబీర.55, క్యాబేజీ.15, క్యారెట్.37, దొండకాయ.18, గుండు బీన్సీస్.115, గింజచిక్కుడు.75, గోకరకాయ.40, కీర.23, దోసకాయ.15, బీట్‌రూట్.19, ఉల్లిగడ్డ.16, ఆలుగడ్డ.25, చామగడ్డ.33, మొరంగడ్డ.19, కందగడ్డ.55, క్యాలీఫ్లవర్.23, సొరకాయ.09, పొట్లకాయ.18, అరిటికాయ.11, మునగకాయ.4, మామిడికాయ.45, ముల్లంగి.4–5, ఉల్లిపొరక.55. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీ

సనత్‌నగర్: కార్యాలయం పార్కింగ్ స్థలంలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ పార్క్ చేసి విధులు ముగించుకుని తిరిగి వచ్చి చూసేసరికి మాయమైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. ఖైరతాబాద్ చింతల్ బస్తీ రోడ్డులోని స్కైలైన్ రెసిడెన్సీలో నివాసం ఉండే సూరిశెట్టి సాయి కృష్ణానగర్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ హంటర్ 350 వాహనాన్ని కొనుగోలు చేశాడు. అయితే తన కార్యాలయ పనులపై పడి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకోలేదు. రోజులాగానే ఈ నెల 30న ఉదయం కీలీ ఇంజనీర్ కార్యాలయం పార్కింగ్ స్థలంలో పార్క్ చేసి డ్యూటీకి వెళ్లాడు. తిరిగి రాత్రి 7 గంటలకు వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రిటైర్డ్ ఎస్పీ ఇంట్లో చోరీ

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలో రిటైర్డ్ ఎస్పీ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. అమీర్‌పేట శివబాగ్ కాలనీలో మాజీ ఎస్పీ కేవీ పటేల్ కుటుంబ సభ్యులు నివసిస్తున్నారు. తల్లి కౌసల్య ఇంట్లోని బీరువాలో 10 తులాల బంగారు మంగళసూత్రాన్ని దాచుకుంది. గత నెల 29న బీరువా తెరిచి చూడగా నగలు కనిపించలేదు. నగలు చోరీకి గురైనట్లు గ్రహించి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓయూలో పోటీ పరీక్షల పుస్తకాల పంపిణీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో వివిధ ఉద్యోగాల పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేశారు. ఆదివారం యూనివర్సిటీ ఎదుట నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పుట్టిన రోజును పురస్కరించుకొని ఓయూ విద్యార్థి నేత వలిగొండ నరసింహా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పోటీ పరీక్షల పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వికాస్‌యాదవ్, వెంకట్, సామ్రాట్, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ఆదివారం డిమాండ్ చేశారు. తక్కువ వేతనానికి పని చేసినా సకాలంలో వేతనాలు అందక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని సకాలంలో వేతనాలు అందేల చర్యలు తీసుకోవాలని కోరారు.

హోంమంత్రిగా మాలలకు అవకాశం ఇవ్వాలి

ఉస్మానియా యూనివర్సిటీ: మంత్రి వర్గ విస్తరణలో మాలలకు హోంమంత్రిగా అవకాశం ఇవ్వాలని మాల జేఏసీ అధ్యక్షులు మాదాసు రాహుల్ డిమాండ్ చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం మాలలు విశేష కృషి చేశారన్నారు. వివేక్ వెంకటస్వామికి హోంమంత్రితో పాటు మరొకరికి మంత్రి పదవిని ఇవ్వాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సనత్‌నగర్: సోదరితో కలిసి యాక్టివాపై వెళుతుండగా కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. మణికొండలో నివాసం ఉండే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నరేంద్ర (30) ఈ నెల 24న మధ్యాహ్నం 12.45 గంటలకు తన సోదరి కళ్యాణితో కలిసి సనత్‌నగర్‌లోని ఆగ్రోమెక్ స్టీల్ కంపెనీకి యాక్టివా స్కూటీపై వెళ్తున్నాడు. సరిగ్గా స్టీల్ కంపెనీ ముందుకు రాగానే ఎడమ వైపు నుంచి నిర్లక్ష్యంగా వేగంగా డ్రైవర్ కారు నడుపుకుంటూ వచ్చి వీరి బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో నరేంద్రతో పాటు సోదరి కళ్యాణికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ బియ్యం పంపిణీ షురూ

- ప్రారంభంలో మొరాయించిన సర్వర్లు
- ఒక్కో లబ్ధిదారుడికి 25 నిమిషాల సమయం
- షాపుల వద్ద బారులు తీరిన వినియోగదారులు


భగత్‌సింగ్ కాలనీ రేషన్ షాపు వద్ద బారులు తీరిన కార్డుదారులు

బంజారాహిల్స్: వాతావరణ ప్రతికూల పరిస్థితులతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన మూడు నెలల రేషన్ బియ్యాన్ని జూన్ 1వ తేదీన నుంచి పంపిణీ చేస్తున్నారు. ఆదివారం మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభం కాగా షాపులు తెరిచిన కొద్ది సేపటికే సర్వర్లు మొరాయించాయి. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–07 పరిధిలోని 81 రేషన్ దుకాణాల్లో ఉదయం రెండు గంటల పాటు సర్వర్లు మొరాయించి కార్డుదారులు గంటల తరబడి షాపుల ముందు బారులు తీరాల్సి వచ్చింది. సాఫ్ట్‌వేర్ మార్చడంతో సమస్య తలెత్తిందని డీలర్లు పేర్కొన్నారు. సన్న బియ్యం పంపిణీ కావడంతో రేషన్ షాపులకు కార్డుదారులు మొదటి రోజే బారులు తీరారు. ఒకేసారి కార్డుదారులు రావడంతో షాపులన్నీ కిటకిటలాడాయి. అన్ని రేషన్ దుకాణాల్లోనూ పెద్ద సంఖ్యలో విచ్చేస్తున్న కార్డుదారులతో ఒకవైపు, సర్వర్ మొరాయించి ఇంకోవైపు సమస్య తీవ్రతరం అయ్యింది.


మాగంటి కాలనీ రేషన్ షాపు వద్ద బారులు తీరిన కార్డుదారులు

మూడు నెలల బియ్యం.. మూడుసార్లు బయోమెట్రిక్..

- ఒక కార్డుదారుడు మూడు నెలల రేషన్ బియ్యం తీసుకోవాలంటే ఒక్కో నెలకు సంబంధించి ఒకసారి బయోమెట్రిక్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇలా మూడుసార్లు బయోమెట్రిక్ తీసుకున్న తర్వాత కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఒక్కో కార్డుదారుడికి అయిదు కిలోల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో చొప్పున అందిస్తున్నాయి. దీనికి కూడా వేర్వేరుగా బయోమెట్రిక్ తీసుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఫలితంగా ఒక కార్డుదారుడికి మూడు నెలల బియ్యం ఇవ్వడానికి 20 నుంచి 25 నిమిషాల సమయం తీసుకుంది.
- అటు సర్వర్ మొరాయించడం, ఇటు సమయం ఎక్కువ తీసుకోవడం వల్ల మొదటి రోజు డీలర్లు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాగే రేషన్ షాపుల్లో గోధుమల పంపిణీ కూడా ప్రారంభమైంది. కిలో రూ.7 చొప్పున గోధుమలు పంపిణీ చేశారు. అలాగే సర్కిల్ పరిధిలో ఉన్న 3481 మంది అంత్యోదయ అన్నయోజన కార్డుదారులకు ఒక్కొక్కరికి కిలో పంచదార కూడా పంపిణీ చేస్తున్నారు. దీని వల్ల బియ్యం, గోధుమలు, పంచదార మూడింటి పంపిణీ ఒకేసారి కావడం కూడా కొంత గందరగోళానికి దారితీసింది.
- ఖైరతాబాద్ సర్కిల్–07 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, రహ్మత్‌నగర్, వెంగల్‌రావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో 81 రేషన్ షాపులు ఉండగా వీటి పరిధిలో 83013 ఆహార భద్రతా కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల్లో 292882 మంది లబ్ధిదారులు ఉన్నారు.

పోర్టిఫైడ్ సన్నబియ్యం పంపిణీ...

జూన్ 1 తేదీ నుంచి రేషన్ లబ్ధిదారులకు మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ కార్యక్రమం ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగనుంది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలని బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు. పోర్టిఫైడ్ సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఒకే నెలలో మూడు నెలల సరుకుల దృష్ట్యా చాలా వేలి ముద్రలు, ఐరిష్ తీసుకోవాల్సి ఉంటుందని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ఈ–పాస్ ఎలక్ట్రానిక్ కాంటాకు బ్లూటూత్‌ను అనుసంధానం చేసి వేలిముద్రలు తీసుకుంటున్నారు.

నర్సింగ్‌రావు ప్యానెల్ ఘన విజయం


తెలుగు టెలివిజన్ కెమెరామెన్ యూనియన్ నూతన కార్యవర్గం

బంజారాహిల్స్: తెలుగు టెలివిజన్ కెమెరామెన్ యూనియన్ ఎన్నికల్లో నర్సింగ్‌రావు ప్యానెల్ ఘన విజయం సాధించింది. బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌లో ఉండే యూనియన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో యూనియన్ అధ్యక్షుడిగా ఎం.నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడిగా కె. శ్రీధర్, జనరల్ సెక్రటరీగా పి. యామేష్(చక్రి), సంయుక్త కార్యదర్శిగా ఆర్. బాబు, కోశాధికారిగా పివి.చంద్రప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కె. రామానాయుడు, ఇ.ప్రేమ్‌కుమార్, ఈసీ మెంబర్లుగా తిరుపతిరెడ్డి, వి. మోహన్, జి. నాగేంద్ర కుమార్, డి. దుర్గా శివ శంకర్, యు. కేశవ, జె. గోపాల్‌రెడ్డి, నర్రా వేణు గోపాల్, వంశీ తదితరులు ఎన్నికయ్యారు. మొత్తం 380 ఓట్లకుగాను 245 ఓట్లు పోల్ అయ్యాయి. ఈస ందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సింగ్‌రావు మాట్లాడుతూ... తనపై ఉంచిన నమ్మకంతో ఘన విజయాన్ని కట్టబెట్టిన సభ్యుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ హక్కులు, సంక్షేమం కోసం పాటుపడతానని అన్నారు. 'వ్యక్తిగత స్వలాభాల కోసం వ్యవస్థను పాడు చేయకండి'అనే నినాదంతో ఈ ప్యానెల్ పోటీలో దిగి విజయం సాధించింది.

బీసీలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి

బంజారాహిల్స్: 'స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు – కేంద్ర ప్రభుత్వ దేశవ్యాప్తంగా బీసీ కులగణన – భవిష్యత్ బీసీ ఉద్యమ కార్యాచరణ'పై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని కళింగ ఫంక్షన్‌హాల్‌లో బీసీల రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ ముదిరాజ్ కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానిపై ఒత్తిడి పెంచాడన్నారు. తమిళనాడు తరహాలో తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

ముదిరాజ్‌లను 'బీసీ–ఏ'లోకి మార్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న పుష్పలత ముదిరాజ్

పంజగుట్ట: ఎన్నికలకు సమయంలో కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చిందని కాని అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కటి కూడా నెరవేర్చలేదని శ్రీచండీ ముదిరాజ్ మత్స్యకార సంఘం అధ్యక్షురాలు కోట్ల పుష్పలత ముదిరాజ్ అన్నారు. ముఖ్యంగా ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మారుస్తానని ఇప్పటికీ మార్చలేదన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ తాను మే 26 నుంచి 30వ తేదీ వరకు యాదగిరిగుట్ట నుంచి గన్‌పార్క్ అమరవీరుల స్థూపం వరకు పాదయాత్ర చేశానని తెలిపారు. మొదట పెద్దెత్తున ర్యాలీగా పాదయాత్ర చేద్దామని అనుకున్నప్పటికీ పోలీసులు అనుమతి నిరాకరించడం కొన్ని శక్తులు అడ్డురావడంతో తాను ఒంటరిగానే పాదయాత్ర చేశానని పేర్కొన్నారు. ముదిరాజ్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని, నీలం మధుకు ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో శివ ముదిరాజ్, కోట్ల కృష్ణయ్య, ఆర్.కె.సాయన్న, ప్రొఫెసర్ పెబ్బేటి మల్లిఖార్జున్, వెంకటేశ్వర్లు, మాదవి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

యోగ విద్యకు ప్రాచుర్యం

సనత్‌నగర్: జ్యోతి డే పేరిట యోగా గురూజీ శాంతి దూత్ నరేంద్ర బంధూజీ 73 జన్మదిన వేడుకలను సనత్‌నగర్ హిందూ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం ఉదయం యోగ సాధకులు, గురువులు ఘనంగా సన్మానించారు. నిర్మల్ సాధన జ్యోతి మందిర్ పేరిట గత 47 ఏళ్లుగా యోగా శిక్షకులను తయారుచేస్తూ యోగ విద్యకు ప్రాచుర్యం తీసుకువస్తున్నారని ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఇప్పటివరకు 7,500 యోగ టీచర్లను సమాజానికి అందించారన్నారు. నగర వ్యాప్తంగా 23 బ్రాంచ్‌ల ద్వారా యోగ తరగతులను కొనసాగిస్తున్నారని వివరించారు.

అందరి సహకారంతో బోనాలు విజయవంతం చేస్తాం

గోల్కొండ: అందరి సహకారంతో కోట బోనాలు విజయవంతం చేస్తామని కాంగ్రెస్ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజిరీ అన్నారు. ఆదివారం బోనాల నిర్వహణపై జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు బోనాల నిర్వహణ కమిటీ చైర్మన్ కె.చంటిబాబును జగదాంబిక మహంకాళీ అమ్మవారి వృత్తివని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బొమ్మల సాయిబాబా చారి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాల నిర్వహణపై తాము దేవాదాయ శాఖ మంత్రి, కమిషనర్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కూడా కలిశామన్నారు. ఈ కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు బి.శ్రీకాంత్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎన్.శ్రీకాంత్, సురేష్‌గౌడ్, బి.అనిత, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులున్నారు.

తెలుగు వెలుగు ఒరవడిని ఇలాగే కొనసాగించాలి

దూరదర్శన్ మాజీ ఏడీడీ డా. అనంతపద్మనాభ రావు

ఖైరతాబాద్: యువ భారతి సాహితీ సాంస్కృతిక సంస్థ ఐఐఎంసీ కళాశాల, మానస ఆర్ట్స్ థియేటర్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి నెల మొదటి ఆదివారం నిర్వహిస్తున్న తెలుగు వెలుగు సమాఖ్య కార్యక్రమం 8వ సమావేశం ఆదివారం కళాశాల సభా ప్రాంగణంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దూరదర్శన్ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు మాట్లాడారు. యువ భారతి వారి ఆధ్వర్యంలో తెలుగు వెలుగు కార్యక్రమం చేయడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ ఒరవడిని ఇలాగే కొనసాగించాలని సూచించారు. అనంతరం తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఆచార్యులు డాక్టర్ నోరి రాజేశ్వర రావు మాట్లాడుతూ.. ఇవి వ్యక్తుల మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కూర రఘువీర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాలు యూట్యూబ్‌లో యువభారతి అనే చానల్ ద్వారా ప్రసారమవుతాయని అన్నారు. అలాగే యువ భారతి ప్రచురించే పుస్తకాలను యువ భారతి లింకు ద్వారా ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో జి.వెంకట్రావు, రవీంద్ర, నారాయణరెడ్డి, రామకృష్ణ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కాకర్ల హనుమంతరావు ఆదిభట్ల నారాయణదాసు విరచిత సీతా కల్యాణం హరికథను దక్షిణామూర్తి, సుధాకర్ వాద్య సహకారంతో ఎంతో రమణీయంగా గానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కూర రఘువీర్, యువభారతి వ్యవస్థాపక సమావేశకర్త ఆచార్య వంగపల్లి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.


ఐఐఎంసి కళాశాలలో సీతా కల్యాణం హరికథ గానం

ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్న మహిళ అరెస్టు

వెంగళరావునగర్: ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేస్తున్న మహిళను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..కరీంనగర్‌కు చెందిన బి.ప్రసన్నరెడ్డి కొంత కాలంగా జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంది. వెంగళరావునగర్ కాలనీ నివాసి ఎస్.జీవన్‌కు గతేడాది ఆమె పరిచయం అయింది. హైకోర్టు న్యాయవాదినని, జడ్జిలతో పరిచయాలు ఉన్నాయని చెప్పుకొచ్చింది. దీంతో జీవన్ తనకు ఉద్యోగం ఇప్పించాలని ప్రాధేయపడ్డాడు. దీనిని ఆసరాగా తీసుకుని రూ.15 లక్షలు ఇస్తే హైకోర్టులో రికార్డు అసిస్టెంట్ పోస్ట్ ఇప్పిస్తానని చెప్పగా అతను రూ.6.5 లక్షలు ఇచ్చాడు. మిగిలినవి ఆలస్యం కావడంతో శైలజారెడ్డి, ఫిరోజ్‌ఖాన్‌ను తన అసిస్టెంట్స్ అని చెప్పి వారికి డబ్బులు ఇవ్వాలని సూచించింది. ఇటీవల రవి అనే వ్యక్తి జీవన్‌కు ఫోన్ చేసి ప్రసన్నరెడ్డి తనకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ.4.5 లక్షలు తీసుకుని మోసం చేసిందని అన్నాడు. దీంతో ఇరువురు కలిసి ప్రసన్నరెడ్డికి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెపై గతంలో నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో చీటింగ్ కేసులు ఉన్నాయి. శనివారం ఆమె కరీంనగర్‌లో మధురానగర్ పోలీసులకు చిక్కింది. ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యార్థిని తేజస్వినికి సన్మానం



తేజస్వినిని సన్మానిస్తున్న ఖైరతాబాద్ 2బీహెచ్‌కే హౌసింగ్ సొసైటీ సభ్యులు

ఖైరతాబాద్: ఇంటర్ మీడియట్‌లో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించిన తేజస్వినిని ఆదివారం ఖైరతాబాద్ 2 బీహెచ్‌కే హౌసింగ్ సొసైటీ సభ్యులు సన్మానించారు. ఖైరతాబాద్ 2బీహెచ్‌కేలో నివాసముంటున్న తేజస్విని శంకర్‌పలి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో ఇంటర్ ఒకేషనల్ (ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్) కోర్సులో 992 మార్కులతో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించిన సందర్భంగా 2బీహెచ్‌కే హౌసింగ్ సొసైటీ తరఫున రూ.10వేల చెక్కును అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి విజయ్, ఉపాధ్యక్షులు వెంకటేష్, యాదగిరి, అశోక్, సాయి రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జాబితాలో లంబాడీలను కలిపేందుకు కుట్ర

- సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య నంజీవనాయక్
- 29న సేవాలాల్ సేన రాష్ట్ర మహాసభ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో లంబాడీలను బీసీ జాబితాలో కలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ నాయక్ ఆరోపించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సేవాలాల్ సేన రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంజీవ నాయక్ మాట్లాడుతూ... ఈనెల 29న హైదరాబాద్ నగరంలో సేవాలాల్ సేన 11వ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐటీడీఏ కింద ఉన్న మ్యూజియంలలో లంబాడీల అనవాళ్లు కూడా లేకుండా చేశారని అన్నారు. మంత్రివర్గంలో లంబాడీలకు అవకాశం లేకుండా పోయిందన్నారు. లంబాడీ భూములను కూడా గుంజుకుంటున్నారని విమర్శించారు. ఎస్టీలకు ఉన్న 10 శాతం రిజర్వేషన్ కూడా సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయడంలేదని అన్నారు. లంబాడీల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివక్షత చూపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ మాలోతు సైదనాయక్, నగర అధ్యక్షులు వి. కళ్యాణ్‌నాయక్, వ్యవస్థాపక సభ్యులు స్వరాజ్‌నాయక్, రాష్ట్ర మాజీ కిషన్‌నాయక్, రమేష్ మహారాజ్, అజయ్, హుస్సేన్, వెంకన్న, రవినాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భూక్య సంజీవనాయక్

జాబితాపై సర్వత్రా ఉత్కంఠ

నేడు తేలనున్న ఆర్‌యూవీ పథకం దరఖాస్తుదారుల భవితవ్యం

బంజారాహిల్స్: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ధిదారుల ఎంపిక ఓ కొలిక్కి రాగా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 2 సోమవారం లబ్ధిదారులకు పట్టాలు అందజేయనున్నారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో నిరుద్యోగ యువతీ, యువకులు ఈ పథకంలో లబ్ధికోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకోగా 360 డిగ్రీల కోణంలో దరఖాస్తులను పరిశీలించిన అధికారులు అర్హత ఉన్న దరఖాస్తులను ఎంపిక చేసి బ్యాంకులకు అందజేశారు. బ్యాంకుల నుంచి లబ్ధిదారుల వివరాలతో కూడిన జాబితా శనివారం అధికారులకు చేరింది. సోమవారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని లబ్ధిదారులకు రుణ పత్రాలు అందజేయనున్నారు. 50 వేల నుంచి 4 లక్షల వరకు రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 16వేల మంది దరఖాస్తు..

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో 16వేల మంది దరఖాస్తు చేసుకోగా ఇందులో సంబంధిత ధ్రువపత్రాలు జతపర్చి వార్డు కార్యాలయాల్లో అందజేసిన వారు 6వేల మందికిపైగా ఉన్నారు. ఇందులో కూడా అన్ని పత్రాలను స్క్రూటినీ చేసిన అధికారులు జాబితాను బ్యాంకులకు అందజేశారు. బ్యాంకుల నుంచి సిబిల్‌లో లేని వాళ్లను ఈ పథకానికి ఎంపిక చేసి సంబంధిత అధికారులకు జాబితాను పంపించారు. ఎంత మంది లబ్ధిపొందారన్నది సోమవారం తేలనుంది.


రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న యువత

ఖైరతాబాద్ నియోజకవర్గంలో 20వేలకు పైగా దరఖాస్తులు...

ఇక ఖైరతాబాద్ నియోజక వర్గంలో పరిదిలోఓ ఈ పథకం కోసం 20 వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు.. అన్ని పత్రాలు జతచేసి ఫిజికల్‌గా వార్డు కార్యాలయాల్లో 9 వేల మంది వరకు మాత్రమే దరఖాస్తులు ఇచ్చారు. షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు వీటిని పరిశీలించి బ్యాంకులకు జాబితాలను అందజేశారు. ఇదిలా ఉండగా లబ్ధిపొందిన వారికి రూ.50 వేలు, రూ.లక్ష రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికే ఆవిర్భావ దినోత్సవం రోజు రుణపత్రాలను పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మిగతా దరఖాస్తులను తర్వాత పరిశీలన చేస్తారు.

80శాతం రుణాలు మంజూరైనట్లు సమాచారం..

ప్రస్తుతం రూ.50 వేలు, రూ.లక్షకు దరఖాస్తు చేసుకున్న వారికి 80 శాతం రుణాలు మంజూరైనట్లు తెలుస్తున్నది. బ్యాంకర్ల ఆమోదం, మండల కమిటీల ఆమోదం తర్వాత జిల్లా స్థాయి అధికారులు ఆమోదం తెలపనున్నారు ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో వీటిని ప్రకటించనున్నారు. స్వయం ఉపాధి కోసం ఎంపికైన లబ్ధిదారులకు మండల స్థాయిలో శిక్షణా కార్యక్రమాలు ఇవ్వనున్నారు. మరో వైపు వచ్చిన దరఖాస్తులను చాలా వరకు తిరస్కరణకు గురయ్యాయి. సిబిల్ స్కోర్ చూసి కొన్నింటిని బ్యాంకర్లు పక్కనపెట్టారు.

- రూ.1 లక్ష కంటే ఎక్కువ రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం తర్వాత పరిశీలించనుంది. అర్హుల జాబితాను మంత్రి ఆమోదం కోసం పంపించగా ఆదివారం సాయంత్రం ఆమోదముద్ర పడినట్లుగా తెలుస్తున్నది. జాబితాలో ఎవరున్నారనేది ఉత్కంఠగా మారింది. ఈ పథకం ఎవరెవరిని వరిస్తుందనేది సోమవారం తేలనుంది. ఆశావహులు ఎదురుచూపులతో గడిపేస్తున్నారు.

నగరంలో నేడు

- తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాలు ఉదయం 8 గంటలకు జరుగుతాయి.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది .
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్ ఎగ్జిబిషన్ ప్రారంభం

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

నేటి 'ప్రజావాణి' వాయిదా

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నేపథ్యంలో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చేవారం నుంచి యథావిధిగా ప్రజావాణి జరుగుతుందని కమిషనర్ పేర్కొన్నారు. గ్రేటర్ ప్రజలందరూ సహకరించాలని కమిషనర్ కోరారు.

14న ఐటీ ఉద్యోగుల ప్రత్యేక సమావేశం

రాయదుర్గం: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల కోసం గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14న ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 'లీడింగ్ ఫ్రమ్ విథిన్'పేరిట ఈ కార్యక్రమం సాగుతుంది. ఈ సందర్భంగా 'రిట్రీట్స్ ఫర్ డిజిటల్ మైండ్స్'న్యూ చాప్టర్‌ను ఆవిష్కరించే కార్యక్రమంలో శాంతి సరోవర్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్ దీదీ, ముంబైలోని ఇంటర్నేషనల్ సీనియర్ ఫ్యాకల్టీ, మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్ బి.కె.క్రీనా దీదీ పాల్గొంటారు. కార్యక్రమంలో పాల్గొనేవారు తమ పేర్లను ఉచితంగా వెబ్‌సైట్ www.shantisarovar.orgలో నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

మిల్లెట్ ల్యాబ్‌లో యువతకు శిక్షణ



సమ్మర్ ఇంటర్న్‌షిప్ కోహర్ట్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

రాయదుర్గం: భారతీయ సైన్స్ భవిష్యత్తులో కీలకమైన పెట్టుబడని విశ్వసిస్తున్నామని హెచ్‌సీయూ ప్లాంట్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ముత్తమిలరసన్ అన్నారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని ప్లాంట్ సైన్సెస్ విభాగం, టమాటో జెనోమిక్స్ రిసోర్సెస్ రిపోజిటరీ కింద సమ్మర్ ఇంటర్న్‌షిప్ కోహర్ట్ కార్యక్రమాన్ని హెచ్‌సీయూ మిల్లెట్ ల్యాబ్‌లో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మిల్లెట్ జెనెటిక్స్, జెనోమిక్స్‌లో అధునాతన పరిశోధనలకు హెచ్‌సీయూలోని మిల్లెట్ ల్యాబ్ ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు. మిల్లెట్ ల్యాబ్‌లో నిర్మాణాత్మక శిక్షణ ద్వారా యువ మనసులను శక్తివంతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. పీహెచ్‌డీ స్కాలర్లు, ప్రాజెక్ట్ ఫెలోలు ఇంటర్న్‌లకు శిక్షణ ఇవ్వడంలో చురుకైన పాత్ర పోషిస్తారని చెప్పారు.

తెలంగాణ కబడ్డీ సంఘం నిధుల అవకతవకలపై ఫిర్యాదు

అబిడ్స్: తెలంగాణ కబడ్డీ సంఘంలో నిధుల అవకతవకలపై అబిడ్స్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు. 2020 నుంచి 2024 మధ్య సుమారు రూ.1.30 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని రాష్ట్ర కబడ్డీ కమిటీ సంఘం మాజీ సంయుక్త కార్యదర్శి సురేష్ ఆబిడ్స్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ ఇమ్మానియేల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాస్‌పోర్టు ట్యాంపరింగ్ కేసులో ఒకరి రిమాండ్

శంషాబాద్: పాస్‌పోర్టు ట్యాంపరింగ్‌కు పాలపడుతున్న వ్యక్తిని ఆర్‌జీఐఏ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సౌదీ, అరబ్ దేశాల్లో ఉపాధి కోసం వెతుకుతున్న అమాయకులను ప్రొటెక్షన్ ఆఫ్ ఇమిగ్రేషన్ స్టాంపులు లేకుండా విజిటింగ్ వీసాలతో పంపిస్తున్న ముఠాపై పోలీసులు కన్నేశారు. ఈ మేరకు ఇటీవల ఓ కేసు నమోదైన సంగతి తెలిసిందే. పాస్‌పోర్టు ట్యాంపరింగ్ కేసులో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన నాగబాబు అనే వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ బాలరాజు తెలిపారు.

ఆటిజమ్‌కు సెల్ థెరపీ

హైదరాబాద్‌లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యం

- సైడ్ ఎఫెక్ట్ లేని ట్రీట్‌మెంట్
- 10 శాతం మంది పిల్లల్లో లక్షణాలు
- గర్భిణుల్లో ఒత్తిడి, జన్యుపరమైన సమస్యలే కారణం



సాక్షి, సిటీబ్యూరో: ఇంట్లో పిల్లలు బుడిబుడి అడుగులేస్తే ఇంటిల్లిపాదికీ ఆనందం. వారితో గడిపిన కాలం అద్భుతం. కష్టాలన్నీ మర్చిపోతారు. అలాంటి పిల్లలు శారీరకంగా ఎదిగినా మానసికంగా ఎదుగుదల లేనప్పుడు, ప్రవర్తన సాధారణ పిల్లలకు భిన్నంగా ఉన్నప్పుడు వారి తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. నగరంలో ఇలా ఆటిజమ్ లక్షణాలున్న పిల్లలు సుమారు 8 నుంచి పది శాతం మంది ఉంటారని గణాంకాలు చెబుతున్నాయి. మూడేళ్ల వయసులోపే గుర్తించి వెంటనే చికిత్స అందిస్తే ఆ పిల్లలు సాధారణ స్థితికి రావచ్చు. ఇటీవల దక్షిణ భారతదేశంలోనే తొలిసారి హైదరాబాద్‌లో అత్యాధునిక సెల్ థెరపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని నిపుణులు చెబుతున్నారు.

గుర్తించడం ఎలా..?

మెదడు ఎదుగుదల పుట్టినప్పటి నుంచి 13 ఏళ్ల వరకు ఉంటుంది. పిల్లలు రెండేళ్ల నుంచి రెండున్నరేళ్ల వయసు వచ్చేసరికి సహజంగానే అన్ని రకాలుగా అర్థం చేసుకుంటారు. వారి ఆలోచనలను వ్యక్తపరచగలరు. ఎదురుగా ఉన్న వ్యక్తిని కాకుండా పక్కకు చూడటం, నలుగురు పిల్లలతో కలవకుండా ఒంటరిగా విడిపోవడం, కళ్లలోకి కళ్లు పెట్టి చూడలేకపోవడం, ఐ కాంటాక్ట్‌లో మాట్లాడలేకపోవడం, పేరు పెట్టి పిలిచినా పరధ్యానంలో ఉండటం, అడిగే ప్రశ్నలకు ఆలస్యంగా స్పందించడం, అర్థం చేసుకునే సామర్థ్యం తక్కువగా ఉండటం వంటివన్నీ ఆటిజమ్ లక్షణాలు. మరికొన్ని విషయాల్లో హైపర్ యాక్టివ్‌గా ఉండటం వంటి లక్షణాలు ఆటిజమ్‌లో కనిపిస్తాయి. మెదడులో ఒక వైపు ఎదుగుదల ఉండి, రెండో వైపు తటస్థంగా ఉండిపోవడమే దీనికి కారణమని వైద్యులు అంటున్నారు. ఇలాంటప్పుడు ఆలస్యం చేయకుండా వైద్యనిపుణులను సంప్రదించడం మేలు. ఆటెక్స్ (ఏటీఈసీ) పరీక్షలో స్కోర్ 30 వరకు ఉంటే సాధారణమే. అంతకు మించితే మాత్రం చికిత్స అవసరం. అయితే హైదరాబాద్‌లో ఈ స్కోర్ సుమారు 250 వరకు ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

ఎందుకిలా అవుతుందంటే..

వివిధ కారణాల వల్ల ఆటిజమ్ వచ్చే అవకాశం ఉందని వైద్యులు పేర్కొంటున్నారు. గర్భిణి తీవ్ర ఒత్తిడికి గురైనా ఆ తర్వాత పుట్టిన శిశువుకు ఆటిజం వచ్చే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో జన్యుపరంగానూ రావచ్చని నిపుణులు అంటున్నారు. కుటుంబం లైఫ్ స్టైల్ కూడా పిల్లలపై ప్రభావం చూపుతుంది. నాలుగు గోడల మధ్య పిల్లలు ఉండిపోయినా పిల్లల ఆలోచనాశక్తి ఎదగకుండా పోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

మూల కణాలతో చికిత్స..



ఆటిజమ్ కేసులు పెరుగుతున్నాయి. పిల్లల వయసు రెండున్నరేళ్ల నుంచి 13 ఏళ్ల మధ్యలో మెదడు పెరుగుదల ఉంటుంది. ఈ సమయంలోనే ఆటిజమ్ చికిత్సలు మంచి ఫలితాలు ఇస్తాయి. త్వరితగతిన మెదడు అభివృద్ధి చెందుతుంది. ఆటెక్స్ (ఏటీఈసీ) స్కోర్ చూసి పిల్లలు ఏ స్థితిలో ఉన్నారో గుర్తిస్తాం. రక్తం, బోన్‌మ్యారో నమూనాలు తీసుకుని ల్యాబ్‌లో పరీక్షించి ట్రీట్‌మెంట్ ప్రారంభిస్తాం. ఆరు వారాల్లో మూడు డోస్‌లు ఇస్తాం. తొలి డోస్ తరువాత పిల్లల్లో మార్పు కనిపిస్తుంది. దీని వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఆహార నియమాలు అవసరం లేదు. పిల్లలు పుట్టినప్పుడు మూల కణాలను భద్రపర్చుకుంటే భవిష్యత్తులో ఉపయోగకరంగా ఉంటాయి.

– నిషారెడ్డి, సెల్ థెరపీ వైద్యురాలు, రీ క్లినిక్, హైదరాబాద్

నేడు శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన టీటీడీ ఆలయం

హిమాయత్‌నగర్: ఐదు రోజులపాటు నిర్వహించే వేడుకలకు హిమాయత్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయం(టీటీడీ) ముస్తాబైంది. స్వామివారి 20 వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం వాహన సేవలతో ఆలయ అర్చకులు అంకురార్పణ చేయనున్నారు. ఈ నెల 3న ఉదయం 6.30 నుండి 8.45 గంటల మధ్య మిథున లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఐదు రోజులపాటు ఉదయం, రాత్రి వేళల్లో స్వామి వారికి వాహన సేవలు నిర్వహిస్తారు. ఈ నెల 7 న ఉదయం 11.30 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం ఉంటాయి. రాత్రి 9 గంటలకు ధ్వజారోహణం తర్వాత టీటీడీ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

ఉద్యమకారులకు మంత్రి పదవి ఇవ్వాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న గజ్జెల కాంతం, పిడమర్తి రవి తదితరులు

ఖైరతాబాద్: తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నేతలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతం , ఓయూ జేఏసీ చైర్మన్ పిడమర్తి రవి కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు ఆదివారం లక్డీకాపూల్‌లో తెలంగాణ ఉద్యమకారుల రౌండ్‌టేబుల్ సమావేశం గజ్జెల కాంతం, పిడమర్తి రవి ఆధ్వర్యంలో జరిగింది. గజ్జెల కాంతం మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతం జనాభా ఉన్న మాదిగల తరఫున కవ్వంపల్లి సత్యనారాయణకు కేబినెట్ విస్తరణలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మాల సామాజిక వర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు అద్దంకి దయాకర్‌కు కూడా మంత్రి ఇవ్వాలన్నారు. పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల స్థలం, ఇల్లు కట్టుకోవడానికి రూ.25 లక్షలు అందించాలని, పెన్షన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఓరుగంటి వెంకటేష్ గౌడ్, మీసాల మల్లేశం, బొంకూరి సురేందర్, డాక్టర్ సంజీవ్ నాయక్, కొల్ల శ్రీనివాస్, గజ్జెల ఆనందరావు, గజ్జెల మల్లికార్జున్, బోరెల్లి సురేష్, ప్రభాకర్, సముద్రాల అజయ్, సుద్దాల లక్ష్మణ్, దేవరకొండ నరేష్, బొమ్మెర స్టాలిన్, నిమ్మల వీరన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



ఓ విద్యార్థికి మూడు చక్రాల సైకిల్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎస్‌బీఐ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం, ప్రధాన కార్యదర్శి భార్గవ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆర్టీసీ కల్యాణ మండపంలో ఎస్‌బీఐ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ బ్యాంకుల్లో సుమారు 3,800 మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారికి సంస్థ నుంచి రావాల్సిన బెనిఫిట్స్, ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పేద విద్యార్థులను ఆదుకోవడానికి చేయూత అందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం మరోమారు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యం, ప్రధాన కార్యదర్శి భార్గవ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో హైదరాబాద్ సర్కిల్ డీజీఎం, సీడీవో పంకజ్ ప్రియదర్శి, కుమార్, రోహిత్, జితేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డు.. సైకిల్ రైడ్



ఖైరతాబాద్: నెక్లెస్ రోడ్ సైకిల్ రైడ్‌తో సందడిగా మారింది. వరల్డ్ బైసికిల్ డేను పురస్కరించుకొని ఆదివారం సాగర తీరంలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్ మీదుగా సైకిల్ రైడ్ నిర్వహించారు. ప్రతి ఏడాది జూన్ 3న వరల్డ్ బైసికిల్ డే సందర్భంగా ఆదివారం హైదరాబాద్ సైకిలిస్ట్ గ్రూప్ ఆధ్వర్యంలో 300 మందితో కలిసి సైకిల్ రైడ్ నిర్వహించారు. ఈ రైడ్‌ను కస్టమ్స్ అండ్ జీఎస్టీ చైర్మన్ నరసింహారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. 8 ఏళ్లుగా బైసికిల్ డే సందర్భంగా గ్రామీణ పేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు అందజేస్తున్నామని, ఈసారి కూడా 15 సైకిళ్లు అందజేశామని హైదరాబాద్ సైకిలిస్ట్ గ్రూప్ ఫౌండర్ రవీందర్ నందనూరి తెలిపారు. దుండిగల్ తండా ప్రాంతంలోని విద్యార్థినులకు 10, మెహిదీపట్నం ప్రాంతంలోని పాఠశాల విద్యార్థినులకు 5 సైకిళ్లు, సూర్యాపేటలకు చెందిన వారికి రెండు ట్రైసైకిల్స్ అందజేశామని తెలిపారు.



ఉచితంగా ట్రైసైకిల్స్ అందజేస్తున్న సైకిలిస్ట్ గ్రూప్ సభ్యులు

గన్‌మెన్లు లేకుండా పర్యటనా?

రాజాసింగ్‌కు నోటీసులు



పాతబస్తీలో భద్రత లేకుండా బుల్లెట్‌పై పర్యటించిన ఎమ్మెల్యే రాజాసింగ్

అబిడ్స్: పోలీస్ శాఖ బుల్లెట్ ప్రూఫ్ కారుతో ఎమ్మెల్యే రాజాసింగ్‌కు భద్రత ఏర్పాటు చేసినా ఆయన ఎలాంటి భద్రత లేకుండా బుల్లెట్‌పై ఒక్కరే పాతబస్తీలో పర్యటించడంతో మంగళ్‌హాట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. మతపరంగా అత్యంత సున్నితమైన పాతబస్తీలోని భవానీనగర్, తలాబ్‌కట్ట, ఇంజన్‌బౌలి, బాబానగర్, బహదూర్‌పురా, సంతోష్‌నగర్, యాకత్‌పురా, గోల్కొండ, జియ్రా ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భద్రత లేకుండా, గన్‌మెన్‌లు లేకుండా ఎలా పర్యటిస్తారని నోటీసులో పేర్కొన్నారు. ఏదైనా సంఘటన జరిగితే ఎలా అని ప్రశ్నించారు. అవాంఛనీయ సంఘటనలను నివారించడానికి వన్ ప్లస్ ఫోర్ భద్రతతోపాటు బుల్లెట్ ప్రూఫ్ కారును తప్పనిసరిగా వాడాలని సూచించారు. గోషామహల్ ఏసీపీ ఎస్.సుదర్శన్ ఆధ్వర్యంలో మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు నోటీసులు అందజేశారు.

బస్‌షెల్టర్ తొలగింపునకు కుట్ర



సీట్లు లేకుండా, వెనక ఉన్న షీట్ తొలగించిన దృశ్యం

పంజగుట్ట: పంజగుట్ట ప్రధాన రహదారిపై ఉన్న ఓ బస్‌షెల్టర్‌ను తొలగించేందుకు పలువురు యత్నిస్తున్నారు. పంజగుట్ట నుంచి ఖైరతాబాద్ వెళ్లే మార్గంలో నిమ్స్ ఆసుపత్రి ఎదురుగా గోకుల్ టవర్స్ ముందున్న బస్‌షెల్టర్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు సీట్లు, ఎండ, వర్షం రాకుండా అడ్డుగా వెనక ఇనుప రేకు ఉండేది. కొన్ని రోజుల క్రితం వరకు ఉన్న ఇనుప రేకు ఉన్నట్టుండి మాయమైంది. ప్రయాణికులు కూర్చునే సీట్లను కూడా తొలగించారు. బస్‌షెల్టర్ వెనకే ఇటీవల ఒక దుకాణం ప్రారంభమైందని, తమ వ్యాపారానికి అడ్డుగా ఉందని దానిని తొలగించేందుకు వారు ప్రయత్నిస్తున్నారని స్థానికులు అంటున్నారు. టవర్స్ పార్కింగ్ ప్లేస్‌లో అక్రమంగా షెడ్ వేసి కస్టమర్లు కూర్చునేందుకు టేబుల్స్ ఏర్పాటు చేయడంతో పార్కింగ్‌కు ఇబ్బంది పడాల్సి వస్తోందని పలువురు వ్యాపారులు అంటున్నారు.

మార్కెట్‌లోకి 'విజయ' నూతన పాల ఉత్పత్తులు



విజయడెయిరీ నూతన ఉత్పత్తులను విడుదల చేస్తున్న అమిత్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి

లాలాపేట: అంతర్జాతీయ పాల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం విజయ డెయిరీ నూతన పాల ఉత్పత్తులు డీటీఎం పెరుగు, శుభోదయం చిన్న నెయ్యి ప్యాకెట్లను ఆ సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఎండీ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మార్కెట్‌లోకి విడుదల చేశారు. అంతర్జాతీయ పాల దినోత్సవాన్ని లాలాపేటలోని విజయ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. దీంతోపాటు ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ కోఆపరేటివ్స్–2025 సెల్ఫీ స్టాండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్‌రెడ్డి మాట్లాడుతూ పాడి రైతుల శ్రేయస్సు, వినియోగదారుల ఆరోగ్యం కోసం మరింత నైపుణ్యంతో పనిచేయాలని ఉద్యోగులకు సూచించారు. అనంతరం అనాథ విద్యార్థి గృహంలోని చిన్నారులకు విజయ పాలు, పాల ఉత్పత్తులను పంపిణీ చేశారు. విజయ డెయిరీ జనరల్ మేనేజర్లు మల్లయ్య, కవిత, మల్లికార్జున్, మధుసూదన్, ఇండియన్ డెయిరీ అసోసియేషన్ తెలంగాణ చాప్టర్ ఎస్వీ డీబీఆర్ కృష్ణారెడ్డి, సుజిత్ పాల్గొన్నారు.

అవయవ దాతలకు డోనర్ కార్డుల అందజేత



మదీనాగూడలో దోనర్ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తదితరులు

చందానగర్: అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని పీఏసీ చైర్మన్ ఆరికెపూడి గాంధీ అన్నారు. ఆదివారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మదీనాగూడలోని మై హోమ్ జ్యూవెల్ అపార్ట్‌మెంట్స్‌లో అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం, తెలంగాణ శరీర అవయవదాతల సంఘం ఆధ్వర్యంలో గాంధీ మెడికల్ కాలేజీకి పూర్తి శరీరంలోని అవయవాలు దానం చేసినవారికి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మందికి డోనర్ కార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ 'మరణం తరువాత జీవించండి'నినాదం స్ఫూర్తిని ఆచరణలో పెట్టడానికి ఒక సంస్థను ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఒకేసారి 30 మంది దాతలు దేహ దానానికి ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, విశిష్ట అతిథిగా డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి, సీనియర్ నాయకుడు రఘునాథ్‌రెడ్డి, ఆత్మీయ అతిథులుగా డాక్టర్ కాట్రగడ్డ భారతి, గురుప్రకాష్, అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్, చాపరాల ఇందిర, రజిని, శ్రీనివాస్, ప్రసాద్, మల్లేష్ గుప్తా, నరేందర్ బల్లా తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మకుమారీస్ సేవలు వెల కట్టలేనివి



శాంతి సరోవర్‌లో సోలార్ పవర్ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సుశీల్ బాజ్‌పాయ్, కుల్‌దీప్ దీదీ

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ సేవలు వెల కట్టలేనివని ఆర్‌ఎస్‌పీఎల్ ఢిల్లీ గ్రూప్ అధ్యక్షుడు సుశీల్ బాజ్‌పాయ్ అన్నారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ క్యాంపస్‌లో ఆర్‌ఎస్‌పీఎల్ గ్రూప్(ఘడి డిటర్జెంట్) కంపెనీ న్యూఢిల్లీ సహకారంతో ఆదివారం 270 కిలోవాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధిని దశలవారీగా క్యాంపస్ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతి సరోవర్ డైరెక్టర్ బి.కె.కుల్‌దీప్ దీదీ మాట్లాడుతూ శాంతిసరోవర్ క్యాంపస్ సంవత్సరానికి 20 వేల మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా కృషి చేస్తోందన్నారు. రోడ్లపై రోజురోజుకూ కాలుష్యకారక వాహనాల సంఖ్య పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం శాంతిసరోవర్ క్యాంపస్‌లో అతిథులు, డైరెక్టర్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో ముంబై ఎస్‌బీఐ విశ్రాంత సీజీఎం వినోద్‌కుమార్, పలువురు ఆర్‌ఎస్‌పీఎల్ సంస్థ ప్రతినిధులు, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చర్చలకు సిద్ధంగా ఉన్నా కాల్చి చంపడం దారుణం

ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం వారిని చంపడం విచారమని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. దేశంలోని ప్రజాస్వామ్యం పూర్తిస్థాయి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భగా హరగోపాల్ మాట్లాడుతూ మావోయిస్టుల శవాలను కూడా ఇవ్వడానికి ప్రభుత్వం నిరాకరిస్తోందన్నారు. కొంతకాలంగా పాలకులు అనుసరిస్తున్న విధానాలతో దేశం ఒక విచిత్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని, ఈ పరిస్థితుల్లో ప్రజలు, ప్రజా సంఘాలు శాంతి చర్చలు జరగాలని కోరుతుంటే ప్రభుత్వాలు అణచివేతను నమ్ముకున్నాయని అన్నారు. దండకారణ్యం నెత్తురోడుతోందని, విప్లవోద్యమ అణచివేతే లక్ష్యంగా సాగుతున్న ఆపరేషన్ కగార్ ఆదివాసీల హననానికి కారణం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రజలపైనే యుద్ధం చేస్తోందని విమర్శించారు. వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, ఎస్.రవి, భూరం అభినవ్, ఆత్రం భుజంగరావు, ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, డాక్టర్ ఎం.ఎఫ్ గోపీనాథ్, పాణి, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఠాణాకు హరిత హంగులు



పచ్చదనంతో తీర్చిదిద్దిన పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు ఏసీపీ హరిప్రసాద్ తదితరులు

బంజారాహిల్స్: పంజగుట్ట కూడలిలో ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మొన్నటి వరకు చెత్తాచెదారం, మూలన పడ్డ వాహనాలు, పారుతున్న దుర్గంధంతో అధ్వానంగా ఉండేది. నిత్యం వేలాది వాహనాల రాకపోకలతోపాటు ఆభరణాల షాపులకు వచ్చే కస్టమర్లతో ఆ ప్రాంతం కిటకిటలాడుతూ ఉండేది. అయితే వెస్ట్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ బాధ్యతలు తీసుకున్న తర్వాత అపరిశుభ్రంగా ఉన్న ఠాణా పరిసరాలను పచ్చదనం, పరిశుభ్రతతో తీర్చిదిద్దేవిధంగా చొరవ తీసుకున్నారు. గడిచిన నాలుగు నెలలుగా ఠాణాకు రెండు వైపులా మొక్కలు నాటి పచ్చదనం తీసుకువచ్చారు. దుమ్ము ధూళిలో మూలనపడ్డ వాహనాలను అక్కడి నుంచి తొలగించారు. ఠాణా ముందు పాదచారులు నడిచేందుకు వీలుగా ఫుట్‌పాత్ వేయించారు. చెత్తాచెదారం లేకుండా జీహెచ్‌ఎంసీతో మాట్లాడి పెద్ద ఎత్తున వ్యర్థాలను తొలగింపజేశారు. మొన్నటివరకు అపరిశుభ్రంగా, అధ్వానంగా ఉన్న ఠాణా కాస్తా పరిశుభ్రతతో కళకళలాడుతోంది.

సంగీత రాగాలతో 'రఘునాథాంజలి'



ఆకట్టుకున్న సంగీత కచేరి

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ హిందుస్తానీ శాస్త్రీయ సంగీత విద్వాంసులు పండిట్ రఘునాథ్ తలే గౌకర్‌ను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులు శాస్త్రీయ సంగీత రాగాలతో ఘనంగా అంజలి ఘటించారు. ఆదివారం ఆదర్శనగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో మృదుల ఫౌండేషన్, రఘునాథ్ తలే గౌకర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఆగ్రా సంయుక్త ఆధ్వర్యంలో రఘునాథాంజలి పేరిట సంగీత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గిరీంద్ర, ప్రతిభ, డాక్టర్ మేఘా, సుభ్ర తలే గౌకర్ చేసిన శాస్త్రీయ సంగీత కచేరి ఆకట్టుకుంది. కుటుంబం అంతా శాస్త్రీయ సంగీతంలో రాణించడం, సంగీత పరిరక్షణ, వికాసం కోసం కృషి చేయడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో బెనారస్ సంగీత విద్వాంసులు పండిట్ ఆశీష్ నారాయణ్ త్రిపాఠి, కూచిపూడి నాట్య కళాకారిణి డాక్టర్ సంఘమిత్ర, తబలా విద్వాంసులు టి.జైకిషన్, మృదుల ఫౌండేషన్ నిర్వాహకులు రవి, రఘునాథ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 2, జూన్, 2025





ప్రపంచవ్యాప్తంగా యువతను ఆకట్టుకుంటున్న తాజా డ్రింక్ సంచలనం.. బోబా టీ, లేదా బబుల్ టీ. తైవాన్‌లో పుట్టిన ఈ పానీయం ఇప్పుడు నగరంలోనూ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంటోంది. ఇటీవల బోబా టీ షాప్స్ ముంబయి, బెంగళూరు వంటి నగరాలతో పాటు నగరంలోనూ పెరుగుతున్నాయి. కాలేజీ యువత, వర్కింగ్ ప్రొఫెషనల్స్ దీనిని చల్లదనాన్నిచ్చే ఆహ్లాదకరమైన డ్రింక్‌గా ఎంజాయ్ చేస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

క్రేజీ ఫుల్.. బోబా బబుల్..

నగరంలో బోబా/బబుల్ టీ ట్రెండ్



- తైవాన్‌లో పుట్టిన పానీయానికి క్రేజ్
- వెరై'టీ' రుచికి నగర యువత ఫిదా
- ప్రముఖ నగరాల్లోని కేఫ్స్‌లో లభ్యం
- ఆకట్టుకుంటున్న కలర్ కాంబినేషన్స్



బోబా టీ అనేది టీ ఆధారిత పానీయం. అదే దీనికి ప్రత్యేకతను చేకూర్చే అంశం. టాపియోకా పెరల్స్ లేదా బోబా బాల్స్. ఇవి చిన్న గోళాకార బంతుల్లా ఉంటాయి. తీపిగా, కొద్దిగా చిక్కదనం ఉండే ఈ బంతులు టీతో కలిసినపుడు ఒక వినూత్న రుచిని జత చేస్తాయి. బోబా టీ కూడా బ్లాక్ టీ, గ్రీన్ టీ లేదా మిల్క్ టీ తరహాలోనూ వినియోగించవచ్చు. లేదా దీనికి పండ్ల ఫ్లేవర్స్, సిరప్‌లు, పాలు లేదా క్రీమ్‌లను కూడా కలుపుతారు. బోబా టీలో భాగంగా టాపియోకా బాల్స్ కాకుండా జెల్లీ, ఫ్రూట్ బిట్స్ వంటి వేరే రకాల టాపింగ్స్ కూడా వినియోగిస్తారు.

ఎన్నెన్నో.. వెరై'టీ'లు

బోబా టీ వివిధ రుచుల్లో మ్యాంగో, స్ట్రాబెర్రీ, చెరకు, కొబ్బరి వంటి అనేక ఫ్లేవర్లలో లభ్యమవుతోంది. ప్రత్యేకమైన టేక్–అవే గ్లాసులు, స్టైలిష్ స్ట్రా, బాల్స్ వల్ల యువత ఈ పానీయం పట్ల అధికంగా ఆసక్తి చూపిస్తున్నారు. ఆకట్టుకునే కలర్ కాంబినేషన్లు, ఆకర్షణీయమైన ప్రెజెంటేషన్ వల్ల బోబా టీ ఇన్‌స్టా, ఇతర సామాజిక మాధ్యమాల్లో రీల్స్‌ల ద్వారా బాగా పాపులర్ అయిపోయింది.

పోషక విలువలు..

కాసావా స్టార్చ్ లేదా సముద్రపు పాచి సారం నుండి తయారు చేసిన ఈ ముత్యాలు సహజంగా గ్లూటెన్ రహితమైనవి. పైగా పూర్తి శాకాహారం. కాసావా అనేది విటమిన్ 'సి' మంచి మూలం. ఇది వాపును తగ్గించే, కొల్లాజెన్ ఉత్పత్తికి మద్దతు ఇచ్చే యాంటీఆక్సిడెంట్. దీంతోపాటు ఫైబర్, విటమిన్ బి6 పుష్కలంగా లభిస్తుంది. ఇది మెదడు అభివృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు నాడీ వ్యవస్థ, రోగనిరోధక వ్యవస్థ మెరుగుదలకు సహకరిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.



ఆరోగ్యం సంగతేం 'టీ'..

బోబా టీ కాస్త అధికంగా తీపి పదార్థాలతో కూడినందున దీనిని అప్రమత్తంగా వినియోగించాలి. ఎందుకంటే దీనిలో అధిక క్యాలరీలు ఉంటాయి. అయితే కొంతమంది టాపియోకా బాల్స్‌ను, చక్కెరను తగ్గించి ఆరోగ్యకరమైన రీతిలో కూడా తయారు చేస్తున్నారు. దేశ వ్యాప్తంగా, నగరంలోనూ ఉన్న ప్రముఖ కేఫ్ చైన్ యమ్మీ బీ, బోబా టీకి కొత్త వెర్షన్‌ను తాజాగా మార్కెట్లోకి తెచ్చింది. ఆరోగ్యాభిలాషలను దృష్టిలో పెట్టుకుని షుగర్–ఫ్రీ బోబా టీని ఆన్‌లైన్ ద్వారా అందిస్తోంది. మ్యాంగో బోబా టీ, థాయ్ బోబా టీ, మాచా బోబా టీ.. వంటి పేర్లతో ఈ బోబా/బబుల్ టీ నగర ఆహార ప్రియుల అభి'రుచుల్లో' ఒకటిగా మారింది.





ఉత్సాహంగా 'లిటిల్ స్టెప్స్ బిగ్ డ్రీమ్స్' మారథాన్

టీవర్క్స్ వద్ద ప్రారంభం

రాయదుర్గం: సమాజ సేవా స్ఫూర్తిని చాటుతూ వీ వైబ్, అహంప్రాణ ఫౌండేషన్ కలిసి 'లిటిల్ స్టెప్స్ బిగ్ డ్రీమ్స్' పేరిట ప్రత్యేక మారథాన్ ఆదివారం నిర్వహించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్ వద్ద దీనిని ప్రారంభించారు. 5 నుంచి 12 ఏళ్ల లోపు పిల్లల కోసం ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ మారథాన్‌లో 900 మందికి పైగా చిన్నారులు, వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకులు రాగావీణ సజ్జా, ప్రవీణ్‌కుమార్ తంటెల్లా మాట్లాడుతూ సమాజ సేవా స్ఫూర్తిని చాటేందుకు వేగా జ్యువెలర్స్, సిడ్స్ ఫామ్ సంయుక్త సహకారంతో దీనిని ఏర్పాటు చేశామన్నారు. దసరా పర్వ దినాన్ని పురస్కరించుకుని తదుపరి కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. లిటిల్ స్టెప్స్ బిగ్ డ్రీమ్స్ మారథాన్ కేవలం సరదాగా సాగిన ఈవెంట్ మాత్రమే కాదని, విద్యా ప్రాముఖ్యతను, సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన అవసరాన్ని ప్రోత్సహించిన అర్థవంతమైన కార్యక్రమమని వివరించారు. కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

శికారాలో రోజా సందడి



సాక్షి, సిటీ బ్యూరో : ప్రముఖ సినీ నటి, మాజీ మంత్రి రోజా సెల్వమణి తమ కుమార్తెతో కలసి జూబ్లీహిల్స్ శిఖారా క్లినిక్‌ను ఆదివారం సందర్శించారు. ప్రస్తుతం వేగంగా అభివృద్ధి చెందుతోన్న రంగాల్లో బ్యూటీ, హెయిర్, ఏస్తటిక్స్ వంటివి ఉన్నాయని, దీంతో పాటు చర్మ సౌందర్యానికి ప్రజాదరణ పెరుగుతోందని అన్నారు. శిఖారా అందించే సర్వీసెస్‌ను సంస్థ సీఈఓ రాఘవేందర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆధునిక పద్ధతులు అందుబాటులోకి తెస్తే నగర యువత తప్పకుండా ఆదరిస్తారని ఆమె పేర్కొన్నారు.



ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లో తెలంగాణ డాక్టర్లు

ఆల్విన్‌కాలనీ: నగరంలోని కూకట్‌పల్లికి చెందిన 10 మంది డాక్టర్లతో కలిసి వివేకానందనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ వంశీ రెడ్డి నేపాల్ దేశం నుంచి ట్రెక్కింగ్ చేస్తూ ఎవరెస్ట్ బేస్ క్యాంపను చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ ఎవరెస్ట్ డేను పురస్కరించుకుని నేలమట్టం నుంచి ఎవరెస్ట్ బేస్ క్యాంప్ 5364 మీటర్లు ఎక్కి అక్కడి నుంచి కాలపత్తర్ 5555 మీటర్ల ఎత్తు ఎక్కామని తెలిపారు. ఎవరెస్ట్ డే సందర్భంగా చేరుకున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఎవరెస్ట్ బేస్ క్యాంప్ వద్ద భారత జాతీయ జెండాను ఎగరవేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కేదర్ వంశీదర్, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, డాక్టర్ కమలాకర్, డాక్టర్ పవన్, డాక్టర్ రమేష్, డాక్టర్ కృష్ణ, డాక్టర్ శివ, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

నాటికగా పీవీ 'గొల్ల రామవ్వ' కథ..

నేడు క్రియేటివ్ థియేటర్ ప్రదర్శన
తెలుగు విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహణ



సాక్షి, సిటీ బ్యూరో: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, క్రియేటివ్ థియేటర్, భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో సోమవారం సాయంత్రం 6:45 గంటలకు 'గొల్ల రామవ్వ' నాటికను ప్రదర్శించనున్నారు. ఈ నాటికకు మూలకథ స్వర్గీయ భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు రాసిన ప్రసిద్ధ కథ 'గొల్ల రామవ్వ'. గ్రామీణ నేపథ్య జీవితాల విశిష్టతను ప్రతిబింబించే ఈ కథను నాటికగా మలచి ప్రదర్శిస్తున్నారు. తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి వేదికగా ఈ కార్యక్రమం జరుగనుంది. క్రియేటివ్ థియేటర్ వ్యవస్థాపకులు అజయ్ మంకెనపల్లి ఆధ్వర్యంలో దీనిని ప్రదర్శించనున్నారు. నాటకరంగ అభిమానులు ప్రతి ఒక్కరూ హాజరై ఈ విలక్షణ నాటికను ఆస్వాదించాలని నిర్వాహకులు కోరుతున్నారు. ఈ నాటికలో తమ సంస్థ నుంచి పలువురు యువ థియేటర్ ఆర్టిస్టులు అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.




ప్రకృతితో అనుబంధం..

మంచిరేవుల ట్రెక్ పార్క్

మణికొండ: మంచిరేవుల ట్రెక్ పార్క్‌లో నిర్వహిస్తున్న డెక్కన్ వుడ్స్, ట్రైల్స్ పేరుతో నిర్వహిస్తున్న పర్యావరణ శిబిరాల్లో పాల్గొంటే ప్రకృతితో అనుబంధాన్ని పెంచుకోవచ్చని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఎకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ అన్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకూ మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్‌పార్క్‌లో నాక్టర్నల్ వాక్, నేచర్‌క్యాప్, బర్డ్‌వాక్ నిర్వహించారు. ఇందులో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 18 మంది ప్రకృతి ప్రేమికులు పాల్గొన్నారు. శనివారం సాయంత్రం ట్రెక్ పార్క్ ప్రత్యేకతలు, ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ప్రాచీన మీసోలిథిక్ శిలా చిత్రాలను పరిశీలించారు. రాత్రి సమయంలో క్యాంప్ ఫైర్, ప్రకృతి ఆధారిత ఆటలు, ఇంటరాక్టివ్ కార్యక్రమాలు, అడవిలో రాత్రిపూట నడక (నాక్టర్నల్ వాక్), క్యాంప్ డైనింగ్, గుడారాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం నేచర్‌క్యాంప్‌లో పక్షుల కిలకిల రావాలను వినడంతో పాటు కొండ చరియల మీదుగా ట్రెక్కింగ్, పక్షుల గుర్తింపు కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి శనివారం ఈ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. ఔత్సాహికులు 94935 49399, 98852 98980లో సంప్రదించాలన్నారు. క్యాంప్‌లో సహాయ డైరెక్టర్ వి.తనూజ, ప్లాంటేషన్ మేనేజర్ రాజేంద్రకుమార్, అటవీ రేంజ్ అధికారి ఎస్.శ్రీనివాస్, ప్రాజెక్ట్ మేనేజర్ కె.సుమన్, నేచురలిస్ట్ అఖిల్, అపరంజని పాల్గొన్నారు.







స్త్రీ సాధికారత దిశగా..

సాయి సమాజ్ ఛారిటబుల్ ట్రస్ట్ కృషి

మహిళలకు ఉపాధి శిక్షణ, సర్టిఫికెట్లు



గౌతంనగర్ : మహిళలు తమ కాళ్లపై నిలబడి.. స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదిగేందుకు దాదాపు దశాబ్దకాలంగా తోడ్పాటునందిస్తోంది సాయి సమాజ్ ఛారిటబుల్ ట్రస్ట్. ఎలాంటి లాభాపేక్ష లేకుండా స్త్రీల సాధికారతకు బాటలు వేస్తోంది. వందలాది మంది మహిళల ఆర్థిక ఆలంబనకు కృషి చేస్తోంది. స్త్రీ ఆర్థిక పురోగతి సాధించినప్పుడే ఆ కుటుంబం.. తద్వారా ఆ దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని నమ్మిన సిద్ధాంతం మేరకు ట్రస్ట్ సేవలు కొనసాగిస్తోంది. పేద, మధ్య తరగతి వర్గాల మహిళలకు కుట్టు మిషన్, మగ్గం వర్క్ (డిజైన్)లపై ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తూ చేయూతనందిస్తోంది. ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకూ 35 మంది మహిళలకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నారు. గత తొమ్మిది సంవత్సరాల్లో ఇప్పటి వరకూ 23 బ్యాచ్‌లకు పైగా శిక్షణ ఇచ్చామని ట్రైనర్ అనూష 'సాక్షి'తో చెప్పారు. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా వివిధ రంగాల్లో స్వయం ఉపాధి శిక్షణ తీసుకొని, ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లను ప్రధానం చేస్తామన్నారు.

ఉపాధి అవకాశాల్లో మెరుగుదల..



నిరుపేద మహిళలకు సొంతంగా ఉపాధి చేసుకోడానికి మొగ్గు చూపుతున్నారు. చీరలు, బ్లౌజులపై డిజైన్ వేయడానికి మగ్గం వర్క్ నేర్పిస్తున్నాం. దీంతో స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి.

– ఉమా, శిక్షకురాలు

తరగతులతో మేలు..



ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్, ఇతర మగ్గం, ఎంబ్రాయిడరీ వర్క్ పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోంది. అన్ని విధాలా శిక్షణ తీసుకొని మా సొంత కాళ్లపై నిలబడి ఉపాధి పొందేందుకు దోహదపడుతుంది.

– సంగీత, కుట్టుమిషన్ నేర్చుకున్న మహిళ

కుట్టుమిషన్‌పై శిక్షణ..

సాయి సమాజ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలకు కుట్టుమిషన్‌లో బ్లౌజులు, పలు రకాల పంజాబీ డ్రెస్సులపై శిక్షణ ఇస్తాం. మహిళలకు శిక్షణ ఇచ్చి మూడు నెలల తర్వాత సర్టిఫికెట్లను అందజేస్తాం.

– అనుష, శిక్షకురాలు





ఓపల్ సుచాతా.. మోడల్, థాయ్‌లాండ్.. తొలి మిస్ వరల్డ్...
ఇప్పుడు 72వ మిస్ వరల్డ్!
థాయ్‌లాండ్‌కి చెందిన ఆమె క్యాన్సర్ ఫ్రీ ప్రపంచం కోసం
పాటుపడుతోంది! దానికో కారణం ఉంది.
పదహారవ ఏట ఆమెకు బ్రెస్ట్ ట్యూమర్ సర్జరీ అయింది.
అది తన జీవనోద్దేశాన్ని, లక్ష్యాన్నే మార్చింది అంటున్న
ఓపెల్ సుచాతా గురించి మరిన్ని విషయాలు
ఆమె మాటల్లోనే..



హాసెట్ డెరెజె అద్మస్సు, ఓపెల్ సుచాతా, మాజా క్లాజ్డా

72 ఏళ్ల మా కల నెరవేరింది!



మిస్ వరల్డ్ ఓపల్ సుచాతా

“నేను పుట్టి పెరిగింది థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో. మా ఊరూ హైదరాబాద్‌లాగే పర్ల్ సిటీ! హైస్కూల్ కోసం బ్యాంకాక్‌కి మూవ్ అయ్యాను. సైకాలజీ, ఆంత్రోపాలజీ నాకు ఇష్టమైన సబ్జెక్ట్స్. ప్రస్తుతం నేను అంబాసిడర్ కావాలనే ధ్యేయంతో ఇంటర్నేషనల్ రిలేషన్స్ చదువుతున్నాను.. మా కుటుంబ విషయానికి వస్తే అమ్మ, పెద్దమ్మలు, అత్తలు .. అందరూ స్ట్రాంగ్ పర్సన్సే. ఒకరకంగా చెప్పాలంటే నేను స్ట్రాంగ్ విమెన్ మధ్యలో పెరిగాను. ఆ వాతావరణమే నాకు స్ఫూర్తి. ఆ స్ట్రెంతే నా పదహారవ ఏట బ్రెస్ట్‌లో డిటెక్ట్ అయిన ట్యూమర్‌తో ఫైట్ చేసేలా చేసింది. అది క్యాన్సర్ ట్యూమర్ కాదు. అయినా చాలా భయపడ్డాను. ఆ భయాన్నుంచి ఓ ఉద్దేశం కోసం ప్రయాణించేలా చేసింది నా చుట్టూ ఉన్న మహిళల స్ట్రెంతే! సర్జరీ తర్వాత ఈ హర్డిల్‌ని గనుక దాటగలిగితే నా జీవితాన్ని బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్నెస్ కార్యక్రమాలకు అంకితం చేయాలనుకున్నాను. లక్కీగా దాటాను. దాంతో అనుకున్నట్టుగానే ‘ఓపల్ ఫర్ హర్’ ప్రాజెక్ట్‌తో బ్రెస్ట్‌క్యాన్సర్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌ను స్టార్ట్ చేశాను. మహిళా సాధికారతకూ పాటుపడుతున్నాను. ఈ బ్యూటీ పాజెంట్‌లో నేను పాల్గొనడానికి ప్రేరణ కూడా అదే. బ్యూటీ విత్ ఎ పర్పస్ అనే రౌండ్‌తో ఈ మిస్ వరల్డ్ బ్యూటీ పాజెంట్ మన కథను ప్రపంచానికి వినిపించే అవకాశాన్ని కల్పిస్తోంది. అందుకే ఈ పాజెంట్‌లో పాల్గొన్నాను. నా కథను షేర్ చేసుకుని, నా ప్రాజెక్ట్ ద్వారా నేను చేస్తున్న కార్యక్రమాలను వివరించి బ్రెస్ట్ క్యాన్సర్ మీద మహిళలకే కాదు జెండర్స్‌కి అతీతంగా అందరికీ అవగాహన కల్పించాలనుకున్నాను.

తోటి కంటెస్టెంట్లందరి ఆలోచనలూ పంచుకుంటాను

మిస్ వరల్డ్ హోదాలో నేను ప్రపంచమంతా పర్యటించగలిగే అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా ప్రపంచమంతటా నా ప్రాజెక్టుల గురించి చెప్పుకోగలను. అయితే నాకు నా తోటి కంటెస్టెంట్లందరి ఆలోచనలూ, ప్రాజెక్టులూ కూడా చాలా నచ్చాయి. నాకు వీలున్నంతవరకు నేను అందరి ఆలోచనలూ, ప్రాజెక్టులనూ కూడా అన్ని వేదికలమీదా పంచుకుంటాను.

క్రౌన్‌తో మా దేశానికి వెళుతున్నందుకు సంతోషంగా ఉంది

నా బ్యూటీ పాజెంట్ జర్నీ నా పద్దెనిమిదవ ఏట మొదలైంది. మొదటిసారి నేను గెలవలేదు. తర్వాత రెండేళ్లకు మళ్లీ నేషనల్ బ్యూటీ పాజెంట్‌లో పాల్గొన్నాను. గెలిచాను. మిస్ వరల్డ్‌కి ఎంపికయ్యాను. బ్యూటీ విత్ ఎ పర్పస్‌తో విన్ అయ్యి.. మిస్ వరల్డ్ క్రౌన్‌తో మీ ముందుకు వచ్చాను. నిజానికి ఇది మా దేశం 72 ఏళ్లుగా కంటున్న కల. ఆ కల నా ద్వారా సాకారం అయినందుకు, నేను మిస్ వరల్డ్ క్రౌన్‌తో మా దేశానికి వెళ్లగలుగుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ పాజెంట్ నా లెర్నింగ్ అన్ లెర్నింగ్ ప్రాసెస్‌కు ఓ వేదికైంది. భిన్నదేశాలు, విభిన్నమైన సంస్కృతి, సంప్రదాయాలకు చెందిన నా తోటి కంటెస్టెంట్స్ నుంచి చాలా నేర్చుకున్నాను. ఎక్స్ఛేంజ్ ఆఫ్ వ్యూస్, ఒపీనియన్స్, నాలెడ్జ్ షేరింగ్‌తో కొత్త విషయాలను తెలుసుకోగలిగాను. నా ఆలోచనా తీరూ మారింది. నా పర్సెప్షన్ బ్రాడ్ అయింది.

అన్నీ అద్భుతం

తెలంగాణ రావడం ఇదే మొదటిసారి. ఇక్కడి మహిళలు చాలా వైబ్రెంట్‌గా ఉన్నారు. వాళ్ల కట్టుబొట్టు తీరు, ఇక్కడి ఫుడ్, కల్చర్, ఆతిథ్యం అన్నీ అద్భుతం. నేను జ్యూయలరీ ఫ్యాన్‌ని. అందుకే నాకు హైదరాబాద్ బాగా నచ్చింది. ముత్యాలే కాదు సంప్రదాయ, ఫ్యాషన్ జ్యుయలరీకి ఫ్యూజన్‌లా ఉందీ ప్రాంతం. నేను చూసిన ఈ అద్భుతాన్ని మా వాళ్లకు చెప్పాలనుకుంటున్నాను. అంతేకాదు, ఇక్కడ నన్ను ఇన్‌స్పైర్ చేసిన కథలు చాలా ఉన్నాయి. వాటినీ మావాళ్లకు షేర్ చేసుకోవాలనుకుంటున్నాను. మాటల కన్నా చేతలతోనే అవతలి వాళ్లకు ప్రేరణగా నిలవాలనుకుంటాను. మన పక్కనున్న వాళ్లకు ఓ భరోసాగా నిలవాలనుకుంటాను. నన్ను నేను అలా మలచుకోవడానికే ప్రయత్నిస్తాను'' అని చెప్పింది ఈ మిస్ వరల్డ్.

– సరస్వతి రమ

ఫోటోలు: ఎస్.ఎస్. ఠాకూర్

సమానత్వం.. సాధికారత సాధిస్తా!

ఫస్ట్ రన్నర్–అప్ హాసెట్ డెరెజె అద్మస్సు (ఇథియోపియా)



హాసెట్ డెరెజె అద్మస్సు రెండవ స్థానంలో నిలిచి మిస్ వరల్డ్ చరిత్రలో అత్యున్నత ర్యాంకింగ్ సాధించింది. ఇథియోపియా దేశం తరపున ప్రాతినిధ్యం వహించిన ఈ అందాల భామ, ఫస్ట్ రన్నర్–అప్‌గా , మిస్ వరల్డ్ ఆఫ్రికా టైటిల్‌ను గెలుచుకున్నారు. కెమికల్ ఇంజినీరింగ్ చేస్తున్న పంతొమ్మిదేళ్ల హాసెట్ దక్షిణాఫ్రికాలో జరిగిన మిస్ టీన్ ఇథియోపియా, కిందటేడాది మిస్ వరల్డ్ ఇథియోపియా పోటీలో విజేతగా నిలిచారు. ఇథియోపియాలోని మహిళల విద్య, ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆమె సమాజంలో సానుకూల మార్పులు తీసుకు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గ్రామీణ సమాజాలలో తల్లీబిడ్డల ఆరోగ్యం, బాలికల విద్యపై దృష్టి సారించిన ఆమె ''బ్యూటీ విత్ ఎ పర్పస్'' ప్రాజెక్ట్ న్యాయమూర్తులను, ప్రేక్షకులను ఆకట్టుకుంది.

నా పనే నా కిరీటం

కిరీటం మరొకరికి వెళ్లచ్చు. కానీ, నా అంతర్గత అందం నేను చేసే పనిపైనే ఉంటుంది. అదే నాకు కిరీటం. స్థానికంగా, అంతర్జాతీయంగా ఆరోగ్య సమానత్వం, లింగ సాధికారత కోసం ఒక గొంతుకగా పనిచేస్తాను. ఈ పోటీలలో పాల్గొనడం ద్వారా భారతీయ సంప్రదాయ, సాంస్కృతిక పరిమళాన్ని అర్థం చేసుకున్నాను. ఆస్వాదించాను. ఈ ఫీలింగ్ చాలా సంతోషంగా ఉంది. ఓపా గురించి చెప్పాలంటే తను చాలా హార్డ్ వర్కర్. నేను తనకు చాలా పెద్ద అభిమానిని. తనకు కిరీటం దక్కినందుకు చాలా సంతోషంగా ఉంది. తనలో భిన్నమైన క్వాలిటీస్ ఉన్నాయి. నిజానికి అందం అంటే అందరూ అనుకుంటున్నట్టు చర్మం, జుట్టు, గోళ్లు, డ్రెస్సింగ్.. ఇవి కావు. మన చుట్టూ ఉన్న సమాజం కోసం పనిచేయడమే. మా పేరెంట్స్ నా ఎదుగుదల కోసం ఎంతో కృషి చేశారు. నా ఈ విజయానికి నా కుటుంబ మద్దతు ఎంతో ఉంది.

మానసిక ఆరోగ్యంపై అవగాహన కోసం...

ఇథియోపియాలో మానసిక ఆరోగ్యంపై ప్రజలలో అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నాను. మాయా చారిటబుల్ ఆర్గనైజేషన్ కు అంబాసిడర్‌గా ఉంటూ ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్నాను. మిస్ వరల్డ్ అనేది కేవలం అందానికి సంబంధించినది మాత్రమే కాదు. నా దేశం నుంచి ఈ స్థాయికి చేరిన తొలి ఇథియోపియన్ నేనే. మిస్ వరల్డ్ ఒక లక్ష్యాన్ని చేరుకోవడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమం, ఇది ప్రపంచవ్యాప్తంగా తల్లులు, వారి పిల్లల జీవితాలలోనూ స్ఫూర్తి నింపేది'' అని చెప్పారు.

అందమైన అనుభవాలు అద్భుతమైన జ్ఞాపకాలు

సెకండ్ రన్నర్ – అప్ మిస్ పోలాండ్ మాజా క్లాజ్డా



2024లో మిస్ పోలోనియా కిరీటాన్ని గెలుచుకున్న మాజా క్లాజ్డా ఈ ఏడాది మిస్ వరల్డ్ ఫైనల్‌లో సెకండ్ రన్నరప్‌గా నిలిచింది. అందం, తెలివితేటలు, సమతుల్యతతో న్యాయనిర్ణేతలను, ప్రేక్షకులను ఆకర్షించింది. ఆమె బ్యూటీ విత్ ఎ పర్పస్ చొరవ, నేటి అత్యంత ముఖ్యమైన సమస్యలలో ఒకటైన పిల్లలు, యుక్తవయస్కుల మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. మానసిక అనారోగ్య నివారణ, భావోద్వేగ సంఘర్షణలపై దృష్టి సారించి, 40 కి పైగా వర్క్‌షాప్‌లను నిర్వహించింది. మానసిక శ్రేయస్సు గురించి యువత తమను తాము, తమతో ఉన్న వారిని ఒకరినొకరు బాగా అర్థం చేసుకోవడానికి ఈ వర్క్‌షాపులు ఉపకరిస్తున్నాయి. మనస్తత్వశాస్త్ర విద్యార్థిగా, మాజా టీనేజర్లతో వారి స్వంత భాషలో కనెక్ట్ అవుతుంది. సామాజిక బహిష్కరణ ప్రమాదంలో ఉన్న పిల్లలకు మద్దతు ఇచ్చే గ్రోయింగ్ అప్ జోన్ ఫౌండేషన్‌కు చెందిన 12 ఏళ్ల బాలుడి కలను మాజా ఇటీవల నెరవేర్చింది. ఆమె అతన్ని బార్సిలోనాలో జరిగే లైవ్ మ్యాచ్‌కు హాజరు కావడానికి బార్సిలోనాకు తీసుకువెళ్లింది. అతని జీవితకాల కోరికను నెరవేర్చింది.

సంతృప్తికరమైన అనుభవాలు

నేను పొందిన గొప్ప విజయాల్లో ఒకటి చిన్నచూపును అధిగమించడం. మొదట్లో నలుగురితో కలవాలంటే చాలా సిగ్గుపడేదాన్ని. దానిని దాటి ఈ దశకు వచ్చాను. ప్రజలతో కలిసిపోవడం, వారితో మాట్లాడుతూ ఉండటం అంటే నాకు ఇష్టం. కిరీటం దక్కకపోయినా అంతకు మించిన అనుభవాలు నాకు అద్భుతమైన జ్ఞాపకాన్ని ఇచ్చాయి. ఇక్కడి ఆతిథ్యం నాకు మా ఇంటిని గుర్తు చేసింది. ఇది నా రెండో కుటుంబంలా అనిపించింది. మెడికల్ టూరిజంలో భాగంగా ఏఐజీ హాస్పిటల్‌కి వెళ్లినప్పుడు వారి ఆప్యాయత నన్ను ఆకట్టుకుంది. వారు ఎంతో బాధలో ఉండి కూడా చిరునవ్వుతో మాకు ఆహ్వానం పలికారు. ముచ్చటించారు. అది నా జీవితంలో మరచిపోలేను. ఇక్కడ ప్రతి ఒకరికి మరొకరితో ఉన్న కనెక్టివిటీ, రిలేషన్స్ చాలా బాగున్నాయి'' అంటూ తెలంగాణలో మిస్ వరల్డ్ పాజెంట్ జరిగిన తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసింది మాజా క్లాజ్డా

– నిర్మలారెడ్డి


సాక్షి సినిమా

కదన రంగంలో...



● నిఖిల్, సంయుక్త

‘కార్తికేయ 2’ వంటి పాన్ ఇండియా హిట్ తర్వాత నిఖిల్ నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం ‘స్వయంభు’. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్నారు. ఆదివారం (జూన్ 1) నిఖిల్ బర్త్ డే. ఈ సందర్భంగా కదన రంగంలో యుద్ధం చేస్తున్నట్లుగా ఉన్న నిఖిల్, సంయుక్త పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. నిఖిల్ కత్తి పట్టుకుని యోధుడిలా పవర్‌ఫుల్‌గా కనిపించగా, సంయుక్త విల్లు పట్టుకుని ఉన్నారు. ''హిస్టారికల్ యాక్షన్ ఎపిక్ మూవీగా ‘స్వయంభు’ ఓ వినూత్న అనుభూతిని ప్రేక్షకులకు ఇచ్చేలా ఉంటుంది. ఈ చిత్రం కోసం నిఖిల్ ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు'' అని చిత్రబృందం పేర్కొంది.



సూపర్ థ్రిల్లర్

సుధీర్ బాబు హీరోగా రూపొందించిన పాన్ ఇండియన్ చిత్రం ‘జటాధర’. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సోనాక్షీ సిన్హా, శిల్పా శిరోద్కర్, రాజీవ్ కనకాల, ‘శుభలేఖ’ సుధాకర్, ఝాన్సీ ఇతర పాత్రలు పోషించారు. ప్రేరణ అరోరా, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్ తెలుగు, హిందీ భాషల్లో నిర్మించారు. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. కాగా... మే 31 సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ‘హ్యాపీ బర్త్‌డే టు ది కింగ్ ఆఫ్ చర్మిష్మా’ అంటూ శివుడి పాత్రధారిగా ఉన్న కృష్ణ లుక్‌ని ‘జటాధర’ యూనిట్ విడుదల చేసి, ఆయనకు నివాళులు అర్పించింది. ''సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. అభిమానులు, ప్రేక్షకులకు ఈ సినిమా ఓ గొప్ప అనుభూతినిచ్చేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ తెలిపింది.



● రవళి, అచ్చిరెడ్డి, ఆమని, రోజా, ఎస్వీ కృష్ణారెడ్డి, ఇంద్రజ, లయ

నేను వారికి ప్రత్యేకంగా చేసిందేమీ లేదు - ఎస్వీ కృష్ణారెడ్డి

''నా సినిమాల ద్వారా ఎందరో ప్రతిభావంతులకు అవకాశాలు ఇచ్చానని చెబుతున్నారు. కానీ వాళ్లందరూ స్వతహాగా ప్రతిభ ఉన్నవారు. నా చిత్రాల ద్వారా వారి ప్రతిభ ప్రేక్షకులకు మరింతగా తెలిసింది. అంతేకానీ నేను వారికి ప్రత్యేకంగా చేసిందేమీ లేదు'' అని దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం (జూన్ 1) హైదరాబాద్‌లో ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– ''నన్ను మొదటి నుంచీ ప్రోత్సహిస్తూ, అండగా నిలబడిన నిర్మాత అచ్చిరెడ్డిగారికి కృతజ్ఞతలు. దర్శకుడిగా నాకు తొలి చాన్స్ ఇచ్చిన హీరో రాజేంద్రప్రసాద్‌గారికి థ్యాంక్స్'' అన్నారు. నటి, మాజీ మంత్రి రోజా మాట్లాడుతూ– ''కృష్ణారెడ్డిగారి దర్శకత్వంలో చేసిన ‘శుభలగ్నం’ చిత్రం నా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది. భర్తను కోటి రూపాయలకు అమ్మే అలాంటి ఘటనలు ఈ రోజు సమాజంలో జరుగుతున్నాయి. అంటే ఆయన సృజనాత్మకతలో ఎంత ముందు చూపు ఉందో ఊహించుకోవచ్చు'' అని తెలిపారు. ఈ వేడుకల్లో మురళీ మోహన్, బ్రహ్మానందం, శ్రీకాంత్, తనికెళ్ల భరణి, రాజేంద్ర ప్రసాద్, అలీ, బండ్ల గణేశ్, లయ, ఇంద్రజ, ఆమని, సుచిత్రాచంద్రబోస్ తదితరులు పాల్గొని, ఎస్వీ కృష్ణారెడ్డితో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

కామెడీ... మిస్టరీ



● కేఎస్‌కే చైతన్య, సునీత, రాజ్‌కుమార్ బృందావనం

‘మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్’ చిత్రాల ఫేమ్ సంగీత్ శోభన్ హీరోగా, ప్రశాంతి చారులింగా హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘గ్యాంబ్లర్స్’. కేఎస్‌కే చైతన్య దర్శకత్వం వహించారు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో కేఎస్‌కే చైతన్య మాట్లాడుతూ– ''కామెడీ, మిస్టరీ, ఎమోషన్... ఇలా అన్ని వాణిజ్య అంశాలతో రూపొందిన చిత్రం ‘గ్యాంబ్లర్స్’. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు ఓ కొత్త లోకంలో ఉంటారు. వారికి సరికొత్త అనుభూతినిస్తుంది'' అన్నారు. ''వైవిధ్యమైన కథతో ‘గ్యాంబ్లర్స్’ తీశాం'' అని రాజ్‌కుమార్ బృందావనం తెలిపారు. సునీత మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. సంగీత్ శోభన్ నటన చాలా కొత్తగా ఉంటుంది. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ మా చిత్రాన్ని నైజాంలో విడుదల చేస్తోంది'' అని చెప్పారు.

మేఘాలు చెప్పిన ప్రేమ కథ



● విపిన్, ఉమాదేవి కోట

నరేష్ అగస్త్య, రబియా ఖాతూన్ జోడీగా నటించిన చిత్రం ‘మేఘాలు చెప్పిన ప్రేమ కథ’. విపిన్ దర్శకత్వంలో ఉమాదేవి కోట నిర్మించారు. ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో విపిన్ మాట్లాడుతూ– ''క్లీన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. మా సినిమాలో సంగీత విద్వాంసులు ప్రిన్స్ రామవర్మ, ట్రావెల్ కోర్ వారసులు అతిథి పాత్రలు చేశారు'' అన్నారు. ఉమాదేవి కోట మాట్లాడుతూ– ''నాకు కథలు రాయడం ఇష్టం. నా జీవితంలో కె. విశ్వనాథ్, సిరివెన్నెల సీతారామ శాస్త్రిగార్లను కలవడం ఓ భాగ్యం. ఇంట్లో వాళ్ల సపోర్ట్‌తో ఈ బ్యానర్‌ని స్థాపించా. ప్రతి సినిమాలో కళని కనెక్ట్ చేయాలనేది నా ఆశ. అందుకే ‘మేఘాలు చెప్పిన ప్రేమ కథ’ని సంగీతానికి ప్రాధాన్యం ఇచ్చేలా తీశాం. ఈ సినిమాను సిరివెన్నెల గారికి అంకితం ఇస్తున్నాం'' అన్నారు. ''పాటలు చక్కగా వచ్చాయి'' అన్నారు సంగీత దర్శకుడు జస్టిన్ ప్రభాకర్. కెమేరామేన్ మోహన్ కృష్ణ మాట్లాడారు.

త్వరలో సైకి



● మురళీ కృష్ణంరాజు, శ్రుతీ శెట్టి

''‘సైకి’లో ప్రతిభ గల టీమ్‌తో వర్క్ చేయడం హ్యాపీగా ఉంది. మంచి కథతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు మురళీ కృష్ణంరాజు. పృథ్వీ పెరిచెర్ల దర్శకత్వంలో మురళీ కృష్ణంరాజు, శ్రుతీ శెట్టి జంటగా నటించిన సినిమా ‘సైకి’. నాగిరెడ్డి గుంటక, పృథ్వీ పెరిచెర్ల, శ్రీలక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజు నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్ విడుదల వేడుకలో పృథ్వీ పెరిచెర్ల మాట్లాడుతూ– ''డైరెక్టర్‌గా నాకు ఇది తొలి చిత్రం. ‘సైకి’ ప్రీమియర్ చూసినవారు చాలా బాగుందని చెప్పారు. మా సినిమాని ఆదరిస్తే ఇలాంటి మంచి కథలు తెరపైకి తెచ్చే ప్రయత్నం చేస్తూనే ఉంటాం'' అన్నారు. ''ఒక కాంపాక్ట్ బడ్జెట్‌లో పర్ఫెక్ట్‌గా ఒక మూవీ చేస్తే ఎలా ఉంటుంది అనేందుకు మా ‘సైకి’ ఓ ఉదాహరణ'' అని సినిమాటోగ్రాఫర్ రసూల్ ఎల్లోర్ చెప్పారు.

పాడేరులో సస్పెన్స్



● ‘సత్యం’ రాజేశ్

‘సత్యం’ రాజేశ్, శ్రవణ్, ‘బాహుబలి’ ప్రభాకర్, సుహాన ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ‘పాడేరు 12వ మైలు’. ఎస్.కె. దర్శకత్వంలో సాయి లక్ష్మీ గణపతి మూవీ క్రియేషన్స్‌పై గ్రంధి త్రినాథ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఎస్.కె. మాట్లాడుతూ– ''ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ మోదకొండమ్మ తల్లి ఆశీస్సులతో ఈ చిత్రం తీశాం. సస్పెన్స్ అండ్ లవ్ అంశాలతో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులకు నచ్చుతుందని నమ్ముతున్నాను'' అన్నారు. గ్రంధి త్రినాథ్ మాట్లాడుతూ– ''డైరెక్టర్, యాక్టర్స్ అందరూ సపోర్ట్ చెయ్యడంతోనే మా సినిమా బాగా వచ్చింది. టీజర్, సాంగ్స్‌కి మంచి స్పందన వచ్చింది. సినిమా కూడా ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది'' అని చెప్పారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽ 182	నిఫ్టీ ▽ 83
81,451	24,751

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	19,114	▽	62
డోజోన్స్	42,270	△	54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,772	△	56
డాక్స్	23,997	△	64
షాంఘై	3,347	▽	16
నికాయ్	37,965	▽	468

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.90	85.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.60	116.52
€	యూరో	ఎస్‌బీఐ	95.61	98.31
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.60	60.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.80	56.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.00	68.68
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.93	23.43
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.41	24.19
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83

రిటర్నుల దాఖలుకు రెడీనా..?

ఐటీఆర్ పత్రాల్లో పలు మార్పులు

- సెప్టెంబర్ 15 వరకు అదనపు గడువు
- మూలధన లాభాలను సమగ్రంగా వెల్లడించాలి
- ఆధార్ ఉంటేనే రిటర్నుల సమర్పణ సాధ్యం
- డిజిటల్ రూపంలో ఫారమ్ 16
- షేర్ల బైబ్యాక్ ఆదాయంపై పన్ను



సాక్షి, బిజినెస్ డెస్క్

ఆదాయపన్ను రిటర్నులు దాఖలు చేసే వారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది. గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో 6.47 కోట్ల నుంచి 8.39 కోట్లకు రిటర్నులు పెరిగాయి. పెరుగుతున్న అవగాహన, ఆదాయపన్ను శాఖ విస్తృత ప్రచారం ఇందుకు మద్దతుగా నిలుస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (అసెస్‌మెంట్ సంవత్సరం 2025–26) ఆదాయపన్ను రిటర్నుల పత్రాలను ఆదాయపన్ను శాఖ నోటిఫై చేసింది. వీటిల్లో కొన్ని కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. వీటి ఫలితంగా అదనపు వివరాలు నమోదు చేయాల్సి వచ్చింది. వీటితోపాటు.. ఆదాయన్ను రిటర్నుల పత్రాల ఎంపిక విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తప్పకుండా తెలుసుకోవాలి.

ఐటీఆర్ 1, 4లో మార్పులు

ఐటీఆర్ 1, 4 పత్రాల దాఖలుకు మరింత మందికి అర్హత లభించింది. ఈక్విటీ, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై దీర్ఘకాల మూలధన లాభం కలిగిన వారు సైతం వీటిని దాఖలు చేయవచ్చు. కాకపోతే మూలధన లాభం ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 లక్షలు మించకూడదు. ''ముందు సంవత్సరాల్లో సెక్షన్ 112ఏ కింద దీర్ఘకాల మూలధన లాభం (ఎల్‌టీసీజీ) పన్ను మినహాయింపు పరిధిలోనే ఉన్నప్పటికీ ఐటీఆర్–1 ఫారమ్‌కు అర్హత ఉండేది కాదు. దీనికి బదులు ఐటీఆర్–2 లేదా 3 దాఖలు చేయాల్సి వచ్చేది. ఇవి మరింత సంక్లిష్టంగా ఉండడంతో అధిక సమయం పట్టేది. చిన్న పన్ను చెల్లింపుదారులకు శ్రమ తగ్గించే ఉద్దేశ్యంతో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ (సీబీడీటీ) ఐటీఆర్–1, 4 పరంగా అర్హత ప్రమాణాలను సవరించింది. మొత్తం ఎల్‌టీసీజీ రూ.1.25 లక్షలు మించనప్పుడు, మూలధన నష్టాలను క్యారీఫార్వార్డ్ (తదుపరి సంవత్సరాలకు బదిలీ) చేసుకోవాల్సిన అవసరం లేని వారు ఐటీఆర్ 1, 4 దాఖలు చేసుకునేందుకు అనుమతించింది''అని ట్యాక్స్‌మన్ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ నవీన్ వాద్వా తెలిపారు. ఒకవేళ దీర్ఘకాల మూలధన లాభం రూ.1.25 లక్షలకు మించినా లేదా మూలధన నష్టాలను క్యారీ ఫార్వార్డ్ చేసుకోవాల్సిన అవసరం ఉన్న వారు ఇంతకుముందు మాదిరే ఐటీఆర్ 2 లేదా 3లో నిబంధనల ప్రకారం తమకు అనుకూలమైన దానిని ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రూ.1.25 లక్షల వరకు మూలధన లాభంపై ఎలాంటి పన్ను లేకపోవడంతో ఈ వెసులుబాటు లభించింది.

ఆధార్ నంబర్ ఉండాల్సిందే..



ఐటీఆర్ 1, 2, 3, 5 పత్రాల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీ కాలమ్‌ను తొలగించారు. ఇంతకుముందు వరకు ఆధార్ లేకపోయినా ఆధార్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎన్‌రోల్‌మెంట్ నంబర్‌తో ఐటీఆర్ దాఖలు చేసుకునే అవకాశం ఉండేది. అసెస్‌మెంట్ సంవత్సరం (ఏవై) 2025–26 ఐటీఆర్‌లు దాఖలు చేయాలంటే కచ్చితంగా ఆధార్ నంబర్ ఉండాల్సిందే. లేదంటే ఐటీఆర్ దాఖలు చేయలేరని వాద్వా తెలిపారు.

వ్యాపారులైతే అదనపు వివరాలు

వ్యాపార ఆదాయం, వృత్తిపరమైన ఆదాయం ఉన్న వారు ఒక విధానం నుంచి మరో విధానానికి ఏటా మళ్లేందుకు అవకాశం లేదు. వీరు ఒక్కసారి కొత్త విధానాన్ని ఎంపిక చేసుకుంటే, జీవిత కాలంలో తిరిగి ఒక్కసారే పాత విధానానికి మళ్లేందుకు అనుమతిస్తారు. ''గతేడాది ఐటీఆర్ 4 పత్రం కొత్త పన్ను విధానం నుంచి తప్పుకున్నారా? అని మాత్రమే అడిగేది. అవును అని బదులిస్తే ఫారమ్ 10–ఐఈఏ అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ ఇవ్వాల్సి వచ్చేది. ఏవై 2025–26 ఐటీఆర్–4లో మాత్రం మరిన్ని వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఫారమ్ 10–ఐఈఏ గత ఫైలింగ్‌ల ధ్రువీకరణలను సైతం సమర్పించాల్సి ఉంటుంది. ప్రస్తుత సంవత్సరంలోనూ కొత్త పన్ను విధానం నుంచి తప్పుకోవాలని అనుకుంటున్నారా? అనే ధ్రువీకరణ సైతం ఇవ్వాలి''అని వాద్వా తెలిపారు.

టీడీఎస్ వివరాలు

ఈ ఏడాది ఐటీఆర్ 1, 2, 3, 5లో టీడీఎస్ కాలమ్‌లో.. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏ ఆదాయం నుంచి టీడీఎస్ మినహాయించారన్న వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. వేతనం కాకుండా ఇతర ఆదాయంపై టీడీఎస్ మినహాయించినట్టయితే ఆ వివరాలు నమోదు చేయడం తప్పనిసరి అని వాద్వా తెలిపారు.

మూలధన నిబంధనల్లో మార్పులు

2024 బడ్జెట్‌లో స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభాల నిబంధనల్లో మార్పులు చేశారు. ఇవి 2024 జూలై 23 నుంచి అమల్లోకి వచ్చాయి. దీంతో గత ఆర్థిక సంవత్సరంలో లిస్టెడ్ షేర్లు లేదా అన్‌లిస్టెడ్ షేర్లు, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్, ఇల్లు, భూమి లేదా ఇతర క్యాపిటల్ అసెట్‌లను విక్రయించినట్టయితే.. అవి ఏ తేదీన విక్రయించారన్న దాని ఆధారంగా పన్ను బాధ్యతలను వేర్వేరుగా మదింపు వేసుకోవాలి. 2024 జూలై 23కు ముందు విక్రయించినట్టయితే ఒక రేటు, ఆ తర్వాత విక్రయించిన వారికి మరొక రేటు వర్తిస్తుంది. ఐటీఆర్ పత్రాల్లో 2024 జూలై 23కు ముందు, ఆ తర్వాత లావాదేవీల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలి. ఈక్విటీ, డెట్ సెక్యూరిటీలపై వేర్వేరు రేట్ల ప్రకారం పన్ను చెల్లించాలి. మూలధన లాభం ఉంటే ఐటీఆర్ 2, 3 లేదా 5లో నిబంధనల ప్రకారం తమకు సరిపోయే పత్రాన్ని దాఖలు చేయాలి.

అన్‌లిస్టెడ్ బాండ్లు, డిబెంచర్లపై లాభం

అన్‌లిస్టెడ్ బాండ్లు, డిబెంచర్లపై మూలధన లాభాలను ఈ ఏడాది ఐటీఆర్ పత్రాల్లో ప్రత్యేకంగా వెల్లడించాల్సి ఉంటుంది. 2024 జూలై 23 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ''వీటి ప్రకారం.. అన్‌లిస్టెడ్ డిబెంచర్లు లేదా బాండ్లు 2024 జూలై 22 లేదా అంతకుముందు ఇష్యూ చేసి ఉంటే, వాటి గడువు ముగింపు లేదా విక్రయం లేదా బదిలీ 2024 జూలై 23 లేదా ఆ తర్వాత జరిగితే.. ఆ మొత్తాన్ని స్వల్పకాల మూలధన లాభం కిందే పరిగణిస్తారు. ఎంతకాలం పాటు కొనసాగించారన్న దానితో సంబంధం లేదు. ఈ ఆదాయాన్ని తమ వార్షిక ఆదాయానికి కలిపి నిబంధనల మేరకు పన్ను చెల్లించాలి. 2024 జూలై 23కు ముందు ఇన్వెస్ట్ చేసి, ఆలోపే విక్రయించినట్టయితే అప్పుడు దీర్ఘకాల మూలధన లాభం కింద 20 శాతం పన్ను చెల్లించాలి''అని వాద్వా వివరించారు. అన్‌లిస్టెడ్ బాండ్లు, డిబెంచర్లలో పెట్టుబడులు కలిగిన వారు ఐటీఆర్ 2, 3 లేదా 5 ద్వారా వెల్లడించాల్సి ఉంటుంది.

బైబ్యాక్ సైతం డివిడెండే



2024 అక్టోబర్ 1 నుంచి లిస్టెడ్ కంపెనీలు చేపట్టే షేర్ల బైబ్యాక్‌లో పాల్గొని, ఆదాయం అందుకుంటే ఆ మొత్తాన్ని డివిడెండ్ కిందే పరిగణిస్తారు. 'ఇన్‌కమ్ ఫ్రమ్ అదర్ సోర్సెస్' (ఇతర వనరుల రూపంలో వచ్చిన ఆదాయం) కింద బైబ్యాక్ మొత్తాన్ని డివిడెండ్ ఆదాయంగా చూపించాలని వాద్వా సూచించారు. ''క్యాపిటల్ గెయిన్స్ షెడ్యూల్‌లో మాత్రం బైబ్యాక్‌లో షేర్లను విక్రయించగా వచ్చిన మొత్తాన్ని సున్నా కింద చూపించాలి. అప్పుడు షేర్ల కొనుగోలుకు చేసిన పెట్టుబడి మొత్తం మూలధన నష్టం అవుతుంది. దీన్ని తదుపరి సంవత్సరాలకు క్యారీ ఫార్వార్డ్ చేసుకోవాలి. తదుపరి ఎనిమిది ఆర్థిక సంవత్సరాల్లో దీర్ఘకాల మూలధన లాభాలతో సర్దుబాటు చేసుకోవచ్చు''అని వాద్వా వివరించారు.

80డీడీ, 80యూ కోసం డిజేబిలిటీ సర్టిఫికెట్



వైకల్యంతో ఉన్న వారి కోసం చేసిన వ్యయాలను పాత పన్ను విధానంలో సెక్షన్ 80డీడీ లేదా సెక్షన్ 80యూ కింద మినహాయింపు కోరుకునే అవకాశం ఉంది. ఇందుకు గతంలో ఫారమ్ 10–ఐఏ వివరాలు ఇస్తే సరిపోయేది. అయితే ఈ ఏడాది నుంచి ఈ సెక్షన్ల కింద మినహాయింపు కోరే వారు ఫారమ్ 10–ఐఏతోపాటు (మెడికల్ సర్టిఫికెట్) డిజేబిలిటీ సర్టిఫికెట్ అక్నాలెడ్జ్‌మెంట్ నంబర్ (వైకల్య సర్టిఫికెట్ ధ్రువీకరణ) ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు ఐటీఆర్ 2 లేదా 3ని ఎంపిక చేసుకోవాలని వాద్వా సూచించారు. వ్యక్తులు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్) దివ్యాంగుల కోసం చేసే వైద్య వ్యయాలు లేదా ఆరోగ్య బీమా ప్రీమియం చెల్లింపులపై సెక్షన్ 80డీడీ కింద పన్ను మినహాయింపు కోరొచ్చు. 80యూ సెక్షన్ అన్నది స్వయంగా వైకల్యం ఎదుర్కొంటున్న పన్ను చెల్లింపుదారుల కోసం ఉద్దేశించినది. 40 శాతం వైకల్యం ఉన్న వారు రూ.75,000, 80 శాతం వరకు వైకల్యం ఎదుర్కొనే వారు రూ.1.25 లక్షల ఆదాయంపై పన్ను మినహాయింపును ఈ రెండు విభాగాల్లోని వారు క్లెయిమ్ చేసుకోవచ్చు.

రూ.కోటిదాటితేనే అప్పుల వివరాలు..



ఇప్పటి వరకు ఒక ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఆదాయం రూ.50లక్షలు మించినట్టయితే ఆస్తులు, అప్పుల వివరాలను ఐటీఆర్‌లో వెల్లడించాల్సి వచ్చేది. 2025–26 అసెస్‌మెంట్ సంవత్సరం నుంచి మొత్తం ఆదాయం రూ.కోటి మించినప్పుడే ఆస్తులు, అప్పుల వివరాలు వెల్లడించాలంటూ నిబంధనల్లో మార్పులు చేశారు.

ఎవరికి ఏ ఫారమ్?



ఐటీఆర్–1: వేతనం లేదా పింఛను రూపంలో రూ.50లక్షలకు మించకుండా ఆదాయం, ఒక ఇంటిపై ఆదాయం కలిగిన వారు, ఇతర ఆదాయం ఉన్న వారు (లాటరీ లేదా పందేల్లో గెలుపు రూపంలో కాకుండా) ఐటీఆర్–1 దాఖలు చేసుకోవచ్చు. ఈ ఏడాది నుంచి వచ్చిన మార్పుల ప్రకారం దీర్ఘకాల మూలధన లాభం రూ.1.25 లక్షలు మించని వారు సైతం ఇదే పత్రాన్ని ఎంపిక చేసుకోవచ్చు. భారత్‌కు వెలుపల ఆస్తులు కలిగిన వారు లేదా విదేశీ ఆదాయం కలిగిన వారు ఐటీఆర్–1 దాఖలుకు అర్హులు కారు. అలాగే రూ.50 లక్షలకు మించి ఆదాయం కలిగిన వారు, వ్యవసాయ ఆదాయం రూ.5,000 మించిన వారికీ ఐటీఆర్–1 వర్తించదు.

ఐటీఆర్–2: వ్యక్తులు లేదా హెచ్‌యూఎఫ్‌లు రూ.50 లక్షలకు మించి ఆదాయం కలిగి.. అదే సమయంలో వ్యాపారం లేదా వృత్తిపరమైన ఆదాయం లేనట్టయితే ఐటీఆర్–2ను ఎంపిక చేసుకోవాలి. ఇతర ఆదాయం (లాటరీలు, పందేల రూపంలో గెలుచుకున్న ఆదాయం సైతం) కలిగి ఉంటే.. స్వల్పకాల మూలధన లాభం, రూ.1.25 లక్షలకు మించి దీర్ఘకాల మూలధన లాభం, మూలధన నష్టాలను క్యారీ ఫార్వార్డ్ చేసుకోవాలనుకుంటే, ఒకటికి మించి ఇళ్లపై ఆదాయం.. విదేశీ ఆస్తులు/ ఆదాయం.. క్రిప్టో ఆదాయం కలిగినవారు (మూలధన లాభంగా చూపించేట్టయితే), వ్యవసాయం ఆదాయం రూ.5,000 మించి ఉంటే, ఒక కంపెనీలో డైరెక్టర్ హోదాలో ఉంటే, అన్‌లిస్టెడ్ షేర్లు కలిగిన వారు సైతం ఫారమ్ 2ను దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఐటీఆర్–3: ఐటీఆర్–2లో పేర్కొన్న అన్ని ఆదాయాలకు అదనంగా ఒక సంస్థలో భాగస్వామిగా ఉంటే, క్రిప్టో ఆదాయాన్ని వ్యాపార ఆదాయంగా చూపిస్తుంటే ఐటీఆర్–3ని ఎంపిక చేసుకోవాలి. వ్యాపారం, వృత్తి నుంచి ఆదాయం (ఆడిట్, ఆడిట్ అవసరం లేని కేసులు), వేతనం, అద్దె ఆదాయం, స్వల్ప, దీర్ఘకాల మూలధన లాభాలు, వడ్డీ, డివిడెండ్లు, లాటరీ ఆదాయం లేదా ఇతర ఏదైనా ఆదాయం.. ఒక సంస్థలో భాగస్వామిగా ఆదాయం అందుకున్న వారికి ఇది వర్తిస్తుంది. వ్యాపారం లేదా వృత్తి నిర్వహిస్తూ ప్రిజంప్టివ్ ఇన్‌కమ్‌ను ఎంపిక చేసుకోని వారు, వ్యాపారం లేదా వృత్తి ఆదాయం కలిగి రికార్డులు నిర్వహిస్తూ, వాటిని ఆడిటింగ్ చేయాల్సి ఉన్న వారికి కూడా ఇదే వర్తిస్తుంది.

ఐటీఆర్–4: రూ.50లక్షల వరకు ఆదాయం కలిగిన వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్‌లు (ఎల్‌ఎల్‌పీలు కాకుండా).. ఐటీఆర్–1 కిందకు వచ్చే ప్రతీ ఆదాయానికి అదనంగా.. ప్రిజంప్టివ్ ఇన్‌కమ్ (టర్నోవర్‌పై నిర్ణీత శాతాన్ని ఆదాయంగా చూపించే) స్కీమ్ కింద వ్యాపారం/వృత్తి ఆదాయం కలిగిన వారు ఐటీఆర్–4ను ఎంపిక చేసుకోవాలి. వ్యవసాయం ఆదాయం రూ.5,000కు మించకుండా ఉంటేనే దీనికి అర్హత ఉంటుంది. లాటరీ, పందేల రూపంలో కాకుండా ఇతర ఆదాయం కలిగిన వారు.. వీటికి అదనంగా దీర్ఘకాల మూలధన లాభం రూ.1.25 లక్షలకు మించకుండా ఉండి, మూలధన నష్టాలను క్యారీ ఫార్వార్డ్ చేసుకోవాల్సిన అవసరం లేని వారు ఐటీఆర్ –4 దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఐటీఆర్–5: ఎల్‌ఎల్‌పీలు, అసోసియేషన్ ఆఫ్ పర్సన్‌లు (ఏవోపీలు), బాడీ ఆఫ్ ఇండివిడ్యువల్స్ (బీవోఐలు), ఆర్టిఫీషియల్ జ్యూరిడికల్ పర్సన్ (ఏజేపీలు)లకు ఇది వర్తిస్తుంది.

ఐటీఆర్–6: సెక్షన్ 11 కింద మినహాయింపులు క్లెయిమ్ చేయని కంపెనీలు ఐటీఆర్–6 దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఐటీఆర్–7: సెక్షన్ 139(4ఏ), లేదా సెక్షన్ 139(4బి) లేదా సెక్షన్ 139(4సి), లేదా సెక్షన్ 139(4డి), లేదా సెక్షన్ 139(4ఈ), లేదా సెక్షన్ 139(4ఎఫ్)ల కింద ఆదాయం కలిగిన వ్యక్తులు, కంపెనీలకు ఐటీఆర్–7 వర్తిస్తుంది.

డిజిటల్ ఫారమ్ 16

ఆదాయపన్ను శాఖ కొత్తగా డిజిటల్ ఫారమ్ 16ను ప్రకటించింది. ఉద్యోగుల వేతనం నుంచి మినహాయించిన పన్ను వివరాలు (టీడీఎస్) ఫారమ్ 16లో ఉంటాయి. సాధారణంగా ఏటా మే చివరి నాటికి ఈ పత్రాన్ని యాజమాన్యాలు ఉద్యోగులకు జారీ చేస్తుంటాయి. దీని ఆధారంగా ఉద్యోగులు రిటర్నులు దాఖలు చేస్తుంటారు. ఇకపై ట్రేసెస్ పోర్టల్ నుంచి నేరుగా ఫారమ్ 16 డిజిటల్ పత్రాన్ని జారీ చేయనున్నారు. దీంతో ఈ డిజిటల్ ఫారమ్ 16ను పన్ను రిటర్నుల దాఖలు పోర్టళ్లపై డిజిటల్‌గా అప్‌లోడ్ చేసుకోవచ్చు. దాంతో ఫారమ్ 16లో ఉన్న వివరాలన్నీ ఐటీఆర్‌లో ఆటోమేటిగ్గా భర్తీ అవుతాయి.

ఇవి గమనించాలి..

- వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, ఆడిటింగ్ అవసరం లేని సంస్థలు జూలై 31 లేదా ఆలోపు ఐటీఆర్‌లు ఫైల్ చేయాల్సి ఉంటుంది. కాకపోతే ఈ ఏడాది ఐటీఆర్ పత్రాల్లో మార్పులు తీసుకొచ్చినందున ఈ గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించారు.
- ఆడిటింగ్ అవసరమైన వ్యాపార సంస్థలకు ఈ గడువు అక్టోబర్ 31.
- సవరణ రిటర్నులు దాఖలుకు డిసెంబర్ 31 వరకు గడువు ఉంటుంది.
- రూ.5లక్షలకు మించని ఆదాయం కలిగిన వారు రూ.5వేల ఆలస్యపు రుసుం, రూ.5 లక్షలు మించిన ఆదాయం కలిగిన వారు రూ.1,000 ఆలస్యపు రుసుంతో డిసెంబర్ 31 వరకు బిలేటెడ్/లేట్ రిటర్నులు దాఖలు చేసుకోవడానికి అనుమతి ఉంది.
- అప్‌డేటెడ్ రిటర్నులను అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన నాటి నుంచి నాలుగేళ్ల వరకు దాఖలు చేసుకోవచ్చు. ఇందుకు మార్చి 31 తుది గడువు.

న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్

బ్రోకరేజ్: ఐడీబీఐ క్యాపిటల్ — **కొనొచ్చు**



ప్రస్తుత ధర: రూ.1,236
టార్గెట్: రూ. 1,666
ఎందుకంటే: సాఫ్ట్‌వేర్, కన్సల్టింగ్ సేవల కంపెనీ న్యూజెన్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీస్ గతేడాది(2024–25) నాలుగో త్రైమాసికంలో ఆకర్షణీయ పనితీరు ప్రదర్శించింది. జనవరి–మార్చి(క్యూ4)లో మొత్తం ఆదాయం త్రైమాసికవారీగా 13 శాతం, వార్షికంగా 15 శాతం చొప్పున ఎగసింది. ఇందుకు ప్రధానంగా ప్రాజెక్టుల అమలు(ఇంప్లిమెంటేషన్) 39 శాతం జంప్‌చేయడం, లైసెన్స్ ఆదాయం 24 శాతం పుంజుకోవడం(త్రైమాసికవారీగా) దోహదపడ్డాయి. దేశీయంగా ఆదాయం 10 శాతం, ఆసియాపసిఫిక్ తదితర దేశాల(ఎపాక్) నుంచి మరింత అధికంగా 14 శాతం సమకూరడం సైతం ఫలితాల్లో వృద్ధికి సహకరించింది. ప్రస్తుతం ప్రపంచస్థాయిలో అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) మొత్తం ఆదాయం 20 శాతం జంప్‌చేయనున్నట్లు కంపెనీ యాజమాన్యం అంచనా వేస్తోంది. విభిన్న మార్కెట్ల నుంచి పటిష్ట అమ్మకాలు సాధించనున్నట్లు భావిస్తోంది. గతేడాది క్యూ4లో వార్షికంగా ఆర్డర్లు 30 శాతం బలపడ్డాయి. దీంతో గతేడాది ఆర్డర్‌బుక్ రూ. 1,664 కోట్లను తాకింది. దీంతో ఈ ఏడాది ఆదాయంలో 21 శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో 22 శాతం చొప్పున బలపడగలదని అంచనా వేస్తున్నాం. ఈఆర్అండ్‌డీ, సేల్స్, మార్కెటింగ్ విభాగాలపై కంపెనీ కొనసాగిస్తున్న నిరవధిక పెట్టుబడులు కంపెనీకి దన్నుగా నిలవనున్నాయి. వీటికితోడు ఏజెంటిక్ ఏఐ కార్యాచరణ పనితీరుకు ప్రోత్సాహాన్నివ్వనుంది. కొత్త ఆర్డర్లను పొందడంలో ముందడుగు, క్లయింట్లకు చేరువకావడం, డిజిటల్ లెండింగ్, భారత్‌తోపాటు, ఎపాక్, మధ్యప్రాచ్యం నుంచి అమ్మకాలు పెంచుకునే అవకాశముంది. మరోపక్క బీమా రంగ విభాగంలో కంపెనీ పట్టుసాధిస్తోంది. భారత్, మధ్యప్రాచ్యంలో బీమా విభాగంలో మరిన్ని అవకాశాలపై దృష్టిపెట్టి ముందుకు సాగుతోంది.

వోల్టాంప్ ట్రాన్స్‌ఫార్మర్స్

బ్రోకరేజ్: ఎమ్‌కే గ్లోబల్ — **కొనొచ్చు**



ప్రస్తుత ధర: రూ. 8,286
టార్గెట్: రూ. 11,350
ఎందుకంటే: హెవీ ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్ తయారీ దిగ్గజం వోల్టాంప్ ట్రాన్స్‌ఫార్మర్స్ గత ఆర్థిక సంవత్సరం (2024–25) చివరి త్రైమాసికంలో అంచనాలను మించిన ఫలితాలు ప్రకటించింది. ఇందుకు జోరందుకున్న అమ్మకాలు, ప్రొడక్టులకు మెరుగైన ధరలు తోడ్పాటునిచ్చాయి. గతేడాది కనిపించిన సానుకూల ప్రభావాన్ని అందిపుచ్చుకుంటూ జనవరి–మార్చి(క్యూ4)లో వార్షికంగా అమ్మకాల పరిమాణం 9.4 శాతం బలపడింది. ఈ కాలంలో మొత్తం ఆదాయం 24 శాతం జంప్‌చేసి రూ. 620 కోట్లను అధిగమించింది. నిర్వహణ లాభం(ఇబిటా) 16 శాతం ఎగసి రూ. 120 కోట్లను తాకగా, నికర లాభం 4 శాతం వృద్ధితో రూ. 97 కోట్లకు చేరింది. అయితే ఇబిటా మార్జిన్లు 1.35 శాతం నీరసించి 18.6 శాతంగా నమోదయ్యాయి. స్థూల మార్జిన్లు మరింత అధికంగా 3 శాతం క్షీణించాయి. క్యూ3(అక్టోబర్–డిసెంబర్)తో పోలిస్తే 2.3 శాతం తగ్గి 27 శాతానికి పరిమితమయ్యాయి. ప్రధానంగా ఎనర్జీ ఎఫీషియెంట్ ట్రాన్స్‌ఫార్మర్స్ తయారీలో ఉన్న కంపెనీ నికర లాభం.. అధిక పన్ను చెల్లింపులు, తగ్గిన ఇతర ఆదాయం కారణంగా స్వల్ప వృద్ధికే పరిమితమైంది. పునరుత్పాదక ఇంధన విభాగంసహా వివిధ మార్కెట్ల నుంచి ప్రొడక్టులకు డిమాండ్ కనిపిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం పేర్కొంటోంది. దీంతో దేశీయంగా అమ్మకాలు ఊపందుకోనున్నట్లు తెలియజేసింది. వార్షికంగా 26 శాతం వృద్ధితో రూ. 980 కోట్లకు చేరిన ఆర్డర్ బుక్ ఇందుకు సహకరించనుంది.ఇప్పటికే ప్రకటించిన 6,000 ఎంవీఏ సామర్థ్య విస్తరణ సక్రమంగా కొనసాగుతున్నట్లు వెల్లడించింది. రెనవబుల్ ప్రాజెక్టులు, ప్రయివేట్ పెట్టుబడులతోపాటు.. తయారీ రంగంలో ప్రభుత్వ పీఎల్ఐ పథకాలు కంపెనీకి లబ్ధిని చేకూర్చనున్నాయి. కాగా.. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 100 చొప్పున డివిడెండ్ ప్రకటించింది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

మార్కెట్లపై జీడీపీ ఎఫెక్ట్

ఆర్‌బీఐ సమీక్షపై ఇన్వెస్టర్ల చూపు
- టారిఫ్ చర్చలకూ ప్రాధాన్యత
- ఇండెక్సులకు ఎఫ్‌పీఐల దన్ను
- ఈ వారం ట్రెండ్‌పై విశ్లేషకుల అంచనా



గత వారాంతాన వెలువడిన జీడీపీ గణాంకాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేయనున్నాయి. మరోవైపు ఆర్‌బీఐ పాలసీ సమీక్షపై ఇన్వెస్టర్లు దృష్టి పెట్టనున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. ఎఫ్‌పీఐ పెట్టుబడులు, యూఎస్ టారిఫ్ పరిస్థితులు తదితర అంశాలకూ ప్రాధాన్యత ఉన్నట్లు తెలియజేశారు. వివరాలు చూద్దాం..

ముంబై: గత ఆర్థిక సంవత్సరం(2024–25)లో దేశ ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం బలపడింది. చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ) 7.4 శాతం వృద్ధి చూపింది. జీడీపీ విలువ 3.9 లక్షల కోట్ల డాలర్లకు చేరడం సానుకూల అంశమని విశ్లేషకులు పేర్కొన్నారు. గత వారాంతాన వెలువడిన జీడీపీ గణాంకాలు ఈ వారం దేశీ స్టాక్ మార్కెట్లపై ప్రభావాన్ని చూపనున్నట్లు తెలియజేశారు. ఇక మరోపక్క ఆర్‌బీఐ అధ్యక్షతన మానిటరీ పాలసీ కమిటీ(ఎంపీసీ) మూడు రోజుల సమావేశం బుధవారం (4న) ప్రారంభంకానుంది. శుక్రవారం(6న) పాలసీ సమీక్షా నిర్ణయాలు వెలువడనున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు వడ్డీ రేట్ల నిర్ణయాలపై దృష్టిపెట్టనున్నట్లు రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా తెలియజేశారు. ఈ వారం మే నెల తయారీ, సర్వీసుల రంగ పీఎంఐ గణాంకాలు వెలువడనున్నాయి. ఆర్‌బీఐ గత(ఏప్రిల్) సమీక్షలో రెపో రేటును 0.25 శాతం తగ్గించి 6 శాతానికి దించిన సంగతి తెలిసిందే.

గణాంకాలు కీలకం

మే నెలకు ఆటో అమ్మకాల గణాంకాలు వెలువడుతున్నాయి. వీటికితోడు జీఎస్‌టీ వసూళ్లు తదితర అంశాలు సెంటిమెంటును ప్రభావితం చేయగలవని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వెల్త్‌మేనేజ్‌మెంట్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా తెలియజేశారు. ఇటీవల ప్రపంచ ప్రధాన కరెన్సీలతో మారకంలో యూఎస్ డాలరు ఆటుపోట్లను చవిచూడటం, 10ఏళ్ల ట్రెజరీ బాండ్ల ఈల్డ్స్ క్షీణించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఉన్నట్లు వివరించారు. దేశీయంగా ఆర్‌బీఐ రెపో రేటులో 0.25 శాతం కోత పెట్టవచ్చన్న అంచనాలున్నట్లు జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పీఎస్‌యూ బ్యాంకులు యాక్టివ్‌గా కదిలే వీలున్నట్లు ఖేమ్కా అభిప్రాయపడ్డారు. జీఎస్‌టీ వసూళ్లు, ఆటో విక్రయాలు, జీడీపీ తదితర ఆర్థిక గణాంకాలు ఇన్వెస్టర్లకు ప్రోత్సాహాన్నిచ్చే వీలున్నట్లు అధిక శాతంమంది నిపుణులు అంచనా వేశారు.

ఇతర అంశాలు

గత నెల(మే)లో విదేశీ ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్స్‌లో కొనుగోళ్లకు ఆసక్తి చూపడం సానుకూల అంశమని విశ్లేషకులు పేర్కొన్నారు. గతేడాది అక్టోబర్ నుంచి మార్చివరకూ అమ్మకాలకే అధిక ప్రాధాన్యమిచ్చిన ఎఫ్‌పీఐలు ఇటీవల నికర పెట్టుబడిదారులుగా నిలుస్తుండటం సెంటిమెంటుకు బలాన్నిస్తున్నట్లు తెలియజేశారు. డాలరుతో మారకంలో రూపాయి బలపడటం, వడ్డీ రేట్ల తగ్గింపు అంచనాలు, ముడిచమురు ధరలు దిగిరావడం వంటి అంశాలు ఆర్థిక వ్యవస్థకు దన్నునివ్వగలవని అభిప్రాయపడ్డారు. ఆర్‌బీఐ గతేడాదికి సరికొత్త రికార్డ్ నెలకొల్పుతూ ప్రభుత్వానికి భారీ డివిడెండ్ చెల్లించడం ప్రభుత్వ పెట్టుబడులకు దన్నునిస్తుందని తెలియజేశారు. ప్రెసిడెంట్ ట్రంప్ టారిఫ్‌ల విధింపునకు యూఎస్ ఫెడరల్ కోర్టు చెక్ పెట్టిన నేపథ్యంలో విదేశీ పెట్టుబడులు పుంజుకోవచ్చని అంచనా వేశారు.

పెట్టుబడులకే ఎఫ్‌పీఐల మొగ్గు

మే నెలలో రూ. 19,860 కోట్లు

విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) గత నెలలో పెట్టుబడులకే ఆసక్తి చూపారు. వెరసి మే నెలలో నికరంగా రూ. 19,860 కోట్ల విలువైన దేశీ స్టాక్స్ కొనుగోలు చేశారు. అంతకుముందు ఏప్రిల్‌లో అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య నికరంగా రూ. 4,223 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. 2024 అక్టోబర్‌లో అమ్మకాలకే ప్రాధాన్యమిస్తూ వచ్చిన ఎఫ్‌పీఐలు ఈ ఏడాది (2025) జనవరిలో రూ. 78,027 కోట్లు, ఫిబ్రవరిలో రూ. 34,574 కోట్లు, మార్చిలో రూ. 3,973 కోట్లు చొప్పున పెట్టుబడులను వెనక్కి తీసుకున్న విషయం విదితమే. అయితే ఆపై ఏప్రిల్ చివరి నుంచి కొనుగోళ్ల యూటర్న్ తీసుకోవడం గమనార్హం!


జీఎస్‌టీ వసూళ్లు జూమ్

మే నెలలో రూ. 2 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: స్థూలంగా వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) వసూళ్లు గత నెలలో 16.4 శాతం జంప్ చేశాయి. రూ. 2.01 లక్షల కోట్లను అధిగమించాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మే నెలలో స్థూలంగా దేశీ లావాదేవీల విలువ 13.7 శాతం ఎగసి రూ. 1.5 లక్షల కోట్లను తాకింది. దిగుమతుల జీఎస్‌టీ ఆదాయం 25 శాతంపైగా పెరిగి రూ. 51,266 కోట్లకు చేరింది. అంతకుముందు నెల(ఏప్రిల్)లో జీఎస్‌టీ వసూళ్లు సరికొత్త రికార్డ్‌కు తెరతీస్తూ రూ. 2.37 లక్షల కోట్లుగా నమోదైన విషయం విదితమే. గత నెలలో స్థూల సెంట్రల్ జీఎస్‌టీ ఆదాయం రూ. 35,434 కోట్లుకాగా.. రాష్ట్ర జీఎస్‌టీ ఆదాయం రూ. 43,902 కోట్లకు చేరింది. సమీకృత జీఎస్‌టీ రూ. 1.09 లక్షల కోట్లుగా నమోదైంది. సెస్ నుంచి రూ. 12,879 కోట్ల ఆదాయం లభించింది.

కృత్రిమ రక్తం



రక్తం ప్రాణాధారం. ఏదైనా ప్రమాదం జరిగి లేదా శస్త్రచికిత్స వల్ల చాలా రక్తం పోయిన మనిషిని బతికించాలంటే ఆసుపత్రిలో ఆ వ్యక్తి బ్లడ్ గ్రూప్‌నకు సరిపోయే రక్తం ఉండాలి. ఒకవేళ లేకపోతే సరిపోయే బ్లడ్ గ్రూప్ ఉన్న ఆరోగ్యవంతుడైన మనిషి నుంచి రక్తాన్ని సేకరించి ఎక్కించాలి. ఆ రక్తం దొరక్క కొన్నిసార్లు ప్రాణాలే పోతుంటాయి. కానీ భవిష్యత్తులో దీన్ని పూర్తిగా నివారించవచ్చు! ఎవరికైనా నిమిషాల్లో.. మనుషులే ఇవ్వాల్సిన అవసరం లేకుండా 24 గంటలూ రక్తం అందుబాటులో ఉండొచ్చు!! దీన్ని కృత్రిమ రక్తం అందామా లేక కృత్రిమ ప్రాణాధారం అందామా? ఏ పేరు పెట్టి పిలిచినా ఇదీ రక్తమే. ఈ దిశగా జపాన్‌లో క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. అవి విజయవంతమైతే కోట్లాది మంది ప్రాణాలు కాపాడొచ్చు.

- సాక్షి, స్పెషల్ డెస్క్

రక్తమార్పిడి చరిత్ర

మొట్టమొదటి రక్తమార్పిడి 1665లో ఇంగ్లండ్‌లో జరిగింది. కొన్ని కుక్కల నుంచి రక్తాన్ని తీసి గాయపడిన కుక్కకు ఎక్కించి దాని ప్రాణాలు కాపాడారు. ఆ తరువాత 1818లో బ్రిటిష్ వైద్యుడు జేమ్స్ బ్లండెల్ మనుషుల్లో రక్తమార్పిడి విజయవంతంగా నిర్వహించారు. 19వ శతాబ్దంలో న్యూయార్క్‌లో థియోడర్ గెయిలార్డ్ థామస్ అనే స్త్రీల వైద్య నిపుణుడు (గైనకాలజిస్ట్) రక్తానికి బదులు ఆవు పాలను వాడాడు. 1875లో.. తన దగ్గరకు తీవ్ర రక్తస్రావంతో వచ్చిన మహిళకు 175 మిల్లీలీటర్ల ఆవుపాలు ఎక్కించాడు. వారంపాటు ఆమె జ్వరం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి సమస్యలతో ఇబ్బంది పడినా తరువాత అన్నీ సర్దుకున్నాయట. అలా థామస్ ఏడుసార్లు పాలు ఎక్కించాడట. ఆ ఫలితాలు ఎన్నో మెడికల్ జర్నల్‌లోనూ ప్రచురితమయ్యాయి. 1880 వరకు ఇలా రక్తానికి బదులు ఆవు, మేకపాలు ఎక్కించడం అమెరికా అంతటా జరిగిందని సైన్స్ మ్యాగజైన్ రాసింది. అప్పటి నుంచీ ఇప్పటివరకూ జపాన్‌తోపాటు అమెరికా, యూకే, చైనా వంటి దేశాలు కృత్రిమ రక్తంపై ఇప్పటికే చాలా పరిశోధనలు, ప్రయోగాలు చేశాయి.. చేస్తున్నాయి.

- ఎక్కడైనా, ఎప్పుడైనా అందుబాటులో
- మామూలు రక్తం కంటే ఎక్కువ రోజులు నిల్వ
- బ్లడ్ గ్రూప్‌తో సంబంధం లేదు
- జపాన్ పరిశోధకుల క్లినికల్ ట్రయల్స్
- పాడైపోయిన రక్తం నుంచే తయారీ
- 2030 నాటికి అందుబాటులోకి

రక్తం ఎప్పుడు కావాలంటే..

ఎముకల లోపల ఉండే మూలుగ నుంచి రక్తం తయారవుతుంది. సగటున మనిషి శరీరంలో దాదాపు 5 లీటర్ల వరకు రక్తం ఉంటుంది. మన రక్తం ఎర్రగా ఉండటానికి కారణం మన రక్తంలో ఆక్సిజన్‌ను మోసుకెళ్లే హిమోగ్లోబిన్ అనే పిగ్మెంట్. కొన్ని రకాల శస్త్రచికిత్సలు, ప్రమాదాలు, ప్రసవాలు, పోషకాహార లోపం వల్ల వచ్చే రక్తహీనత, బోన్ మేరో మార్పిడి, బోన్ మేరో ఫెయిల్యూర్, లుకేమియా, హీమోఫీలియా, డెంగ్యూ జ్వరం, తీవ్రమైన మలేరియా జ్వరం వంటి సందర్భాల్లో రక్తమార్పిడి అవసరమవుతుంది.

2 ఏళ్లు.. ఊదా రంగు..

సాధారణంగా మన రక్తం 42 రోజుల వరకే నిల్వ ఉంటుంది. ఆలోపు వాడకపోతే వృథా అయిపోతుంది. కానీ ఈ కృత్రిమ రక్తం 2 ఏళ్లపాటు నిల్వ ఉంటుంది. అంటే.. వృథా అయ్యే అవకాశమే లేదన్నమాట. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. మన రక్తం ఎరుపు రంగులో ఉంటే ఇది ఊదా రంగులో ఉంటుంది. అలవాటు కావడానికి మనకు కాస్త సమయం పడుతుందేమో! అంతేకాదు, బ్లడ్ గ్రూప్‌తో సంబంధం లేకుండా అందరికీ ఈ రక్తాన్ని ఎక్కించే అవకాశం కూడా ఉందట.

ప్రపంచంలోనే తొలిసారి 2018లో కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఎస్టిమేషన్ ఆఫ్ బ్లడ్ రిక్వైర్‌మెంట్ ఇన్ ఇండియా అనే నివేదిక విడుదల చేసింది. దేశంలో పెరుగుతున్న జనాభా, వారి ఆరోగ్య అవసరాలకు అనుగుణంగా దేశంలో రక్తమార్పిడుల వంటి వాటికి ఎంత రక్తం అవసరం అవుతుందో కనిపెట్టడం దీని ప్రధాన ఉద్దేశం. 2008 నాటి ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 2007లో మన దేశంలో కోటి యూనిట్ల రక్తం కావాలని అంచనా వేసింది. కానీ, అప్పటికి మనదేశంలో అందుబాటులో ఉన్నది 40 లక్షల యూనిట్లే. 2018 లెక్కల ప్రకారం అవసరమైనది 2.65 కోట్ల యూనిట్లు. ఈ లెక్కన ప్రస్తుతం ఇది ఎంతకు చేరి ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఒక్క మనకే కాదు.. యావత్ ప్రపంచానికి కృత్రిమ రక్తం.. నిజంగా ప్రాణదాత.



పాడైపోయిన మానవ రక్తంతో..

మానవ రక్తానికి ప్రత్యామ్నాయంగా కృత్రిమ రక్తాన్ని జపాన్ పరిశోధకులు ప్రయోగశాలలో అభివృద్ధి చేశారు. జపాన్‌లోని నారా మెడికల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ హిరోమీ సకాయి ఇందులో కీలకపాత్ర పోషించారు. ఆమె, ఆమె వైద్య బృందం సాధించిన ఈ ఘనతను వైద్య చరిత్రను మలుపుతిప్పే ఘటనగా నిపుణులు వర్ణిస్తున్నారు. ఈ ప్రక్రియకు వీళ్లు వాడింది.. పాడైపోయిన మానవ రక్తాన్నే. ఈ రక్తంలోని హిమోగ్లోబిన్‌ను వీళ్లు వేరుచేశారు. దాన్ని ఎలాంటి వైరస్‌లూ సోకేందుకు అవకాశం లేని ప్రత్యేక షెల్‌లో ఉంచి, అత్యంత జాగ్రత్తగా, కొన్ని ప్రత్యేక పద్ధతుల ద్వారా ఈ కృత్రిమ రక్తం తయారుచేశారు. ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్ జరుగుతున్నాయి. వాలంటీర్లకు 100 నుంచి 400 మిల్లీలీటర్ల కృత్రిమ రక్తాన్ని ఎక్కించి పరీక్షిస్తున్నారు. ఈ ఆవిష్కరణకు మద్దతుగా జరుగుతున్న మరో ఆవిష్కరణలో భాగంగా ప్రాణవాయువును తీసుకెళ్లేందుకు వాహకాలను తయారుచేస్తున్నారు. చువో యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ తెరియుకి కొమట్సు బృందం. ప్లాస్మాలోని అల్బుమిన్‌తో వీటిని రూపొందించారు. ఇవి రక్తపోటును నియంత్రించేందుకు, గుండెపోటు వంటివి రాకుండా చేసేందుకు సహాయపడతాయి. క్లినికల్ ట్రయల్స్ విజయవంతమైతే 2030 నాటికి ఈ రక్తం అందుబాటులోకి వస్తుంది.

● బై బై హైదరాబాద్!

స్వదేశాలకు సుందరీమణులు



ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొన్న సుందరీమణులు తిరిగి తమతమ దేశాలకు పయనమయ్యారు. ఇందులో భాగంగా ఆదివారం ఇంటికి తిరిగి వెళ్తున్న అందగత్తెలకు శంషాబాద్ విమానాశ్రయంలో సంప్రదాయ పద్ధతుల్లో పర్యాటక శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా వారు హైదరాబాద్ గుర్తులను గుండెల్లో దాచుకుని.. బైబై అంటూ బయలుదేరారు.

- శంషాబాద్ (హైదరాబాద్)

● కరంగటం!

- కోయ భాషలో తెలంగాణ ఆవిర్భావ వేడుకల ఆహ్వానం
- భద్రాచలం ఐటీడీఏ పీవో భాషాభిమానం



భద్రాచలం: భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ గిరిజన భాషపై తనకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. సోమవారం జరగనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల ఆహ్వానపత్రికలను తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు కోయ భాషలోనూ ముద్రించారు. 'వేడుకలకు ఆహ్వానం'.. అని అర్థం వచ్చేలా 'కరంగటం' పేరుతో పాటు.. లోపల కూడా కొన్ని కోయ పదాలతో ఆహ్వాన పత్రికను ముద్రించి పంపిణీ చేశారు.

3 నెలల రేషన్.. 6 సార్లు నిశాన్

▶ మొదటి పేజీ తరువాయి



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన కార్డులు. ఎన్ఎస్ఎఫ్ఏ కార్డుదారులకు కేంద్రం ఇచ్చే 5 కిలోల బియ్యానికి రాష్ట్రం అదనంగా కిలో బియ్యం కలిపి ఇస్తోంది. దీంతో ప్రతి నెలా లబ్ధిదారుల నుంచి రేషన్ డీలర్లు రెండుసార్లు వేలిముద్రలు సేకరిస్తున్నారు. తాజాగా మూడు నెలల రేషన్‌ను ఏకకాలంలో ఇవ్వాల్సి రావడంతో ఒక్కో లబ్ధిదారు చేత డీలర్లు ఆరుసార్లు వేలిముద్ర వేయించాల్సి రావడం సాంకేతిక సమస్యలకు కారణమైంది.

నేటి నుంచి పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామన్న అధికారులు

తొలిరోజు ఎదురైన సమస్యలను అధిగమించి సోమవారం నుంచి పూర్తిస్థాయిలో రేషన్ బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేశామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఈ నెల 30 వరకు మూడు నెలల బియ్యం పంపిణీ కొనసాగుతుందని.. అందువల్ల లబ్ధిదారులు కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు. మరోవైపు సాంకేతిక సమస్యలను నివారించేందుకు లబ్ధిదారులంతా వారికి కేటాయించిన తేదీల ప్రకారమే షాపులకు రావాలని రేషన్ డీలర్లు విజ్ఞప్తి చేశారు.

యాదగిరిగుట్టలో ఏపీ హైకోర్టు జడ్జి



జస్టిస్ జె.సుబ్బారెడ్డికి ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ జె.సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు జస్టిస్ జె.సుబ్బారెడ్డి, కుటుంబ సభ్యులకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సీఎం రాష్ట్రావిర్భావ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా.. తెలంగాణ రైజింగ్ నినాదంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉంటుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ కూడా వేర్వేరు ప్రకటనల్లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

కేసీఆర్ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో ఆగమైన తెలంగాణను.. స్వయం పాలనలో అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు.

రాష్ట్రావతరణ వేడుకలకు జపాన్ అతిథి

హైదరాబాద్ చేరుకున్న కితాక్యూషూ నగర మేయర్ కజుహిసా టకేచీ



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు తెలంగాణ రాష్ట్రావతరణ వేడుకల్లో పాల్గొనేందుకు జపాన్‌లోని కితాక్యూషూ నగర మేయర్ కజుహిసా టకేచీ ఆదివారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆయనతోపాటు ఓ ప్రతినిధి బృందం కూడా వచ్చింది. ఇటీవల జపాన్‌లో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి కితాక్యూషూ నగరాన్ని సందర్శించారు. ఆ సందర్భంగా తెలంగాణ అవతరణ వేడుకలకు రావాలని కజుహిసా టకేచీని ఆహ్వానించారు. సోమవారం ఉదయం పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో టకేచీ బృందం పాల్గొంటుంది. అనంతరం ఐటీసీ కాకతీయ హోటల్‌లో తెలంగాణ రాష్ట్రం, కితాక్యూషూ నగరాల మధ్య పరస్పర సహకార ఒప్పందంపై సంతకాలు చేస్తారని సీఎం కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

ఒక్క రోజే 90 వేల మంది!



కొండ కింద రింగ్ రోడ్డులో పార్కింగ్ ప్రదేశంలో నిండిపోయిన వాహనాలు

యాదగిరిగుట్ట ఆలయ చరిత్రలోనే రికార్డు స్థాయిలో పోటెత్తిన భక్తజనం

- వేసవి సెలవులు ముగుస్తుండటంతో భారీగా రాక.. కిక్కిరిసిన క్షేత్రం
- ధర్మ దర్శనానికి 4 గంటలకుపైగా సమయం.. రూ. 79.51 లక్షల నిత్యాదాయం

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట చరిత్రలోనే తొలిసారిగా శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని ఆదివారం రికార్డు స్థాయిలో 90 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా ఆలయానికి తరలిచ్చారు. వేకువజాము నుంచే దైవ దర్శనానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు రావడం మొదలవడంతో ఆలయ పరిసరాలు, క్యూలు, ప్రసాద విక్రయశాల, బస్టాండ్, కల్యాణకట్ట, సత్యనారాయణస్వామి వ్రత మండపం, మెట్ల దారి కిక్కిరిసిపోయింది. స్వామి వారి ధర్మ దర్శనానికి 4 గంటలకుపైగా సమయం పట్టగా వీఐపీ దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. ఆదివారం రాత్రి ఆలయాన్ని మూసేసే వరకు దర్శనం కోసం క్యూలో భక్తులు నిల్చున్నారు. ఉదయం వేకువజామున 4:30 గంటల నుంచి రాత్రి 7:45 గంటల వరకు 87 వేల మందికిపైగా భక్తులు యాదగిరీశుని దర్శించుకోగా రాత్రి 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సుమారు 3,500 మందికిపైగానే భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో ఆలయానికి నిత్యాదాయం రూ.79.51 లక్షలు వచ్చినట్లు ఈఓ వెంకట్రావ్ వెల్లడించారు.

పలువురు భక్తులకు అస్వస్థత..

దర్శనానికి భక్తులు భారీగా తరలిరావడంతో ధర్మ దర్శనం క్యూలో, వీఐపీ క్యూ మార్గంలో పలువురు అస్వస్థతకు గురయ్యారు. గంటల తరబడి నిల్చోలేక సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో ఆలయ సిబ్బంది, భక్తుల కుటుంబ సభ్యులు కొండపైనే ఉన్న ఆస్పత్రికి బ్యాటరీ వాహనాల్లో తరలించి చికిత్స అందించారు. చిన్నపిల్లలతో వచ్చిన తల్లులు సైతం క్యూలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. దీంతో పరిస్థితిని అధికారుల ద్వారా తెలుసుకొని ఈఓ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా భక్తుల రాక పెరిగే సరికి కొండపైన బస్టాండ్, వీఐపీ పార్కింగ్, శివాలయానికి వెళ్లేదారుల్లో వాహనాలు పూర్తిగా నిండిపోయాయి. ఒక దశలో టికెట్లు ఇచ్చే ప్రక్రియను అధికారులు నిలిపేసి కొండ కిందనే వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు చేపట్టారు.



ఆలయ ముఖ మండపంలో శ్రీస్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
సోమవారం । 2-6-2025





మడికట్లో క్రికెట్.. ఏట్లో వాలీబాల్

ఎన్ని ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నా.. పల్లెల్లో ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో క్రీడలు నేర్చుకోవడం ఆనందాన్నిస్తుంది. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలో చిన్నారులు పొలం మడికట్లలో క్రికెట్, యువత ఏటిలో వాలీబాల్ ఆడుతూ వేసవి సెలవులను సరదాగా గడుపుతోంది. - దేవరుప్పుల

కల్వకుంట్ల కుటుంబం వల్లే సామాజిక తెలంగాణ సాకారం కాలేదు

● సుదగాని హరిశంకర్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక తెలంగాణ ఏర్పాటైనప్పటికీ సామాజిక తెలంగాణ సాకారం కాకపోవడానికి ప్రధాన కారణం కల్వకుంట్ల కుటుంబమే అని తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుదగాని హరిశంకర్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని ప్రకటించడాన్ని ఆయన ఖండించారు. ఎలాంటి పదవులు ఆశించకుండా తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన జయశంకర్‌ను విస్మరించి, కేసీఆర్‌ను జాతిపిత అంటూ ప్రచారం చేయడం సరికాదన్నారు. బీసీలే కాకుండా ఎస్సీ, ఎస్టీలను కవిత అవమానించేలా మాట్లాడారని, కవిత తక్షణమే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

పోలీస్‌శాఖకు కేటగిరీలవారీగా పతకాలు

శౌర్యపతకం	9
మహోన్నత సేవా పతకం	16
ఉత్తమ సేవా పతకం	92
కఠిన సేవా పతకం	47
సేవా పతకం	461

ఏసీబీకి కేటగిరీలవారీగా పతకాలు

మహోన్నత సేవా పతకం	01
ఉత్తమ సేవా పతకం	04
కఠిన సేవా పతకం	00
సేవా పతకం	17

విజిలెన్స్ శాఖకు కేటగిరీలవారీగా

ఉత్తమ సేవ పతకం	01
సేవా పతకం	05

అగ్నిమాపకశాఖకు పతకాలు కేటగిరీల వారీగా...:

శౌర్య పతకం	02
మహోన్నత సేవా పతకం	01
ఉత్తమ సేవా పతకం	03
కఠిన సేవా పతకం	00
సేవా పతకం	14

టీజీ ఎస్పీఎఫ్ శాఖకు పతకాలు కేటగిరీల వారీగా..:

మహోన్నత సేవా పతకం	01
ఉత్తమ సేవ పతకం	03
సేవా పతకం	15

తెలంగాణ 'పానకాల స్వామి'!

- సీతంపేటలో శ్రీ గజగిరి లక్ష్మీ నర్సింహస్వామిగా దర్శనం
- దేశంలోనే రెండో ఆలయంగా ప్రసిద్ధి
- 500 ఏళ్ల చరిత్ర ఉన్నట్లు ఆధారాలు



చింతకాని మండలం సీతంపేటలోని శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహస్వామి (పానకాల స్వామి) దేవాలయం



కొండపై స్వయంభువుగా వెలిసిన గజగిరి లక్ష్మీనర్సింహస్వామి

చింతకాని: చుట్టూ కొండలు.. ఆహ్లాదాన్ని పంచే పచ్చని పొలాలు.. ఎత్తయిన గుట్టపై రాతి కొండలో స్వయంభువుగా వెలిసిన శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహస్వామి కొలిచిన వారికి కొంగు బంగారంలా వర్ధిల్లుతున్నాడు. భక్తులు పోసిన బెల్లం పానకాన్ని సగం స్వీకరించి.. మిగతాది ప్రసాదంగా మిగులుస్తూ పానకాల స్వామిగా పూజలు అందుకుంటున్నాడు. త్రేతాయుగంలో హిరణ్యకశిపుడి బారి నుంచి ప్రహ్లాదుడిని రక్షించే క్రమంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం సీతంపేట సమీపాన ఉన్న కొండపై ప్రకృతి రమణీయతకు ముగ్ధుడై నర్సింహస్వామి స్వయంభువుగా వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. పానకాల స్వామి ఆలయం.. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరి తర్వాత తెలంగాణలోని సీతంపేటలో మాత్రమే ఉంది.

ఘనమైన ఆలయ చరిత్ర

త్రేతాయుగంలో నర్సింహస్వామి.. హిరణ్యకశిపుడి బారి నుంచి ప్రహ్లాదుడిని రక్షించి తిరిగి వైకుంఠానికి శ్రీదేవి, భూదేవి సమేతంగా వెళ్తున్నాడట. మార్గమధ్యలో సీతంపేట వద్ద ప్రకృతి రమణీయతతో అలరారుతుండటంతో దేవేరుల కోరిక మేరకు స్వామి ఇక్కడ కొండపై స్వయంభువుగా వెలిశాడని భక్తుల నమ్మిక.

500 ఏళ్ల క్రితం..

సుమారు 500 ఏళ్ల క్రితం ఈ ప్రాంత జమీందారు, నాగులవంచ పరగణాధీశుడు గడ్డం సీతారామిరెడ్డి తాత భూపతిరెడ్డికి సంతానం లేకపోవటంతో.. ఆ దంపతులు ఇష్ట దైవం నర్సింహస్వామిని నిత్యం పూజించేవారు. ఒకరోజు భూపతిరెడ్డి కలలో కనిపించి దేవుడు 'నీకు సంతానం కలగాలంటే నాకు గుడి కట్టించాలి. జ్యోతి రూపంలో ఆకాశమార్గంలో వెళ్తుంటాను. ఆ జ్యోతి ఎక్కడయితే అదృశ్యమవుతుందో అక్కడే ఆలయం నిర్మించాలి'.. అని చెప్పి అదృశ్యమయ్యాడట. దీంతో జమీందార్ సూచనల మేరకు పండితులు అన్వేషిస్తుండగా సీతంపేట వద్ద అడవిలోని కొండల మధ్యలో.. రాతి కొండపై స్వామి వారు దేదీప్యమానంగా దర్శమిచ్చారట. భూపతిరెడ్డి రాతి కొండపై స్వామి గుడి కట్టించాడు. తదనంతరం జమీందారుకు సంతానం కలిగింది. కాగా, స్వామి ఇక్కడ ఏనుగు పడుకున్న ఆకారాన్ని పోలి ఉండడంతో.. శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహా స్వామిగా కొలుస్తున్నారు.



కొండపై కోనేరు

పానకాల స్వామిగా..

నర్సింహస్వామికి పాంచారాత్ర ఆగమ శాస్త్ర ప్రకారం ఆరాధన, పూజలు నిర్వహించేవారు. కొంతకాలానికి ఒక భక్తుడిని స్వామి వారు ఆవహించి.. 'నాకు దప్పికగా ఉంది. బెల్లం పానకం పోయండి'.. అని సూచించారట. దీంతో అర్చకులు బిందెలతో పానకం పోయగా.. సగం మాత్రమే స్వీకరించారని ప్రతీతి. ఇదేమిటని ప్రార్థించడంతో 'సగం పానకాన్నే స్వీకరిస్తా.. మిగతాది భక్తుల కోసం'.. అని చెప్పినట్లు ప్రతీతి. దీంతో అప్పటి నుంచి శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహ స్వామిని పానకాల స్వామిగా కొలుస్తున్నారు. ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజు ఇక్కడ స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు.

కొండపై కోనేరు..

కొండపై ఆలయం, కోనేరు ఉంటాయి. ఈ కోనేరు స్వామి వారి పాదముద్రల ఆకారంలో ఉండడంతో పాటు ఎండాకాలంలో ఎక్కడా నీరు లేకున్నా కోనేరు మాత్రం ఎండిపోయిన దాఖలాలు లేవు. దీన్ని స్వామి మహిమగా భక్తులు చెప్పుకుంటారు. కాగా, త్రిదండి చినజీయర్ స్వామి 2004లో ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ఆయన హాజరయ్యారు.

ధూపదీప నైవేద్యానికి 150 ఎకరాలు

నైజాం నవాబు భూమి శిస్తు వసూళ్ల కోసం ఈ ప్రాంతానికి రాగా జమీందారు భూపతిరెడ్డి ఆయనను ఆలయానికి తీసుకెళ్లాడట. అక్కడ పానకం మహిమను వివరిస్తే నవాబు స్వామి విగ్రహం నోట్లో చేయి పెట్టి అబద్ధమని పరిహాసమాడాడట. దీంతో ఆగ్రహించిన స్వామి.. తన దంతాలతో నవాబు చేయి బయటకు రాకుండా పట్టుకోవడంతో.. ఆయన క్షమించమని కోరడమే కాక ధూపదీప నైవేద్యాల నిమిత్తం కనుచూపు మేర ఉన్న భూమిని ఆలయానికి రాసిచ్చాడని చెబుతారు. కాగా, భూపతిరెడ్డి వంశీయులైన నాగులవంచ గ్రామానికి చెందిన గడ్డం ఉపేందర్‌రెడ్డి కుటుంబీకులు గత మూడేళ్ల వరకు ఆలయ ధర్మకర్త మండలి సభ్యులుగా కొనసాగారు. ప్రస్తుతం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటవుతోంది. అయితే, ఆలయం పేరిట ఉన్న 150 ఎకరాల భూమిని అమ్మి నగదు బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. ఈ డిపాజిట్లపై వచ్చే వడ్డీతో కైంకర్యాలు నిర్వహిస్తున్నారు. ఈ నగదు ఎటూ సరిపోనందున.. ప్రభుత్వం స్పందించి ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలని భక్తులు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా రూపొందించాలి



తెలంగాణలో స్వామి పానకం తాగే ఏకైక ఆలయం సీతంపేటలోనే ఉంది. పచ్చని పంట పొలాల మధ్య ఎత్తయిన కొండపై స్వామి స్వయంభువుగా వెలిశారు. ఘనచరిత్ర కలిగిన శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అనేక అవకాశాలు ఉన్నాయి.

– చందూరు రామకోటేశ్వరరావు, ఆలయ ఈవో

నిర్వహణ కష్టంగా ఉంది



శ్రీ గజగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి. దేశంలో ఉన్న రెండు ఆలయాల్లో సీతంపేటలో ఒకటి ఉంది. ఆలయానికి ఉన్న డిపాజిట్లపై వచ్చే వడ్డీతో ఆలయ నిర్వహణ కష్టంగా ఉంది. ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలి.

– పీవీ రమణాచార్యులు, ఆలయ అర్చకుడు

చిన్నవ్యాధులకు 'సింగరేణి'లోనే చికిత్స

ఇకపై సూపర్ స్పెషాలిటీ వైద్యమైతేనే కార్పొరేట్‌కు రిఫర్

- సీఎండీ బలరాం మౌఖిక ఆదేశాలు
- రిఫర్ కేసులకు మూడేళ్లలో రూ.30 కోట్లు.. ఆర్నెల్లలో రూ.వంద కోట్లా?
- వైద్యాధికారులపై సీఎండీ ఆగ్రహం

గోదావరిఖని: చిన్న వ్యాధులకు ఇక సింగరేణి ఆస్పత్రుల్లోనే వైద్య చికిత్సలు అందించనున్నారు. సంస్థవ్యాప్తంగా ఉన్న ఏడు ఏరియా ఆస్పత్రులను స్పెషాలిటీస్‌గా తీర్చిదిద్దిన క్రమంలో.. సూపర్‌స్పెషాలిటీ వైద్యమైతేనే రిఫర్ చేయాలని సీఎండీ ఎన్.బలరాం ఆదేశించారు. ఆ దిశగా వైద్య యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తోంది. చిన్న చికిత్సలకు ఇక రిఫర్ చేయాలంటే కుదరదని సీఎండీ స్పష్టం చేశారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండి కూడా.. రిఫరల్ వైద్యం కోసం రూ.కోట్లు వెచ్చించడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఈమేరకు సీఎండీ బుధవారం వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వారి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రిఫర్ చేసే వైద్యం కోసం మూడేళ్లలో రూ.30 కోట్లు వెచ్చిస్తే, గత ఆర్నెల్లలో రూ.వంద కోట్లు ఖర్చు చేయడమేమిటని మండిపడ్డారని, ఈ క్రమంలో రిఫర్‌పై విధివిధానాలు మారబోతున్నాయని వెల్లడించారు. వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చడానికి యాజమాన్యం సిద్ధంగా ఉన్నా.. కొన్ని ఏరియా ఆస్పత్రుల నుంచి ప్రతిపాదనలు పంపకపోవడం, తనిఖీల సమయంలో చేతులెత్తేయడాన్ని సీఎండీ తీవ్రంగా పరిగణిస్తున్నారు.



సింగరేణి ఏరియా ఆస్పత్రి

వైద్య పరికరాలకు గ్రీన్‌సిగ్నల్

సింగరేణి కార్మిక కుటుంబాలకు వైద్యం అందించేందుకు.. కనీస వైద్య పరికరాలు, మందుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సీఎండీ ఆదేశించారు. తనిఖీల సమయంలో.. ఏ ఒక్క పరికరం అందుబాటులో లేదనే మాట వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వార్షిక ప్రణాళిక కోసం ఎదురు చూడకుండా.. ఎప్పటికప్పుడు అవసరమైన పరికరాల కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఏరియా ఆస్పత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్లను నియమించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

వైద్యులు సమర్థతను నిరూపించుకోవాలి

కార్మిక కుటుంబాలకు ఏరియా ఆస్పత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నా వెంటనే హైదరాబాద్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని సీఎండీ పేర్కొన్నారు. తద్వారా మూడేళ్లలో రూ.30 కోట్ల వరకు ఉన్న రిఫర్ బిల్లులు.. ఇప్పుడు రూ.100 కోట్లకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతీచిన్న కేసును రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. డాక్టర్లు అంకితభావంతో సేవలు అందించాలని, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలన్నారు. ఏటా సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.400 కోట్లు వెచ్చిస్తోందన్నారు. హైదరాబాద్‌లోనూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.

కార్పొరేట్‌కు దీటైన వైద్యం

సింగరేణిలో వైద్యులు ఉన్నారు. పరికరాలు, సదుపాయాలు కల్పించాం. ఏడు ఏరియా ఆస్పత్రులు, 21 డిస్పెన్సరీలు ఉన్నాయి. సుమారు 170 మంది వైద్య సిబ్బంది ఉన్నారు. కార్పొరేట్ ఆస్పత్రితో సమానంగా స్పెషాలిటీ వైద్యం అందుబాటులో ఉంది. చిన్న వైద్య సేవలు ఇక్కడే పొందాలి. దీన్ని గమనించి సింగరేణి వైద్యుల సేవలను ఉపయోగించుకోవాలి. వైద్యంలో రాజీ లేకుండా ముందుకు వెళ్తున్నాం. ఏటా రూ.400 కోట్లు వైద్యం కోసం వెచ్చిస్తున్నాం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంతా ఉండి కూడా చిన్న వైద్యానికి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు రిఫర్ చేయడం సరికాదు. ఉద్యోగుల్లో వైద్యులు నమ్మకాన్ని పెంచుకోవాలి. సంస్థపై ఆర్థిక భారం పడకుండా చూడాలి.

– కిరణ్‌రాజ్ కుమార్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సింగరేణి

కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధం..

దేశవ్యాప్తంగా కరోనా కేసులు వెలుగు చూస్తున్న క్రమంలో.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సీఎండీ బలరాం సూచించారు. వైరస్ వ్యాప్తి జరిగితే ఎదుర్కొనేందుకు అన్ని ఏరియా ఆస్పత్రుల్లో తగిన విధంగా సంసిద్ధమై ఉండాలని, ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు.

నీలం సంజీవరెడ్డికి సీఎం నివాళి



సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్రపతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సంజీవరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సీఎం.. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.



పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదివారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను హైదరాబాద్‌లో కలిశారు. తనకు టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో స్థానం కల్పించినందుకు ధన్యవాదాలు తెలుపుతూ ఆమెను సన్మానించారు.

సవరణ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో శనివారం రాత్రి మిస్ వరల్డ్ పోటీల గ్రాండ్ ఫినాలే అనంతరం.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీలు ముగిశాయని వేదికపై నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి ప్రకటించారు. అయితే మేయర్‌కు బదులుగా.. సీఎం రేవంత్ రెడ్డి సతీమణి ప్రకటించినట్లు ఆదివారం సాక్షి ప్లస్ (ఈ పేపర్)లో ప్రచురితమైంది. పాఠకులు గమనించగలరు.

అబుదాబిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



వేడుకల్లో ఆకట్టుకున్న గుస్సాడీ వేషధారణ

రాయికల్(జగిత్యాల): అబుదాబిలోని తెలంగాణ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇండియా ఎంబసీ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. వేడుకలకు కౌన్సిలర్ ప్రేమ్‌చంద్, ఆయూ షి సుతారియ హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో ధరావత్ రాజ్‌కుమార్ బృంద సభ్యులు చేసిన గుస్సాడీ నృత్యం, పోతరాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అసోసియేషన్ సభ్యులు పావని, అర్చన, లక్ష్మి ఆధ్వర్యంలో తెలంగాణ కళా సంపదను ప్రతిబింబించే చిత్ర ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచినట్లు అసోసియేషన్ కార్యని ర్వాహకుడు రాజా శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమానికి యూఏఈ లోని వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది కార్మికులు హాజరయ్యారు.

ఏరోప్లేన్ మోడ్‌లోకి కేసీఆర్ రాజకీయ జీవితం

కాంగ్రెస్ సీనియర్ నేత కటకం మృత్యుంజయం

సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌ను ప్రజలు మర్చిపోయారని, ఆయన రాజకీయ జీవితం ఏరోప్లేన్ మోడ్‌లోకి వెళ్లిపోయిందని, ఆయన్ను ఎంత లేపాలని ప్రయత్నించినా లేవలేదని కాంగ్రెస్ సీనియర్ నేత, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి కటకం మృత్యుంజయం వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఒక కన్ను బీఆర్ఎస్ అయితే, మరో కన్ను జాగృతి అని ఎమ్మెల్సీ కవిత అంటున్నారని, అసలు కేసీఆర్ రెండు కళ్లు గుడ్డి కండ్లు అయి ఇంట్లో కూర్చున్నాడని ఎద్దేవా చేశారు. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేసీఆర్‌కు నోటీసులిస్తే తెలంగాణ ప్రజలకు నోటీసులిచ్చినట్టు కవిత చెప్పడం విడ్డూరంగా ఉందని, ఇలాంటి డ్రామాలు మానేసి ఇప్పటికైనా చేసిన పాపాలను కడుక్కోవాలని హితవు పలికారు. జాగృతి పేరు మీద వందల కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును ఖర్చు పెట్టిన కవిత.. జైలుకు ఎందుకు పోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆమె రాసిన లెటర్‌ను లీక్ చేస్తే కేసీఆర్ చేయాలని, లేదంటే ఆమే చేసుకోవాలని, ఇంకెవరికీ ఆ అవసరం ఉండదని చెప్పారు. కాళేశ్వరం కింద 20 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చామని కవిత చెప్పడాన్ని ఖండిస్తున్నామని, కాళేశ్వరం ద్వారా 20 వేల ఎకరాలకు కూడా నీళ్లు రాలేదన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం గురించి విమర్శలు చేసిన కవిత వెంటనే తన మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అవినీతి కుటుంబానికి గాంధీ కుటుంబ త్యాగాల గురించి ఎలా తెలుస్తుందని మృత్యుంజయం ప్రశ్నించారు.

ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం విజయవంతం

● మూడు విడతల్లో 1,12,882 మంది టీచర్లకు ట్రైనింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సృజనాత్మకతతో కూడిన బోధన, అభ్యసన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇటీవల పాఠశాల విద్యాశాఖ తలపెట్టిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం విజయవంతమైంది. రాష్ట్రవ్యాప్తంగా 25,356 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, కేజీబీవీలు, జనరల్ గురుకుల పాఠశాలలున్నాయి. వీటి పరిధిలో 1,22,854 మంది ఉపాధ్యాయులు, ప్రిన్సి పాళ్లు పనిచేస్తున్నారు. వీరికి మే 13వ తేదీనుంచి 31వ తేదీ వరకు మూడు విడతల్లో రాష్ట్ర విద్యాశాఖ ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. ఒక్కో విడతను ఐదు రోజుల పాటు చేపట్టారు. మొదటి విడత శిక్షణ కార్యక్రమం మే 13వ తేదీనుంచి 17వ తేదీ వరకు జరిగింది. ఈ విడతలో 18,448 మంది శిక్షణ పొందారు. రెండో విడత మే 20 నుంచి 24 వరకు జరగగా.. 76,256 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. మూడో విడత మే 27వ తేదీ నుంచి 31 వరకు నిర్వహించగా 27,318 మంది శిక్షణ పొందారు. మొత్తం 1,22,854 మంది టీచర్లు, ప్రిన్సిపాళ్లు ఉండగా... వీరిలో శిక్షణ కార్యక్ర మాలకు 1,16,084 మంది ఎంపిక కాగా... 5,605 మంది రిసోర్స్‌పర్సన్లుగా ఎంపికయ్యా రు. జూలైలో పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో 1,165 మంది శిక్షణకు అనుమతి ఇవ్వలేదు. మూడు విడతలుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమాల్లో 1,12,882 మంది టీచర్లు శిక్షణ పొందారు. 3,202 మంది ఉపాధ్యాయులు వైద్య, ఇతర కారణాల వల్ల శిక్షణకు హాజరు కాలేకపోయారు. వారి కోసం ప్రత్యేక షెడ్యూల్‌ను రూపొందిస్తున్నట్లు విద్యాశాఖ తెలిపింది. ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులను పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ నరసింహారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.





వెయ్యి మందితో యోగా

యోగాంధ్ర వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం 6.30 నుంచి 8.00 గంటల మధ్య విశాఖపట్నంలోని తొట్లకొండపై జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో 1,000 మందితో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి భారీగా హాజరయ్యారు. ఆద్యంతం ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో యువత, వృద్ధులతో సహా అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు.



పరీక్ష పాట్లు

విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీలోని శివాజీ పాలెం పార్కు వద్ద ఏయూ ఇంటర్నేషనల్ బిజినెస్ కాలేజీలో నిర్వహించిన పోలీసు కానిస్టేబుల్ రాత పరీక్షలకు అభ్యర్థులు భారీగా హాజరయ్యారు. పరీక్ష కేంద్రంలోకి వెళ్లడానికి అభ్యర్థులు మండుటెండలో ఇలా నిల్చున్నారు.

క్లుప్తంగా...

ఆహార ధాన్యాల నిల్వ కాంట్రాక్ట్‌ని అదానీకి ఇవ్వొద్దు

ఏపీ రైతుసంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: కార్పొరేట్ దిగ్గజం అదానీ కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పని చేస్తోందని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య కె.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. పంజాబ్, హరియాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సేకరించే ఆహార ధాన్యాల నిల్వ కాంట్రాక్టును 30 ఏళ్లపాటు అదానీ కంపెనీకి ఇచ్చేలా ఒప్పందం చేసుకునేందుకు కేంద్రం సిద్ధపడటం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ఒప్పందం చేసుకోవడానికి ముందే అడ్వాన్స్‌గా రూ.700 కోట్లను అదానీ కంపెనీకి ముట్టజెప్పారని ఆరోపించారు. ఎఫ్‌సీఐని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా కేంద్రం అడుగులు వేస్తోందని విమర్శించారు. ఈ ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్ట్‌లు పూర్తి చేయకుండా 'బనకచర్ల' పేరుతో ప్రచారమా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులు పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం గోదావరి-బనకచర్ల పేరుతో ప్రచారం చేసుకోవడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. ఆయన ఆదివారం విజయవాడలోని దాసరి భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో గుక్కెడు నీళ్ల కోసం ప్రజలు అల్లాడుతున్నా, ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ప్రజల నీటి కష్టాలను తీర్చడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైందన్నారు. అటువంటి చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలని ప్రధాని మోదీ పొగడ్తలతో ముంచెత్తడం విడ్డూరంగా ఉందన్నారు. మోదీ, బాబు పరస్పరం పొగడ్తలతో ముంచెత్తుకుంటుంటే.. ఒక జాతీయ చానల్ మాత్రం ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న అధ్వాన్న పరిస్థితులను, తాగునీటి సమస్యలను ప్రపంచవ్యాప్తంగా ఎండగట్టిందన్నారు.

సీఐడీ విచారణకు యుపిక్స్ కేసు!

ఒంగోలు టౌన్: యానిమేషన్ పేరుతో వందలాది కోట్ల రూపాయలు వసూలు చేసిన యుపిక్స్ కంపెనీ విచారణ కేసును సీఐడీకి అప్పగించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. విజయవాడకు చెందిన నిడుమోలు కిరణ్, అతడి కుటుంబ సభ్యులు ఒంగోలుకు చెందిన వ్యాపారి ఆత్మకూరి అమరలింగేశ్వరరావు వద్ద నుంచి రూ.5 కోట్లు వసూలు చేసినట్లు ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైన సంగతి తెలిసిందే. పోలీసులు రుషికేష్‌లో ఉన్న కిరణ్‌ను ఆదివారం ఒంగోలు తీసుకువచ్చి విచారిస్తున్నట్లు తెలుస్తోంది. విచారణలో నరసరావుపేట, విజయవాడ, వైజాగ్ ప్రాంతాల్లో సుమారు రూ.1000 కోట్లు వసూలు చేసినట్లు తెలిసింది. దాంతో ఈ కేసును సీఐడీకి అప్పగించాలని ఎస్పీ నిర్ణయించినట్లు సమాచారం.

వ్యాన్‌ల వద్ద కష్టంగా ఉంది.. అందుకే రేషన్ షాపుల్లో ఇస్తున్నాం: మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్ : రేషన్ వ్యాన్‌ల వద్ద ఎండలో నిలబడి, వర్షంలో తడిచి ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని లబ్ధిదారులు చెపుతున్నారని, అందుకే మళ్లీ రేషన్ షాపులు తెరవడం జరిగిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం భగ్గేశ్వరం గ్రామంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలసి రేషన్ షాపుల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తాము నిర్వహించిన సర్వేలో వ్యాన్‌ల ద్వారా రేషన్ సరుకులు తీసుకోవడంలో వీధి చివరకు వెళ్లి తీసుకోవడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిసిందన్నారు. సర్వే ద్వారా ప్రజల అభిప్రాయం తెలుసుకున్న అనంతరమే రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేయాలని నిర్ణయించుకోవడం జరిగిందన్నారు.

ఆయిల్ పామ్ రైతుల్లో తీవ్ర అనిశ్చితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం వంట నూనెలపై దిగుమతి సుంకాలను తగ్గించడం, అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల పతనం, పగ్గాలు చేపట్టి ఏడాది కావస్తున్నా ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్)ను ప్రకటించని రాష్ట్ర ప్రభుత్వం వంటి పలు అంశాలు రైతులను తీవ్ర నష్టాల్లోకి నెడుతున్నాయి. ఆయా అంశాల నేపథ్యంలో గత ఏడాది నుంచి కొంతవరకు స్థిరంగా కొనసాగిన పామాయిల్ ధరలు మళ్లీ క్షీణత బాటపట్టాయి. మూడు నెలల్లో టన్ను ధర రూ.21 వేల నుంచి రూ.16 వేలలోపుకు పడిపోతున్న నేపథ్యంలో, పెట్టిన పెట్టుబడి కూడా రాదన్న భయాందోళనకు రైతు గురవుతున్నాడు. -సాక్షి, అమరావతి



ఆందోళనలో.. ఆయిల్ పామ్ రైతు

ఏడాదిగా ఓఈఆర్‌ని ప్రకటించని కూటమి ప్రభుత్వం

- దీనికితోడు అంతర్జాతీయ పరిణామాల ప్రతికూలతలు
- మూడు నెలల్లో టన్నుకు రూ.5 వేలకుపైగా తగ్గనున్న ధర
- పెట్టుబడి కూడా రాకపోవచ్చన్న భయాందోళనలు
- మళ్లీ రోడ్డెక్కే పరిస్థితులు

జగన్ హయాంలో.. హ్యాపీ

- ▲ రాష్ట్రంలో 1.74 లక్షల మంది రైతులు 5.66 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు.
- ▲ ఎకరాకు 7.92 టన్నుల చొప్పున ఏటా సగటున 18.95 లక్షల టన్నుల దిగుబడులొస్తున్నాయి.
- ▲ 2018–19కు పూర్వం సగటున టన్ను రూ.7, 492 చొప్పున లభించగా, వైఎస్ జగన్ హయాంలో గరిష్టంగా తాజా గెలలకు రూ.23,365, కెర్నెల్ నట్స్‌కు రూ.29,250 చొప్పున రైతులకు దక్కింది.
- ▲ అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా ప్రతి ఏటా క్రమం తప్పకుండా తెలంగాణాకు దీటుగా జగన్ ప్రభుత్వం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (ఓఈఆర్)ను ప్రకటించడం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది.
- ▲ ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో 2022–23లో కేంద్రం క్రూడ్ పామాయిల్‌పై ఉన్న 49 శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేసింది. దీనితో ఆయిల్ పామ్ రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొనాల్సి వచ్చింది.
- ▲ పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా ఉప ఉత్పత్తుల (గింజల) విలువను చేర్చి వయబిలిటీ ధరను సవరిస్తూ రైతుకు లాభదాయకమైన ధరను ప్రకటించాలని, దిగుమతి సుంకాన్ని తక్షణమే పునరుద్ధరించాలంటూ అప్పట్లో ఆయిల్ పామ్ రైతులు ఉద్యమ బాటపట్టారు.
- ▲ వీరికి బాసటగా నిలిచిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చారు.
- ▲ ఫలితంగా క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని గతేడాది 20 శాతం విధించింది. సెస్‌తో కలుపుకుంటే 27.5 శాతానికి చేరడంతో ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు కాస్త ఊపిరిపీల్చుకునే పరిస్థితి ఏర్పడింది.

సీన్ రివర్స్...

రైతుల డిమాండ్ మేరకు దిగుమతి సుంకాన్ని పెంచాల్సింది పోయి అనూహ్యంగా తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం వారికి ఆశనిపాతంగా మారుతోంది. తాజాగా దిగుమతి సుంకాన్ని 20 నుంచి 10 శాతానికి తగ్గించడంతో సెస్‌లతో కలుపుకొని 16.5 శాతంగా ఉంది. అదేసమయంలో ఆయిల్ రిఫైనింగ్ ఇండస్ట్రీకి మాత్రం దిగుమతి సుంకం (35.75 శాతం) లో ఎలాంటి మార్పు చేయకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. క్రూడ్ పామాయిల్ దిగుమతులను తగ్గించడం ద్వారా విదేశీ మారక ద్రవ్యం ఆదా చేసేందుకు దేశీయంగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలన్న సంకల్పంతో నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్–ఆయిల్ పామ్(ఎన్ఎంఈవో–ఓపీ)ను ప్రకటించిన కేంద్రమే తాజాగా దిగుమతి సుంకాలను తగ్గించడం ఏ మేరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. గతేడాది విధించిన దిగుమతుల సుంకం పుణ్యమాని ఈ ఏడాది ధర కాస్త నిలకడగా కొనసాగుతోంది. ఏప్రిల్‌లో తాజాగా గెలల ధర టన్ను రూ.21 వేలకు చేరగా, రైతు ఊపిరి పీల్చుకుంటున్నాడు. ఈ తరుణంలో కేంద్ర నిర్ణయంతో ఒక్కసారిగా ఆయిల్ పామ్ ధరల పతనం మొదలయ్యింది. ఈ ప్రభావం దేశంలో తొలి స్థానంలో ఉన్న ఏపీలోని ఆయిల్ పామ్ రైతులపై ఎక్కువగా పడుతోంది.

ఏపీ రైతులకు రూ.425 కోట్లకుపైగా నష్టం!

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ పామాయిల్ ధర కూడా అనూహ్యంగా టన్ను రూ.1.25 లక్షలనుంచి రూ.1.10 లక్షలకు పడిపోయింది. మరో వారం పదిరోజుల్లో కనీసం రూ.లక్షలోపునకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. దిగుమతి సుంకం తగ్గింపుతో పాటు అంతర్జాతీయ మార్కెట్ ధరల ప్రభావంతో ఇప్పటికే టన్నుకు రూ. 21 వేల నుంచి రూ.3 వేలు పతనమై రూ.18 వేలకు చేరిన గెలల ధరలు, మరో వారం పదిరోజుల్లో రూ.16వేల కంటే దిగువకు పడిపోతుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ధరల పతనంతో ఎకరాకు రూ.50వేల చొప్పున ఏపీ రైతులకు రూ.425 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. రిఫైనరీ ఇండస్ట్రీకి ఇస్తున్న ప్రాధాన్యత తమకు ఇవ్వడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఆయా అంశాలపై జాతీయ ఆయిల్ పామ్ ఫార్మర్స్ అసోసియేషన్ మరోసారి ఆందోళన బాట పట్టేందుకు సిద్ధమవుతోంది. సమస్యల తక్షణ పరిష్కారానికి విజ్ఞప్తిచేస్తూ, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీఎస్ఆర్ ప్రసాద్, డాక్టర్ కే.క్రాంతికుమార్ రెడ్డిలు ఇప్పటికే కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖమంత్రి పియోష్ గోయల్‌కు లేఖ రాశారు.

ప్రధాన డిమాండ్లు ఇవీ...

- 2022నాటి స్థాయిలో 49 శాతానికి సుంకాన్ని పునరుద్ధరించాలి.
- కనీస మద్దతు ధర ప్రకటించాలి.
- శుద్ధి నూనె కంటే ముడి నూనెలకు కేవలం 5 శాతం తక్కువ డ్యూటీ ఉండేలా చూడాలి.


అల్లూరి జిల్లాలో గిరిజన సహకార సంస్థ లక్ష్యం దారి తప్పింది. కొంతకాలంగా గిరిజనుల సంక్షేమాన్ని జీసీసీ గాలికొదిలేసింది. అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి వారికి బాసటగా ఉండాల్సిన సంస్థ ఆశయాన్ని విస్మరించింది. గిరిజనులు దళారులపై ఆధారపడి ఆదాయం కోల్పోతున్నా సంస్థను గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు కానరావడం లేదు.



మైదాన ప్రాంతానికి లారీలో వ్యాపారులు తరలిస్తున్న అడ్డాకులు

దళారులే దిక్కు

- లక్ష్యానికి దూరంగా జీసీసీ కార్యకలాపాలు
- అటవీ ఉత్పత్తుల కొనుగోళ్లపై చిరుకన్ను
- గిరిజనులకు దిక్కవుతున్న దళారులు
- ఆదాయం కోల్పోతున్నా పట్టించుకోని వైనం
- గాడిలో పెట్టేందుకు యత్నించని సర్కారు



రంపచోడవరంలో జీసీసీ డీఎం కార్యాలయం

రంపచోడవరం: గిరిజన సహకార సంస్థ లక్ష్యానికి దూరంగా పనిచేస్తోంది. గిరిజనులు సేకరించే చిన్న తరహా అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి వారికి బాసటగా ఉండాల్సిన సంస్థ అరకొరగా కొనుగోళ్లు చేస్తూ చేతులు దులుపుకుంటోంది. కొన్ని రకాల చిన్న తరహా అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడమే మానేసింది.

● అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి ఉండగా మార్కెట్‌లో రేటు లేదనే కారణాన్ని చూపుతూ కొనుగోలుకు దూరంగా ఉంది. ఈ ప్రాంతంలో గిరిజనులకు మంచి ఆదాయాన్నిచ్చే కొండ చీపుళ్ల ధర పడిపోయిందన్న కారణంతో కొనుగోలు చేయడం లేదు. దీంతో గిరిజనులు వారు సేకరించిన చీపుళ్లను మారేడుమిల్లి తీసుకువచ్చి కట్ట రూ.50 నుంచి రూ.60కు అమ్ముకుంటున్నారు. వీటిని దళారులు రూ.70 నుంచి రూ.90కు అమ్ముకుని ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. వీటికి సంబంధించి జీసీసీ నిర్ణయించిన ధరకు దళారులు చెల్లించే ధరకు ఎంతో వ్యత్యాసం ఉంది. మొదటి రకం ధర (గ్రేడ్–1) రూ. 45, గ్రేడ్ –2 రూ. 40, గ్రేడ్ –3 రూ. 35గా నిర్ణయించింది. ప్రస్తుతం మార్కెట్‌లో గిరిజనులు గ్రేడ్‌లతో సంబంధం లేకుండా ఒక కట్ట రూ. 50 ధరకు పైగా అమ్ముకుంటున్నారు.



గిట్టుబాటు ధరలు కోసం ఆందోళన(ఫైల్)

● గతంలో కొనుగోలు చేసిన 20 వేల కొండ చీపుళ్లను కాకినాడ జిల్లా ఏలేశ్వరం గొడౌన్‌లో నిల్వ చేశారు. ఇవి ఇప్పటికీ అలాగే ఉన్నాయి. ఏటా బయట మార్కెట్‌లో కొండచీపుళ్లకు రేటు ఉన్న జీసీసీ నామ మాత్రపు ధరతో కొనుగోలు చేస్తోంది. దీంతో తమ ఉత్పత్తులను జీసీసీ చెల్లించే ధర కంటే బయట వ్యాపారులకు ఎక్కువకు అమ్ముకుంటున్నారు.

● చింతపండు కిలో రూ.36 ధర నిర్ణయించగా బయట మార్కెట్లో వ్యాపారులకు భారీ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకవాడ గండి చింతపండుకు మంచి డిమాండ్ ఉంది. ఈ రకాన్ని వ్యాపారులు రూ.180 నుంచి రూ.200 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. జీసీసీ మాత్రం ఈ రకాన్ని ఇతర ప్రాంతాల్లో లభ్యమయ్యే చింతపండుకు నిర్ణయించిన ధరకు కొనుగోలు చేస్తోంది. దీంతో జీసీసీకి విక్రయించేందుకు గిరిజనులు ఆసక్తి చూపడం లేదు.

● మారేడుమిల్లి ప్రాంత గిరిజనులకు శీకాయ మంచి ఆదాయ వనరు. దీనిని జీసీసీ సరిగ్గా కొనుగోలు చేయడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గతంలో విదేశాలకు ఆర్గానిక్ శీకాయను సరఫరా చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఒక కంపెనీ ఒప్పందం చేసుకుంది. ఆ తరువాత జీసీసీ సరిగ్గా కొనుగోలు చేయడం లేదని గిరిజనులు వాపోతున్నారు.


● జీసీసీ గిరిజనులు సేకరించే, పండించే సుమారు 34 రకాల అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే చిన్న తరహా అటవీ ఉత్పత్తుల సేకరణతో పాటు అవి అంతరించిపోకుండా చూడాల్సి బాధ్యత కూడా ఆ సంస్థపై ఉంది. కోవెల జిగురు కోసం చెట్టు బెరడును సేకరిస్తారు. దీంతో కొంత కాలానికి ఆ చెట్టు చనిపోతుంది. కోవెల చెట్లు అంతరించిపోకుండా వీటి మొక్కలను గిరిజనులతో నాటించి సంతతిని అభివృద్ధి చేయాల్సి ఉంది. జీసీసీకి సేకరణపై ఉన్న శ్రద్ధ వాటి సంరక్షణలో లేదన్న విమర్శలు కూడా ఉన్నాయి. దీని వల్ల చాలా వరకు కోవెల చెట్లు అంతరించిపోయాయి. నరమామిడి చెట్లది అదే పరిస్థితి.

● ఆయుర్వేద విలువలు ఉన్న తిప్ప తీగ, కొవెల జిగురు తదితర వాటి కొనుగోళ్లను పూర్తిగా తగ్గించింది. గానుగ పిక్కలు, కరక్కకాయలు, ముసిడి గింజలు, నల్ల జీడిపిక్కలు,నేపాల గింజలు రెల్ల చెక్క, తానికాయలు వంటి అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేయడం లేదు.



శ్రీవారి దర్శనానికి 20 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం అర్ధరాత్రి వరకు 95,080 మంది స్వామివారిని దర్శించుకున్నారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని వారికి 20 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.



కిక్కిరిసిన కాణిపాకం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి క్షేత్రం ఆదివారం భక్తజనసంద్రంగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో రద్దీ నెలకొంది. భక్తులు వేలాదిగా క్యూకట్టారు. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.



అర్ధగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ



తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో అర్చకులు స్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యం సమర్పించారు. ఆదివారం సెలవు కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. సహజసిద్ధమైన సంజీవరాయ పుష్కరిణి తీర్థం సేవించి బాటల్లో తీసుకెళ్లారు. భక్తులు ఎండలు అధికంగా ఉన్నా ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కిటకిటలాడిన బోయకొండ



చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక పూలు, బంగారు ఆభరణాలతో అత్యంత సుందరంగా ముస్తాబుచేశారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయంలో భక్తుల రద్దీ పెరగడంతో క్యూలన్నీ నిండి కిటకిటలాడాయి. భక్తులకు సౌకర్యాలను ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో పర్యవేక్షించారు.

పెద్దింట్లమ్మా.. చల్లంగా చూడమ్మా..



కై కలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మా.. చల్లంగా చూడమ్మా.. అంటూ భక్తులు పెద్దింట్లమ్మ తల్లిని ఆర్తితో వేడుకున్నారు. ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోటలో కొలువై ఉన్న పెద్దింట్లమ్మ తల్లిని సమీప జిల్లాల నుంచి ఆదివారం పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు ముగుస్తుండటంతో భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించిన భక్తులు పెద్దింట్లమ్మకు మొక్కులు సమర్పించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు పేటేటి పరమేశ్వరశర్మ పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డు ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి చిత్ర పటాల విక్రయం, వాహన పూజలు, భక్తుల విరాళాలు కలిపి మొత్తం రూ.85,340 ఆదాయం వచ్చిందని చెప్పారు.



ప్రతాప్‌గఢ్ కోట దగ్గర ఛత్రపతి శివాజీ విగ్రహం

ఛత్రపతి విజయ విహారం

ఈ టూర్‌లో గిరిదుర్గాలే ప్రధానం. ఛత్రపతి శివాజీ శౌర్యానికి ప్రతీకలు. తిరుమల కొండలంత ఎత్తులో ఉన్నాయి. ఇక... ఓ వనాలయం... మరో నగరాలయం. అవి... దట్టమైన వనాల్లో విస్తరించిన జ్యోతిర్లింగం. మరోటి... ప్రాచీన నగరంలో విలసిల్లిన లక్ష్మీదేవి ఆలయం.

1వ రోజు

ఉదయం ఆరున్నరకు ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్, దాదర్, థానేలలో ఎక్కడైనా రైలెక్కవచ్చు. రైలు రాయగఢ్ వైపు సాగుతుంది. రైల్లో బ్రేక్‌ఫాస్ట్ ఇస్తారు. పదిన్నరకు రైలు మాన్‌గోవ్ స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి రోడ్డు మార్గాన రాయగఢ్ కోటకు చేరాలి. మధ్యాహ్న భోజనం ఎక్కడ అనేది సమయాన్ని బట్టి నిర్ధారిస్తారు. రాయగఢ్ పర్యటన తర్వాత సాయంత్రం ఐదు గంటలకు మాన్‌గోవ్ స్టేషన్‌కు వచ్చి రైలెక్కాలి. రైలు ఆరు గంటలకు పూనే వైపు సాగిపోతుంది. రాత్రి భోజనం రైల్లోనే. పది గంటలకు రైలు పూనేకు చేరుతుంది. హోటల్‌కు చేరడం, పూనేలో రాత్రి బస.



పట్టాభిషేక దుర్గం

రాయిగఢ్ కోట ఉన్న పట్టణం పేరు మహద్. మహారాష్ట్ర, రాయగఢ్ జిల్లాలో ఉంది. ఇది మహాదుర్గం. సముద్రమట్టానికి 4,500 అడుగుల ఎత్తులో ఉంది. సహ్యాద్రి పర్వత శ్రేణుల్లోని ఈ కొండమీదకు చేరడానికి రోప్‌వే, ఏరియల్ ట్రామ్‌వే ఉన్నాయి. కోట లోపల శివాజీ సింహాసనం, పట్టాభిషేకం జరిగిన ప్రదేశం, చెక్కతో నిర్మించిన రాణి ప్యాలెస్, శివాజీ తల్లి జిజాబాయి సమాధి, శివాజీ సమాధి ఉన్నాయి. కోటగోడలు, దర్వాజాల మీదకు అల్లుకున్న పిచ్చి చెట్లుతీగలనుచూస్తే ఈ కోట పరిరక్షణ పట్ల ప్రభుత్వం శ్రద్ధ పెట్టలేదని తెలుస్తుంది. ఇప్పుడు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకి బాధ్యత అప్పగించడంతో పునరుద్ధరణ చర్యలు జరుగుతున్నాయి. ఈ కోట మీద నుంచి చూస్తే చుట్టూ ప్రకృతి సౌందర్యం అంతా దండగా అల్లి అమర్చినట్లుంటుంది. ఇది ఒక ఫీల్‌గుడ్ టూరిస్ట్ డెస్టినేషన్.

2వ రోజు





హోటల్‌లో బ్రేక్‌ఫాస్ట్ తర్వాత పూనాలోని లాల్ మహల్, కాస్బా గణపతి ఆలయాల సందర్శనం. మధ్యాహ్న భోజనం తర్వాత శివ్‌శ్రుతి వీక్షణం. రాత్రి భోజనం తర్వాత హోటల్ గదికి చేరడం. ఆ రాత్రి బస కూడా పూనేలోనే.

లాల్ మహల్ అంటే శివాజీ బాల్యం గడిచిన ప్యాలెస్. శివాజీ తండ్రి షాహాజీ భోసాలే తన కొడుకు, భార్య కోసం కట్టించిన ప్యాలెస్ ఇది. నిజానికి షాహాజీ కట్టించిన నిర్మాణం నిర్వహణ సరిలేక శిథిలమైంది. ఇప్పుడు కనిపిస్తున్న ప్యాలెస్ అదే నమూనాలో చేసిన పునర్నిర్మాణం. ఇక నగరంలో చూడాల్సిన మరో ప్రదేశం కాస్బా గణపతి. ఇది శివాజీ తల్లి రాజమాత జిజాబాయి ప్రతిష్ఠించిన గణపతి విగ్రహం. పూనే వాసులు గ్రామదేవతగా కొలుస్తారు. ఈ గణపతికి ఉన్న చారిత్రక ప్రత్యేకత ఏమిటంటే జాతీయోద్యమంలో భాగంగా బాలగంగాధర తిలక్ సామూహిక గణపతి ఉత్సవాలు మొదలు పెట్టింది ఈ ఆలయంలోనే. ప్రజలను ఒక చోటకు చేర్చడానికి, వారిని జాతీయోద్యమ బాట పట్టించడానికి ఈ ధార్మిక మార్గాన్ని ఎంచుకున్నాడు తిలక్.

3వ రోజు

శివనేరి కోట సందర్శనకు ఉదయాన్నే ఆరు గంటలకు టీ తాగిన తర్వాత హోటల్ నుంచి బయలుదేరాలి. బ్రేక్‌ఫాస్ట్ ప్యాక్ చేసి ఇస్తారు. పూనే నుంచి శివనేరి కోటకు రెండు గంటల ప్రయాణం. మధ్యాహ్న భోజనం తర్వాత భీమశంకర్ దర్శనానికి వెళ్లాలి. ఈ జ్యోతిర్లింగ దర్శనం తర్వాత పూనేకి వచ్చి రాత్రికి హోటల్‌లో బస చేయాలి.



మరాఠా రాజ్యం పుట్టింది!

శివ్‌నేరి కోట ఛత్రపతి శివాజీ పుట్టిన ప్రదేశం. మరాఠా రాజ్య నిర్మాత పుట్టిన నేల అంటే మరాఠా రాజ్యం పుట్టిన నేల కూడా. శివాజీ తాత మాలోజీ భోసాలే నివసించిన కోట ఇది. బహమనీ సుల్తానులు, మొఘలులు, బ్రిటిష్ వారితో జరిగిన యుద్ధాలకు కేంద్ర బిందువు కూడా. ఈ కోట లోపల గంగ, యమున పేరుతో రెండు నీటి గుండాలున్నాయి. ఏడాది పొడవునా వీటిలో నీరు ఉంటుంది. ఈ కోట పై అంతస్థు నుంచి చూస్తే నారాయణగఢ్, హద్సార్, చావాంద్, నీమ్‌గిరి కోటలు కనిపిస్తాయి. ఇంతటి చారిత్రక ప్రాధాన్యం ఉండడంతో యునెస్కో వరల్డ్ హెరిటేజ్ కమిటీ ఈ కోటను వారసత్వ కట్టడాల జాబితాలో చేర్చింది. శివ్‌నేరి కోట నుంచి 70 కిమీల దూరంలో ఉంది భీమశంకర్. చిక్కటి పచ్చదనంతో విస్తరించిన సహ్యాద్రి శ్రేణుల్లో ఉంది. ఇది ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఆరవ జ్యోతిర్లింగ క్షేత్రం. మహారాష్ట్రలో భీమనది తీరాన ఉంది.

4వ రోజు

ఉదయం పూనేలో హోటల్ గది చెక్ అవుట్ చేసి రైలెక్కాలి. ఏడు గంటలకు రైలు బయలు దేరుతుంది. బ్రేక్‌ఫాస్ట్ రైల్లో ఇస్తారు. రైలు పది గంటలకు సతారా స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి రోడ్డు మార్గాన ప్రతాప్‌గఢ్ కోటకు వెళ్లాలి. మధ్యాహ్న భోజనం, కోట సందర్శనం, రాత్రి భోజనం తర్వాత పదిన్నరకు రైలెక్కాలి. పదకొండున్నరకు రైలు కొల్హాపూర్ వైపు బయలుదేరుతుంది.

మరాఠ విజయం

మరాఠా సామ్రాజ్య స్థాపనలో కీలకమైన కోట ప్రతాప్‌గఢ్. మరాఠా సామ్రాజ్యాధినేత శివాజీకి బహమనీ సుల్తాన్ అజమ్‌ఖాన్‌కు మధ్య జరిగిన భీకర యుద్ధంలో శివాజీ గెలిచాడు. శివాజీ కొలిచిన తుల్జా భవానీ మాత ఆలయం ఈ కోటలో ఉంది. సముద్ర మట్టానికి సుమారు వెయ్యి మీటర్ల ఎత్తులో ఉన్న ఈ కోట అందమైన ప్రకృతి సౌందర్యవీక్షణానికి వేదిక కూడా.

5వ రోజు

తెల్లవారు జామున ఐదు గంలకు రైలు కొల్హాపూర్‌లోని షాహూ మహారాజ్ టెర్మినస్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్‌కు వెళ్లి రిఫ్రెష్ అయిన తర్వాత కొల్హాపూర్‌లోని మహాలక్ష్మి ఆలయ దర్శనం. మధ్యాహ్న భోజనం తర్వాత పన్హాల ఫోర్ట్ సందర్శనం. ఆ తర్వాత కొల్హాపూర్‌లోని రైల్వేస్టేషన్‌కు వచ్చి రైలెక్కాలి. రైలు రాత్రి ఎనిమిది గంటలకు బయలుదేరి ముంబయి వైపు సాగిపోతుంది. రాత్రి భోజనం రైల్లోనే.

కొల్హాపూర్ మహారాష్ట్ర కాశీ



భారతీయులు జీవితంలో ఒక్కసారైనా చూసి తీరాలని కోరుకునే ప్రదేశం కొల్హాపూర్. ఇక్కడి లక్ష్మీదేవిని దర్శించుకోవడానికి ఉత్తర- దక్షిణ భారతాల వాళ్లు వస్తారు. ఈ ఆలయ నిర్మాణం గురించి కూడా విశేషంగా చెప్పుకోవాలి. దక్షిణాది ఆలయాల్లాగ విగ్రహాల సుమహారంగా ఉండదు. ఉత్తరాది నిర్మాణాల్లాగానూ ఉండదు. స్థూలంగా నిర్మాణం రెండింటి కలయికగా ఉంటుంది. సునిశితంగా శిల్పనైపుణ్యాన్ని గమనిస్తే జామెట్రికల్ డిజైన్స్‌తో ఆశ్చర్యపోవు కలిగిస్తుంది. దక్షిణ కాశిగా చెప్పుకుంటారు. పెద్ద పట్టణం, మరాఠీ సినిమా పరిశ్రమ కేంద్రం. ఈ పర్యటనలో కొల్హాపూర్ లక్ష్మీదేవి దర్శనం తర్వాత న్యూ ప్యాలెస్ వీక్షణం. ఆ తర్వాత కొల్హాపురి చెప్పులు ఒక జత కొనుక్కోవడం మర్చిపోవద్దు. ఎందుకంటే పనితనం రీత్యా వీటికి జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) ట్యాగ్ కూడా వచ్చింది.

పన్హాల ఫోర్ట్



శివాజీ ఈ కోటను బీజాపూర్ సుల్తానులతో యుద్ధం చేసి సాధించాడు. ఆ తర్వాత మరికొన్ని నిర్మాణాలు చేశాడు. శివాజీ వారసులు ఈ కోట నుంచి మొఘల్, బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీతో యుద్ధాలు చేశారు. ఈ కోట నిర్మాణపరంగా పెద్దది కాదు, కానీ మరాఠాల పాలన ముందుచూపుకు నిదర్శనం. కోట లోపల ధాన్యాగారం ఉంది. అందులో నిల్వ చేసిన ధాన్యం కోట లోపల ఉన్న వారికి మాత్రమే కాదు, రాజ్యంలో కరువు సంభవిస్తే ప్రజల ఆకలి తీర్చడానికి ఒక ఏడాదికి సరిపడినంత ధాన్యాన్ని నిల్వ చేసేవారు. కోట లోపల ఒక దిగుడు బావి ఉంది. స్టెప్‌వెల్‌లు గుజరాత్‌లో ఎక్కువగా ఉంటాయి. ఢిల్లీలోనూ ఉన్నాయి. హైదరాబాద్‌లోనూ ఉంది. తెలంగాణ జిల్లాల్లో కూడా ఉండేవి. ఆర్కియలాజికల్ సర్వే విభాగం తవ్వకాల్లో ఇటీవల కొన్ని స్టెప్‌వెల్‌లు బయటపడ్డాయి. భారతీయ శాస్త్రీయత నిర్మాణాలకు ఇవి తార్కాణాలు.

6వ రోజు

ఉదయం ఆరు గంటలకు రైలు ముంబయిలోని ఛత్రపతి శివాజీ టెర్మినస్‌కు చేరడంతో టూర్ పూర్తవుతుంది. దాదర్, థానేల్లో కూడా దిగవచ్చు.





ఛత్రపతి శివాజీ మహారాజ్ సర్క్యూట్ ప్రతాప్‌గఢ్...
ఇది ఐఆర్‌సీటీసీ భారత్ గౌరవ్ యాత్ర నిర్వహిస్తున్న ఆరు రోజుల టూర్ ప్యాకేజ్. జూన్ 9వ తేదీన మొదలవుతుంది. ముంబయిలో మొదలయ్యే ఈ టూర్‌లో రాయగఢ్ ఫోర్ట్, పూనే, శివనేరీ ఫోర్ట్, భీమశంకర్ జ్యోతిర్లింగ దర్శనం, ప్రతాప్‌గఢ్ ఫోర్ట్, కొల్హాపూర్, పన్హాలా ఫోర్ట్ కవర్ అవుతాయి.

- కొంకణ్ రైల్వేస్ ట్రైన్ ముంబయిలో ఛత్రపతి శివాజీ టెర్మినస్ నుంచి టూర్ మొదలవుతుంది. మాన్‌గోవ్, పూనే, సతారా, ఛత్రపతి షాహూ మహారాజ్ టెర్మినస్ కొల్హాపూర్ మీదుగా తిరిగి ముంబయికి చేరుతుంది.
- టికెట్ ధరలు స్లీపర్ క్లాస్ (ఎకానమీ)లో ఒకరికి 13,155 రూపాయలు, థర్డ్ ఏసీ (కంఫర్ట్)లో దాదాపుగా 20వేలు, సెకండ్ ఏసీ (సుపీరియర్)లో 27 వేలకు పైగా అవుతుంది.
- రాత్రి బసకు ఎకానమీ క్లాస్‌కు నాన్ ఏసీ గదులు డబుల్ లేదా ట్రిపుల్ షేరింగ్‌లో ఇస్తారు. రైలు దిగిన తరవాత రోడ్డు ప్రయాణానికి నాన్ ఏసీ వాహనంలో ప్రయాణం. కంఫర్ట్, సుపీరియర్ ప్యాకేజ్‌లో బస ఏసీ గదుల్లో. ఒక్కరుగా బుక్ చేసుకున్న వారు ఇతర ప్రయాణికులతో రూమ్ షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. లోకల్ ట్రాన్స్‌పోర్టేషన్‌కి ఏసీ వాహనాలు.
- ప్యాకేజ్‌లో చెప్పిన టికెట్ ధరలకు ట్యాక్స్ అదనం. ప్యాకేజ్‌లో ట్రావెల్ ఇన్సూరెన్స్, సెక్యూరిటీ ఉంటుంది. భోజనం శాకాహారం ఇస్తారు.
- పర్యాటక ప్రదేశాల్లో బోటింగ్ వంటి ఎంటర్‌టైన్‌మెంట్ ఖర్చులు ప్యాకేజ్‌లో వర్తించవు.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి, ఫీచర్స్ ప్రతినిధి

శభాష్ స్వితోలినా

గత ఏడాది రన్నరప్ జాస్మిన్ పావోలినిపై సంచలన విజయం

మూడు మ్యాచ్ పాయింట్లు కాపాడుకొని గెలిచిన ఉక్రెయిన్ టెన్నిస్ స్టార్


జాస్మిన్ పావోలిని


స్వితోలినా

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో సంచలనం చోటు చేసుకుంది. టైటిల్ ఫేవరెట్స్‌లో ఒకరైన ఇటలీ స్టార్, ప్రపంచ నాలుగో ర్యాంకర్, నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని ప్రిక్వార్టర్ ఫైనల్లోనే ఇంటిముఖం పట్టింది. ఉక్రెయిన్ సీనియర్ ప్లేయర్ ఎలీనా స్వితోలినా అద్భుత పోరాటపటిమ కనబరిచి జాస్మిన్ పావోలినిని బోల్తా కొట్టించింది. మూడు సార్లు మ్యాచ్ పాయింట్లను కాచుకొని స్వితోలినా గెలుపొందడం విశేషం. కెరీర్‌లో 12వసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడుతోన్న 13వ సీడ్ స్వితోలినా తాజా విజయంతో ఐదోసారి ఈ మెగా టోర్నీలో క్వార్టర్ ఫైనల్ దశకు అర్హత సాధించింది. 2 గంటల 24 నిమిషాలపాటు జరిగిన పోరులో స్వితోలినా 4-6, 7-6 (8/6), 6-1తో జాస్మిన్‌ను ఓడించి క్వార్టర్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ స్వియాటెక్‌తో పోరుకు సిద్ధమైంది. తొలి సెట్ కోల్పోయిన స్వితోలినా రెండో సెట్‌లో 3-5తో వెనుకబడింది. ఎనిమిదో గేమ్‌లో జాస్మిన్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన స్వితోలినా ఆధిక్యాన్ని 4-5కు తగ్గించింది. తొమ్మిదో గేమ్‌లో స్వితోలినా సర్వీస్‌లో జాస్మిన్ విజయానికి రెండు పాయింట్ల దూరంలో నిలిచింది. అయితే ఈ రెండింటిని కాపాడుకున్న స్వితోలినా తన సర్వీస్‌ను నిలబెట్టుకొని స్కోరును 5-5తో సమం చేసింది. అనంతరం స్కోరు 6-6తో సమం కావడంతో సెట్ టైబ్రేకర్‌కు దారి తీసింది. టైబ్రేక్‌లో జాస్మిన్ 6-5తో ఆధిక్యంలో నిలిచి విజయానికి పాయింట్ దూరంలో నిలిచింది. ఈసారీ స్వితోలినా సంయమనం కోల్పోకుండా ఆడి వరుసగా మూడు పాయింట్లు గెలిచి సెట్‌ను సొంతం చేసుకొని మ్యాచ్‌లో నిలిచింది. నిర్ణాయక మూడో సెట్‌లో స్వితోలినా చెలరేగిపోయి 4-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో సెట్‌ను, మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో జాస్మిన్ తన సర్వీస్‌ను ఏడుసార్లు, స్వితోలినా ఆరుసార్లు కోల్పోయారు.

స్వియాటెక్ వరుసగా ఆరోసారి...

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్, ఐదో సీడ్ ఇగా స్వియాటెక్ వరుసగా ఆరోసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గత మూడేళ్లలో ఈ టోర్నీలో విజేతగా నిలిచిన స్వియాటెక్‌కు ప్రిక్వార్టర్ ఫైనల్లో గట్టిపోటీ ఎదురైంది. 12వ సీడ్ రిబాకినా (కజకిస్తాన్)తో జరిగిన మ్యాచ్‌లో స్వియాటెక్ 1-6,


స్వియాటెక్

6-3, 7-5తో నెగ్గి ముందంజ వేసింది. అరంటా సాంచెజ్ వికారియో (స్పెయిన్; 1991 నుంచి 2000 వరకు; 10 సార్లు) తర్వాత ఫ్రెంచ్ ఓపెన్‌లో వరుసగా ఆరు లేదా అంతకంటే ఎక్కువసార్లు క్వార్టర్ ఫైనల్ చేరిన రెండో ప్లేయర్‌గా స్వియాటెక్ గుర్తింపు పొందింది. రిబాకినాతో 2 గంటల 30 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో స్వియాటెక్ రెండు ఏస్‌లు సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. నాలుగుసార్లు తన సర్వీస్‌ను కోల్పోయినా స్వియాటెక్ ప్రత్యర్థి సర్వీస్‌ను కూడా నాలుగుసార్లు బ్రేక్ చేసింది. 33 విన్నర్స్ కొట్టిన స్వియాటెక్ నెట్‌వద్దకు 11 సార్లు దూసుకొచ్చి ఎనిమిదిసార్లు పాయింట్లు గెలిచింది.

సబలెంకా జోరు

ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సబలెంకా (బెలారస్), ఎనిమిదో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) కూడా క్వార్టర్ ఫైనల్ చేరుకున్నారు. సమ్సనోవా (రష్యా)తో 2 గంటల 47 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో కిన్‌వెన్ జెంగ్ 7-6 (7/5), 1-6, 6-3తో గెలిచి తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. సబలెంకా 7-5,6 -3తో అనిసిమోవా (అమెరికా)ను ఓడించింది. తద్వారా సెరెనా విలియమ్స్ (అమెరికా) తర్వాత వరుసగా పదిసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో క్వార్టర్ ఫైనల్ చేరుకున్న ప్లేయర్‌గా ఈ బెలారస్ స్టార్ ఘనత వహించింది.

బోపన్న, యూకీ జోడీలు అవుట్

ఫ్రెంచ్ ఓపెన్‌లో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. పురుషుల డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీ జోడీలు మూడో రౌండ్‌లో నిష్క్రమించాయి. బోపన్న (భారత్)-ఆడమ్ పావ్లాసెక్ (చెక్ రిపబ్లిక్) ద్వయం 2-6, 6-7 (5/7)తో రెండో సీడ్ హ్యారీ హెలియోవారా (ఫిన్‌లాండ్)-హెన్రీ ప్యాటెన్ (బ్రిటన్) జోడీ చేతిలో ఓడిపోయింది. యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జంట 4-6, 4-6తో తొమ్మిదో సీడ్ క్రిస్టియన్ హారిసన్-ఇవాన్ కింగ్ (అమెరికా) జోడీ చేతిలో పరాజయం చవిచూసింది. మూడో రౌండ్‌లో ఓడిన బోపన్న, యూకీ జోడీలకు 43,500 యూరోల (రూ. 42 లక్షల 22 వేలు) చొప్పున ప్రైజ్‌మనీ లభించింది. మరోవైపు బాలుర సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో మానస్ ధామ్నె (భారత్) 5-7, 3-6తో రోనిత్ కర్కి (అమెరికా) చేతిలో ఓటమి పాలయ్యాడు.

జొకోవిచ్ ముందుకు



పురుషుల సింగిల్స్ విభాగంలో మాజీ చాంపియన్, సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. మూడో రౌండ్ మ్యాచ్‌లో జొకోవిచ్ 6-3, 6-4, 6-2తో ఫిలిప్ మిసోలిచ్ (ఆస్ట్రియా)పై గెలుపొందాడు. 2 గంటల 8 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో జొకోవిచ్ ఆరు ఏస్‌లు సంధించాడు. ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగు సార్లు బ్రేక్ చేశాడు. అమెరికా ప్లేయర్, ప్రపంచ 12వ ర్యాంకర్ టామీ పాల్ తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరుకున్నాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో టామీ పాల్ 6-3, 6-3, 6-3తో పాపిరిన్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు.

దీపక్, నమన్ పసిడి పంచ్


దీపక్


నమన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. పోటీల చివరి రోజు రెండు స్వర్ణాలు నెగ్గి... మొత్తం 8 పతకాలు తమ ఖాతాలో వేసుకున్నారు. ఆదివారం దీపక్, నమన్ తన్వర్ పసిడి పతకాలతో మెరిశారు. పురుషుల 75 కేజీల ఫైనల్లో దీపక్ 5-0తో అబ్దురఖిమోవ్ జవోఖిర్ (ఉజ్బెకిస్తాన్)పై విజయం సాధించగా... 90 కేజీల తుది పోరులో నమన్ తన్వర్ 4-1తో హాన్ జిహెన్ (చైనా)పై గెలిచి బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. మహిళల 80 ప్లస్ కేజీల విభాగంలో కిరణ్ ఫైనల్లో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. తుదిపోరులో కిరణ్ 2-3 యెల్దానా తలిపోవా (కజకిస్తాన్) చేతిలో ఓడింది. తమన్నా (51 కేజీలు), ప్రియా (57 కేజీలు), సంజూ (60 కేజీలు), సనేహ (70 కేజీలు), లాల్‌ఫక్‌మవి రాల్టే (80 కేజీలు) కాంస్యాలు చేజిక్కించుకున్నారు. ఈ టోర్నీలో భారత్ తరఫు నుంచి మొత్తం 19 మంది బాక్సర్లు బరిలోకి దిగారు.

గువాహటిలో లవ్లీనా బాక్సింగ్ అకాడమీ

న్యూఢిల్లీ: యువ బాక్సర్లకు తర్ఫీదునిచ్చేందుకు భారత స్టార్ బాక్సర్, 2020 టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహైన్ సొంత బాక్సింగ్ అకాడమీని ప్రారంభించనుంది. గువాహటిలో ఏర్పాటు చేసిన ఈ అకాడమీని మంగళవారం అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ప్రారంభించనున్నారు. సహజ నైపుణ్యానికి అంతర్జాతీయ స్థాయి వసతులు తోడైతే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని లవ్లీనా వెల్లడించింది. 'ఈ అకాడమీతో బాక్సింగ్ ప్రాక్టీస్ మాత్రమే కాకుండా... మారుమూల ప్రాంతవాసుల కలలు కూడా సాకారం అవుతాయి. రింగ్‌లో అడుగు పెట్టాలని చూస్తున్న యువ బాలబాలికలకు ఈ అకాడమీ దిశానిర్దేశం చేయనుంది. ఔత్సాహిక బాక్సర్లు కేవలం పంచ్‌లు విసరడమే కాకుండా... నిలకడగా విజయాలు సాధించేందుకు అవసరమైన క్రమశిక్షణ, స్ఫూర్తినిచ్చే దిశగా ఇక్కడ సాధన సాగుతుంది' అని లవ్లీనా చెప్పింది. ఈశాన్య రాష్ట్రాల్లో క్రీడా మౌలిక వసతులు మరింత మెరుగవడం దిశగా ఇది కీలక ముందడుగని 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం నెగ్గిన లవ్లీనా పేర్కొంది.



'షూటౌట్'లో ఉరుగ్వేపై భారత్ విజయం


లాల్‌రిన్‌పుయి

రొసారియో (అర్జెంటీనా): నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు నాలుగో విజయం నమోదు చేసుకుంది. గత మ్యాచ్‌లో పరాజయం అనంతరం తిరిగి పుంజుకున్న యువ భారత్ ఆదివారం ఉరుగ్వేతో జరిగిన మ్యాచ్‌లో 'షూటౌట్'లో 3-1తో విజయం సాధించింది. నిర్ణీత సమయంలో రెండు జట్లు 2-2 గోల్స్‌తో సమంగా నిలువగా... విజేతను తేల్చేందుకు 'షూటౌట్' నిర్వహించారు. 'షూటౌట్'లో భారత్ పైచేయి సాధించింది. రెగ్యులర్ సమయంలో భారత్ తరఫున వైస్ కెప్టెన్ హీనా (10వ నిమిషంలో), లాల్‌రిన్‌పుయి (24వ నిమిషంలో) చెరో గోల్ చేశారు. ఉరుగ్వే తరఫున ఇన్స్ డె పొసాడస్ (54వ నిమిషంలో), మిలాగ్రోస్ సైగల్ (55వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. తొలి క్వార్టర్‌లోనే హీనా గోల్ కొట్టడంతో ఖాతా తెరిచిన భారత్... రెండో క్వార్టర్‌లో మిజోరం అమ్మాయి లాల్‌రిన్‌పుయి గోల్‌తో ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. ఇదే జోరులో విజయం ఖాయమే అనుకుంటే... ఆఖరి క్వార్టర్‌లో విజృంభించిన ఉరుగ్వే నిమిషం వ్యవధిలో రెండు గోల్స్ చేసి స్కోరు సమం చేసింది. దీంతో షూటౌట్ అనివార్యం కాగా... భారత్ తరఫున గీత యాదవ్, కనిక సివాచ్, లాల్థాంట్లూగి సఫలమయ్యారు. ఉరుగ్వే ప్లేయర్లు ఒక్కో గోల్ మాత్రమే కొట్టడంతో భారత్ విజయం ఖాయమైంది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య అర్జెంటీనాతో భారత్ తలపడుతుంది. మరో మ్యాచ్‌లో ఉరుగ్వే జట్టుతో చిలీ ఆడుతుంది. భారత్ ఈ టోర్నీలో అర్జెంటీనా చేతిలో మాత్రమే ఓడిపోయింది.

పియాస్ట్రి ప్రతాపం

స్పానిష్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన మెక్‌లారెన్ డ్రైవర్





బార్సిలోనా (స్పెయిన్): క్వాలిఫయింగ్ సెషన్‌లో కనబరిచిన దూకుడును ప్రధాన రేసులోనూ కొనసాగిస్తూ... మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో ఐదో విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం జరిగిన స్పానిష్ గ్రాండ్ ప్రిలో పియాస్ట్రి విజేతగా అవతరించాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన పియాస్ట్రి ఆద్యంతం ఆధిపత్యం చలాయించాడు. నిర్ణీత 66 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 32 నిమిషాల 57.375 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో పియాస్ట్రి చైనా గ్రాండ్‌ప్రి, బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి, సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి, మయామి గ్రాండ్‌ప్రిలలో విజేతగా నిలిచాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానాన్ని పొందగా... ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఐదో స్థానంలో నిలిచినా... చివరి ల్యాప్‌లో జార్జి రసెల్ కారును ఢీకొట్టినందుకు అతనిపై 10 సెకన్ల పెనాల్టీని విధించారు. దాంతో వెర్‌స్టాపెన్ చివరకు పదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. మరోవైపు ఆస్టన్ మార్టిన్ జట్టు డ్రైవర్ లాన్స్ స్ట్రోల్ చేతిలో నొప్పి కారణంగా రేసులో పాల్గొనలేదు. మెర్సిడెస్ డ్రైవర్ కిమి ఆంటోనెలి 53వ ల్యాప్‌లో, అలెగ్జాండర్ ఆల్బోన్ (విలియమ్స్) 27వ ల్యాప్‌లో వైదొలిగారు. 24 రేసుల ఈ సీజన్‌లో 9 రేసులు ముగిశాయి. 186 పాయింట్లతో పియాస్ట్రి అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 176 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 137 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు కెనడియన్ గ్రాండ్‌ప్రి జూన్ 15న మాంట్రియల్‌లో జరుగుతుంది.

స్పానిష్ గ్రాండ్‌ప్రి రేసు ఫలితాలు (టాప్-10)

స్థానం	డ్రైవర్	జట్టు	టైమింగ్	వ్యత్యాసం	పాయింట్లు
1	ఆస్కార్ పియాస్ట్రి	మెక్‌లారెన్	1:32:57.375 సెకన్లు		25
2	లాండో నోరిస్	మెక్‌లారెన్	1:32:59.846 సెకన్లు	2.471 సెకన్లు	18
3	చార్లెస్ లెక్‌లెర్క్	ఫెరారీ	1:33:07.830 సెకన్లు	10.455 సెకన్లు	15
4	జార్జియో రసెల్	మెర్సిడెస్	1:33:08.734 సెకన్లు	11.359 సెకన్లు	12
5	నికో హుల్కెన్‌బర్గ్	కిక్ సాబెర్	1:33:11.023 సెకన్లు	13.648 సెకన్లు	10
6	లూయిస్ హామిల్టన్	ఫెరారీ	1:33:12.883 సెకన్లు	15.508 సెకన్లు	8
7	ఐసాక్ హడ్జర్	రేసింగ్ బుల్స్	1:33:13.397 సెకన్లు	16.022 సెకన్లు	6
8	గాస్లీ	అల్పైన్	1:33:15.257 సెకన్లు	17.882 సెకన్లు	4
9	ఫెర్నాండో అలోన్సో	ఆస్టాన్ మార్టిన్	1:33:18.939 సెకన్లు	21.564 సెకన్లు	2
10	మ్యాక్స్ వెర్‌స్టాపెన్	రెడ్‌బుల్	1:33:19.201 సెకన్లు	21.826 సెకన్లు	1

చాంపియన్స్ లీగ్ విజేత పీఎస్‌జీ

ఏడు దశాబ్దాల టోర్నీ చరిత్రలో తొలిసారి టైటిల్ సొంతం

ఫైనల్లో 5-0 గోల్స్ తేడాతో ఇంటర్ మిలాన్‌పై గెలుపు



మ్యూనిక్: ప్రతిష్టాత్మక చాంపియన్స్ లీగ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) జట్టు తొలిసారి విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన తుది పోరులో పీఎస్‌జీ 5-0 గోల్స్ తేడాతో ఇంటర్ మిలాన్ జట్టుపై విజయం సాధించింది. పీఎస్‌జీ తరఫున డెసైర్ డౌ (20వ, 63వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో చెలరేగగా... అష్రఫ్ హకిమి (12వ నిమిషంలో), ఖ్విచా క్వారట్స్‌ఖెలియా (73వ నిమిషంలో), సెన్నీ మయులు (86వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మ్యాచ్ ఆద్యంతం పీఎస్‌జీ జట్టు ఆధిపత్యం కనబర్చగా... ఇటలీ క్లబ్ ఇంటర్ మిలాన్ జట్టు ఒక్క గోల్ కూడా సాధించలేకపోయింది. 60 శాతం బంతిని తమ అధీనంలో పెట్టుకున్న పీఎస్‌జీ చిన్న చిన్న పాస్‌లతో ఫలితం రాబట్టింది. 70 ఏళ్ల చరిత్రగల యూరోపియన్ కప్ ఫైనల్లో ఇలా ఒక జట్టు ఏకపక్షంగా భారీ ఆధిక్యంతో విజయం సాధించడం ఇదే తొలిసారి. పీఎస్‌జీకి ఇదే మొదటి యూరోపియన్ కప్ టైటిల్ కాగా... ఏడో ఫైనల్ ఆడిన ఇంటర్ మిలాన్ జట్టు నాలుగోసారి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 1956లో తొలిసారి నిర్వహించిన ఈ టోర్నీలో రియల్ మాడ్రిడ్ జట్టు విజేతగా నిలవగా... ఇప్పుడు పీఎస్‌జీ రూపంలో 24వ విజేత అవతరించింది. మ్యూనిక్ వేదికగా ఇప్పటి వరకు ఐదుసార్లు ఈ టోర్నీ ఫైనల్ జరగగా... ఐదుసార్లూ కొత్త విజేత ఆవిర్భవించడం విశేషం.

ముఖ్యమంత్రుల ముచ్చట



ఆదివారం మదురైలో జరిగిన డీఎంకే భేటీలో తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌ను సన్మానిస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు



ఉత్తరాఖండ్ పర్యటన సందర్భంగా హరిద్వార్‌లో హర్‌ కీ పౌరీ వద్ద గంగలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా దంపతుల పవిత్ర స్నానం



సింహస్థ కుంభమేళా-2027 ఏర్పాట్ల పర్యవేక్షణ సందర్భంగా నాసిక్‌లో మహంతుల ఆశీర్వాదం తీసుకుంటున్న మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్



గురుగ్రాంలో యువ క్రికెటర్లతో భేటీ సందర్భంగా సరదాగా కాసేపు బ్యాటు చేతబట్టిన హరియాణా ముఖ్యమంత్రి నయాబ్‌సింగ్ సైనీ

'నాసా' చీఫ్‌పై మారిన ట్రంప్ నిర్ణయం

- ఎలాన్ మస్క్ మిత్రుడు జేర్డ్ ఐజాక్‌మాన్‌కు మొండిచెయ్యి
- కొత్త నామినీ పేరును త్వరలో ప్రకటిస్తానన్న అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్: అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా'కు ఎవరు సారథ్యం వహిస్తారన్నది ఇంకా తేలడం లేదు. నాసా చీఫ్ పదవి కోసం చాలామంది పోటీ పడుతున్నారు. ఇందులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సలహాదారుడైన ఎలాన్ మస్క్ సన్నిహితుడు జేర్డ్ ఐజాక్‌మాన్ కూడా ఉన్నారు. ఈ పదవికి ఆయన పేరును నామినేట్ చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ట్రంప్ తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి సోషల్ మీడియాలో పోస్టుచేశారు. ఐజాక్‌మాన్ నేపథ్యాన్ని, గతంలో ఆయనకున్న సంబంధాలను పూర్తిస్థాయిలో సమీక్షించిన తర్వాతే ఈ చర్య తీసుకున్నట్లు వెల్లడించారు. కొత్త నామినీ ఎవరన్నది త్వరలో ప్రకటిస్తానని తెలిపారు. అంతరిక్ష పరిశోధనల్లో అమెరికాను అగ్రస్థానంలో నిలిపే నాయకుడి కోసం తాను అన్వేషిస్తున్నట్లు స్పష్టంచేశారు. 42 ఏళ్ల ఐజాక్‌మాన్ స్పేస్ ఎక్స్ సంస్థ అధినేత ఎలాన్ మస్క్‌కు సన్నిహితుడు. 2021లో స్పేస్‌ఎక్స్ నుంచి తొలి చార్టర్డ్ విమానం కొనుగోలు చేశాడు. 'షిఫ్ట్4'అనే క్రెడిట్ కార్డ్ ప్రాసెసింగ్ కంపెనీకి సీఈఓగా వ్యవహరిస్తున్నాడు. ఐజాక్‌మాన్ పట్ల ట్రంప్‌కు మంచి అభిప్రాయమే ఉండేది. తాను అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐజాక్‌మాన్‌ను నాసా చీఫ్‌గా నియమిస్తానని గత ఏడాది డిసెంబర్‌లో ట్రంప్ స్వయంగా ప్రకటించారు. ఐజాక్‌మాన్ నామినేషన్‌ను ఈ ఏడాది ఏప్రిల్‌లో సెనేట్ కమిటీ సైతం ఆమోదించింది. ఇంతలోనే ట్రంప్ తన నిర్ణయం మార్చుకోవడం చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక అసలు కారణాలు ఏమిటన్నది తెలియరాలేదు. వైట్‌హౌస్ స్పందించలేదు.

ఒంటరి నిర్బంధమే... భరించలేని శిక్ష

ఇవావో హకామడ. ఇటీవల అంతర్జాతీయంగా మారుమోగిన కేసు. జపాన్‌లో శిక్షల తీవ్రత, అక్కడి నేర న్యాయవ్యవస్థ గురించి మరోసారి చర్చకు తెరతీసిన కేసు. 89 ఏళ్ల హకామడ మాజీ ప్రొఫెషనల్ బాక్సర్. తను పనిచేసే సంస్థ యజమానిని, అతడి కుటుంబాన్ని హత్య చేశాడన్న ఆరోపణలపై 1968లో కోర్టు అతనికి మరణశిక్ష విధించింది. దాని అమలును పెండింగ్‌లో పెట్టడంతో ఏకంగా 50 ఏళ్లకు పైగా జైలు జీవితం గడిపాడు! ప్రపంచంలో అత్యంత ఎక్కువ కాలం జైలు జీవితం గడిపిన మరణశిక్ష ఖైదీగా రికార్డులకెక్కాడు. అయితే, పోలీసుల చిత్రహింసలకు తట్టుకోలేకే చేయని నేరాన్ని ఒప్పుకోవాల్సి వచ్చిందని హకామడ ఇటీవల వాపోయాడు. ఈ కేసులో సాక్ష్యాలు తారుమారైనట్టు షిజుయోకా జిల్లా కోర్టు కూడా 2024 మార్చిలో అనుమానం వ్యక్తం చేసింది. పునర్విచారణకు ఆదేశిస్తూ హకామడను విడుదల చేసింది. అనంతరం 2024 సెప్టెంబర్ 26న అతన్ని నిర్దోషిగా ప్రకటించింది. అర్ధశతాబ్దానికి పైగా అక్రమంగా నిర్బంధించినందుకు 21.7 కోట్ల యెన్లు (సుమారు రూ.12.5 కోట్లు) నష్టపరిహారంగా చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జపాన్‌లో అత్యధిక క్రిమినల్ నష్టపరిహారంగా ఇది రికార్డు సృష్టించింది. దీని వెనక హకామడ సోదరి హిడెకో దశాబ్దాల పోరాటం దాగుంది. లాయర్లను కలవడం, పిటిషన్లు వేయడం, ప్రజా మద్దతు కూడగట్టడం... ఇలా ఆమె చేయని ప్రయత్నం లేదు. కానీ సోదరుడు ఎట్టకేలకు విడుదలయ్యాడన్న ఆనందం కూడా ఆమెకు మిగల్లేదు. 55 ఏళ్ల ఒంటరి నిర్బంధం హకామడ మానసిక ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బ తీయడమే అందుకు కారణం. జపాన్ జైళ్లలో

జపాన్ జైళ్లలో దుర్భర పరిస్థితులు

దశాబ్దాలుగా మారని చట్టాలు • 'హకామడ' ఉదంతంతో మళ్లీ తెరపైకి



ఖైదీల దుస్థితికి ఇది తాజా తార్కాణంగా నిలిచింది.

రాత్రంతా రోదనే!

జపాన్ జైళ్లలో అత్యంత కఠిన నిబంధనలు అమలవుతాయి. పలు నేరాలకు ఒంటరి నిర్బంధాన్ని శిక్షగా అమలు చేస్తారు. తోటి ఖైదీలతో మాట్లాడటం దేవుడెరుగు, తమలో తాము కూడా గట్టిగా మాట్లాడుకునేందుకు అనుమతి ఉండదు! పైగా వారిని కలిసేందుకు కుటుంబీకులు, లాయర్లను తప్ప స్నేహితులతో పాటు ఎవరినీ అనుమతించరు. ఉత్తర ప్రత్యుత్తరాలను పూర్తిగా సెన్సార్ చేస్తారు. వ్యక్తిగత వస్తువులను అత్యంత పరిమితంగా అనుమతిస్తారు. కూర్చోవడం, నడవడం, మాట్లాడటం, తినడం, నిద్రపోవడం అన్నీ పక్కాగా టైం ప్రకారం చేయాల్సిందే. ఒక్క సెకను అటూ ఇటూ అయినా శిక్ష తప్పదు. అతి శీతల వాతావరణంలో కూడా టోపీలు, గ్లవ్స్ ధరించడానికి వీల్లేదు. అధికారులపై ఫిర్యాదుకు, సంఘటితం కావడానికి హక్కుండదు. ఏ నిబంధనను కాస్త ఉల్లంఘించినా గార్డుల చేతిలో చావుదెబ్బలే! గంటల తరబడి మోకాళ్లపై కూర్చోబెడతారు. ఇలాంటి పరిస్థితుల్లో ఖైదీలు తీవ్రంగా కుంగిపోతుంటారు. అయితే ఏడ్వడంపై ఆంక్షలు లేవు. దాంతో చాలామంది ఖైదీలు రాత్రిళ్లు ఏడుస్తుంటారు. ఖైదీలను ఇలా ఏళ్లపాటు ఒంటరిగా నిర్బంధించడంపై హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ వంటి మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అయినా జపాన్ న్యాయవ్యవస్థలో దశాబ్దాలుగా ఎలాంటి సంస్కరణలు జరగలేదు.

శిక్షలు అత్యంత కఠినం

జపాన్‌లో శిక్షలు చాలా కఠినంగా ఉంటాయి. చిన్న నేరాలకు కూడా జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధిస్తారు. కొద్ది మోతాదులో డ్రగ్స్ దొరికినా, వాడినా ఏడాది నుంచి పదేళ్ల జైలు, 50 లక్షల యెన్ల జరిమానా విధించవచ్చు. క్రిమినల్ కేసులు రుజువయ్యే రేటు ఏకం 99 శాతం! బలమైన సాక్ష్యాలుండి, గెలుస్తామని నమ్మిన కేసులనే ప్రాసిక్యూటర్లు దాఖలు చేస్తారు. చాలా కేసుల్లో విచారణకు ముందే నిందితులు నేరం అంగీకరిస్తారు. కనుక జపాన్‌లో ఒకసారి అభియోగాలు నమోదైతే ఇక నిర్దోషిగా బయటపడటం అసాధ్యమేనన్న విమర్శలూ ఉన్నాయి.

నేరాలు చాలా తక్కువ

ప్రపంచంలోనే అత్యంత సురక్షితమైన దేశాల్లో ఒకటిగా జపాన్‌కు పేరుంది. సమర్థ నేర న్యాయవ్యవస్థ దాని సొంతం. 2023లో అక్కడ నమోదైన మొత్తం నేరాలు కేవలం 7 లక్షలు. వాటిలో అత్యధికం దొంగతనాలే. అరెస్టు తర్వాత అనుమానితులను 48 గంటల దాకా అదుపులో ఉంచుకునే అధికారం పోలీసు లకు ఉంది. తర్వాత కేసును ప్రాసిక్యూటర్‌కు అప్పగిస్తారు. వారు 24 గంటల్లోపు నిందితుడిని విచారించి తదుపరి నిర్బంధానికి న్యాయమూర్తి అనుమతి పొందాలి. అలా 23 రోజుల దాకా నిర్బంధించొచ్చు. ఈ విధానంపై అనేక విమర్శలున్నాయి.

జైలు గోడలు బద్దలైనా... ఒక్కరూ పారిపోలేదు!

జైళ్లలో తీవ్ర నిర్బంధ పరిస్థితులున్నా పారిపోయేందుకు మాత్రం ఖైదీలు కల్లో కూడా సాహసించరు! దొరికితే శిక్షల తీవ్రత రెట్టింపవుతుంది మరి! పైగా జపాన్‌లో తప్పించుకుని ఎంతోకాలం తిరగడం అసాధ్యం. 1923 సెప్టెంబర్ 1న తీవ్ర భూకంపానికి యొకోహామాలో జైలు గోడ కూలింది. ఆ సమయంలో జైల్లో 1,100 మంది ఖైదీలున్నా కనీసం ఒక్కరు కూడా పారిపోలేదు. కూలిన గోడల లోపలే గడిపారు. దాంతో ముచ్చటపడ్డ జైలు డైరెక్టర్ ఖైదీలను ఒక రోజంతా బయటి తిరిగొచ్చేందుకు అనుమతించారు. 24 గంటలు పూర్తవుతూనే ప్రతి ఖైదీ టంచనుగా తిరిగొచ్చాడు!

- సాక్షి, నేషనల్ డెస్క్

30 సెకండ్లలో 50 బాంబులు

- గత నెల 13న గాజాలో హమాస్ ముఖ్యనేత మొహమ్మద్ సిన్వర్ హతం
- సొరంగంలోని హమాస్ స్థావరంపై ఇజ్రాయెల్ సైన్యం సర్జికల్ దాడి

టెల్ అవీవ్: గాజా స్ట్రిప్‌లో హమాస్ మిలిటెంట్ గ్రూప్‌ను పూర్తిగా అంతం చేయాలన్న లక్ష్యంతో ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తోంది. డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడుతోంది. మే 13వ తేదీన జరిగిన సర్జికల్ దాడుల్లో హమాస్ సీనియర్ కమాండర్ మొహమ్మద్ సిన్వర్‌తోపాటు మరో కీలక సభ్యుడు మొహమ్మదషబానా హతమయ్యారు. కేవలం 30 సెకండ్ల వ్యవధిలో ఏకంగా 50 బాంబులు ప్రయోగించి వీరిని మట్టుబెట్టడం గమనార్హం. ఖాన్ యూనిస్‌లోని యూరోపియన్ ఆసుపత్రి కింద సొరంగంలో ఉన్న హమాస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో దాక్కున్న వీరిద్దరినీ ఇజ్రాయెల్ సైన్యం ఖతం చేసిన తీరు చర్చనీయాంశంగా మారింది. ఈ అండర్‌గ్రౌండ్ సెంటర్‌కు సంబంధించిన వీడియోను సైన్యం తాజాగా విడుదల చేసింది. సరిగ్గా ఆసుపత్రి కింది భాగంలోనే భారీ సొరంగంలో మిలిటెంట్లు తమ స్థావరం ఏర్పాటు చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇది 'హమాస్ కాంబాట్ కంట్రోల్ సెంటర్'అని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. ఆసుపత్రికి, చుట్టుపక్కల జనావాసాలకు నష్టం వాటిల్లకుండా మిలిటెంట్ల స్థావరాన్ని పూర్తిగా ధ్వంసం చేసినట్లు సైన్యం స్పష్టం చేసింది. హమాస్-ఇజ్రాయెల్ మధ్య 2023 అక్టోబర్ 7న యుద్ధం మొదలైన సంగతి తెలిసిందే. హమాస్ అగ్రనేత యహ్యా సిన్వర్ సోదరుడే మొహమ్మద్ సిన్వర్. ఎన్నో దాడుల వెనుక మొహమ్మద్ సిన్వర్ హస్తం ఉంది. అతడిని భౌతికంగా అంతం చేయడం అతిపెద్ద విజయమని సైన్యం చెబుతోంది. యహ్యా సిన్వర్ గతంలోనే ఇజ్రాయెల్ దాడిలో మరణించాడు.

విటమిన్-డి లోపిస్తే మానసిక వ్యాధుల ముప్పు

శిశువుల్లో ఆటిజం, ఏడీహెచ్‌డీ, స్కిజోఫ్రెనియా

లాన్సెట్ అధ్యయనంలో వెల్లడి

గర్భిణులు తగినంత విటమిన్ తీసుకుంటే శిశువులకు తగ్గుతున్న రిస్క్

న్యూఢిల్లీ: మనుషుల ఆరోగ్యానికి విటమిన్-డి ఎంత ముఖ్యమో తెలిసిందే. ప్రధానంగా అప్పుడే పుట్టిన శిశువుల్లో ఈ విటమిన్ తగినంతగా లేకపోతే వారిలో మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ క్వీన్స్‌లాండ్, డెన్మార్క్‌లోని ఆర్హస్ యూనివర్సిటీ, స్టేట్ సీరమ్ ఇనిస్టిట్యూట్‌తో కలిసి లాన్సెట్ సంస్థ నిర్వహించిన తాజా అధ్యయనంలో తేలింది. ఈ వివరాలను సైకియాట్రీ పత్రికలో ప్రచురించారు. డి విటమిన్ లోపంతో జన్మించే శిశువుల్లో ఆటిజం, అటెన్షన్ డెఫిషిట్-హైపర్ యాక్టివ్ డిజార్డర్(ఏడీహెచ్‌డీ), స్కిజోఫ్రెనియా వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు. విటమిన్-డి, మానసిక సమస్యల మధ్య సంబంధాల విషయంలో ఎక్కువ మందిపై నిర్వహించిన సర్వే ఇదే కావడం గమనార్హం. సర్వేలో భాగంగా 71,000 మందిని పరీక్షించారు. వారి డి విటమిన్ స్థాయిలను అధ్యయనం చేశారు. వీరిలో చాలామంది బాల్యంలో మానసిక అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నవారే.

- శరీరంలో తగినంత డి విటమిన్ స్థాయిలు లేకుండా జన్మించినవారిలో ఆరు రకాల మానసిక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు క్వీన్స్‌లాండ్ బ్రెయిన్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి జాన్ మెక్‌గ్రాత్ చెప్పారు. మేజర్ డిప్రెసివ్ డిజార్డర్, బైపోలార్ డిజార్డర్, స్కిజోఫ్రెనియా, ఏడీహెచ్‌డీ, ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్(ఏఎస్‌డీ), అనొరెక్సియా నెర్వోసా వంటి సమస్యలు ఏర్పడుతున్నట్లు వివరించారు.
- శిశువులు, చిన్నారుల్లో డి విటమిన్ తక్కువగా ఉంటే స్కిజోఫ్రెనియా, ఏఎస్‌డీ, ఏడీహెచ్‌డీ ముప్పు అధికంగా ఉంటుందని తెలిపారు.
- మహిళలు గర్భంతో ఉన్నప్పుడు డి విటమిన్ మాత్రలు తీసుకుంటే పుట్టే శిశువులకు ముప్పు తగ్గుతుందని సూచించారు. అలాగే పుట్టిన శిశువులకు తగినంత డి విటమిన్ అందేలా చూడాలని చెప్పారు.
- శిశువుల్లో మెదడు అభివృద్ధికి విటమిన్-డి అత్యంత కీలకమని జాన్ మెక్‌గ్రాత్ వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా గర్భిణుల్లో విటమిన్-డి స్థాయిలు తక్కువగా ఉండడం సర్వసాధారణంగా మారిపోయినట్లు గుర్తించామని పేర్కొన్నారు.
- పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉండాలంటే గర్భిణులు తగినంత డి విటమిన్ తీసుకోవాలని డాక్టర్ హిమానీ నరులా ఖన్నా చెప్పారు. నిత్యం 600 నుంచి 2,000 ఇంటర్నేషనల్ యూనిట్స్ (ఐయూ) డి విటమన్ తీసుకోవాలని సూచించారు. వైద్యుల సలహాతో 4,000 ఐయూ వరకు తీసుకోవచ్చని వివరించారు.
- శరీరంపై 10 నుంచి 30 నిమిషాలపాటు సూర్యకాంతి పడేలా చూసుకోవాలని పేర్కొన్నారు.
- చేపలు, గుడ్లతోపాటు పాల ఉత్పత్తుల్లో విటమిన్-డి అధికంగా ఉంటుంది. గర్భిణులకు కేవలం ఆహారంతోనే తగినంత విట మిన్-డి లభించకపోవచ్చు. అందుకే మా త్రల రూపంలో అదనంగా తీసుకోవాలని డాక్టర్ హిమానీ నరులా ఖన్నా చెప్పారు.
- పేద, తక్కువ ఆదాయం కలిగిన దేశాల్లో డి విటమిన్ లోపం అధికంగా కనిపిస్తోంది. విటమిన్ సప్లిమెంట్స్ కూడా అందుబాటులో ఉండడం లేదు. ఒకవేళ అందుబాటులో ఉన్నప్పటికీ వాటి ఖరీదు భారీగా ఉండడం ప్రజలకు సమస్యగా మారింది.
- ధనిక దేశాల్లోనూ డి విటమిన్ లోపంతో ఎంతోమంది బాధపడుతున్నారు. ఎండలోకి వెళ్లకపోవడం, పోషకాహారం తీసుకోకపోవడం ఇందుకు కారణాలు.

ట్రంప్ స్టీల్ టారిఫ్‌లను ఖండించిన ఈయూ

బ్రస్సెల్స్: యూరోపియన్ యూనియన్(ఈయూ) నుంచి దిగుమతయ్యే స్టీల్, అల్యూమినియంపై టారిఫ్‌లను రెట్టింపు చేస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటను ఈయూ తీవ్రంగా ఖండించింది. ఈ చర్య ద్వైపాక్షిక వాణిజ్య చర్చలను ప్రమాదంలోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. తాము సైతం ప్రతిచర్యకు దిగాల్సి ఉంటుందని కూడా హెచ్చరించింది. అంతిమంగా ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అనిశ్చితిలోకి నెడుతుందని, వినియోగదారులతోపాటు వ్యాపారులకు సైతం భారంగా పరిణమిస్తుందని ఈయూ పేర్కొంది. స్టీల్‌పై టారిఫ్‌లను 25 శాతం నుంచి 50 శాతానికి పెంచడం వల్ల స్థానిక పరిశ్రమను ప్రోత్సహించినట్లవుతుందని శుక్రవారం ట్రంప్ పిట్స్‌బర్గ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రకటించడం తెల్సిందే. స్టీల్, అల్యూమినియంపై టారిఫ్‌లను ఎత్తేస్తూ యూకే, అమెరికాల మధ్య అంగీకారం కుదిరినప్పటికీ, ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేయకపోవడంపై ఈయూ అనుమానాలు వ్యక్తం చేసింది. టారిఫ్‌లను రెట్టింపు చేస్తూ ట్రంప్ తాజాగా చేసిన ప్రకటనపై యూకే స్టీల్ పరిశ్రమ సైతం ఉలిక్కిపడింది.

ప్రియుడికి మస్కా కొట్టి రూ.30 కోట్ల లాటరీ సొమ్ముతో పరార్

కొత్త లవర్‌తో చెక్కేసిన వైనం

మాంట్రియల్: మాజీ ప్రియుడికి వచ్చిన రూ.30 కోట్ల లాటరీ సొమ్ము తీసుకొని ఓ యువతి తన కొత్త ప్రియుడితో పారిపోయింది. జరిగిన మోసాన్ని గుర్తించి లబోదిబోమన్న ఆ బాధితుడు తనకు న్యాయం చేయాలని కోరుతూ బాధితుడు కోర్టుకెక్కాడు. ఈ సంఘటన కెనడాలో చోటుచేసుకుంది. అసలేం జరిగిందంటే... విన్నీపెగ్ పట్టణానికి చెందిన లారెన్స్ క్యాంప్‌బెల్, క్రిస్టల్ యాన్ మెక్‌కే ప్రేమించుకున్నారు. ఏడాదిన్నరపాటు కలిసి ఓ హోటల్ గదిలో జీవించారు. క్యాంప్‌బెల్ 2024లో ఓ లాటరీ టికెట్ కొన్నాడు. ఆ టికెట్‌కు ఇటీవలే జాక్‌పాట్ తగిలింది. క్యాంప్‌బెల్ 5 మిలియన్ డాలర్ల (రూ.30 కోట్లు) సొమ్ము గెలుచుకున్నాడు. కానీ, ఈ డబ్బు తీసుకోవాలంటే అతడి వద్ద సరైన గుర్తింపు కార్డు లేదు. బ్యాంకు ఖాతా కూడా లేదు. వెస్టర్న్ కెనడా లాటరీ కార్పొరేషన్ నుంచి లాటరీ సొమ్ము తీసుకోవడానికి తన ప్రియురాలి సాయం కోరాడు. ఆమెను పూర్తిగా నమ్మాడు. ఆమె తన ఐడీ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించడంతో ఎట్టకేలకు లాటరీ సొమ్ము ఆ ఖాతాలోకి చేరింది. ఆ సయయంలో లారెన్స్ క్యాంప్‌బెల్, క్రిస్టల్ యాన్ మెక్‌కే నమూనా చెక్కును చేతపట్టుకొని ఫొటోలకు, వీడియోలకు ఫోజులిచ్చారు. ఇది తనకు క్యాంప్‌బెల్ ఇస్తున్న పుట్టినరోజు కానుక అంటూ ఆమె మురిసిపోయింది. నిజానికి ఆ యువతి అప్పటికే మరో వ్యక్తితో ప్రేమలో పడింది. పాత ప్రియుడికి చెందిన రూ.30 కోట్లలో అతడికి చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా కొత్త ప్రియుడితో పరారయ్యింది. అతడితో సంబంధాలు తెంచేసుకుంది. ఫోన్‌లో కూడా దొరకలేదు. కొన్ని రోజుల తర్వాత ఆమె ఆచూకీ కనిపెట్టగలిగాడు. మరో వ్యక్తితో పడక్కపై ఆమెను చూశాడు. తాను దారుణంగా మోసపోయినట్లు గుర్తించిన క్యాంప్‌బెల్ న్యాయం కోసం కోర్టును ఆశ్రయించాడు.



నాకు, తేజస్వీకి మధ్య విభేదాలు సృష్టించేందుకు కుట్ర

ఆర్జేడీ నుంచి బహిష్కరణపై తేజ్ ప్రతాప్

పట్నా: ఆర్జేడీ నుంచి ఇటీవల బహిష్కరణకు గురైన లాలు పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ ఆదివారం స్పందించారు. తనకు, తన తమ్ముడు తేజస్వీ యాదవ్ మధ్య చీలిక తెచ్చేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మహాభారతంలో తనను శ్రీకృష్ణుడిగా, సోదరుడిని అర్జునుడితో పోల్చుకుంటూ తేజ్‌ప్రతాప్..'నాకు, అర్జునుడికి మధ్య అగాధ సృష్టించాలని కొందరు కలగంటున్నారు. వీరి కుట్రలు ఎప్పటికీ ఫలించవు. వాళ్లు కృష్ణుడి సైన్యాన్ని గెలవగలరేమో కానీ కృష్ణుడిని పట్టుకోలేరు. అలాంటి ప్రతి కుట్రను త్వరలోనే బయటపెడతా'అని తమ్ముడి పేరును నేరుగా ప్రస్తావించకుండా వ్యాఖ్యానించారు. బిహార్ మాజీ సీఎం లాలు ప్రసాద్ యాదవ్, రబ్రీదేవిల పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్. కొన్నేళ్లుగా అనుష్క అనే యువతితో రిలేషన్‌షిప్‌లో ఉన్నానని, ప్రేమిస్తున్నానని వారం క్రితం ఫేస్‌బుక్ పేజీలో తేజ్ ప్రతాప్ పెట్టిన పోస్ట్ తీవ్ర కలకలం రేపింది. మరునాడే, తేజ్ ప్రతాప్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు లాలు ప్రసాద్ యాదవ్ ప్రకటించారు.

ఆపాత మధురాలు

కొత్తొక వింత అంటారు గానీ నిజానికి 'పాత'తో ఉండే అనుబంధమే వేరు. ప్రఖ్యాత ఆంత్రోపాలజిస్టు ఆదిత్య విజ్ సేకరించిన పురాతన వస్తువులివి. వ్యక్తిగత ఆసక్తి కొద్దీ వీటిని ఆదివారం ఆయన ప్రదర్శనకు ఉంచారు.



1909 నాటి రెమింగ్టన్ టైప్‌రైటర్



తొలి భారతీయ చిత్రం రాజాహరిశ్చంద్ర సినిమా టికెట్



1911లో జరిగిన బ్రిటన్ రాజు కింగ్ జార్జి పట్టాభిషేక ఆహ్వాన పత్రిక



1983 వన్డే క్రికెట్ వరల్డ్‌కప్ విజేతల ఫొటోతో కూడిన అగ్గిపెట్టె

సీఎం పీఠంవైపు చిరాగ్ చూపు?

అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగే యోచనలో కేంద్ర మంత్రి



పట్నా: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కీలకమైన బిహార్‌లో రాజకీయ ముఖచిత్రం అనూహ్యంగా మారేలా కన్పిస్తోంది. కేంద్ర మంత్రి, లోక్‌జన్‌శక్తి (రాం విలాస్) పార్టీ అధినేత చిరాగ్ పాశ్వాన్ బిహార్ సీఎం పీఠంపై కన్నేసినట్టు సంకేతాలు వెలువడుతున్నాయి. ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దిగడం ఖాయమని పార్టీ వర్గాలు అంటున్నాయి. జూన్ 8న జరిగే ఎల్జేపీ నవ సంకల్ప సభలో నేతలంతా ఈ మేరకు చిరాగ్‌ను కోరుతూ తీర్మానం చేస్తారని చెబుతున్నారు. ఆయన సీఎం అభ్యర్థిగా బరిలో దిగాల్సిందేనని పార్టీ ఎంపీ అరుణ్ భారతి ఆదివారం పీటీఐతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. ఇది పార్టీ కార్యకర్తలు, శ్రేణుల మూకుమ్మడి డిమాండ్ అని చెప్పారు. అంతేగాక చిరాగ్ ఎస్సీ నియోజకవర్గం నుంచి కాకుండా జనరల్ సీటు నుంచి పోటీ చేయాలని ఆయన సూచించారు. తద్వారా చిరాగ్ ఏదో ఒక సామాజికవర్గానికి మాత్రమే కాకుండా రాష్ట్రం మొత్తానికీ ప్రాతినిధ్యం వహిస్తున్నారన్న సంకేతాలు పంపడం వీలవుతుందని అభిప్రాయపడ్డారు. ''చిరాగ్ రాజకీయ ప్రస్థానం పూర్తిగా బిహార్‌తోనే ముడివడి ఉంది. మూడుసార్లు ఎంపీగా నెగ్గినా, ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గంలో ఉన్నా 'బిహార్ ఫస్ట్, బిహారీ ఫస్ట్' అన్నదే తొలినుంచీ ఆయన నినాదం. చిరాగ్ స్వప్నమైన స్వయంసమృద్ధ బిహార్ సాకారం కావాలంటే ఆయన సారథ్యంలోనే సాధ్యం. రాష్ట్ర ప్రజలు కూడా అదే కోరుతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఆయన కీలక పాత్ర పోషించాలని ముక్త కంఠంతో అడుగుతున్నారు. చిరాగ్ అసెంబ్లీ ఎన్నికల బరిలో దిగాలంటూ ఇటీవల ఎల్జేపీ ఎగ్జిక్యూటివ్ భేటీలో కూడా ఏకగ్రీవ తీర్మానం చేశాం'' అని భారతి వివరించారు. బిహార్ అసెంబ్లీకి వచ్చే అక్టోబర్లో ఎన్నికలు జరగనున్నాయి. వాటిని బీజేపీ, జేడీ(యూ), ఎల్జేపీలతో కూడిన ఎన్డీఏకు; ఆర్జేడీ సారథ్యంలోని మహాఘట్‌బంధన్‌కు మధ్య ప్రత్యక్ష పోరుగా భావిస్తున్నారు. కొత్తగా తెరపైకి వచ్చిన ప్రశాంత్ కిశోర్ పార్టీ జన్ సురాజ్ ఏ మేరకు ఉనికి చాటుకుంటుందన్నది కూడా ఆసక్తికరం.

హెగ్సెత్‌ది ప్రచ్ఛన్న యుద్ధ మనస్తత్వం

అమెరికా రక్షణ మంత్రిపై చైనా మండిపాటు


బీజింగ్: అమెరికా, చైనాల మధ్య మరోసారి మాటల వేడి రాజుకుంది. తమ దేశంతో ముప్పు పొంచి ఉందంటూ అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ చేసిన వ్యాఖ్యలపై డ్రాగన్ దేశం చైనా మండిపడింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంనాటి మనస్తత్వంతో హెగ్సెత్ మాట్లాడుతున్నారంటూ దుయ్యబట్టింది. సింగపూర్‌లో జరుగుతున్న 'షంగ్రి లా డైలాగ్'సదస్సులో హెగ్సెత్ శనివారం చైనాతో ఇండో-పసిఫిక్ దేశాలకు తక్షణ ముప్పు ఉందని, ఆయా దేశాలను తాము ఒంటరిగా వదిలేయబోమంటూ వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. వీటిని గట్టిగా ఖండిస్తూ చైనా విదేశాంగ శాఖ ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది. 'ఈ ప్రాంతంలోని దేశాలు శాంతి, అభివృద్ధి కోసం కృషి చేయాలని పిలుపు ఇవ్వాల్సిన హెగ్సెత్ ఉద్దేశపూర్వకంగానే ఘర్షణలను పెంచేలా ప్రచ్ఛన్న యుద్ధం కాలంనాటి వైఖరిని బయటపెట్టుకున్నారు'అని అందులో పేర్కొంది. 'ప్రపంచంలో ఆధిపత్య ధోరణి కలిగిన ఏకైక దేశం అమెరికానే. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతిని, స్థిరత్వాన్ని ఆ దేశం దెబ్బతీస్తోంది'అంటూ నిప్పులు చెరిగింది.

భారత సమాఖ్యకు ప్రాతిపదిక ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



ఏకకేంద్ర, సమాఖ్య ప్రభుత్వం

భారతదేశ పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మన రాజ్యాంగ నిర్మాతలు రాజకీయ వ్యవస్థ నిర్మాణాన్ని నిర్ణయించారు. దేశ భిన్నత్వం, విభిన్న వర్గాల ప్రజల ఆలోచనలు, ప్రయోజనాలు, భౌగోళిక వైవిధ్యాలు, ఆచార, సాంప్రదాయాలు, సంస్కృతులు మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకొని భారత పరిపాలనా విధానానికి రూపకల్పన చేశారు. పార్లమెంటరీ అధ్యక్ష తరహా ప్రభుత్వాల ఎంపిక విషయంలో జరిగిన చర్చల అనంతరం పార్లమెంటరీ ప్రభుత్వ విధానం వైపు మొగ్గు చూపారు. ఏక కేంద్ర, సమాఖ్య ప్రభుత్వాల విషయంలో మాత్రం మన రాజ్యాంగ నిర్మాతలు విజ్ఞతను ప్రదర్శించారు. ఎంతో దూరదృష్టితో మనదేశ పరిస్థితులకు అనుగుణంగా ఏక కేంద్ర,సమాఖ్య లక్షణాల కలయికగా పరిపాలనా వ్యవస్థను రూపొందించారు. ప్రాంతీయమైన పరిపాలనా అవసరాలు, భిన్నత్వం, పరిపాలనా సౌలభ్యం మొదలైన అంశాలను ప్రాతిపదికగా చేసుకొని సమాఖ్య లక్షణాలను పొందుపరిచారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలను పంపిణీ చేశారు. మన సమాఖ్యను నిర్మించేటప్పుడు అమెరికాకు బదులుగా కెనడా విధానాన్ని అనుసరించారు. దేశ విభజన కాలం నాటి స్థితిగతులు,స్వదేశీ సంస్థానాల విలీనం, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడం, ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థను అమలు చేయడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కేంద్రీకృత వ్యవస్థ ఏర్పాటుకు కృషి చేశారు. మన దేశం బలమైన ఏకకేంద్ర లక్షణాలు గల బలహీనమైన సమాఖ్య ప్రభుత్వమే గాని బలమైన సమాఖ్య లక్షణాలున్న బలహీనమైన ఏక కేంద్రం కాదని కె.సి.వేర్ పేర్కొనడం గమనార్హం.

మూడు జాబితాలు

భారత రాజ్యాంగంలోని 7వ షెడ్యూల్ ప్రకారం.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజన చేస్తూ మూడు జాబితాలను పొందుపరిచారు. కేంద్ర జాబితాలో జాతీయ, అంతర్జాతీయ ప్రాముఖ్యమున్న అంశాలను పొందుపర్చగా, ప్రాంతీయ ప్రాముఖ్యమున్న 66 అంశాలను రాష్ట్ర జాబితాలో చేర్చారు. ప్రాంతీయ ప్రాముఖ్యం ఉన్నప్పటికీ జాతీయ దృక్పథం అవసరమైన అంశాలను ఉమ్మడి జాబితాగా పేర్కొంటూ 47 అంశాలను పొందుపర్చారు. కాలక్రమంలో వచ్చిన అనేక మార్పుల దృష్ట్యా ప్రస్తుతం కేంద్ర జాబితాలో 100 అంశాలు, రాష్ట్ర జాబితాలో 61 అంశాలు, ఉమ్మడి జాబితాలో 52 అంశాలు ఉన్నాయి. 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్య, అడవులు, తూనికలు, కొలతలు వంటి అంశాలను రాష్ట్రజాబితా నుంచి తొలగించి ఉమ్మడి జాబితాలో చేర్చడం వల్ల పైన పేర్కొన్న మార్పులు సంభవించాయి. మూడు జాబితాల్లో పేర్కొనని అంశాలను, నూతనంగా వచ్చే అంశాలను అవశిష్ట అధికారాలుగా పేర్కొంటూ వాటిపై శాసనాలను చేసే అధికారాన్ని కేంద్ర ప్రభుత్వానికి కల్పించారు. ఏదైనా ఒక అంశం అవశిష్ట అంశం అవుతుందో, కాదో నిర్ణయించే అధికారం సుప్రీంకోర్టుకు మాత్రమే ఉంటుంది. ప్రపంచంలో సమాఖ్య విధానాన్ని అనుసరించే అన్ని దేశాల రాజ్యాంగాల్లోని సమాఖ్య లక్షణాలను మనదేశం కూడా కలిగి ఉంది. లిఖిత రాజ్యాంగాన్ని కలిగిన మనదేశంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాలను పంపిణీ చేయడం, అదేవిధంగా కేంద్ర, రాష్ట్రాల మధ్య వివాదాలు తలెత్తినప్పుడు పరిష్కరించడం కోసం స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సుప్రీంకోర్ట్ రాజ్యాంగ పరిధికి లోబడి వ్యవహరించాల్సి ఉంటుంది. కాబట్టి మన దేశంలో రాజ్యాంగం ఆధిక్యతను కలిగి ఉంటుందని చెప్పొచ్చు. మారుతున్న ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని సవరిస్తున్నారు. మన రాజ్యాంగంలోని సమాఖ్య లక్షణాలను.. అనగా 7వ షెడ్యూల్‌ను, 11వ భాగాన్ని, సుప్రీంకోర్ట్ అధికారాలను సవరించాలంటే భారత పార్లమెంట్ 2/3వ వంతు మెజార్టీతో పాటు దేశంలోని 1/2 వంతుకు తగ్గకుండా రాష్ట్రాలు కూడా తమ ఆమోదాన్ని తెలపాల్సి ఉంటుంది. దేశ పరిపాలనకు అవసరమైన శాసనాలను రూపొందించే పార్లమెంట్‌లోని ఎగువసభ రాజ్యసభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పార్లమెంట్‌లోని ఎగువసభ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించడం వల్ల కేంద్రం చేసే చట్టాలు రాష్ట్రాల ప్రయోజనాలకు భిన్నంగా ఉంటే రాజ్యసభ దాన్ని నిరోధిస్తుంది. గతంలో బీహార్‌లోని రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ)కు చెందిన రబ్రీదేవి ప్రభుత్వాన్ని రద్దుచేసి రాష్ట్రపతి పరిపాలన విధిస్తూ రాష్ట్రపతి చేసిన ప్రకటనను పార్లమెంట్‌లోని లోక్‌సభ ఆమోదించినప్పటికీ రాజ్యసభ తిరస్కరించింది. ఈ కారణంగా బీహార్‌లో రాష్ట్రపతి పాలనను ఎత్తివేయాల్సి వచ్చింది.

అవశిష్ట అధికారాలు కేంద్రానికే

భారతదేశంలోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా కేంద్రంలో బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఏక కేంద్ర లక్షణాలను రాజ్యాంగంలో ప్రబలంగా పొందుపర్చడం విశేషం. కేంద్ర, రాష్ట్రాల మధ్య అధికారాల పంపిణీ జరిగినప్పటికీ, కేంద్ర జాబితాలో 97, రాష్ట్ర జాబితాలో 66, ఉమ్మడి జాబితాలో 47 అంశాలను పొందుపర్చినప్పటికీ ఉమ్మడి జాబితాలోని అంశాలపై పరోక్షంగా కేంద్రానికి ఆధిపత్యం ఉంటుంది. అవశిష్ట అధికారాలను కూడా కేంద్రానికి కేటాయించడంతోపాటు 249, 250, 356, 252 వంటి అధికరణలు రాష్ట్ర జాబితాలోని అంశాలపై కూడా కేంద్రం శాసనాలు చేయడానికి అవకాశం కల్పిస్తున్నాయి. దీనిద్వారా మన దేశంలో బలమైన కేంద్రం ఉందని పేర్కొనవచ్చు. మన దేశంలోని రాష్ట్రాల్లో అధిపతులుగా వ్యవహరించే గవర్నర్ రాష్ట్రాల పరిపాలనలో కీలకమైన పాత్రను పోషిస్తారు. అయితే గవర్నర్ల నియామకంలో, వారిని బదిలీ చేసే సందర్భంలో, వారి పదవీకాలాన్ని పొడగించడంలో, పదవి నుంచి తొలగించడంలో కేంద్ర ప్రభుత్వమే పూర్తి అధికారాలను కలిగి ఉంటుంది. గవర్నర్ల నియామకంలో, తొలగింపు విషయంలో రాష్ట్రాలకు ఎలాంటి అధికారాలుండవు. రాజ్యాంగంలోని 18వ భాగంలో పొందుపర్చిన అత్యవసర పరిస్థితులు, ఆ సందర్భంలో కేంద్ర ప్రభుత్వానికి సంక్రమించే తిరుగులేని అధికారాలు మనదేశ ఏక కేంద్ర లక్షణాన్ని తెలియజేస్తున్నాయి. జాతీయ అత్యవసర పరిస్థితిని విధించిన కాలంలో కేంద్రం రాష్ట్ర జాబితాలో పేర్కొన్న అంశాలపై కూడా శాసనాలను చేయవచ్చు. 356 అధికరణను అనుసరించి రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించినప్పు డు రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన అంశాలన్నింటిపై కేంద్రమే శాసనాలు చేస్తుంది. ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించిన కాలంలో కేంద్రం జారీచేసే ఆర్థికపరమైన ఆదేశాలను రాష్ట్రాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. అందువల్లే భారతదేశం సాధారణ పరిస్థితుల్లో సమాఖ్యగా, అత్యవసర పరిస్థితుల్లో ఏక కేంద్రంగా పనిచేస్తుందని బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాల బర్తరఫ్

భారత రాజ్యాంగంలోని కొన్ని అంశాలు కేంద్రం ఆధిపత్యాన్ని చాటుకోవడానికి, కేంద్రం రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం కలుగజేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. 365 అధికరణ ప్రకారం

కేంద్రం.. రాష్ట్రాలకు పరిపాలనాపరమైన ఆదేశాలను జారీ చేసినప్పుడు ఒకవేళ రాష్ట్రాలు పాటించని సందర్భంలో కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలను బర్తరఫ్ చేయడమే కాకుండా ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవ చ్చు. రాష్ట్ర శాసనసభలు రూపొందించి, ఆమోదించిన బిల్లులపై గవర్నర్ తన ఆమోద ముద్ర వేయకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం కేంద్రానికి పంపించవచ్చు. ఒకవేళ రాష్ట్రపతి సదరు బిల్లును తిరస్కరిస్తే దానిపై రాష్ట్రాలకు ఎలాంటి అధికారం ఉండదు. రాష్ట్రాల్లో శాంతిభద్రతలు క్షీణించినప్పుడు రాష్ట్రాలు కోరితే కేంద్రం తన సాయుధ బలగాలను పంపాల్సి ఉంటుంది. కానీ రాష్ట్రాల అభిప్రాయంతో నిమిత్తం లేకుండానే తన బలగాలను మోహరింపజేసే అధికారం కూడా కేంద్రానికి ఉంది.

పార్లమెంట్‌కు విశేష అధికారాలు

భారతదేశ పరిపాలనలో అత్యంత కీలకపాత్రను పోషించే రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థలు కూడా బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు తోడ్పడ్డాయని పేర్కొనవచ్చు. కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆదాయ వనరులను పంపిణీ చేసేందుకు కేంద్ర ఆర్థిక సంఘాన్ని రాష్ట్రపతి ఏర్పాటు చేస్తారు. ఈ ఆర్థిక సంఘాన్ని మనదేశ ఆర్థిక సమాఖ్యను సమన్వయపరిచే చక్రంగా పేర్కొంటారు. ఫైనాన్స్ కమిషన్‌ను కేంద్రమే నియమిస్తుంది. దానిలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాతినిధ్యం ఉండదు. కేంద్ర ప్రభుత్వ ఖర్చులను, ఖాతాలను తనిఖీ చేసే కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రాష్ట్ర ప్రభుత్వాల ఖర్చులను, ఖాతాలను కూడా తనిఖీ చేయవచ్చు. అయితే ఈ విషయంలో కాగ్ విధులను, బాధ్యతలను నిర్ణయించే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉంటుంది. మనదేశ పరిపాలనలో అత్యంత కీలక పాత్రను పోషించే అఖిల భారత సర్వీసుల ఉద్యోగుల ఎంపిక విషయంలో కేంద్రంలో ఉండే యూపీఎస్సీ కీలకపాత్రను పోషిస్తోంది.

భారతదేశంలో రాజ్యాంగబద్ధమైన ఎన్నికలను నిర్వహించే కేంద్ర ఎన్నికల కమిషన్ విధివిధానాలను నిర్ణయించడంలో, ప్రజాప్రాతినిధ్య చట్టాలను రూపకల్పన చేయడంలోనూ పార్లమెంట్ మాత్రమే అధికారాన్ని కలిగి ఉంటుంది.

కేంద్ర ప్రణాళికా సంఘం

భారతదేశం ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను అనుసరిస్తోంది. మనదేశ సామాజిక, ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు అనే అంశం ఉమ్మడి జాబితాలో ఉంది. 1950లో కేంద్ర కేబినెట్ తీర్మానాన్ని అనుసరించి ఏర్పాటు చేసిన కేంద్ర ప్రణాళికా సంఘం భారత ప్రధానమంత్రి నేతృత్వంలో పని చేస్తోంది. అంటే.. జాతీయ ప్రణాళికలతోపాటు రాష్ట్రాల ప్రణాళికలను నిర్మించడంలో, నియంత్రించడంలో కేంద్రమే ముఖ్యపాత్రను పోషిస్తోంది. ప్రణాళికా సంఘంలో రాష్ట్రాలకు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. కేంద్రీకృతమైన ప్రణాళిక వ్యవస్థను అనుసరించడం వల్ల రాష్ట్రాల్లో ప్రణాళికా సంఘాలకు ఎలాంటి ప్రాధాన్యం లేదు. ప్రణాళికా సంఘం రూపొందించిన ప్రణాళికా ముసాయిదాను ఆమోదించే జాతీయాభివృద్ధి మండలికి కూడా ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. జాతీయాభివృద్ధి మండలిలో రాష్ట్రాలకు ప్రాతినిధ్యం కల్పించినప్పటికీ ఇది కేవలం ప్రణాళికా సంఘానికి సలహా మండలిగా మాత్రమే పనిచేస్తుంది. అంతర్రాష్ట్ర కౌన్సిల్‌కు ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారు. ఈ కౌన్సిల్ కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య అదేవిధంగా రాష్ట్రాలకు, రాష్ట్రాలకు మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించే సంస్థగా పని చేస్తోంది.

భారత్‌లో బలమైన కేంద్రం

భారతదేశం సాధారణ సమాఖ్య లక్షణాలను కలిగి ఉన్నప్పటికీ ప్రపంచంలో వాస్తవిక సమాఖ్య ప్రభుత్వానికి ఆదర్శంగా పేర్కొనే అమెరికా సమాఖ్యతో అనేక అంశాల్లో విభేదిస్తోందని పేర్కొనవచ్చు. అమెరికన్ సమాఖ్య ప్రకారం రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలను కల్పించి కేంద్ర ప్రభుత్వానికి జాతీయ ప్రాముఖ్యమున్న కొన్ని అంశాలపై అధికారాలను కల్పించారు. అంటే బలమైన రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. భారతదేశంలో కేంద్రానికి ఎక్కువ అధికారాలను కల్పించడం ద్వారా బలమైన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం గమనార్హం. అమెరికాలో మిగులు(అవశిష్ట) అధికారాలను రాష్ట్రాలకు కేటాయించగా భారతదేశంలో మాత్రం దానికి భిన్నంగా కేంద్రానికి కేటాయించారు. అమెరికాలో దేశం మొత్తానికి వర్తించే ఫెడరల్ రాజ్యాంగంతో పాటు ప్రతి రాష్ట్రానికి సొంత రాజ్యాంగాలను ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. దీని ద్వారా అక్కడ రెండు రాజ్యాంగాలున్నాయి. భారతదేశంలో ఒకే రాజ్యాంగం అమల్లో ఉంది. అదేవిధంగా అమెరికాలో జాతీయ పౌరసత్వం, రాష్ట్ర పౌరత్వం అని రెండు పౌరత్వాలు ఉండగా మనదేశంలో ఒకే పౌరసత్వం అమల్లో ఉంది. ఆ ఒక్క పౌరసత్వం కూడా కేంద్ర జాబితాలో ఉండటం వల్ల పౌరసత్వాలపై చట్టాలను చేసే అధికారాన్ని పార్లమెంట్ కలిగి ఉంటుంది. అమెరికన్ శాసన శాఖయైన కాంగ్రెస్‌లోని ఎగువసభ సెనేట్ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. అయితే సెనేట్‌లోని మొత్తం వంద మంది సభ్యులు ఆ దేశంలోని 50 రాష్ట్రాల నుంచి.. అంటే ఒక్కో రాష్ట్రం నుంచి ఇద్దరు సభ్యులు చొప్పున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అక్కడ పెద్ద రాష్ట్రానికి, చిన్న రాష్ట్రానికి ఒకే రకమైన ప్రాతినిధ్యం కల్పించారు. కానీ భారతదేశంలో రాష్ట్రాల జనాభాను బట్టి రాజ్యసభలో సభ్యుల ప్రాతినిధ్యం వేర్వేరుగా ఉంది. అమెరికాలో వికేంద్రీకృతమైన న్యాయవ్యవస్థ ఉండగా మనదేశంలో కేంద్రీకృతమైన న్యాయ వ్యవస్థ అమల్లో ఉంది. రాష్ట్రాల రాజ్యాంగాధిపతులైన గవర్నర్లను అమెరికాలోని రాష్ట్రాల్లో ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. మనం కెనడా పద్ధతిని అనుసరిస్తుండడం వల్ల మన దేశంలోని రాష్ట్రాల అధిపతులైన గవర్నర్లను రాష్ట్రపతి అనగా కేంద్రం నియమిస్తుంది. అమెరికా రాజ్యాంగం వాస్తవికమైన ధృఢ రాజ్యాంగంగా వ్యవహరిస్తోంది. కానీ, మనదేశంలో రాజ్యాంగం ప్రధానంగా అధృడమైనది. భారతదేశంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తిరుగులేని అధికారాన్ని కలిగి ఉంది. అంటే ఈ విషయంలో రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి కాదు.

మూర్తము నుంచి అమూర్తానికి అనేది..

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

సోషల్ మెథడ్స్



సంఘీకృత ఉద్గార పద్ధతి/ సామాజిక కృత కథనా పద్ధతి-సామాజిక వాచిక పద్ధతి/ చర్చా పద్ధతి

1. బౌద్ధుల కాలంలో చర్చాపద్ధతి ఆవిర్భవించింది.
2. సంఘీకృత ఉద్గార పద్ధతిని సాంఘీ కీకృతం చేసిన చర్చ అనడం ఉత్తమం.
3. సంఘీకృత ఉద్గార పద్ధతిలో విద్యార్థులు చొరవ తీసుకొని చర్చలు, గోష్ఠులు నిర్వహించుకుంటారు.
4. యాకబ్, సింప్సన్ ప్రకారం సామాజికీకృత కథనంలో విద్యార్థులు సహజ వాతావరణంలో చర్చలు జరుపుతారు. ప్రశ్నలు వేస్తారు. పథక రచన చేస్తారు, నివేదిస్తారు. ప్రకటనలు చేస్తారు. పనిచేస్తూ ఉంటారు.
5. ఉపాధ్యాయుడు మార్గదర్శకునిలా, సహాయకునిలా, నిర్దేశకునిలా వ్యవహరిస్తాడు.

చర్చ రూపాలు

1. **సెమినార్ (సెమినార్ గోష్ఠి పథకం)**
   సెమినార్‌లో విద్యార్థులు వ్యక్తిగతం లేదా సామూహికంగా సమస్యను దర్యాప్తు చేసి నివేదిక సమర్పిస్తారు. ఆ నివేదికపై సమావేశంలో చర్చిస్తారు.
   ఉదా: 'రోడ్డు భద్రత విద్య' అనే పాఠ్యాంశంపై సెమినార్.
2. **వాగ్వాదం (Debate):** ఒక ప్రత్యేకమైన సమస్యపై పరస్పర విరుద్ధమైన అభి ప్రాయాలున్న ఇద్దరు విద్యార్థులు పాల్గొంటారు. వివాదాంశంపై అనుకూలంగా లేదా ప్రతికూలంగా అభిప్రా యాలు వ్యక్తం చేస్తారు. వాగ్వాదం జరిగేటప్పుడు సమన్వయకర్త ఉంటాడు. ఉదా: మతం, మానవాళి మనుగడకు అవసరమా? కాదా?
   1. భారత రాజ్యాంగం దృఢమైందా? అదృఢమైందా?
   2. జాతీయ సమైక్యతకు కులం అవరోధమా? కాదా?
   3. రాజ్యాంగం ఏకకేంద్ర లక్షణాలు కలదా? సమైఖ్య లక్షణాలు కలదా?
3. **సింపోజియం:** ఎంపిక చేసిన విషయంలోని వివిధ అంశాలపై సభ్యులు అభి ప్రాయాలు వ్యక్తం చేస్తారు. స్ట్రక్ ప్రకారం సింపోజియం వ్యాఖ్యానాల సముదా యం. ఇది మౌఖికంగా గానీ, లిఖితంగా గానీ ఉండవచ్చు. సింపోజియంలో చర్చా కార్యక్రమాన్ని తరగతి ఎదుట నిర్వహిస్తారు. సింపోజియంలో నలుగురు లేదా ఐదుమంది ఉంటే మంచిది.
   ఉదా: జాతీయ సమైక్యతకు అవరోధాలు.
4. **జట్టు చర్చ (Panel Discussion)**
   4 నుంచి 8 మంది విద్యార్థులున్న గ్రూపు ను ప్యానల్ అంటారు. దీనికి ఒక అధ్యక్షుడు ఉంటాడు. సభ్యులు ఇతని ఆధ్వర్యంలో చర్చిస్తారు.
   - సభ్యులు అర్ధచంద్రకారంలో ప్లాట్‌ఫాం పై కూర్చుంటారు.
   - అధ్యక్షుడు అడిగే ప్రశ్నలకు సభ్యులు జవాబులిస్తారు.
5. **రౌండ్ టేబుల్ సమావేశం:**
   1. ఇది తరగతిలో విద్యార్థులు నిర్వహించే బహిరంగ చర్చ. విద్యార్థులను నాలుగు లేదా ఐదు వర్గాలుగా విభజిస్తారు.
   2. వీరు ఒక అంశాన్ని చర్చిస్తారు.
   3. చిన్న సమూహంలో చర్చ ప్రభావవంతమైన ఫలితాన్ని ఇస్తుంది.
   4. విద్యార్థులందరూ చర్చలో పాల్గొంటారు. కాబట్టి మంచి ఫలితాలు పొందవచ్చు.
   5. చర్చలు పూర్తయిన తర్వాత ప్రతి గ్రూపు తరగతిలో సారాంశాన్ని నివేదించాలి.
   6. రౌండ్ టేబుల్ సమావేశాన్ని గ్రూపు చర్చ అని కూడా అంటారు.
   ఉదా: ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం అమలు.
6. **కార్య శిబిరం (Workshops)**
   కార్యశిబిరంలో పాల్గొనే వ్యక్తులు పత్రాలను పాటించడం, చర్చలను నిర్వర్తిం చడం వంటి కార్యకలాపాలను ఆచరణ రూపంలో చేస్తారు.
   ఉదా: విద్యార్థుల్లో పటాలు గీసే నైపుణ్యాలు పెంపొందించే వర్క్‌షాప్.
7. **బ్రెయిన్ స్టోర్మింగ్ :**
   - ఆలెక్స్ అస్‌బర్న్ రూపొందించారు.
   - మెదడులో ఆలోచనలు రేకెత్తించడం దీని ముఖ్య ఉద్దేశం.
   - ఉపాధ్యాయుడు ఒక సమస్యను విద్యా ర్థులకు ఇచ్చి వారి నుంచి సమాధానా లు కోరతాడు. ఆ సమాధానాలు సరైనవా కావా? అనేవి ముఖ్యం కాదు. విద్యార్థుల్లో విభిన్న ఆలోచనలు రేకెత్తించి సృజనాత్మకత పెంపొందించడం బ్రె యి న్ స్టోర్మింగ్ ముఖ్య ఉద్దేశం.

ప్రయోజనాలు:

1. విద్యార్థి సాంఘీకీకరణానికి వీలు కలుగు తుంది.
2. నాయకత్వ లక్షణాలు పెంపొందిం చవచ్చు.
3. వాక్‌పటిమను అభివృద్ధి చేయవచ్చు.
4. ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం నేర్చవచ్చు.
5. ప్రజాస్వామ్య విలువలు పెంచవచ్చు.
6. ఉపాధ్యాయుడికి, విద్యార్థులకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పవచ్చు.

పరిమితులు:

1. నిరర్థకమైన చర్చగా పరిణమించవచ్చు.
2. కాలయాపనతో కూడుకున్నది
3. ధైర్యం, చొరవ ఉన్న కొద్ది మంది విద్యార్థులు మిగతావారిపై ఆధిపత్యం చూపవచ్చు.
4. విద్యార్థులు వాదన పటిమ కోసం, ప్రజ్ఞను చూపించడం కోసం వాదించవచ్చు.

మాదిరి ప్రశ్నలు

1. విద్యార్థులు తోటివారి అభిప్రాయాలను గౌరవించడం ఏ పద్ధతిలో నేర్చుకుంటారు?
   1) ప్రశ్నోత్తర 2) ప్రకల్పన
   3) ఉపన్యాస 4) చర్చా
2. సాంఘిక శాస్త్రానికి ఒక చక్కని విద్యా ప్రణాళికా ప్రయోగశాల?
   1) పాఠశాల ప్రయోగశాల
   2) సాంఘికశాస్త్ర మ్యూజియం
   3) సాంఘికశాస్త్ర తరగతి గది
   4) చుట్టూ ఉండే సమాజం
3. సింపోజియంలో ఎంతమంది విద్యార్థులు పాల్గొంటే బాగుంటుంది?
   1) 10-15 2) 20-30
   3) 15-18 4) 4-5
4. విద్యార్థుల్లో స్వీయ అభిప్రాయాల వ్యక్తీకరణకు అవకాశం కల్పించే పద్ధతి?
   1) పర్యవేక్షితాధ్యయనం
   2) సామాజీకీకృత కథనం
   3) మూలాధార పద్ధతి
   4) ఉపన్యాస ప్రదర్శన పద్ధతి
5. జిల్లా ఉపవిద్యాధికారి జనవరిలో పూర్తి చేయాల్సిన సిలబస్ డిసెంబర్‌లోనే పూర్తి చేయాలని ఆదేశించాడు. అప్పుడు హై స్కూల్ ఉపాధ్యాయుడిగా మీరు?
   1) ముఖ్యమైన అంశాలు బోధిస్తారు
   2) ఉపన్యాస పద్ధతిలో బోధిస్తారు
   3) చర్చా పద్ధతిలో కష్టమైన పాఠాలు బోధిస్తారు
   4) సమస్యాపరిష్కార పద్ధతి అవలంబిస్తారు
6. పర్యవేక్షితాధ్యయనంలో మోబిల్ ఇ. సింప్సన్ ఒక పాఠానికి 90 నిమిషాల కాలవ్యవధిని కేటాయించి దాన్ని కింది ఏ కార్యకలాపాలుగా వర్గీకరించారు?
   1) సమీక్ష-25 ని., నియోజన 25 ని., అభ్యాసాలు 15 ని., నియోజిత అధ్యయనం 20 ని.
   2) సమీక్ష-25 ని., నియోజన-25 ని., అభ్యాసాలు 5 ని., నియోజితాధ్య యనం-35 ని.
   3) సమీక్ష-30 ని., నియోజన 20 ని., అభ్యాసాలు, 10 ని., నియోజితాధ్య యనం-20 ని.
   4) సమీక్ష-25 ని., నియోజన- 35 ని., అభ్యాసాలు-15 ని., నియోజితాధ్య యనం - 20 ని.
7. ఏ బోధనా పద్ధతిలో మోడరేట్ ఆవశ్యకత ఉంటుంది?
   1) సమస్యాపద్ధతి 2) మూలాధార పద్ధతి
   3) సామాజికీకృత కథనం
   4) సమస్యా పద్ధతి
8. 9వ తరగతిలోని భూపట చలనాలు అనే అంశం బోధించడానికి అనువైన పద్ధతి?
   1) మూలాధార పద్ధతి
   2) ఉపన్యాస ప్రదర్శనా పద్ధతి
   3) సామాజికీకృత కథనం
   4) సమస్యాపద్ధతి
9. సింపోజియం గోష్ఠిలో?
   1) అనేకమంది విద్యార్థులు ఒక సమస్య గురించి నివేదిస్తారు
   2) ఎంపికచేసిన విషయంలో వివిధ అంశాలపై పాల్గొనే సభ్యులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు
   3) తరగతిని 4 లేదా 5 చర్చా వర్గాల కింద విభజిస్తారు
   4) చైర్మన్ ప్రశ్నలకు 4 నుంచి 8 మంది అభిప్రాయాలు వ్యక్తం చేస్తారు
10. జట్టు బోధనలో రెండు అంతకంటే ఎక్కువ విషయాలు ఒకే వర్గంలోని విద్యార్థులకు సంయుక్తంగా చేపట్టడం?
    1) సంచయన క్రమానుగతం
    2) సమవర్తిత విషయాలు
    3) ఏక కేంద్ర నమూనా
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
11. కంప్యూటర్ యుగంలో సాంఘికశాస్త్ర అధ్యయనాలు అవసరమా? కాదా? అనే అంశాన్ని చేపట్టడానికి సామాజికీకృత కథనంలోని ఏ రూపం అనువైంది?
    1) సెమినార్ గోష్ఠి పథకం
    2) వాగ్వాదం
    3) సింపోజియం
    4) కార్యశిబిరం
12. 'జలియన్‌వాలాబాగ్ దురంతం' అనే అంశాన్ని బోధించడానికి అత్యుత్తమ మూలాధారం?
    1) ఆనాటి వార్తాపత్రికలు
    2) చిరస్మారకాలు
    3) ఉద్యమ నాయకుల రచనలు
    4) జలియన్ వాలాబాగ్‌కు సంబంధించిన నమూనా
13. ఆదాయం, వ్యయాన్ని సూచించే 'సంతులిత బడ్జెట్' అనే అంశాన్ని బోధించడానికి అనువైన బోధనోపకరణం?
    1) కమ్మీగ్రాఫ్ 2) టేబుల్ చార్ట్
    3) ఫ్లోచార్ట్ 4) లైన్ గ్రాఫ్
14. బోధనలో క్రమమైన, తార్కికమైన, ఫలప్రదమైన ఏర్పాటును సూచించేది?
    1) ఉపగమం 2) నైపుణ్యం
    3) వ్యూహం 4) బోధనాంశం

సమాధానాలు

1) 4 2) 4 3) 4 4) 2 5) 2
6) 2 7) 3 8) 2 9) 2 10) 2
11) 2 12) 2 13) 2 14) 3

గతంలో అడిగిన ప్రశ్నలు

1. విద్యార్థి వాస్తవ జీవిత సమస్యలను ఎదుర్కోవడానికి తగిన సామర్థ్యాన్ని పెంపొందించే జీవితాన్ని సరిదిద్దుకోగల జ్ఞానాన్ని ఇవ్వడం ఏ యూనిట్ ముఖ్యోద్దేశం?
   1) వనరుల యూనిట్
   2) బోధనా యూనిట్
   3) అనుభవ ప్రాముఖ్య యూనిట్
   4) నిర్మాణాత్మక యూనిట్
2. 'సింపోజియం వ్యాఖ్యానాల సముదాయంగా ఉంటుంది. ఇది మౌఖికంగా గానీ, లిఖితంగా గానీ ఉండవచ్చు. విభిన్న భావాలను, దృక్పథాలను అందిస్తుంది' అని పేర్కొన్నవారు?
   1) రెమాంట్ 2) వెస్లీ
   3) స్ట్రక్ 4) రాన్‌స్కీ
3. జట్టు బోధన భావన ఏ దేశంలో ఆవిర్భ వించింది?
   1) రష్యా 2) అమెరికా
   3) ఇంగ్లండ్ 4) ఇండియా
4. మూర్తము నుంచి అమూర్తానికి అనేది ఒక?
   1) బోధనా క్షేత్రం 2) బోధనా ప్రవర్తన
   3) బోధనోపకరణం
   4) బోధనా సూత్రం
5. 9వ తరగతి విద్యార్థులకు కుటుంబ బడ్జెట్ అనే పాఠాన్ని అవగాహన చేయించడానికి అనువైన పద్ధతి?
   1) ప్రాజెక్టు 2) ఉపన్యాస
   3) ప్రదర్శన 4) బృంద

సమాధానాలు

1) 4; 2) 3; 3) 2; 4) 4; 5) 1.

విద్య, ఉద్యోగ సమాచారం

నేషనల్ హైవేస్ అథారిటీలో 60 ఉద్యోగాలు

ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ).. 60 డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.


- **మొత్తం పోస్టుల సంఖ్య:** 60
- **పోస్టుల వివరాలు:** డిప్యూటీ మేనేజర్ టెక్నికల్
- **అర్హత :** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ గేట్ -2025 స్కోర్ ఉండాలి.
- **వయసు:** గరిష్ఠ వయోపరిమితి 30ఏళ్లకు మించరాదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.
- **ఎంపిక విధానం:** విద్యార్హతలు, గేట్ స్కోర్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 09.06.2025
- **వెబ్‌సైట్ :** https://nhai.gov.in/#/

ఎయిమ్స్ మంగళగిరిలో వివిధ ఉద్యోగాలు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మంగళగిరిలో ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- **పోస్టుల వివరాలు:** సీనియర్ రెసిడెంట్-02, క్లినికల్ సైకాలజిస్ట్/సైకియాట్రిక్ సోషల్ వర్కర్-01, సైకియాట్రిక్ నర్స్-01, డేటా మేనేజర్-01.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఎంఫిల్, ఎండీ/డీఎన్‌బీలో ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- **వయసు:** 40 ఏళ్లు ఉండాలి.
- **వేతనం:** నెలకు సీనియర్ రెసిడెంట్‌కు రూ.1,00,000, క్లినికల్ సైకాలజిస్ట్‌కు రూ.50,000, సైకియాట్రిక్ నర్స్‌కు రూ.25,000, డేటా మేనేజర్‌కు రూ.15,000.
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** 17.06.2025.
- **వెబ్‌సైట్:** https://www.aiimsmangalagiri.edu.in/

నేత్రానుగుణ్యత అంటే ఏమిటి?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

కాంతి

పుటాకార దర్పణం

పుటాకార దర్పణానికి ఎదురుగా ఒక చిన్న వస్తువును ఉంచినప్పుడు దాని ప్రతిబింబం పెద్దగా ఆవర్తనం చెంది తలకిందులుగా ఏర్పడుతుంది.

1. చెవి, ముక్కు, గొంతు పరిశీలించడానికి వైద్యులు ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. కాబట్టి దీన్ని డాక్టర్స్ మిర్రర్ అని కూడా అంటారు.
2. సౌరశక్తిని ఒక బిందువు వద్ద కేంద్రీకరించే సోలార్ కన్వెక్టర్లలో ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. అందువల్ల దీన్ని బర్నింగ్ మిర్రర్ అంటారు. సోలార్ కన్వెక్టర్లలో పుటాకార దర్పణాలు, కుంభాకార దర్పణాలను ఉపయోగించవచ్చు.
3. దీన్ని సేవింగ్ మిర్రర్‌గా ఉపయోగిస్తారు.
4. టార్చిలైట్, వాహనాల హెడ్‌లైట్‌లలో ఈ దర్పణాన్ని ఉపయోగిస్తారు. ఈ దర్పణాల ప్రధాన నాభి వద్ద విద్యుత్ బల్బును అమర్చుతారు.

కుంభాకార దర్పణం

కుంభాకార దర్పణంలో పెద్ద వస్తువు ప్రతిబింబం చిన్నగా, నిటారుగా ఏర్పడుతుంది.

1. కుంభాకార దర్పణాన్ని వాహనాల్లో డ్రైవర్ పక్కన అద్దాలుగా ఉపయోగిస్తారు.
2. ఆగ్రాకోట వద్ద ఏర్పాటు చేసిన కుంభాకార దర్పణంలో తాజ్‌మహల్ పూర్తి ప్రతిబింబం కనిపిస్తుంది.

➢ **దూరదర్శిని:** కంటి నుంచి దూరంగా ఉన్న వస్తువులను దగ్గరగా స్పష్టంగా చూడటానికి దూరదర్శినులను ఉపయోగిస్తారు.

➢ దూరదర్శినిని 1608 జనవరి 10న గెలీలియో అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

➢ **దూరదర్శిని రకాలు:** ఉపయోగించే విధానాన్ని బట్టి దూరదర్శినిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **ఖగోళ దూరదర్శిని:** భూమికి ఆవల ఉన్న ఖగోళ వస్తువులను అంటే సూర్యుడు, నక్షత్రాలు, గ్రహాలు మొదలైన వాటిని పరిశీలించడానికి ఈ దూరదర్శినిని ఉపయోగిస్తారు. దీనిలో తుది ప్రతిబింబం తలకిందులుగా ఏర్పడుతుంది. అయితే ఖగోళ వస్తువులన్నీ గోళాకారంలో ఉండటం వల్ల ఖగోళ వస్తువులను ఈ దూరదర్శిని ద్వారా పరిశీలించడంలో ఎలాంటి సమస్య ఉండదు.

➢ **భూ ఖగోళ దూరదర్శిని:** భూమి, సముద్రాలపై దూరంగా ఉన్న వస్తువులను దగ్గరగా, స్పష్టంగా చూడటానికి ఖగోళ దూరదర్శినిని ఉపయోగిస్తారు. దీనిలో తుది ప్రతిబింబం నిటారుగా ఏర్పడుతుంది.

నిర్మాణం దృష్ట్యా దూరదర్శినులను తిరిగి రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

1. **వక్రీభవన దూరదర్శిని:** ఇలాంటి దూరదర్శినిని కటకాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ రకానికి చెందిన దూరదర్శినిని గెలీలియో కనుగొన్నాడు.
2. **పరావర్తన దూరదర్శిని:** వీటిని దర్పణాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ రకానికి చెందిన దూరదర్శినిని జేమ్స్ గ్రిగోరి అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

1. హబుల్ స్పేస్ టెలిస్కోప్‌ను 1990 ఏప్రిల్ లో నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి ప్రవేశపెట్టారు. దీని ద్వారా విశ్వ రహస్యాలను అధ్యయనం చేస్తున్నారు.
2. X-కిరణాలతో పనిచేసే మొదటి టెలిస్కోప్ (చంద్ర X-Ray)ను నాసా శాస్త్రవేత్తలు రూపొందించారు. దీన్ని 1999లో అంతరిక్షంలోకి ప్రయోగించారు.
3. రేడియో తరంగాలను ఉపయోగించి పనిచేసే ప్రపంచంలో అతిపెద్దదైన రేడియో టెలిస్కోప్‌ను మహారాష్ట్రలోని పుణే సమీపంలో ఏర్పాటు చేశారు. దీని పేరు India Giant రేడియో ఆస్ట్రోనామికల్ టెలిస్కోప్.
4. 2009 మార్చి 6న కెప్లర్ టెలిస్కోప్‌ను నాసా శాస్త్రవేత్తలు అంతరిక్షంలోకి ప్రయోగించారు. ఈ టెలిస్కోప్‌ను ఉపయోగించి జీవరాశిని కలిగి ఉన్న గ్రహాల ఉనికిని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.
5. ప్రపంచంలో అతిపెద్దదైన సోలార్ టెలిస్కోప్‌ను భారతదేశం రూపొందిస్తోంది. దీన్ని జమ్మూకాశ్మీర్‌లోని లడక్ ప్రాంతం లో ఏర్పాటు చేస్తున్నారు.

మైక్రోస్కోప్‌లు

➢ **సూక్ష్మదర్శినులు:** కంటికి దగ్గరగా ఉన్న చిన్న వస్తువులను పెద్దగా, స్పష్టంగా చూడ డానికి సూక్ష్మదర్శినులను ఉపయోగిస్తారు. వీటిని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

➢ **సరళ సూక్ష్మదర్శిని:** దీన్ని తక్కువ నాభ్యాంతరం ఉన్న ఒకే ఒక కుంభాకార కటకాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ కటకాలకు ఒకవైపున చిన్న వస్తువును ఉంచి రెండో వైపు నుంచి చూస్తే దాని ప్రతిబింబం ఆవర్తనం చెంది నిటారుగా కనిపిస్తుంది. కాబట్టి సరళ సూక్ష్మదర్శినిలో చిన్న వస్తువు ప్రతిబింబం చాలా పెద్దదిగా కనిపిస్తుంది.

ఉపయోగాలు

1. చిన్న అక్షరాలను స్పష్టంగా చదవడానికి
2. వేలిముద్రలను, హస్తరేఖలను పరిశీలించడానికి
3. గడియారంలోని చిన్న భాగాలను స్పష్టంగా చూడటానికి
4. వాచ్ మెకానిక్‌లు ఈ సరళ సూక్ష్మదర్శినిని ఉపయోగిస్తారు.

➢ **సంయుక్త సూక్ష్మదర్శిని:** దీనిలో రెండు కుంభాకార కటకాలు ఉంటాయి. ఇందులో వస్తువుకు దగ్గరగా ఉన్న కటకాలను వస్తు కటకం, కంటికి దగ్గరగా ఉన్న కటకాన్ని అక్షి కటకం అంటారు. ఈ రెండు కటకాల మధ్య దూరాన్ని సంయుక్త సూక్ష్మదర్శిని పొడవు అని అంటారు. ఈ సూక్ష్మదర్శినిలో చిన్న వస్తువు ప్రతిబింబం మొదట వస్తు కటకం వల్ల, ఆ తర్వాత అక్షి కటకం వల్ల రెండుసార్లు ఆవర్తనం చెంది తుది ప్రతిబింబం తలకిందులుగా ఏర్పడుతుంది. సంయుక్త సూక్ష్మదర్శిని ఆవర్తన సామర్థ్యం సరళ సూక్ష్మదర్శినితో పోల్చినప్పుడు 1000 నుంచి 2000 రెట్లు ఎక్కువగా ఉంటుంది. బ్యాక్టీరియా, ఫంగస్, వృక్ష కణాలు, జంతు కణాలు, జీవ కణాలు, రక్త కణాలు, పుప్పొడి రేణువులు మొదలైన వాటిని పరిశీలించడానికి దీన్ని ఉపయోగిస్తారు.

1. ఎలక్ట్రానిక్స్ సూత్రం ఆధారంగా పనిచేసే ఎలక్ట్రానిక్స్ మైక్రోస్కోప్ ఆవర్తన సామ ర్థ్యం సంయుక్త సూక్ష్మదర్శిని కంటే 265 రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వైరస్‌ను పరిశీలించడానికి దీన్ని ఉపయోగిస్తారు.
2. 2011 సెప్టెంబరులో బ్రిటన్ శాస్త్రవేత్తలు ఆప్టికల్ మైక్రోస్కోప్‌ను కనుగొన్నారు. దీని ఆవర్తన సామర్థ్యం ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌తో పోల్చినప్పుడు 250 రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ప్రాథమిక కణాల గురించి అధ్యయనం చేయడానికి దీన్ని ఉపయోగిస్తున్నారు.

➢ **స్టీరియోస్కోప్:** హోలోగ్రఫీ విధానంలో చిత్రీకరించిన త్రిడైమెన్షనల్ ఫొటోలను చూడటానికి ఈ సాధనాన్ని ఉపయోగిస్తారు.

➢ **స్ట్రోబోస్కోప్:** గమనంలో ఉన్న వస్తువు, తన చుట్టూ తాను తిరుగుతున్న వస్తువును నిశ్చల స్థితిలో ఉన్నట్లుగా చూడటానికి ఈ సాధనాన్ని ఉపయోగిస్తారు.

➢ **పెరిస్కోప్:** Z ఆకారం ఉన్న ఒక గొట్టం రెండు మూలల వద్ద M_1, M_2 అనే రెండు సమతల దర్పణాలను ఒక్కొక్క దాన్ని 45° కోణంతో అమర్చుతారు. యుద్ధం జరిగే సమయంలో బంకరు (గొయ్యి)లో ఉన్న సైనికులు, జలాంతర్గామిలో ఉన్న నావికులు, శత్రువుల కదలికలను పరిశీ లించడానికి దీన్ని ఉపయోగిస్తారు.

➢ **కెలిడియోస్కోప్:** దీన్ని మూడు సమతల దర్పణాలను ఉపయోగించి నిర్మిస్తారు. ఈ దర్పణాలను సమబాహు త్రిభుజం ఆసన్న భుజాల్లా అమర్చి నిర్మిస్తారు. ఈ దర్పణాల మధ్య ఒక వస్తువును ఉంచినప్పుడు అనేక ప్రతిబింబాలు కనిపిస్తాయి.

➢ **Sextant:** త్రికోణమితిలోని Secθ సూత్రం ఆధారంగా ఈ సాధనం పనిచేస్తుంది. దీన్ని ఉపయోగించి పర్వతాలు, భవనాలు, కట్టడాల ఎత్తును తెలుసుకోవచ్చు.

➢ **ఆల్టీమీటర్:** ఈ సాధనాన్ని గగనతలంలో ఎగురుతున్న విమానాలు, రాకెట్‌లు, క్షిపణులు మొదలైన వాటిలో అమర్చి భూఉపరితలం నుంచి ఆ వస్తువుల ఎత్తును కొలవవచ్చు.

➢ **సినిమా ప్రొజెక్టర్:** దీన్ని థామస్ అల్వా ఎడిసన్ కనుగొన్నాడు. సినిమా ప్రొజెక్టర్‌కు ముందు భాగంలో కుంభాకార కటకాలను అమర్చుతారు. ఈ ప్రొజెక్టర్ ద్వారా ఒక సెకన్ కాలంలో 16 ఫిల్మ్‌లు కదలి వెళ్లినట్లయితే తెరపైన ఏర్పడిన బొమ్మ సజీవ చిత్రంలా కనిపిస్తుంది.

➢ టెలివిజన్‌ను జె.ఎల్. బయర్డ్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. టెలివిజన్‌లో కెనియోస్కోప్ అనే పరికరం విద్యుదయస్కాంత తరంగాలను $\frac{1}{25}$ వ సెకను కాలంలో పిక్చర్‌గా మార్చుతుంది.

➢ ఆధునిక కాలంలో ఉపయోగిస్తున్న ఎల్‌సీడీ, ఎల్‌ఈడీలను క్యాలెండర్ టెలివిజన్‌లు అని పిలుస్తారు. వీటిలో పిక్చర్ స్పష్టత ఎక్కువగా ఉంటుంది.

➢ **కెమెరా:** కెమెరాను జోసెఫ్ నయోప్సీనైస్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. మానవుని కంటి భాగాలను ఆధారంగా చేసుకొని కెమెరాను ఆవిష్కరించారు. కెమెరా వివిధ భాగాలతో కంటిలోని భాగాలను పోల్చవచ్చు.

1. మానవ కనుగుడ్డు కెమెరాలోని కుంభాకార కటకంలా పనిచేస్తుంది. ఈ కనుగుడ్డు ఉబ్బెత్తుగా ఉండి కుంభాకార కటకంలా పనిచేస్తుంది. కాబట్టి కనుగుడ్డు వస్తువు దూరాన్ని ఆధారంగా చేసుకొని తనంతట తానుగా తన నాభ్యాంతరాన్ని మార్చుకుంటూ ఆ వస్తువును స్పష్టంగా చూడగలుగుతుంది. ఈ ధర్మాన్ని నేత్రానుగుణ్యత అంటారు.
2. కనురెప్ప కెమెరాలోని మూతలా పనిచేసి, కనుగుడ్డుకు రక్షణ కల్పిస్తుంది.
3. రెటీనా కెమెరాలోని ఫిల్మ్‌లా పనిచేస్తుంది. కాబట్టి వస్తువు ప్రతిబింబం దీనిపైన ఏర్పడుతుంది. నిశ్చల స్థితిలో ఉన్న ఒక వస్తువును ఫొటో తీయడాన్ని స్టిల్ ఫొటోగ్రఫీ అంటారు. కదులుతున్న వస్తువును ఫొటో తీయడాన్ని Kinetography అంటారు.

దృష్టి రకాలు

1. **మోనాక్యులర్ దృష్టి:** ఒకే కన్నుతో వస్తువులను చూడగలగడాన్ని మోనాక్యులర్ దృష్టి అంటారు.
   ఉదా: కాకి దృష్టి
2. **బైనాక్యులర్ దృష్టి:** రెండు కళ్లతో వస్తువులను చూడగలిగే దృష్టి జ్ఞానాన్ని బైనాక్యులర్ దృష్టి అంటారు.
   ఉదా: మానవుడి దృష్టి
3. **నిషాచర దృష్టి:** రాత్రి సమయంలో లేదా చీకటిలో వస్తువులను చూడగలిగే దృష్టి జ్ఞానాన్ని నిషాచర దృష్టి అంటారు.
   ఉదా: పిల్లిదృష్టి

దృష్టిలోపాలు

1. **హ్రస్వదృష్టి (దగ్గర దృష్టి):** కంటికి దగ్గరగా ఉన్న వస్తువును మాత్రమే చూడగలిగి దూరంగా ఉన్న వస్తువును చూడలేని దృష్టిలోపాన్ని హ్రస్వ దృష్టి అంటారు. ఈ దృష్టి లోపాన్ని నివారించడానికి తగిన నాభ్యాంతరం ఉన్న వికేంద్రీకరణ కటకాన్ని ఉపయోగించాలి.
2. **దూరదృష్టి (దీర్ఘ దృష్టి):** కంటి నుంచి దూరంగా ఉన్న వస్తువును మాత్రమే చూడగలిగి దగ్గరగా ఉన్న వస్తువును చూడలేని దృష్టిలోపాన్ని దూరదృష్టి లేదా దీర్ఘ దృష్టి అంటారు. ఈ దృష్టి లోపాన్ని తగిన నాభ్యాంతరం ఉన్న కేంద్రీకరణ కటకాన్ని ఉపయోగించి నివారించవచ్చు.

➢ **అసమదృష్టి:** కంటిలోని కార్నియా అనే భాగం దెబ్బతినడం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు ఏ వస్తువును పరిశీలించినా అడ్డు, నిలువు రేఖలుగా కనిపిస్తుంది. ఈ లోపాన్ని సవరించడానికి తగిన నాభ్యాంతరం ఉన్న స్తూపాకార కటకాన్ని ఉపయోగించాలి.

➢ **చత్వారం:** కొంత మందిలో వయసు పెరిగిన కొద్దీ కళ్లు నేత్రానుగుణ్యతను కోల్పోతాయి. అంటే తమంతట తాము తమ నాభ్యాంతరాన్ని మార్చుకోలేక దగ్గరగా, దూరంగా ఉన్న వస్తువులను చూడటం వీలుకాదు. ఇలాంటి దృష్టి లోపాన్ని చత్వారం అంటారు. ఈ లోపాన్ని సవరించడానికి ద్వినాభికటకాన్ని ఉపయోగించాలి.

➢ **రేచీకటి:** విటమిన్-ఎ లోపం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులకు పగటి సమయంలో అంటే సూర్యకిరణాల సమక్షంలో మాత్రమే దృష్టి జ్ఞానం ఉంటుంది. కానీ రాత్రి సమయంలో లేదా చీకటిలో కృత్రిమ కాంతి జనకాల వల్ల వచ్చే కాంతి తీవ్రత వల్ల దృష్టి జ్ఞానం కలుగదు. ఇలాంటి దృష్టి లోపాన్ని రేచీకటి అంటారు. ఈ లోపాన్ని సవరించుకోవడానికి విటమిన్ -ఎ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలి.

➢ **వర్ణాంధత్వం:** కంటిలో కోన్స్ లోపం వల్ల ఈ దృష్టి లోపం ఏర్పడుతుంది. ఈ లోపం ఉన్న వ్యక్తులు అన్ని రంగులను గుర్తిం చలేరు. కాబట్టి ఈ దృష్టి లోపాన్ని వర్ణాంధత్వం అంటారు. ఇది జన్యువుల ద్వారా తల్లిదండ్రుల నుంచి సంతానానికి సంక్రమిస్తుంది. అందువల్ల దీనికి చికిత్సా విధానం అందుబాటులో లేదు.

అదృశ్య వికిరణాలు

పరారుణ కిరణాలు: పరారుణ కిరణాలను హెర్చెల్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు. ఈ కిరణాల తరంగదైర్ఘ్య అవధి 7500 A° నుంచి సుమారు 4 మిలియన్‌ల A° వరకు ఉంటుంది. ఈ కిరణాలను అన్ని రకాలైన గాజు పదార్థాలు శోషించుకుంటాయి. కాబట్టి గాజుతో నిర్మించిన సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని గుర్తించేందుకు వీలు కాదు.

రాతి ఉప్పు/ సైంధవ లవణం: రాతి ఉప్పు తో చేసిన పట్టకం, కటకాల ద్వారా ఈ తరంగాలు చొచ్చుకువెళతాయి. ఇలాంటి పట్టకం, కటకాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

➢ పరారుణ కిరణాలు వాటి వెంట ఉష్ణాన్ని మొసుకొనిపోతాయి. ఈ కిరణాలు ఏవైనా వస్తువులను తాకినప్పుడు ఆ వస్తువుల ఉష్ణోగ్రత పెరుగుతుంది. కాబట్టి పరారుణ కిరణాలను ఉష్ణ వికిరణాలు అని కూడా అంటారు. ఈ సూత్రం ఆధారంగా పనిచేసే థర్మోపైల్, బోలోమీటర్ అనే సాధనాలను ఉపయోగించి పరారుణ కిరణాల ఉనికిని తెలుసుకోవచ్చు.

ఉపయోగాలు


1. టీవీ, రేడియో కార్యక్రమాల ప్రసారానికి
2. టీవీ రిమోట్ కార్డ్‌లో
3. రహస్య సంకేతాలను ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి ప్రసారం చేసేందుకు
4. పొగమంచు, దుమ్ము, ధూళి కణాల ద్వారా కొంతదూరంలో ఉన్న వస్తువులను చూసేందుకు, స్పష్టంగా ఫొటో తీసేందుకు
5. గోడలపై ఉన్న పాత చిత్రలేఖనాలను తొలగించేందుకు
6. కండరాల నొప్పిని, బెణుకుల నొప్పిని తగ్గించేందుకు
7. పక్షవాతాన్ని నయం చేసేందుకు
8. భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న కృత్రిమ ఉపగ్రహాలను నియంత్రించేందుకు
9. తక్కువ దూరం ప్రయాణించేందుకు, రాకెట్లు, క్షిపణుల కోసం ఈ కిరణాలను మార్గనిర్దేశిక కిరణాలుగా ఉపయోగిస్తారు.

How far is the starting point..



DIRECTIONS

Main Directions:
East
West
North
South



Sub-Directions (or) Cardinal Directions:
North-East
South-East
South-West
North-West

From the above diagram, we can also observe that:


a) Angle between North and East is 90°
b) Angle between North-East and East is 45°
c) Angle between North and South-East is 135°

Rotation of Angles: To solve angle movement questions, it is necessary to know about the rotations of angles.

CW (Clock Wise)


ACW (Anti Clock Wise)

Left-Right Conditions:



Pythagoras Rule:

$a^2+b^2=c^2$



Some standard values:

If a = 3; b = 4, then c = 5 i.e., $3^2 + 4^2 = 5^2$

$a^2 + b^2 = c^2$

$3, 4, 5 \rightarrow 3^2 + 4^2 = 5^2$

$5, 12, 13 \rightarrow 5^2 + 12^2 = 13^2$

$7, 24, 25 \rightarrow 7^2 + 24^2 = 25^2$

$8, 15, 17 \rightarrow 8^2 + 15^2 = 17^2$

Shadow Cases:

Morning

Direction	*Shadow falls*
East	Front side
West	Back side
North	Left side
South	Right side

Evening


Direction	*Shadow falls*
East	Back side
West	Front side
North	Right side
South	Left side

- At 12 Noon there is no shadow because the rays of the sun are vertically downward.

Exercise

1. Satyam starts walking towards East and after walking 20 m, turn Southwards and walks 10 m and then he turns to his right and walks 30 m. In which direction is he now with respect to the starting point?
1) South 2) West
3) South-East 4) South-West
5) None of these

Sol:



So, Satyam is in the south-west direction with respect to starting point.

This type of question, can solve in distance method:

1. **Same Directions (Addition)**
   $E_3 + E_4 = E_7$
   $S_2 + S_3 = S_5$
2. **Opposite Directions (Subtraction)**
   $N_3 - S_8 = S_5$
   $E_8 - W_3 = E_5$
3. ⊥ (Pythagoras) Directions ($a^2 + b^2 = c^2$)
   $E_5N_{12} = NE_{13}$
   $E_3S_4 \Rightarrow SE_5$
   Above,
   question we can write
   $E_{20}\,S_{10}\,W_{30} \Rightarrow W_{10}\,S_{10} \Rightarrow SW$

Ans: 4

2. Anirudh walked 35 meters towards South. Then he turned to his left and walked 40 meters. He then turned towards his left and walked 15 meters. He again turned to his right and walked 25 meters. At what approximate distance is he from the starting point and in which direction?
1) 60m NE 2) 35m SE
3) 67m East 4) 67m SE
5) None of these


Sol: $S_{35}\,E_{40}\,N_{15}\,E_{25}$
$S_{35}\,N_{15}\,E_{40}\,E_{25}$
$S_{20}E_{65} \rightarrow 20^2 + 65^2 = 4625$
approx. 67m.
SE_{67}
Ans: 4

3. Arun travels 10 miles towards West, then travels 20 miles South, then travels 6 miles East, then travels 20 miles North and then finally goes 10 miles West. How far is he from the starting place?
1) 10 2) 14 3) 20 4) 6
5) None of these

Sol: $W_{10}\,S_{20}\,E_6\,N_{20}\,W_{10}$
W_{14}
Ans: 2

4. A is East to B and West of C, H is South-West of C and B is South-East of X, who is the farthest West?
1) C 2) A 3) X 4) B
5) None of these

Sol:



B is the farthest west
Ans: 4

5. Gopal moves towards South-East a distance of 7m, then he moves towards west and travels a distance of 14m. From here, he moves towards North-West a distance of 7m and finally he moves a distance of 4m towards East and stood at that point. How far is the starting point from where he stood?
1) 3m 2) 4m
3) 10m 4) 11m
5) None of these

Sol: $SE_7\,W_{14}\,NW_7\,E_4 = W_{10}$
Ans: 3


Directions (Q. No. 6 and 7) Study the following information care- fully and answer the questions given below.

Point P is 9m towards the East of point Q. Point R is 5m towards the South of point P. Point S is 3m towards the West of point R. Point T is 5m towards the North of point S. Point V is 7m towards the South of point S.

6. If a person walks in a straight line for 8m towards West from point R, which of the following points would he cross the first?
1) V 2) Q 3) T 4) S
5) None of these
Ans: 4

7. Which of the following points are in a straight line?
1) P, R, V 2) S, T, Q
3) P, T, V 4) V, T, R
5) None of these


Sol:



Ans: 5

8. If North is called as East, West is called as North and so on.. then South East is called as?
1) South-West 2) South
3) North East 4) North
5) None of these

Sol:



Ans: 1


9. One early morning, after the sunrise a man was standing facing a pole. The shadow of the pole fell exactly to his right. In which direction person facing finally?
1) North 2) East 3) West
4) South 5) None of these
Ans: 4

10. A man travels 4 km due North, the travels 6 km due East and further travels 4 km due North. How far and in which direction is he from the starting point?
1) 14 km North East
2) 10 km North East
3) 3 km South East
4) 14 km North West
5) None of these

Sol: $N_4\,E_6\,N_4$
$N_8\,E_6$ (⊥)
NE_{10}
Ans: 2

11. Seven villages A, B, C, D, E, F and G are situated as follow.
E is 2 km to the West of B
F is 2 km to the North of A
C is 1 km to the West of A
D is 2 km to the South of G
G is 2 km to the East of C
1) E and G 2) E and C
3) G and C 4) F and G
5) None of these

Sol:



Ans:3